# మన నాన్నగారు



# మన నాన్నగారు



Not for Sale. For Private Circulation Only.

# ముందు మాట

శ్రీ నాన్నగారంటే హృదయంలో ఉన్న సద్వస్తువు అని మనందరి అనుభవం. నాన్నగారు ఎన్నో వేలాది ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు కాని ఆయన జీవిత విశేషాలు ఎవరైనా అడిగినప్పుడు ఏదో మాట చెప్పి దాటేసేవారు. ఒక విదేశీ భక్తుడు శ్రీ రమణ భగవానులే శ్రీ నాన్నగారిగా పునర్జన్మించారు అని తన పుస్తకంలో వ్రాసుకున్నాడు. అది నాన్నగారికి తెలిసినప్పుడు దానిని నాన్నగారు ఒప్పుకోలేదు సరికదా 'మాకు చెప్పకుండా రాసేస్తారేంటి?' అని ప్రశ్నించారు. మళ్ళీ నాన్నగారే తమ వైభవం ఒప్పుకుంటూ ఇలా అన్నారు: 'కొండ మీద దీపం పెట్టి కనిపించకూడదు అని అంటే అదెలా సాధ్యం? మా విషయంలోనూ అంతే. మేము గుట్టుగా ఉందాము అనుకున్నా అది సాధ్యం కాదు'. జ్ఞానికి వ్యక్తి భావన ఉండదు, వ్యక్త పరచడానికి ఇతరులు ఉండరు. అందుకే వ్యక్తిగత జీవితం విశదపరచడం నాన్నగారికి ఇష్టం లేదేమో. నాన్నగారు సమాధి చెందాక నాన్నగారి జీవిత విషయాలు పెద్దగా సేకరింపబడలేదు అనే బాధ కలిగినప్పుడు ఆయన ప్రసంగాలలో ఆయన గురించి ఆయనే ప్రస్తావించిన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి అని నాన్నగారి మార్గదర్శనం కలిగింది. శ్రీ నాన్నగారు అపార కరుణతో తమ జీవిత విశేషాలు తెలుపుతూ వ్యక్తమయ్యారా అనిపించింది. అవి సేకరించి భక్తులతో పంచుకోవాలనే చిన్ని ప్రయత్నమే ఈ పుస్తకం. శ్రీ నాన్నగారు 50 సంవత్సరాలకు పైగా సజీవంగా అనంతకోటి భక్తులను అనుగ్రహించారు. ఈ చిన్ని పుస్తకంలో నాన్నగారికి సంపూర్ణంగా న్యాయం చేయగలగడం అసాధ్యమని గ్రహించగలరు. ముందుగా శ్రీ నాన్నగారంటే పరిచయం లేని వారి కొరకు శ్రీ నాన్నగారి జీవితం సంక్షిప్తంగా ప్రస్తావింపబడినది. ఈ పుస్తకం రూపుదాల్చుటకు తమ సహాయ సహకారాలు అందించిన నిగూఢ భక్తులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, భక్తులందరూ దీనిని హృదయపూర్వకంగా స్వీకరిస్తారని ఆశిస్తున్నాము.





ప్రేమ, అనుగ్రహం నామ రూపాలు ధరించి వచ్చిన అవతార మూర్తి సద్గురు శ్రీ నాన్నగారు

# విషయసూచిక




1) శ్రీ నాన్నగారి సంక్షిప్త జీవితం (Page 6-19)

2) శ్రీ నాన్నగారికి రమణ భగవాన్ మరియు ఇతర మహాత్ములతో గల అనుబంధం (Page 20-34)

3) శ్రీ నాన్నగారి స్వప్న దర్శనాలు (Page 35-49)

4) శ్రీ నాన్నగారికి ఇష్టమైన మహాత్ములు, రచనలు, పాటలు (Page 50-62)

5) శ్రీ నాన్నగారి ప్రసంగాల చరిత్ర మరియు విశిష్టత (Page 63-71)

6) శ్రీ నాన్నగారి లండన్ అనుభవాలు (Page 72-116)

7) శ్రీ నాన్నగారితో ముఖా ముఖి (Page 117-125)

8) శ్రీ నాన్నగారి గుణ గణాలు (Page 126-143)

9) భక్తులతో శ్రీ నాన్నగారి అనుబంధం (Page 144-173)

10) శ్రీ నాన్నగారి ప్రవచనాల నుండి సేకరింపబడిన మహనీయుల సూక్తులు (Page 174-183)

## శ్రీ నాన్నగారి సంక్షిప్త జీవితం

అది పశ్చిమ గోదావరి జిల్లా, జిన్నూరు గ్రామం. పాలకొల్లు మార్టేరు మార్గములో "శ్రీ రమణ క్షేత్రం" బోర్డు ఆ దారి గుండా వెళ్ళే వారిని ఆకర్షిస్తుంది. ఆ గ్రామం లో నాన్నగారిని తెలియని వారుండరు. ప్రతి గుండెను గుడి చేసి రమణ జ్యోతి వెలిగించిన ప్రేమమూర్తి. కృష్ణ నగర్ లో అడుగు పెట్టగానే కనిపించే పెంకుటిల్లు నాన్నగారిది. ఆర్తులకు, జిజ్ఞాసులకు, భక్తులకు ఆ ఇల్లు చిరపరిచితము. లోపలికి ప్రవేశించగానే అరుగు మీద గోడకు గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణ భగవానుడు దర్శనమిస్తాడు. ఆ పక్క రామకృష్ణ పరమహంస, వివేకానంద చిత్ర పటాలు వ్రేలాడుతూ ఉంటాయి. అరుగు మీద ఒక పక్కగా చక్కగా అలంకరింపబడిన శ్రీ రమణుల ఫొటో చూపరులను ఆకర్షిస్తుంది. ప్రతి రోజు లాగే ఆ అరుగు భక్తులతో నిండి ఉంది. ఎదురుగా ఉన్న చెట్ల నుండి వీస్తున్న గాలి వారి శరీరాలను తాకుతోంది. ఆ వాతావరణంలో ఉన్న ప్రశాంతత వారి ముఖాలలో ప్రతిఫలిస్తోంది. వారి కళ్లు నాన్నగారి కోసం ఆతురతతో ఎదురు చూస్తున్నాయి. ఇంతలో కొద్దిగా అలికిడయ్యింది, కర్టెను తొలగించుకుంటూ ఎదురుగా నాన్నగారు.



స్వచ్ఛమైన తెల్లని ఖాదీ పైజామా, లాల్చీ ధరించి మెడపైన తుండును సవరించుకుంటూ నిర్మల మందహాసముతో కరుణనిండిన చూపులతో, ముఖ మండలంలో చెదరని శాంతితో, దివ్యకాంతితో మెరిసిపోతూ బయటకి వస్తున్న నాన్నగారికి వారంతా భక్తి భావంతో చేతులు జోడించారు. శ్రీ రమణులకి కొద్ది దూరం లో ఉన్న కుర్చీలో కూర్చున్నారు నాన్నగారు. అంతా మౌనంగా ఉన్నారు. చల్లని ప్రేమపూరిత దృక్కులతో ఒక్కొక్కరిని వీక్షిస్తున్నారు. నాన్నగారిని పాశ్చాత్యులకి పరిచయం చేసిన పాశ్చాత్య భక్తుడు రోజర్ హౌస్డెన్ వారి చూపులలోని ప్రత్యేకతను వర్ణిస్తూ, 'వారి చూపులు కోమలము, కరుణా పూరితము, ప్రియుడు ప్రేయసి పై సారించిన దానివలే ఆ చూపు ప్రేమమయం. ఆ చూపులలో కర్తృత్వ భావన గానీ, వ్యక్తి భావనగానీ, కామన గానీ, ఏదో ప్రయోజనము సాదిద్దామన్న ఉద్దేశ్యము గానీ, లేదు. అది అందరికీ లభ్యమే కాని ఎవరి మట్టుకు వారు అది తమకి మాత్రమే ప్రత్యేకమనుకుంటారు." అంటాడు. నిజమే! ఇది ప్రతి ఒక్కరికీ అనుభవ సిద్ధమే.

బుద్ధుని కళ్లను బోలిన ఆ విశాల నేత్రాలనుండి జాలువారుతున్న శాంతి తరంగాల తాకిడికి వారి హృదయాలు పులకించి పోతున్నాయి.

కొద్దిసేపటికి నాన్నగారూ! అంటూ ఒక కుటుంబంలో పెద్ద వలె తమ తమ సందేహాలనూ, సమస్యలనూ వారికి విన్నవించుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలను ఎంతో ప్రేమతో, కరుణతో, ఆప్యాయతతో సూచిస్తూ వారిని శాంతి సాగరం లో ఓలలాడించారు. రెండు గంటల కాలం దొర్లి పోయింది. మెల్లగా లేచి వారు తమ గదిలోకి వెళ్లిపోయారు. తనను దర్శింప వచ్చిన వారికి కన్న తల్లి తండ్రుల కంటే మించిన ప్రేమతో వారి యోగ క్షేమములకు బాధ్యత వహిస్తూ, వారి జీవితాల్లో వెలుగు నింపుతూ, శాంతితో తడుపుతూ, వసుధైక కుటుంబ భావన వారిలో కలుగ జేస్తూ, దు:ఖ స్పర్శ లేని జీవితాలకు భాగస్వాములను చెయ్యటమే దీక్షగా బూనిన ఈ నాన్నగారెవరు ???

శ్రీ నాన్నగారి గురించి.....

శ్రీ నాన్నగారు 1934 సెప్టెంబరు 23వ తేదీ పౌర్ణమి, ఆదివారం, ఉదయం 9 గంటలకు శ్రీ సూర్య నారాయణ రాజు, రాజాయమ్మ పుణ్య దంపతుల ప్రథమ సంతానంగా కొమ్మర గ్రామం లో మాతామహుల ఇంట జన్మించారు. వారిది సుక్షత్రియ వ్యవసాయ కుటుంబం. స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా జిన్నూరు. జన్మ నామం భూపతిరాజు వెంకట లక్ష్మీ నరసింహ రాజు. భక్తులు వారిని ప్రేమతో 'నాన్నగారు'' అని పిలుస్తారు. ఆ పేరే సార్థక నామధేయంగా నిలిచిపోయింది.

నాన్నగారి పూర్వీకులు ఆస్తిక చింతన కలవారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు, చిన్నప్పటి నుండి వారిలో ఆధ్యాత్మిక చింతన ఉండేది. కుటుంబ పరంగా చూచినట్లయితే వారిలో భక్తి బీజం నాటుకోడానికి, భక్తి తత్వం కలగడానికి ప్రధాన కారణం వారి నాన్నమ్మగారైన పాపాయమ్మగారి ఆశీస్సులు. ఆవిడ గొప్ప భక్తురాలు. సాధారణంగా మానవ మనస్తత్వం ఎలా ఉంటుందంటే, మంచివి మనం ఉంచుకుని, మిగిలినవి ఇతరులకు ఇస్తాము. కాని ఆవిడ మంచిదనుకున్నదే ఇతరులకు ఇచ్చిన ఉత్తమురాలు. ఇలాంటి

లక్షణాలున్న వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. ఆవిడ ప్రభావం నాన్నగారిపై చెరగని ముద్రవేసింది. నాన్నగారికి బాల్యం లోనే పితృవియోగం కలిగింది. వారి బాల్యం కొమ్మర, జిన్నూరు గ్రామాలలో గడిచింది. చిన్నతనం నుండి కూడ వారికి కోపమంటే తెలియదు. చాలా సౌమ్యంగా ఉండేవారు. వారి ప్రాథమిక విద్య జిన్నూరు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, ఉన్నత విద్య M.M.K.M హై స్కూలు, పాలకొల్లులో జరిగింది. 1950 సంవత్సరం లో వారి వివాహం అప్పల నర్సాయమ్మ గారితో,  కొమ్మర గ్రామం లో జరిగింది. వారికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు.

శ్రీ నాన్నగారిలో ఆధ్యాత్మిక చింతన వయస్సు వస్తున్న కొద్దీ వికసిస్తూ వచ్చింది. జ్ఞానం పట్ల స్పష్టమైన అవగాహన లేకపోయినా, దానిని సంపాదించాలనే ఆపేక్ష బలంగా ఉండేది. ఆధ్యాత్మిక చింతన లేకుండా చైతన్యస్థాయిని పెంచుకోవడం సాధ్యం కాదని వారి అభిప్రాయం. 1954 సంవత్సరం మార్చిలో వారు అమ్మమ్మగారితో కలిసి ఉత్తర దేశం లోని పుణ్య క్షేత్రాలను దర్శించారు. ఆ యాత్రలో ఢిల్లీలో జ్ఞానానందని కలిసారు. కాశీలో తొమ్మిది రోజులు గడిపారు. అంతర్గతంగా వారిలో శివుని పట్ల భక్తి భావం ఉండేది. కాశీలో ఉండగానే వారికి భక్తి యొక్క ప్రాముఖ్యం తెలిసిందంటారు. ఆ తరువాత పూరీ జగన్నాథం వెళ్లారు. హృషీకేశ్ లో స్వామి శివానందని దర్శించారు. ఆ రోజు వెళ్లిన యాత్రికులలో వారే వయస్సులో చాలా చిన్నవారు. స్వామి శివానంద వారి తల నిమురుతూ,"మంచిగా ఉండు.మంచి చెయ్యి. Be Good. Do Good" అని ఆశీర్వదించారు. మంచి చెయ్యటం కంటే మంచిగా ఉండటం కష్టమని చెప్పారు. వారితోపాటు యాత్రలకు వెళ్లిన వారిలో స్వామి జ్ఞానానంద శిష్యులైన ఆత్మానంద ఒకరు. వారితో పరిచయం ఏర్పడింది. ఆత్మానంద మంచి రచయిత, సాహిత్య ప్రియులు. ఆధ్యాత్మిక విషయాలకంటే సాహిత్యం గురించే ఎక్కువ మాట్లాడుతూ ఉండేవారు. భక్తిభావం ఉన్న అంశాన్ని కూడా సాహిత్య కోణంలో చూసేవారు. వారి స్నేహం వల్ల నాన్నగారికి సాహిత్యం మీద కొంత అభిరుచి కలిగింది. నాన్నగారు చదివిన మొదటి ఆధ్యాత్మిక పుస్తకం 1954 లో, "శ్రీ వివేకానంద ఉవాచ". తరువాత అనేక గ్రంథాలు చదివారు. మానవునికి మానస వికాసానికి ఉపదేశ గ్రంథాలు ఎంతగానో ఉపయోగపడతాయంటారు నాన్నగారు.



1954-59 సంవత్సరాల మధ్య, పాలకొల్లు లో ప్రతి సంవత్సరం భగవద్గీత ఉపన్యాసాలు జరిగేవి. శంకరానంద స్వామి హిందీలో, రామకృష్ణానంద స్వాములు తెలుగులో చెప్పేవారు. ఆ ప్రసంగాలు వారిని ఆకర్షించాయి. గీతను అధ్యయనం చెయ్యాలనే ఆసక్తి కలిగింది. నాన్నగారు శంకరానంద స్వామి వారి మాస పత్రిక 'గీతా వాణి' కి భగవద్గీత మీద వ్యాసాలు రాసి పంపేవారు. 1960 నుంచి భగవద్గీత బోధ చేసేవారు నాన్నగారు. స్వార్థం లేకుండా సమాజ శ్రేయస్సును కాంక్షించారు. 1960-70 మధ్య వారి ఆధ్వర్యం లో జిన్నూరు గ్రామంలో మధ్యాహ్న భోజన పథకాలు, వయోజన విద్యా నిర్వర్తించబడ్డాయి. భౌతికంగా ఏ విషయాల పట్ల ఆసక్తి చూపేవారుకాదు. పరుల కష్టాన్ని తమ కష్టంగా భావించేవారు. జీవితం పట్ల విరుద్ధ వైఖరీ ఉండేది కాదు. వయస్సు పై బడ్డ వృద్దులు కూడా వారి సలహా సంప్రదింపులు కోరేవారు. వారు చేస్తున్న సాధనకు ఇతరుల నుండి ఎటువంటి సహాయ సహకారములు అందలేదు. సమాజ గతి మార్చే అవతార పురుషులకు ఇది సహజమే కదా!

స్వయంకృషి, నిస్వార్థ సేవ, మహాత్ముల ఆశీర్వాదబలంతో, పరిశుద్ధ మనస్సుతో బంగారు ముద్దలా ఉన్న వారి జీవితాన్ని ఒక మహనీయుడు తన స్వాధీనం చేసుకున్నాడు. 1957 లో, భగవాన్ రమణులు స్వప్న దర్శనం కలుగచేసి, గట్టిగా ముద్దు పెట్టుకోవడం, నాన్నగారి జీవన విధానాన్ని మలుపు తిప్పింది. 1959లో మొదటి సారిగా అరుణాచలం ప్రయాణమయ్యారు. మార్గ మధ్యలో ఏర్పేడు, మళయాళ స్వాముల వారి దర్శనము చేసుకొని, వారి ఆశీస్సులు పొందారు. చిన్న వయస్సు లో అంత ఆధ్యాత్మిక అభిరుచి కలిగినందుకు ఆధ్యాత్మికముగా ఉజ్జ్వల భవిష్యత్తు ఉంటుందని వారు దీవించారు. తరువాత తిరుపతి పుణ్య క్షేత్రాన్ని దర్శించారు. అక్కడ నుండి పరమ పావనమైన అరుణాచల క్షేత్రములో అడుగు పెట్టారు. 1959 జనవరి, సంక్రాంతి పండుగ నాడు రమణాశ్రమములో ఉన్నారు. అక్కడ నాలుగు రోజులు గడిపి రామేశ్వరాన్ని దర్శించారు. తిరుగు ప్రయాణం లో పాండిచ్చేరి అరవిందాశ్రమం మాతాజీని దర్శించి వారి ఆశీస్సులు పొందారు. వారికి స్వప్నానుభవం అయ్యాక జిన్నూరులో ఉంటున్నప్పటికీ స్వగ్రామం అరుణాచలమే అనిపించేది. ఇక్కడ నుండి అరుణాచలం వెళ్ళటం కాదు, ఆక్కడ నుండి చెదరి పోయి ఇక్కడకు (జిన్నూరు) వచ్చామంటారు. 1959 మొదలు జిన్నూరు లో ప్రతి సంవత్సరం

రమణ జయంతి చెయ్యటం ప్రారంభించారు. నాన్నగారికి ప్రవచనముల పట్ల కూడా ఆసక్తి లేదు. కాని, భగవాన్ అనుగ్రహం వారిని వక్త గా నిలపెట్టింది. ఒక సందర్భం లో భగవాన్ స్వప్నం లో వారిని ఎలా అనుగ్రహించినది వారు చెప్పారు. (అది భగవాన్ ఆజ్ఞగా పాటించారు) ఆ స్వప్నం వాస్తవమైనది. స్వప్నం వాస్తవమవుతుందా? 1960 లో ముమ్మాట్లు అది వాస్తవమే అయ్యింది. జరగ బొయే సంఘటనలను సినిమా రీలుగా ముందే చూసిన వారికి ఇక తన ఇష్టాన్ని పక్కన పెట్టి పనిముట్టులా భగవాన్ ఆజ్ఞ పాటించారు.

1983 నుండి వారిని 'నాన్నగారు' అని పిలవటం ప్రారంభించారు. వారి అసలు పేరు వేంకట లక్ష్మీ నరసింహ రాజు, కాని ఆ పేరు పెట్టి ఎవరూ ఏనాడూ పిలిచేవారు కాదు. 1983 కి ముందు కూడ 'జిన్నూరు రాజుగారు' అని పిలిచేవారు. గాంధీని మనం మహాత్ముడని ఎంత  సహజం గా పిలుస్తామో అంత సహజంగా వచ్చిన పిలుపు 'నాన్నగారు' అని. మీటింగులు పెట్టి, సన్మానాలు చేసి ఇచ్చిన బిరుదు కాదు. సహజంగా పెల్లుబికి వచ్చిన ప్రేమ పిలుపు. తమ కష్ట సుఖాలకు బాధ్యత వహించే తండ్రిగా, జనక భావంతో, సహజంగా మొట్టమొదట 'నాన్నగారు'' అన్న పేరుతో పిలచిన వారు పశ్చిమ గోదావరి జిల్లా అరటకట్ల భక్తులు. తదనంతరకాలం లో ఆ పేరే విశ్వవ్యాప్తమైనది.

1986లో నాన్నగారికి చాలా జబ్బు చేసింది. 6 నెలలు వదలకుండా జ్వరం వచ్చింది. ఆ జ్వరం తగ్గించమని ఏ దేవుణ్ణి ప్రార్థించలేదు. వారికి లోపల ఒకటే బాధ ఉండేది. భౌతికంగా అరుణగిరి చూసే అవకాశం ఉండదేమో అనిపించేది. అరుణాచలంతో వారికి ఉన్న జన్మాంతర అనుబంధం అటువంటిది. ఆ అరుణాచల రమణుని కృప వలన వారు పరిపూర్ణ ఆరోగ్యవంతులయ్యారు.

నాన్నగారి ఆధ్యాత్మిక అభివృద్ధికి బాహ్యంగా ఎవరి ప్రోత్సాహం లేదు. వారి స్వయం కృషి, గైడెన్స్ అంతా భగవాను నుండే అందేది. ఇంట్లో కుటుంబ వ్యక్తులు గాని, స్నేహితులు గాని ఎవరి సహాయం లేదు. చదివిన గ్రంథాలు తోడ్పడ్డాయి. నాన్నగారికి బాహ్యంగా గురువంటూ ఎవరూ లేరు. అంతా రమణుల అనుగ్రహమే అంటారు. తన సాధన కంటే రమణుల అనుగ్రహమే తనను చైతన్యవంతుణ్ణి చేసిందంటారు. ఇటునుండి చేసిన దాని కంటే అటునుండి వచ్చిందే ఎక్కువ. ఆ  ప్రేమయే తమను కృతార్థుడిని చేసిందని చెప్తారు.

లౌకిక విషయాలను సీరియస్ గా తీసుకునే అలవాటే లేదు. వాటిని అసలు పట్టించుకోరు. మహిమల మీద వారికసలు గౌరవం లేదు.'నిజమైన శాంతి నీకు కలిగితే, అద్భుతాలవైపుకు మహిమలవైపుకు నీ మనస్సు వెళ్ళదు. అద్భుతాల వలన, మహిమల వలన నీకు మోక్షం రాదు. ఆత్మ జ్ఞానం వలన నీకు మోక్షం కలుగుతుంది. అందువలన జ్ఞానాన్ని గమ్యం గా పెట్టుకోవాలి. ఈ మహిమలు కూడా స్వప్నం లో ఒక భాగం' అంటారు.

మహోన్నతమైన మానవ జన్మనెత్తినందుకు ఏ పరిస్థితిని మానవుడు పొందాలో శ్రీ రమణుల కృపవలన శ్రీ నాన్నగారు పొందారు. అరుణాచలేశ్వరుడు రమణుని ఎంచుకున్నట్లు, రమణ తత్వాన్ని మానవాళికి బోధించగల వ్యక్తిగా భగవాన్ నాన్నగారిని అనుగ్రహించారు. నాటి నుండి నేటి వరకు వారి జీవితము రమణులకంకితము చేసారు. ఆంజనేయ స్వామికి రాముడి మాట, రాముడి కార్యం తప్పించి వేరొక ఆలోచన లేనట్లుగా నాన్నగారికి భగవాన్ మాట భగవాన్ పని తప్పించి మరొక తలంపు రాదు.

"ఏమీ తెలియని, అక్షర జ్ఞానం లేని వారికి ఆధ్యాత్మిక విద్యను బోధించి ఆత్మ సింహాసనం మీద కూర్చోపెట్టడం నా గమ్యం" అని అంటూ నిగూఢమైన వేదాంత తత్త్వాన్ని చిన్న చిన్న మాటలతో తెలియచేస్తారు. "ప్రియమైన ఆత్మ బంధువుల్లారా" అనే పిలుపుతో తమ ఉపదేశాన్ని ప్రారంభించి, మన హృదయాలను తెరచి, శాశ్వతమైన శాంతితో, సుఖంతో, వైరాగ్యం తో నింపుతారు. ప్రేమపూరితమైన వాక్కులతో కరిగిస్తారు. దేహం మరణించాక ఏ జీవుడైతే ప్రయాణం చేస్తాడో వాడి గురించి రవ్వంత, ముల్లంత విచారణ చేస్తే వాడిప్పుడే లేడన్న రమణ బోధని మనవాతీత శక్తులు ప్రదర్శించకుండా మానవుడికి ఆయన ప్రేమతో, స్పర్శతో, చూపుతో, మాటతో, సూటిగా స్వరూపం దగ్గరకు చేర్చగల సమర్థ సద్గురువులు శ్రీ నాన్నగారు. వారి మాటలు మన మనస్సుని బంధిస్తాయి. సూక్ష్మమైన విషయాలు మన మనస్సుకు హత్తుకోవాలని "రహస్యం- ఈ మాటలు ఇంకెక్కడా అనకండి" అంటూ మన మనసుని ఆ విషయం మీద లగ్నం చేస్తారు. ఒక్కోసారి "ఈ ఒక్క మాట సరిపోతుంది. దీన్ని పట్టుకోండి" అంటూ పచ్చగడ్డి చూపుతూ దూడను తోలుకెళ్ళినట్లు మన స్వరూపం చెంతకు మనల్ని తీసుకెళతారు. మధురగంభీరమైన ఆ స్వరాన్ని వింటున్నప్పుడు దేహధ్యాస తెలీదు. కాలం ఆగిపోతుంది. పరమ శాంతిలో కూరుకు పోతాం. "ఆత్మ మాటకందదు. మనసుకు అందదు" అని పెద్దల వాక్కు. కాని

నాన్నగారు ఆత్మ వైభవాన్ని గురించి వర్ణిస్తూ ఉంటే ఆ మాట వెనుక ఉన్న అనుగ్రహం వల్ల ఆ చైతన్య స్రవంతిలో మనం కలసిపోతాం. వారి ప్రసంగాలు మనలో తార్కిక బుద్ధిని పెంచుతాయి. ఇలా చెయ్యమని మాటలతో ఆదేశించరు. హృదయాంతరాళాల్లో నుంచి అలా ఉండేలా భక్తుల్ని అనుగ్రహిస్తారు. సూక్ష్మ దృష్టి మనకు కలిగేలా మనకు తెలీకుండా మనలో మార్పు తీసుకురాగలగటం ఒక్క నాన్నగారికే సాధ్యం.

భగవాన్ అందుకున్న అద్వైతసిద్ధిని పొందలేక పోవటానికి ఎన్నో ఆటంకాలు ఉన్నాయని, వారన్నిటినీ త్యజించారు కాబట్టి అది వారికి సాధ్యమైయిందని, సంసారంలో ఉంటూ ఆ స్థితిని పొందటం అసాధ్యమని చాలా మంది అభిప్రాయపడుతుంటారు. సన్యాసమంటే కాషాయ వస్త్ర ధారణ మాత్రమేకాదని, అహంభావనని త్యజించడమే నిజమైన సన్యాసమన్న వారి బోధను ఆచరించి చూపటానికే వచ్చిన బోధావతారమే శ్రీ నాన్నగారు. గృహస్థుడిగా జీవిస్తూ, తన జీవితాన్ని సందేశంగా చూపిస్తూ ఎందరి జీవితాలలోనో జ్ఞాన దీపాలను వెలిగిస్తున్న అమృతమూర్తి శ్రీ నాన్నగారు.

హృదయం విప్పి మాట్లాడేవారికి ఎప్పుడూ స్పందిస్తారు నాన్నగారు. కొన్ని కొన్ని సందర్భాలలో భక్తులడిగిన ప్రశ్నలకు వారిచ్చిన సమాధానాలను బట్టి 'నాన్నగారంటే' ఏమిటో వారి మాటలను బట్టి తెలుసుకోగలం. ఒక భక్తుడడిగిన ప్రశ్నలకు వారిచ్చిన సమాధానలు ఇక్కడ పొందు పరుస్తున్నాం.

**ప్ర** : Realisation పూర్వ జన్మ సుకృతం వల్ల కలిగినట్లు, మీక్కూడా అట్లాగే వచ్చిందా? లేక పోతే మీరు సాధన చేసారా?

**నాన్నగారు** : ప్రత్యేకంగా నేనే కష్టమూ పడలేదు. భగవాన్ అంటే నాకు చాలా ఇష్టం. అందులో రాజీ లేదు. మీరు భగవాన్ ని ఒక గంట సేపు విమర్శిస్తారనుకోండి, ఆ విమర్శ నేను విన్నా ఆయన మీద నాకు ఉన్న ఇష్టం కాని, ప్రేమ కాని పెన్సిల్ పాయింట్ అంత కూడా పోదు. ఏదైనా నాకొక ఆధ్యాత్మిక అస్థిత్వం ఉందంటే అది కేవలం ప్రేమవల్లే వచ్చింది. ప్రత్యేకించి కష్టపడలేదు.

**ప్ర** : అంటే మీరాయన్ని స్మరించటం వల్ల వచ్చిందంటారా?

**నాన్నగారు :** స్మరించటం అనండి ప్రేమ అనండి. ఒక తాదాత్మ్యం. ఎంత తాదాత్మ్యం అంటే ఆయనకి నేను నమస్కారం కూడా పెట్టను. పెట్టకూడదని కాదు. మనలోమనం ఏం పెట్టుకుంటామని. ఇంట్లో వాళ్లు ఇంట్లోవాళ్లకి దండాలు పెట్టుకుంటారా? గౌరవం లేదని కాదు. అంటే వేరు భావన లేదు. నేను భగవాన్ కి ప్రత్యేకంగా worship చేయలేదు. అంటే ఆయన పటాన్ని ఎదురు పెట్టుకుని రోజు అష్టోత్తరం చదవటం, దీపారాధన, పూజ... ఇటువంటి worship చెయ్యలేదు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా ఆ విశ్వాసం మటుకు ఎప్పుడూ పోలేదు. ఒకసారి చల్లపల్లి జమీందారుగారు కూడా ఇదే ప్రశ్న అడిగారు. 'నేను 1948 నుండి రమణాశ్రమం వెళుతున్నాను. భగవాన్ని స్వయంగా దర్శించాను. మీ కంటే సీనియర్ ని. కాని మీకు దొరికిన శాంతి నాకు దొరికినట్లు కనబడటం లేదు' అన్నారు. ఆయన మీద మనకుండే ఆప్యాయత యొక్క తీవ్రతని బట్టి ఉంటుంది. ఆ తీవ్రతను బట్టి హృదయం విప్పారుతుంది అని చెప్పాను.




**ప్ర :** మీరు భగవాన్ ని భౌతికంగా చూడనప్పుడు మీకు ఎట్లా వచ్చింది?

నాన్నగారు : ఇంత వరకు ఆయన్ని భౌతికంగా చూడలేదన్న తలంపు కూడా ఎప్పుడూ రాలేదు. నన్ను నేను చూడలేదనుకుంటానాండీ...

అంటే తాదత్మ్యం వల్ల చూడలేదనే తలంపు రాలేదు.

పై సమాధానం లో 'నన్ను నేను చూడలేదనుకుంటానా?' అన్న వారి మాటలను బట్టి సర్వత్రా నిండి నిబిడీకృతమైన చైతన్యమే శ్రీ నాన్నగారని చెప్పకుండా చెప్పారు. భగవాన్ కి భిన్నంగా నాన్నగారు లేరని వ్యక్తమే కదా!

శ్రీ నాన్నగారి నిరాడంబరత నిరుపమానం. ఇతరుల మెప్పు పొందాలన్నట్టు ఏ మాత్రం నడుచుకోరు. ఏ విధమైన ప్రత్యేకతలూ లేకుండా ప్రయత్నంతో నడుస్తున్నట్లు కాక అప్రయత్నంగా జారిపోతున్నట్లు ఉంటుంది వారి జీవిత

సరళి. శ్రీ నాన్నగారు కాలాతీతులు. కాని వారు దేనికీ వేళ తప్పరు. ప్రతి పని సమయం ప్రకారం ఆచరిస్తారు. తన కోసం ఎవ్వరూ వేచి ఉండటం వారికిష్టం ఉండదు. కాలాన్ని వృధా చెయ్యనివ్వరు. భగవంతుడు కాల స్వరూపం లో ఉన్నాడని పదేపదే హెచ్చరిస్తారు.

నాన్నగారిలో ఉన్న అసాధారణ లక్షణాలలో ముఖ్యమైనది తనని ఆశ్రయించి వచ్చిన వారెవరైనా తన ప్రేమలో, పిలుపులో, ఆప్యాయతలో భేదబుద్ధి గోచరించదు. మీరు భక్తులందరినీ ప్రేమిస్తారు కానీ మీ హృదయంలో నాకొక ప్రత్యేక స్థానముందని ఒకసారి ఒక భక్తుడంటే, వారు చిద్విలాసం తో ' ఇక్కడకొచ్చే ప్రతి భక్తునికి అలాగే అనిపిస్తుందంటారేమిటి?' అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రత్యేకమైనట్టు, కృష్ణుడు గోపికలతో ప్రవర్తించిన తీరుకు సజీవ దృష్టాంతం శ్రీ నాన్నగారు.

సాధారణంగా పీఠాధిపతులు, గురువులు జన బాహుళ్యానికి దూరంగా ఉంటారు. దానికి విరుద్ధంగా శ్రీ నాన్నగారు సామన్య ప్రజలకి దగ్గరగా ఉంటారు. శిష్యులు గురువుని దర్శించటం, సేవించుకోవటం సహజమైతే, ఇక్కడ గురువే శిష్యుల బాగోగులకి బాధ్యత వహించడం విశేషం. శిష్యుల రాక కోసం ఎదురు చూడటం, వారి బాధల్ని పోగొట్టడానికి కొన్ని వందల మైళ్లు ప్రయాణం చేసి వారిని పలకరించటానికి స్వయంగా వెళ్లే గురువు ఎన్ని జన్మలెత్తినా మనకు లభ్యం కారేమో! అన్ని ప్రేమల కంటే తల్లి ప్రేమ గొప్పదంటారు. కాని సృష్టిలో ఏ ప్రేమా నాన్నగారి ప్రేమను సరితూగలేవు.

శ్రీ నాన్నగారు ఆధ్యాత్మిక జీవితాన్ని దైనందిన జీవితం తో ఎప్పుడూ విడదీయరు. దైనందిన జీవితం లో అహంకారానికి అలంకారం చేయకుండా ఉండటమే నిజమైన సాధన అంటారు. భక్తిని పూజగదికి మాత్రమే పరిమితం చేయవద్దంటారు. తన చెంతకు వచ్చిన భక్తుల ప్రారబ్ధాన్ని, తన జ్ఞాన బోధలో మాధుర్యాన్ని అందిస్తూ, వారు దాన్ని తేలికగా, సమానంగా అనుభవించేటట్లు చేస్తున్న ప్రేమమూర్తి శ్రీ నాన్నగారు. హృదయం లో ఉన్న సచ్చిదాంద స్వరూపానికి ప్రతినిధిగా నిలిచి, ఆత్మ వైభవాన్ని తెలియచెప్పడానికి ఆ దేహాన్ని పనిముట్టుగా చేసుకున్నారు. మానవ కల్యాణమే పరమావధిగా సాగిపోతున్న మహనీయులు పూజ్య గురుదేవులు శ్రీ నాన్నగారు.

## శ్రీ నాన్నగారి భక్తికి మూలం అయిన పాపాయమ్మగారు



శ్రీ నాన్నగారి నాయనమ్మ గారి పేరు పాపాయమ్మగారు. నాన్నగారు అనేవారు: 'ఈరోజు మాకు ఏదైనా భక్తి కలిగిందంటే మా నాయనమ్మ గారి రక్తం మాలో ప్రవహించినందు వల్లనే'. పాపాయమ్మగారు తమ భర్తను మరియు యువ వయస్కుడైన కొడుకును- ఇద్దరినీ కూడా కోల్పోయాక పుట్టెడు దుఃఖంలో ఉన్న కోడలిని (నాన్నగారి తల్లి అయిన రాజయమ్మగారు) పిల్లలతో సహా కొమ్మరకు (కోడలి పుట్టినిల్లు) పంపించేశారు. తాము స్వయంగా తమ పుట్టిల్లైన మురమళ్ళ వెళ్లి ఉండటం మొదలుపెట్టారు. పాపాయమ్మగారికి తులసి కోట అంటే విపరీతమైన ఇష్టం. కోడలు మనవళ్ల తో విడిపోతున్నప్పుడు తులసి కోట దగ్గర కూర్చొని: 'ఇదేంటి మా సంసారం ఇలా మగదిక్కు లేకుండా అయిపోయింది. చెట్టుకొకళ్ళము, పుట్టకొకళ్ళము అయి వెళ్ళిపోతున్నాము. ఈ అరుగు మీద ఎప్పుడైనా నలుగురు కూర్చుంటారా? ఈ ఇంట్లో ఎప్పుడైనా నలుగురు భోజనం చేస్తారా?' అని బోరుమని విలపించారట పాపాయమ్మగారు. అశేష భక్తజనులు నాన్నగారి అరుగు మీద కూర్చొని శాంతిపొందటం మరియు నాన్నగారింట్లో భోజనం చేయటం జరిగిందంటే దానికి కారణం పాపాయమ్మగారి పుణ్యమే.

పాపాయమ్మగారికి నాన్నగారంటే విపరీతమైన ఇష్టం. "నాకు పెద్దమనవడ్ని ఇచ్చేసేయి. నేను పెంచుకుంటాను" అని కోడల్ని అడగాలని పాపాయమ్మగారికి చాలా ఉండేది. కానీ అలా అడగలేక పోయారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కోడలికి పెద్ద కొడుకుని (నాన్నగారిని) కూడా దూరం చేయడం భావ్యం కాదు అని ఆవిడకు అనిపించేది. ఎప్పుడైనా మేనల్లుళ్లు లేక మేనకోడళ్లు 'నిన్ను మేమే చూస్తున్నాము కదా. కనుక నీ ఆస్తి మాకే ఇవ్వాలి' అని సరదాగా అంటే 'నా ఆస్తి నా మనవళ్లకే చెందుతుంది' అని దెబ్బలాడేసేవారట పాపాయమ్మగారు. పాపాయమ్మగారికి తన మనవళ్లంటే అంత ఇష్టం. ఎప్పుడు ఏ చుట్టాలు వెళ్లినా మురమళ్ళలో తులసి కోట దగ్గరే కనిపించేవారు. మురమళ్ళ వెళ్ళాక పాపాయమ్మగారు రెండు మూడు సంవత్సరాల కన్నా ఎక్కువ బతకలేదు.

మురమళ్ళ దగ్గర ఒక ఊరిలో నాన్నగారు ప్రసంగించటానికి వెళ్ళినప్పుడు ఒక భక్తుడు ఒక పెద్దావిడను నాన్నగారి దగ్గరకు తీసుకువచ్చి 'ఈవిడ పాపాయమ్మగారి స్నేహితురాలు, మురమళ్ళ నుంచి వచ్చారు' అని పరిచయం చేసాడు. అప్పుడు నాన్నగారు ఆ పెద్దావిడకు ఎదురెళ్లి, స్టేజి మీదకు తీసుకొచ్చి ఎంతో గౌరవ పూర్వకంగా ఆదరించి ఇలా అన్నారట: 'మీరు పాపాయమ్మగారి స్నేహితురాలా అండి? మీరు పాపాయమ్మగారితో కలిసి జీవించగలిగినందుకు ఎంత అదృష్టవంతులండి, ఎంత భాగ్యమండి మీది!' అలా సాక్షాత్తు పాపాయమ్మగారే వచ్చారని భావించి ఉపన్యాసమంతా స్టేజి మీద తన దగ్గర కూర్చోపెట్టుకొని ఎంతో గౌరవ ఆదరణ తో ఆవిడను చూశారట నాన్నగారు. ఆవిడ ద్వారా నాన్నగారికి పాపాయమ్మగారి పట్ల ఎంత గౌరవం ఉందో వ్యక్తం అయింది.

## 'మన నాన్నగారు'- ఒక భక్తురాలి మాటల్లో వివరణ



ఒకసారి రాముడి గురించి చెబుతూ నాన్నగారు అన్నారు: 'తల్లులను, భార్యను, తమ్ముళ్లను, మిత్రులను, అయోధ్యా ప్రజలను - ఎవ్వరినీ విడిచి పెట్టలేదమ్మా రాముడు. అన్ని బంధాలలో తానుండి తరించి తరింప చేసేవాడమ్మా బంధాల రాముడు'. అలాగే నాన్నగారు కూడా తల్లిని, భార్యను, తమ్ముళ్లను, మిత్రులను, భక్తులను - ఎవ్వరినీ విడిచిపెట్టలేదు. అన్ని బంధాలలో తానుండి తరించి తరింప చేసేవారు బంధాల నాన్నగారు.

ఒక ఇంజనీర్ గారు నాన్నగారితో అన్నారు: 'ఇన్నాళ్లు నేను ప్రశ్నలు అడిగితే మీరు సమాధానాలు చెప్పారు. ఇప్పుడు ఇక నేను మిమ్మల్ని ఏమీ అడుగను. మీరు ఏది ఇస్తే అదే తీసుకెళ్తాను' అంటే నాన్నగారు అన్నారట: 'మేము ఇచ్చేది unseen and unheard '. అంటే మౌనంగా అనుగ్రహించే దక్షిణామూర్తి నాన్నగారు.

ఇచ్చేటప్పుడు చెప్పడం ఎందుకు? అని మన ప్రయత్నంతో సంబంధం లేకుండా మనలో మారు మనస్సు తీసుకొచ్చే భగవానే మన నాన్నగారు.

కృష్ణుడు గురించి చెబుతూ నాన్నగారు ఒకసారి అన్నారు: 'మన పండితులకే శ్రీ కృష్ణుని రాసక్రీడా రహస్యం తెలియదు. ఇక క్రైస్తవులు విమర్శించడంలో ఆశ్చర్యం ఏముంది? బ్రహ్మానందం తానై ఉన్నాడు కృష్ణుడు. ఆరేళ్ళ

పిల్లవాడికి కామం ఏమిటమ్మా? తమ ప్రయత్నంతో సంబంధం లేకుండా గోపికలకు బ్రహ్మానందం కలుగచేసాడమ్మా'. అలాగే నాన్నగారు కూడా బ్రహ్మానందం తానై ఉండి అశేష భక్త జనులను తమ కూడా తిప్పుకుని వారి ప్రయత్నంతో సంబంధం లేకుండా బ్రహ్మానందం కలుగచేసిన కృష్ణ పరమాత్మ మన నాన్నగారు.

తమ ప్రేమను భగవాన్ వలె రహస్యంగా ఉంచుకోకుండా భౌతికంగా కూడా తమ ప్రేమను వ్యక్తపరుస్తూ నువ్వు ఉన్నావు అని చెబుతూనే నువ్వు లేని స్థితికి తీసుకువెళ్లే రామకృష్ణ పరమహంస మన నాన్నగారు.


ఆదిశంకురులు బోధావతారం. ప్రొద్దున నుండి రాత్రివరకు ఎడతెగక బోధించేవారు. అలాగే శరీరానికి ఎంతటి అనారోగ్యం ఉన్నా 'ఈ శరీరం ఏ పనిమీద వచ్చిందో ఆ పని జరిగిపోవాలి. నా ఆఖరి శ్వాస దాకా బోధించడం మానను' అన్న ఆదిశంకరులు మన నాన్నగారు.



బుద్ధుడు మొదటి సంచార గురువు. తన వద్దకు వచ్చే భక్తులనే కాకుండా తన వద్దకు రాలేని భక్తుల దగ్గరికి ఎంతో కరుణతో తానే స్వయంగా వెళ్లి అనుగ్రహించే సంచార గురువు మన నాన్నగారు. 'మీరు ఊరికే సబ్జెక్టు చెప్పేస్తున్నారు కానీ వినే వారికి అర్థం అవ్వటం లేదు.  మీకు మిగిలేది కంఠశోషమే' అని ఆనంద్ బుద్ధుడితో అంటే బుద్ధుడు అన్నాడట: ఇప్పటికి విత్తనాలు చల్లేద్దాము. అనుకూల పరిస్థితి వచ్చినప్పుడు మొలకెత్తుతాయి. విత్తనాలే చల్లకపోతే అనుకూల పరిస్థితులు వచ్చినా అవేమి మొలకెత్తుతాయి?' అలాగే అర్హత ఉన్నా లేక పోయినా కరుణతో అందరికీ బోధ చేసిన బుద్ధ భగవానులు మన నాన్నగారు.

ఏసు క్రీస్తు అన్నాడు: 'You must be poor and pure in the spirit'. ఒక భక్తురాలు అన్నారు: 'నాన్నగారు, మా ఊరిలో అందరూ మిమ్మల్ని 'పేదల దేవుడు' అని పిలుస్తున్నారు' అంటే నాన్నగారు అన్నారు: 'నన్ను ఎవరు ఎలా పొగిడినా ఏమీ అనిపించలేదు కానీ ఈ మాట వింటే అనుకోకుండా ఆనందం వచ్చేస్తుంది'. ఏసు క్రీస్తు అంతటి నిరాడంబరులు మన నాన్నగారు.


# ‘మన నాన్నగారు’ అంటే



రాందాస్ పప్పా గారి బ్లిస్స్




బుద్ధుని శాంతి, కరుణ



శ్రీ రామకృష్ణుల భక్తి




శ్రీ శారదా దేవి పవిత్రత



శ్రీ సాయి బాబా ఘనత



స్వామి వివేకానందుని ధైర్యం



ఏసు క్రీస్తుని  ప్రేమ



శంకరుని జ్ఞానబోధ



శివానంద స్వామి సేవా భావం



శ్రీ కృష్ణుని ధర్మం



భగవాన్ రమణుల సమానత్వం



హనుమంతుని వినయం

# శ్రీ నాన్నగారి బాల్యానుభావం








మనం ఇప్పుడు ముప్పర్తిపాడుకు వచ్చాం. మేము రెండో తరగతి, మూడో తరగతి చదివేటప్పుడు కొమ్మరలో చదవలేదు, పక్క ఊరిలో చదివాము. బాషా అనే ఒకతను మాకు చొక్కాలు కుట్టేవాడు. సుమారు 40 సంవత్సరాలు క్రితం ముప్పర్తిపాడు నుంచి కొమ్మరకు వచ్చాడు. కొమ్మరలోనే machine పెట్టుకుని కొమ్మరలోనే కుట్టేవాడు. కొమ్మరలో అందరూ బాషా దగ్గరే బట్టలు కుట్టించుకునేవారు. నేను బట్ట పట్టుకెళ్ళి 'దీపావళి దగ్గరికి వచ్చేసింది ఎప్పుడు కుడుతావు?' అని అడిగితే 'జిన్నూరు కూర్చో' అనేవాడు. నా పేరు పెట్టి పిలిచేవాడు కాదు. 'జిన్నూరు' అనేవాడు. 'జిన్నూరు కూర్చో. నువ్వు దగ్గర ఉంటే తొందరగా కుడతాను. నువ్వు వెళ్ళిపోతే ఎప్పుడు కుడతానో తెలియదు. ఎన్ని బట్టలు ఉన్నాయో చూడు' అనేవాడు. ఇప్పుడే అడుగుతున్నాను 'బాషా ఎలా ఉన్నాడు?' అంటే 'చనిపోయాడు' అని చెబుతున్నారు. ముసలివాడై మంచం పట్టిఉంటే పలకరించి వద్దాం అనుకున్నాను.

చిన్నతనంలో ఒకసారి మా స్కూల్ టీచర్ ని 'హిందూ మతాన్ని స్థాపించింది ఎవరు?' అని అడిగితే ఆయన సరైన సమాధానం చెప్పలేకపోయారు. నాకు తర్వాత తెలిసివచ్చింది. హిందూ మతాన్ని ఎవరూ స్థాపించలేదు. అదొక జీవన విధానం అని అర్థం అయ్యింది.

## స్వామి జ్ఞానానంద తో శ్రీ నాన్నగారి మొదటి సమావేశం

నేను మొట్టమొదటిసారి జ్ఞానానంద స్వామిని 1954 మార్చి నెలలో డిల్లీలో చూసాను. అప్పుడు మనకు లోక్ సభలో మౌలంకర్ స్పీకర్ గా ఉండేవారు. ఆయన గుజరాత్ కి చెందినవారు. ఆయన మన లోక్ సభకు first స్పీకర్. మౌలంకర్ గారిని నేను పార్లమెంట్ లో చూసాను. ఎంత అందంగా ఉండేవారో. ఆయన సౌందర్యం కూడా నాకు గుర్తు వస్తూ ఉంటుంది. అప్పుడు లంకసుందరం గారు అనే MP బందర్ లో ఉండేవారు. ఆయన మమ్మల్ని పార్లమెంట్ house కి తీసుకెళ్ళారు. అప్పుడు నేను మౌలంకర్ ను చూసాను. Shakespeare చెప్పాడు ఒకచోట: 'Heaven walks on the earth'. మౌలంకర్ అలా ఉండేవారు. ఈ మాటలు ఎందుకు చెబుతున్నాను




అంటే మొట్టమొదటి సారి జ్ఞానానందను scientist గా నెహ్రూ గారికి పరిచయం చేసింది మౌలంకర్ గారు. అప్పుడు National Physical Laboratory ను ఢిల్లీలో స్థాపించారు. దానికి ఒక popular scientist డైరెక్టర్ గా ఉండేవారు. ఆయనకు సహకారంగా ఉండటానికి జ్ఞానానంద జర్మనీ నుండి తిరిగివచ్చి ఢిల్లీ లో settle అయ్యారు. జ్ఞానానంద శిష్యులలో ఆత్మానంద అని ఒకరుండేవారు. ఆయనది గుంటూరు జిల్లా. అప్పుడు నాకు చిన్నతనం, పిల్లకాయని. అంతకుముందు నేను జ్ఞానానంద స్వామి పేరు వినలేదు. 'జ్ఞానానంద స్వామి మీ west godavari కి చెందినవారే.  నేను మిమ్మలను ఆయనకు పరిచయం చేస్తాను' అని ఆత్మానంద నన్ను జ్ఞానానంద స్వామి వద్దకు తీసుకెళ్ళారు. ఢిల్లీ లో జ్ఞానానంద మొదట కొన్ని రోజులు సిటీ బస్సులో ఆఫీస్ కు వెళ్ళేవారు; తర్వాత ఆయనకు vehicle వచ్చింది. జ్ఞానానంద స్వామి ఆఫీస్ చేరక ముందే మేము వెళ్ళాము. అక్కడ ఒక boy జ్ఞానానందకు వండిపెట్టేవాడు. ఆత్మానంద నన్ను జ్ఞానానందకు పరిచయం చేస్తూ 'మీ ప్రాంతం వారే, జిన్నూరుకు చెందినవారు' అని అన్నారు. జ్ఞానానంద వద్ద ఆత్మానంద సన్యాసం పుచ్చుకున్నారు. నాకు ఆత్మానందకు tea కాసి ఇచ్చారు. tea పెట్టిస్తే ఒక గ్లాస్ లో నుండి ఇంకో గ్లాస్ కి నేను తిప్పుకుంటున్నాను. 'అన్నిసార్లు తిప్పుకుంటే tea చల్లారుతుంది. చల్లారిపోతే tea బాగుండదు. కనుక tea పుచ్చుకో' అని చెప్పారు జ్ఞానానంద. ఆ మాటలు నాకు బాగా గుర్తు. అందుకే చెబుతున్నాను.

## హృషీకేశ్ లో స్వామి శివానంద తో శ్రీ నాన్నగారి సమావేశం

జ్ఞానానంద దర్శనం అయిన తర్వాత మేము ఢిల్లీ నుండి హృషీకేశ్ వెళ్ళాం. హృషీకేశ్ లో శివానంద అప్పుడే స్నానం చేసివచ్చారు. శివానంద గురించి నాకేమీ తెలియదు. ఈ ఆత్మానందే నన్ను లోపలకు తీసుకెళ్ళారు. ఆయన అప్పుడే గంగా నదిలో స్నానం చేసి వచ్చారు. ఇంకా కాషాయం కూడా తొడగలేదు. పదిమంది లోపలికి వెళితే, వెళ్ళినవాళ్ళలో నేను పిల్లకాయని. వయస్సు లో చిన్నవాడిని. అందుచేత దగ్గర పిలిచి touch చేసి: 'Be good and do good' అన్నారు. Be good అంటే మంచిగా ఉండమని, Do good అంటే మంచి చేయమని. ఇది అన్ని మతాల సారం. తర్వాత ఒక మాట చెప్పారు. అదిమటుకు నాకు బాగా మెదడులో నాటుకుంది. Do good కంటే Be good కష్టం అని. ఒక మనిషి మంచి చేయటం కంటే మంచిగా ఉండటం కష్టం. ఇప్పుడు గాంధీగారి కంటే మంచి పనులు చేసినవారు ఇండియా లో ఉండొచ్చు. కాని ఆ మంచిపని చేసినవారు గాంధీ అంత మంచిగా ఉన్నారని చెప్పలేము. The Divine Life అనే జర్నల్ ఇచ్చారు. అదొక మాసపత్రిక. స్వామి శివానంద ఆయన చేతితో ఎంత ఆంగ్ల సాహిత్యం పంచిపెట్టారో మనం చెప్పలేము. నూతిలో నుంచి నీరు ఎలా ఊరతాయో అలా ప్రెస్ లో పుస్తకాలు print అవుతూనే ఉండేవి. 50% books ఆయన ఫ్రీ distribution చేసారు. సుమారు 300 పుస్తకాలు వ్రాసారు. ఆయన original గా డాక్టర్. ఆయన మాతృభాష తమిళం. 'ఒకప్పుడు నేను జ్ఞానానంద హృషీకేశ్ లో కలిసి తపస్సు చేసాము' అని శివానంద స్వామి చెప్పారు. జ్ఞానానంద గురించి శివానందకు తెలుసు. శివానంద గురించి జ్ఞానానందకు తెలుసు. వారిద్దరూ సమకాలికులే. కనుక 1954 లో నేను చూసిన saints లో జ్ఞానానంద ఒకరు, శివానంద ఒకరు.















www.srinannagaru.com

## శ్రీ నాన్నగారి జీవితంలోకి శ్రీ రమణ భగవానుల ఆగమనం

నాది పశ్చిమగోదావరి జిల్లా జిన్నూరు గ్రామం. నేను వ్యవసాయ కుటుంబంలో జన్మించాను. నా పూర్వీకులు ఆస్థిక బుద్ధి కలవారు. నాకున్న తాత్విక చింతన వంశపారంపర్యంగా వచ్చిన వారసత్వపు హక్కు లాంటిది. మా నానమ్మ పాపాయమ్మ గారి ప్రభావం ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా నా జీవితం మీద ఎంతగానో ఉంది. 1954 లో మా అమ్మమ్మగారైన సీతమ్మగారితో కలిసి ఉత్తరాది పుణ్యక్షేత్రాలన్నీ దర్శించాను. అది 1957 వ సంవత్సరం. అంతవరకు నా జీవితం సాధారణంగానే గడుస్తూ వెళ్ళింది. నా ఆలోచనలో ఉన్న పొరపాట్లను అతిక్రమించటానికి గాని, సత్యాత్మను దర్శించటానికి గాని నేను చెప్పుకోదగిన కృషి ఏమీ చేయలేదు. సాంఘిక సేవ పట్ల ఆసక్తిగా ఉండేది. కష్టాలను సుఖాలుగా మార్చుకోవటానికి అలవాటు పడ్డాను. జీవితము పట్ల విరుద్ధమైన వైఖరి లేదు.

ఒకరోజు రాత్రి నాకు స్వప్నం వచ్చింది. ఆ స్వప్నం లో చేతిలో కర్ర ఉన్న ఒక ముసలి వ్యక్తి వచ్చి నన్ను మంచం మీదనుండి లేవదీసి గట్టిగా ముద్దు పెట్టుకున్నారు. నేను కంగారుపడ్డాను. ఇలాగ నన్ను మూడుసార్లు కుడిబుగ్గ మీద ముద్దుపెట్టుకొన్నారు. నా జోలికి రావద్దని, నన్ను ముద్దు పెట్టుకోవద్దని, నన్ను విడిచిపెట్టమని ఆయనతో గట్టిగా పోరాడాను. అయినా ఆ అపరిచిత వ్యక్తి నా మాట వినిపించుకోలేదు. నన్నుకాని, నేను చెబుతున్న మాటలను కాని కొంచెం కూడా పట్టించుకోకుండా ఆయన పని ఆయన ఏకపక్షంగా చేసుకుపోతున్నారు. ఆయన నా జీవితం మీద దాడి చేస్తున్నట్లు అనిపించింది. నాకెంతో భయం కూడా వేసింది. ఆయన వడిలో నుండి జారిపోటానికి నేను గట్టి ప్రయత్నం చేసాను. నా జోలికి రావద్దని, నన్ను ముద్దు పెట్టుకోవద్దని, నన్ను విడిచిపెట్టమని, నా జీవితంలో ప్రవేశించవద్దని నేను గట్టిగా మొరపెట్టుకొన్నాను. నన్ను ఆయన బలవంతంగా ఎత్తుకొని ఎంతో ఆప్యాయంగా ముద్దు పెట్టుకొన్న సమయంలో నా తలక్రింద ఉన్న తలగడ క్రింద జారి పడిపోయింది. నన్ను ముచ్చటగా మూడుసార్లు ముద్దుపెట్టుకొన్న తర్వాత క్రింద పడిపోయిన తలగడ స్వయంగా ఆయన చేతితో తీసి జాగ్రత్తగా మంచం మీద సర్ది నాకు ఇసుమంతయు నొప్పిలేకుండా తిరిగి యథావిధిగా మంచం మీద పడుకోబెట్టారు. నా వంక ఎంతో జాలిగా ఒకసారి చూసి 'ప్రస్తుతానికి ఇది సరిపోతుందిలే' అని

నెమ్మదిగా చెప్పి వెళ్ళిపోయారు. ఇదంతా డాక్టర్ ఒక రోగికి ఆపరేషన్ చేసినట్లుగా అనిపించింది. ఆయన ఎవరో, ఏమిటో, ఎందుకు నన్ను కావాలని స్వీకరించటానికి వచ్చారో నాకానాటికి తెలియలేదు. నేను స్వప్నావస్థలో నుండి జాగ్రదావస్థలోకి వచ్చిన తర్వాత కూడా మూడురోజుల పాటు ఆ ముసలాయన నన్ను ముద్దుపెట్టుకున్న కుడిబుగ్గ మీద చెమ్మగానే ఉండింది. చెరిపినా చెరగలేదు.

నాకు స్వప్నంలో దర్శనమిచ్చి నన్ను లాలించి ఆశీర్వదించిన వ్యక్తి ఎవరో అర్థంకాలేదు. ఆయన రూపం ఎప్పుడూ అంతకుముందు చూడలేదు. ఆయన పేరు వినలేదు, ఎక్కడా చదవలేదు. ఆయనకు నాకు ఉన్న అనుబంధం నా ఆలోచనకి అందని విషయం. స్వప్నం యొక్క ప్రభావం మాత్రం నా జీవితం మీద బలీయంగా పని చేయటం ప్రారంభించింది. అది ఎన్ని జన్మల అనుబంధమో మరి! అలా ఆరునెలలు గడిచిపోయాయి. నా స్వప్నంలో దర్శనమిచ్చిన వ్యక్తి ఎవరో తెలుసుకోడానికి తపిస్తూనే ఉన్నాను. ఒకరోజు మా జిన్నూరు గ్రామం లైబ్రరీలో కూర్చొని 'ది హిందూ' అనే ఆంగ్లదినపత్రిక చదువుతున్నాను. అందులో మద్రాస్ బుక్ పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన 'గ్రేట్ మెన్ అఫ్ ఇండియా' అనే advertisement చూసాను. భారత దేశంలో జన్మించిన పదిమంది మహాత్ముల గురించి ఆంగ్లభాషలో చిన్నపుస్తకములో ప్రచురించారు. వారు ప్రచురించిన పేర్లు వరుసలో చదువుతున్నాను. అందులో ఏడవ పేరు 'శ్రీ రమణ మహర్షి'. అది చదివేసరికి నా శరీరం జలదరించింది. నన్ను ఎవరో కుదిపినట్లు అనిపించింది. ఆయన పేరు చదవగానే ఆయన నన్ను ఆకర్షించటమే కాక ఆయన గురించి తెలుసుకోవాలనే కాంక్ష బయలుదేరింది. ఈ పేరు చదవగానే నా శరీరమనే గుళ్ళనుండి నన్ను హృదయగుహలోకి ప్రవేశించడానికి దారి చూపిస్తాడని అనిపించింది. వెంటనే మద్రాసు కంపెనీ వారికి వ్రాసి 'శ్రీ రమణ మహర్షి' అనే పుస్తకం పోస్ట్ ద్వారా తెప్పించాను. ఆ పుస్తకంలో ఆయన పటం కూడా ముద్రించారు. నాకు ఆరునెలల క్రిందట స్వప్నంలో దర్శనమిచ్చి ఆశీర్వదించిన అవతారపురుషుడు ఈ పటంలో ఉన్న 'శ్రీ రమణ మహర్షుల' వారు అని తెలిసింది.

నాకు స్వప్నంలో దర్శనం ప్రసాదించిన దేవతా పురుషుడు తమిళనాడు రాష్ట్రంలో 'అరుణాచలం' అనే పుణ్యక్షేత్రమందు 'శ్రీ రమణాశ్రమం' లో జీవించి 'భగవాన్ శ్రీ రమణ మహర్షి' గా ప్రపంచ ప్రఖ్యాతి పొంది

ఆయన తన 70వ సంవత్సరంలో అనగా 14-4-1950 సంవత్సరంలో మహానిర్వాణం చెందారు. ఆయనకు వ్యక్తిగతమైన జీవితం లేదు. సత్యాత్మ ప్రకాశమే ఆయన జీవితం. సమత్వమే ఆయన ఊపిరి. ఆత్మ ఒక్కటే సమానమైనది. ఆయన దర్శనమాత్రము చేతనే ప్రపంచంలో అనేకమంది జీవితంలో కృతార్థులయ్యారు. భారతదేశపు ఆధ్యాత్మిక ఆకాశానికి ఆయన సూర్యుడిలాంటివాడు. యావత్ మానవజాతికి ఒక వరముగా 'శ్రీ రమణ స్వామి'ని పరమేశ్వరుడు ప్రసాదించాడు. ఆయన జీవితమే ఒక సందేశం. శ్రీ రమణస్వామి ఉపదేశాలను దేశకాలములు బంధించవు. ఆయన నామస్మరణ పుణ్యప్రదమైనది. మహాత్ములకు మహాత్ముడు. ఆయన అవతారం మానవ జాతికే గర్వకారణం. మానవ జాతి తపః ఫలితంగానే ఆయన అవతరించారు. ఆయన సందేశం జాతికి వెలుగు. నేను 1959 సంవత్సరం జనవరి నెలలో మొదటిసారిగా రమణాశ్రమం దర్శించాను. ఆనాటి నుండి ఈనాటివరకు రమణ సందేశాన్ని వ్యాప్తిపరచడానికి నా జీవితమంతా అంకితం చేసాను. నేను కావాలని ఆయనను నా జీవితంలోకి తెచ్చుకోలేదు. నన్ను ఆయన కావాలని తీసుకొని జీవితములో కృతార్థుడిని చేశారు.



## రమణ జయంతి సందర్భంగా మాట్లాడమని భగవాన్ రమణులు శ్రీ నాన్నగారిని స్వప్నం లో ఆదేశించడం

పూర్వం  ఒక భక్తుడు పాలకొల్లులో తన ఇంటిదగ్గర భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతి కార్యక్రమం ఏర్పాటు చేసాడు. అతను మా ఇంటికి వచ్చి నన్ను ఒక వక్తగా రమ్మని ఆహ్వానించాడు. జయంతి కార్యక్రమానికి వెళ్లి ప్రవచనం చేయటానికి నా మనస్సు ఇష్టపడలేదు. 'నేను రాలేను' అని చెప్పాను. తప్పనిసరిగా జయంతి సభకు రావాలని ఆ భక్తుడు నన్ను బలవంతం చేసాడు. సభాకార్యక్రమానికి హాజరు అవ్వటం నాకు ఇష్టం లేకపోయినా వస్తానని మాటమాత్రం అన్నాను. కాని వెళ్ళకూడదు అన్న నిర్ణయానికి వచ్చాను. ఈ సంగతంతా భగవాన్ శ్రీ రమణ మహర్షి జయంతికి ముందు జరిగింది.

ఆ రోజు రాత్రి శ్రీ భగవాన్ నాకు స్వప్నదర్శనం ఇచ్చి 'పాలకొల్లు సత్సంగానికి హాజరు అవుతున్నావా లేదా?' అని ప్రశ్నించారు. భగవాన్ తో వాస్తవం చెప్పటానికి సంకోచించి 'సత్సంగానికి హాజరై ప్రసంగించి వస్తానని' చెప్పాను. 'నువ్వు అబద్ధం చెబుతున్నావు' అని ఆయన అన్నారు. ఆ మాటకు నేను కంగారు పడ్డాను. నా మనస్సుకు కలవరం కలిగింది. నా మనస్సులో ఉన్న విషయం ఆ మహర్షికి తెలిసినందుకు నాలో నాకు ఆశ్చర్యం కలిగింది. నాకు ఇసుమంతయు ఇష్టంలేకపోయినా జయంతి సభకు హాజరై మాట్లాడి వస్తానని మరొకసారి చెప్పాను. ఆ ఋషి మాత్రం నాతో ఏమీ మాట్లాడలేదు. మౌనంగా బయటకి వెళ్ళిపోయారు. స్వప్నం ముగిసింది. అదేరోజు రాత్రి కొన్ని గంటల తర్వాత రెండో స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో శ్రీ భగవాన్ నాకు దగ్గరగా వచ్చి నన్ను ఆహ్వానించిన వ్యక్తి యొక్క ఇంటిని, ఆ ఇంటిలోని ఒక పెద్ద గదిని చూపించారు. మరుసటి రోజు జయంతి సభ ఆ పెద్ద గదిలో ఉదయం పది గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. నాకు తెలిసిన ఒక ఉన్నత విద్యావంతుడు, సోషల్ వర్కర్ అయిన ఒక పెద్ద మనిషిని భగవాన్ నాకు స్వప్నంలో చూపించి మరుసటి రోజు జరగబోయే సభలో ఆయన నీకన్నా ముందుగా వచ్చి ముందుగానే మాట్లాడుతారని చెప్పారు. ఆ పెద్దమనిషి గదిలో కూర్చొనే చోటు కూడా చూపించారు. ఆ సభలో ఆయన రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడుతారని, తర్వాత నువ్వు మూడు గంటలు ప్రసంగించ వలసి ఉంటుందని అన్నారు. నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా నువ్వు జయంతిసభను జయప్రదం చేయవలసి ఉందని, నువ్వు అహంకారంతో తీసుకున్న నిర్ణయం కూలిపోతుందని నాకు గట్టిగా చెప్పి నా వంక ఆప్యాయంగా ఒకసారి చూసి నెమ్మదిగా వెళ్ళిపోయారు. ఇదంతా నాకొక సలహాగా కాకుండా ఆయన ఆజ్ఞగా అనిపించింది. స్వప్నావస్థ నుండి జాగ్రదావస్థలోకి వచ్చాను. అదంతా ఒక స్వప్నం మాత్రమే. శ్రీ భగవానులు స్వయంగా వచ్చి నాకు ఆదేశాలు జారీ చేసినా నాకు విశ్వాసం కుదరలేదు. స్వప్నాన్ని ఎంతమాత్రం విశ్వసించలేదు. స్వప్నం వాస్తవం ఎలా అవుతుంది? అని అనుకున్నాను. ఇంత జరిగినా భగవాన్ జయంతి సభకు వెళ్ళకూడదని ఒక దృఢనిశ్చయానికి వచ్చి ఉదయం తొమ్మిది గంటలకే భోజనం చేసి కూర్చున్నాను. జయంతి సభకు వెళ్ళమని నాలో ఒక బలీయమైన శక్తి నన్ను ఆజ్ఞాపించింది. ఆ శక్తి ప్రవాహంలో నా నిశ్చయం జారిపోయింది. నా మనస్సు నా స్వాధీనంలో లేదు. నా తలంపు సన్నగిల్లింది. ఒక అతీతమైన

శక్తిప్రవాహం నన్ను బలాత్కారంగా పాలకొల్లు జయంతి సభకు తీసుకు వెళ్ళింది. నన్ను ఒక బొమ్మరీతిగా ఆ శక్తి సభాస్థలానికి చేర్చింది. నేను సభలోకి అడుగుపెట్టగానే శ్రీ భగవాన్ నాకు స్వప్నంలో చూపించినవన్నీ అక్కడ జరుగుతున్నాయి. అదంతా నాకు అద్భుతంగా అపూర్వంగా అనిపించాయి. నాకు వచ్చిన పొట్టి స్వప్నము యథాతథముగా అక్కడ పొడుగున ప్రదర్శిస్తున్నారని తోచింది. స్వప్నం వాస్తవం అవుతుందని నేను విశ్వసించలేదు. కాని జరిగింది చూసిన తరువాత నాకు వచ్చిన స్వప్నం నేను నమ్మకుండా ఉండలేక పోయాను. భగవాన్ శ్రీ రమణ మహర్షి ఎంతో సజీవంగా ఉన్నారని అనిపించింది.

## భగవాన్ రమణులతో శ్రీ నాన్నగారి జన్మజన్మల అనుబంధం

నా హృదయంలోకి మొదటిసారి భగవాన్ ప్రవేశించినప్పుడు భగవాన్ పట్ల నాకు కలిగిన ప్రేమ ఈ రోజుకి అలాగే ఉంది. మొట్టమొదటి రమణ జయంతోత్సవం 1957 వ సంవత్సరం లో జిన్నూరు elementary school లో జరుపుకున్నాం. భగవాన్ పట్ల అప్పుడు ఎంతటి ఆప్యాయత ఉండేదో ఈ రోజుకి అది అలాగే ఉంది. ఇది నా తెలివితేటల వల్ల కాదు. అది కేవలం జన్మజన్మాంతర అనుబంధం వల్ల సాధ్యమైంది. భగవాన్ అన్నారు: 'ఒకే చోట తవ్వకుండా చాలా చోట్లు తవ్వితే నీకు నీళ్లు ఎలా లభిస్తాయి?' నాకు చాలా చోట్ల తవ్వే మనస్తత్వం ఉంటే ఆయన్ను ఎప్పుడో వదిలేసే వాడిని. ఆయన్ని అంటిపెట్టుకుని ఉన్నాను అంటే అది నా తెలివితేటల వల్ల కాదు. నేను ఆయన చేయి పట్టుకోలేదు. ఆయనే నా చేయి పట్టుకున్నారు. నేను ఆయన్ను స్మరించడం లేదు. ఆయన నన్ను స్మరిస్తున్నారు కాబట్టే నేను ఆయన్ని అంటుపెట్టుకొని ఉండగలుగుతున్నాను. నాకన్నా తెలివైనవారు, సమర్థవంతులు ఈ లోకంలో ఎంతోమంది ఉంటారు. దీనికి తెలివికి ఎటువంటి సంబంధం లేదు. ఆయన నన్ను స్మరించి ఆయన్ను స్మరించే శక్తి నాకు ఇస్తున్నారు కాబట్టే నేను ఇవాళ 'రమణ రమణ' అని అనగలుగుతున్నాను. ఈ విధంగా ఆ నాటినుండి ఈ నాటివరకు నా భక్తి చెదరకుండా uniform గా ఉండింది. అది ఈ జన్మలో చేసిన సాధన వలన కాదు, భగవాన్ తో జన్మజన్మాంతర అనుబంధం ఉండటం వలన సాధ్యమైంది. భగవాన్ ని ఎవరైనా విమర్శించినా నా భక్తి చెదరదు. దానికి కారణం మా మధ్య ఉన్న జన్మజన్మాంతర అనుబంధం. 'మీది జన్మ జన్మాంతరాల అనుబంధం అయితే అది చివరి వరకు నిలుస్తుంది' అని కాళిదాసు అన్నాడు.

## భగవాన్ రమణుల పట్ల శ్రీ నాన్నగారి దృఢమైన భక్తి

ఈ మధ్యన ఒకరు రమణస్వామిని నా దగ్గర విమర్శించారు. 'మీ భక్తిని చెడగొట్టడం కోసం రమణస్వామిని విమర్శించడంలేదు' అని ఆయన అన్నారు. అప్పుడు నేను అన్నాను 'ఏదైనా కారణం వల్ల నాకు రమణస్వామి మీద భక్తి కలిగితే, మీరు విమర్శిస్తే నాకు కంగారు పుడుతుంది. నాకు కంగారు పడవలసిన అవసరం లేదు. నాకు రమణస్వామి మీద భక్తి అకారణమైనది. మీరు చెప్పే మాటలు వినినంత మాత్రాన నా భక్తి చెలించి పోతుందనే తక్కువ అంచనా మీరు వేయద్దు. అంత తేలికగా నాకు భగవాన్ మీద భక్తి పోతుంది అని మీరు అనుకోవద్దు. అలా అనుకుంటే మాత్రం మీ అంచనా తప్పు. రమణమహర్షి అని నేను ఒక్కసారి హిందూ paper లో చదవగానే నాకు ఆయనపట్ల devotion, ఒకరకమైన thrill కలిగింది. ఆయన ఒక ఋషి అనిగాని, ఒక జ్ఞాని అనిగాని, అవతారపురుషుడనిగాని, ఒక modern మహర్షి అనిగాని నాకు తెలియదు. ఆయన ఏమిటో నాకు తెలియదు. ఆయన ఏమిటో నాకు తెలియకుండానే ఆయనపట్ల నాకు ప్రేమ కలిగింది. అందుచేత మీరు చెప్పే చిన్నచిన్న మాటలు చూసి చెదిరిపోయే mind కాదు నాది. ఇది తుమ్మొస్తే ఊడిపోయేదా? తుమ్మొస్తే ఊడిపోయేటటువంటి భక్తి అయితే life ని dedicate చేయగలమా?

## భగవాన్ రమణుల విశిష్ఠత శ్రీ నాన్నగారి మాటల్లో

మీరు అస్తమాను రమణమహర్షి రమణమహర్షి అంటారు. ఎందుకు మీకు రోజు ఈ రమణమహర్షి గొడవ? మీరు సుఖంగా ఉన్నట్లు కనబడటంలేదు, వచ్చినవారిని సుఖంగా ఉండనివ్వటంలేదు. ఆయన జ్ఞానదాత అంటున్నారు. అదీ కనబడటంలేదు అని 20 సంవత్సరాల కిందట నన్ను ఇంటిదగ్గర భక్తులు అడుగుతూ ఉండేవారు. దక్షిణామూర్తి ఆదిగురువు అని చెబుతారు. ఆయన మహాపండితులకు జ్ఞానం ఇచ్చిన మాట నిజమే. రమణమహర్షి లో ఏముందని మీరు అడుగుతున్నారు. రమణమహర్షి పండితులకే కాదు, చదువులేనివారికి చివరకు జంతువులకు కూడా జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆయన పైకి గొప్పగా కనిపించటంలేదు. ఏదో గోచీ పెట్టుకొని కూర్చున్నాడు. ఒక మనిషి యొక్క ఔన్నత్యాన్ని బాహ్యంగా చూచి ఎప్పుడూ కొలవకూడదు.

రమణమహర్షిలో ఏముంది అంటే నేనేమి చెబుతాను? ఆయన చదువుకొన్నవారిని, చదువులేనివారిని, ధనం ఉన్నవారిని, ధనంలేనివారిని, అందమైనవారిని, కురూపులను అందరినీ సమానంగా చూసారు. ఎందుచేతనంటే ఆయనకు దేహబుద్ధిలేదు.

## మీరు తపస్సు చేసారా? అన్న ప్రశ్నకు శ్రీ నాన్నగారి జవాబు

ఒక స్వామీజి నాన్నగారిని ఇలా అడిగారు: ' మీరు హిమాలయాలలో గాని, శ్రీశైలంలో గాని, హరిద్వార్ లో గాని తపస్సు చేసారా?' అంటే నాన్నగారు అన్నారు: 'నేను ఎక్కడా తపస్సు చేయలేదు. భగవాన్ నా జీవితంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఆయన్నే అంటుపెట్టుకున్నాను. నాకు సంబంధించినంత వరకు నేను ఎటువంటి పెద్ద పెద్ద సాధనలు చేయలేదు. నాకు ఆత్మజ్ఞానం కలిగిందంటే కేవలం గురువు మీద ఉన్న ప్రేమ వల్లనే. అది అనంతమైన హద్దులు లేని ప్రేమ. ప్రతీ రోజు మారిపోయే ప్రేమ కాదు, అది అఖండమైన ప్రేమ. ఏదో నా ప్రయత్నం వల్ల నాకు అటువంటి ప్రేమ కలగలేదు. అది కేవలం శ్రీ రమణానుగ్రహం వలన కలిగింది. భగవాన్ మార్గంలోకి వచ్చినప్పటినుంచి నేను భగవాన్ నామాన్ని, రూపాన్ని, టీచింగ్ ని అంటిపెట్టుకొని ఉన్నాను. కర్త తాను చేసిన కర్మ యొక్క ఫలితానికి ఎలా అంటుబెట్టుకొని ఉంటాడో, నేనూ భగవాన్ని అలా అంటుబెట్టుకొని ఉన్నాను. నేనేమైనా సాధించానంటే కేవలం ఈ ప్రేమ వల్లనే సాధ్యమైంది. అది తప్పించి నేనింకేమీ చేయలేదు. కేవలం ప్రేమ వల్లనే సాధించగలిగాను.

## భగవాన్ రమణుల దత్త పుత్రులు శ్రీ నాన్నగారు

శ్రీ నాన్నగారు అన్నారు: ' నేను ఏ తపస్సు చేయలేదు. నాకు దైవానుగ్రహం ఉంది. భగవంతుని direct interference ఉంది. నేను ఏదైనా సాధించానంటే దానికి కారణం కేవలం భగవాన్ నన్ను దత్తత తీసుకొనటం. అది నూటికి నూరు శాతం భగవాన్ అనుగ్రహం వల్లనే. నేను రమణుని దత్తపుత్రుడను'. అప్పుడు ఒక భక్తురాలు ఇలా అడిగారు: 'మీరంతా సాధన పేరుతో ఇప్పుడు పడే కష్టాలన్నీ నేను పూర్వజన్మల్లోనే పూర్తి చేసి ఉండవచ్చు కదా అని భగవాన్ అన్నారు. అలాగే మీ విషయంలో కూడా సాధనంతా పూర్వ జన్మల్లో అయిపోయి ఉండవచ్చు

కదా?' అంటే నాన్నగారు అన్నారు: ' భగవాన్ ఆత్మజ్ఞానం కొరకు పూర్వజన్మల్లో కష్టపడి సాధన చేసి ఉండవచ్చు కాని నేను ఎటువంటి కష్టంలేకుండా ఆత్మజ్ఞానం పొందాను. మీరంతాకూడా మిమ్మల్ని దత్తత తీసుకోడానికి ఎవరైనా ఉన్నారేమో చూసుకోండి. కాని అలా దత్తత తీసుకునేవారు అనుగ్రహ స్వరూపులై ఉండాలి'.

## 'భగవాన్ ఎల్లప్పుడూ ఉన్నారు' అని శ్రీ నాన్నగారి అనుభవం



నేను రమణ మహర్షిగారి పటం దగ్గర కూర్చున్నాను. ఆయనకు నేనెప్పుడూ పూజ చేయలేదు. ఆ పటం వంక చూస్తూ ఏమన్నాననంటే: 'ఇప్పుడా శరీరం లేదు కదా, నువ్వు లేవని నాకు తెలుసు' అని అన్నాను. అంటే భగవాన్ అన్నారు: 'నేను లేనని నువ్వు అనుకున్నా నీ వెంట పడుతున్న మాట నిజం. ఉండటానికి శరీరానికి సంబంధం ఏమిటి?' బ్రాహ్మీ స్థితి పొందినవాడు వాడి శరీరం ఉన్నప్పుడు కూడా వాడు శరీరం కాదు. శరీరం ఉండటానికి లేకపోవడానికి జ్ఞానికి బేధం కనిపించదు. మిమ్మల్ని అందరినీ ఆ స్థాయికి తీసుకురావటానికే గురువు చేసే ప్రయత్నం. బ్రాహ్మీస్థితి పొందినవాడు కళ్ళులేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు, కాళ్ళు లేకుండా నడవగలడు.

ఈ మధ్య మా ఇంట్లో ఇటువంటి ప్రశ్నలు అడగటం లేదు కాని వారు నన్ను ఈ ప్రశ్న ఎప్పుడు అడుగుతారా అని ఎదురు చూస్తున్నాను: 'అసలు భగవాన్ ఏమి చేసారు?' నా దగ్గర జవాబు సిద్ధంగా ఉంది: 'అసలు భగవాన్ చేయనిది ఏమిటి?' కాని వారు నన్ను అడగటంలేదు. నేనూ వారికి భగవాన్ గురించి చెప్పటంలేదు. మేమిరువురమూ రాజీకొచ్చేసాము.

నాకు ఎంతోమంది మహాత్ములతో అనుబంధం ఉంది. కాని అద్వైత స్థితిని ప్రసాదించింది మాత్రం భగవానే.

## భగవాన్ని ప్రత్యక్షంగా చూడలేదని నాన్నగారికి ఎప్పుడూ బాధ కలుగలేదు

రమణాశ్రమం లో ఒక రమణ భక్తుడు ప్రసంగిస్తూ 'నాన్నగారు భగవాన్ని దేహంలో ఉండగా (ఫ్లెష్ అండ్ బ్లడ్ లో) చూడలేదు' అన్నారు. దానికి జవాబు చెబుతూ నాన్నగారు అన్నారు: 'అది రైట్.  భగవాన్ దేహంలో ఉండగా నేను ఆయన్ని చూడలేదు. అయితే ఆయన్ని దేహంలో ఉండగా చూడలేదు అన్న బాధ నాకేమీ లేదు. భగవాన్ దేహం పడిపోయేముందు, ఒకరు భగవాన్ని అడిగారు: 'మీ దేహం పడిపోతుంది. మరి మమ్మల్ని ఎవరు కరుణిస్తారు? మా పట్ల ఎవరు కృప చూపిస్తారు?' అంటే అప్పుడు భగవాన్ ఒక చక్కటి బ్యూటిఫుల్ సెంటెన్స్ చెబుతారు: 'ఈ దేహం ఉన్నప్పుడు కూడా ఈ దేహం మిమ్మల్ని అనుగ్రహించడం లేదు. ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తుందో



ఈ దేహం మరణించిన తరువాత కూడా అది ఉంటుంది. ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తుందో దానికి మరణం లేదు. దేహం ఉన్నప్పుడు కూడా ఈ దేహం కాదు మిమ్మల్ని అనుగ్రహించేది'. అంటే గురువుతోటి అనుబంధం ఒక జన్మతోటిది కాదు. భగవాన్ అన్నారు: 'పూర్వ జన్మల్లో ఏమీ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసుకున్నామా?  ఈ సంబంధం మనలను మరొక చోట కలపదా?' మనకు బేధ బుద్ధి, అజ్ఞానం, అహంకార బుద్ధి నశించే వరకు మనకు గురువు యొక్క సహాయ సహకారాలు ఉంటూనే ఉంటాయి. దేహం మరణించినప్పటికీ గురువుతో అనుబంధం మనకు తెగదు. అందుచేత గురువంటే కేవలం దేహమాత్రుడే కాదు. గురువుని దేహానికి పరిమితం చేయడం ఆయన్ని అగౌరవపరచడం. రమణ మహర్షి ఇప్పుడు లేరు అనుకోవడం ఆయన్ని అగౌరవపరచడం. అందుచేత ఆయన ఉన్నాడు, సజీవంగా ఉన్నాడు. ఆయన దేహం ఉందా లేదా అన్నది ముఖ్యం కాదు'.

'మీరు ఎప్పుడైనా భగవాన్ ను సశరీరంగా చూసారా?' అని నన్ను కొంతమంది అడుగుతూ ఉంటారు. ఈ శరీరంతో చూడలేదు. ఇంతకుముందు శరీరంతోటి విరూపాక్షగుహలో ఉండగా చూసాను అంటే జన్మలు మారినా అనుబంధం వెంటాడుతోంది.

## నాన్నగారికి భగవాన్ తో ఉన్న అనుబంధం చైతన్యానికి సంబంధించినది


రమణ మహర్షి గారి శరీరాన్ని నేను చూడలేదు. నాకు రమణ మహర్షి గారికి మానసిక అనుబంధం లేదు. నాకు ఆయన చుట్టం కాదు. రమణ మహర్షి నాకు శరీరానికి సంబంధించిన వారు కాదు, మనస్సుకు సంబంధించిన వారు కాదు. మా సంబంధం మనోదేహములకు అతీతమైనది. అది చైతన్య స్థాయి లో ఉన్నటువంటి అనుబంధం. అందుచేత ఎన్ని గాలివానలు వచ్చినా మాకు భగవాన్ కి ఉన్న సంబంధం పోలేదు. అది మానసిక అనుబంధం అయితే పోతుంది. అది చైతన్యానికి సంబంధించినది.

## శ్రీ నాన్నగారిపై భగవాన్ రమణుల అపార కృప

జీవితంలో నేను చేసిన సాధన కంటే అరుణాచల రమణుని కృప మాత్రమే నేను చైతన్య స్థాయిని పొందేందుకు ఎక్కువగా సహకరించింది. ఏ సాధకుడైనా ప్రయత్నం తో పాటు దైవానుగ్రహం కలిసి రాకపోతే సిద్ధుడు కాలేడు. ఈశ్వరుని కృప లేకుండా మనస్సు అణగదు. అణిగిన మనస్సుకు మాత్రమే ఆత్మదర్శనానికి అర్హత చేకూరుతుంది. భగవాన్ శ్రీ రమణ మహర్షి ప్రసాదం వలన మాత్రమే నేను శాంతి స్థానము పొందగలిగాను.

## శ్రీ నాన్నగారు అంటే భగవాన్ యొక్క ప్రతినిధి

ఒకడు మూల విరాట్టు. రెండు ఉత్సవ విగ్రహం. మూల విరాట్టు కదలడు. కాని ఉత్సవ విగ్రహాన్ని శివ రాత్రి రోజున ఊరేగిస్తారు. ఊరేగే దేవుడు separate గా ఉంటాడు. ఊరేగే దేవుడిని ఉత్సవ విగ్రహం అంటారు. ఆ ఉత్సవ విగ్రహం మూల విరాట్టుకు representative. మూల విరాట్టు కదలడు కాబట్టి ఈ ఉత్సవ విగ్రహాన్ని పంపుతాడు. అందుచేత నన్ను representative of భగవాన్ అనేవారు.





నా విషయం లో divine interference వచ్చింది. Divine interference వల్లనే ఈ సృష్టి నుండి బయట పడ్డాను.

## ఒక అశరీర వాణి తో శ్రీ నాన్నగారి అనుభవం

నాకు cancer ఉందని డాక్టర్స్ అనుకున్నారు. నా మనస్సు కూడా ఈ దేహం వదిలేయడానికి prepare అయిపోయింది. ఇక వేరే తలంపులు లేవు. నాకు 104 డిగ్రీల జ్వరం వచ్చింది. జ్వరం తగ్గితే అరుణాచలం వెళ్ళాలి, అక్కడ గిరిప్రదక్షిణం చేయాలనే తలంపే రాలేదు. జ్వరంతో బాధ పడుతుండగా ఒక అదృశ్యశక్తి యొక్క అశరీరవాణి వినపడింది: 'నువ్వు ఎప్పుడైనా ఉడిపి అనే పేరు విన్నావా?' అని అడిగింది. నేనన్నాను 'ఉడిపి కర్ణాటక రాష్ట్రంలో ఉంది'. అప్పుడు మళ్ళీ ఆ అశరీరవాణి అడిగింది: 'అక్కడి దేవుడెవరో నీకు తెలుసా?' అంటే నేను 'బాలకృష్ణుడు' అని జవాబు ఇచ్చాను. 'అక్కడ బాలకృష్ణుడిని స్థాపించింది ఎవరో తెలుసా?' అని అడిగితే 'మధ్వాచార్యులు' అని బదులిచ్చాను. అక్కడ ఏ దేహం కనబడటం లేదు కాని ఆ అదృశ్య



శక్తి వేసే ప్రశ్నలకు నేను జవాబులు ఇస్తున్నాను. అప్పుడా అదృశ్యశక్తి అంది: 'నువ్వు ఉడిపి కృష్ణుని దర్శనం చేసుకో. నీ జ్వరం తగ్గిపోతుంది'. ఇలా అన్నాక ఆ అదృశ్య శక్తి యొక్క అశరీరవాణి వినిపించడం ఆగిపోయింది. కాని నాకు అప్పటికీ ఉడిపి వెళ్ళాలి, కృష్ణుడిని దర్శించాలి అన్న తలంపు కూడా రాలేదు. అప్పుడు నేను డాక్టర్ గారితో ఆ అదృశ్య శక్తి తో జరిగిన సంభాషణ వివరించాను. డాక్టరుగారు అన్నారు: మాకు మీ రోగకారణం అంతుపట్టడంలేదు. కనుక మీరు ఉడిపి దర్శిస్తానని మొక్కుకోండి'. కాని నేను ఎంత ప్రయత్నించినా అలా చేయలేకపోయాను. ఉడిపి వెళ్ళకూడదు అని కాదు, ఉడిపి కృష్ణుడు నాకు ఇష్టం లేడు అని కూడా కాదు. అసలు జ్వరం తగ్గితే గిరిప్రదక్షిణ చేద్దాం అన్న తలంపు కూడా రాలేదు. ఇదంతా ఒక స్వప్నంలా అనిపించింది. 'నేను చనిపోయినా నష్టం ఏమిటి? ఈ శరీరం పంచభూతాలతో తయారయ్యింది. ప్రారబ్ధం ఖర్చు అయ్యేవరకు, ప్రాణం దేహాన్ని అంటుపెట్టుకొని ఉంటుంది. ప్రారబ్ధం ఖర్చు అవ్వగానే ఈ దేహం రాలిపోతుంది' అని అనిపించింది.

## శ్రీ నాన్నగారి ఆంజనేయస్వామి స్వప్నదర్శనం




సౌందర్యం అంతా హృదయంలోనే ఉంటుంది. సౌందర్యం అనేది బాహ్యవస్తువుల్లో ఉండదు. ఒకసారి నేను షిరిడిలో ఉండగా బాలాంజనేయ స్వామి స్వప్నంలో దర్శనం ఇచ్చాడు. ఆయన పూర్వం ఎప్పుడూ నాకు అలాంటి స్వప్నదర్శనం ఇవ్వలేదు. నేనూ ఆయన ఉపాసన ఎప్పుడూ చేయలేదు. దేవుడు, దెయ్యం గొడవ వదిలేయండి. ఆ సౌందర్యం చూడలేక నేను రెండు కళ్ళూ మూసేసుకున్నాను. సౌందర్యం అంటే ఇక్కడ బాహ్య సౌందర్యం గురించి ప్రస్తావిస్తున్నాను. అంతఃసౌందర్యం గురించి మాట్లాడటంలేదు. ఆంజనేయస్వామిది బహుసుందరమైన రూపం. సుందరకాండ అనే పేరు కూడా ఈ విధంగానే వచ్చింది. ఆయన షిరిడిలో స్వప్నదర్శనం ఇచ్చినప్పుడు నాకు అనిపించింది: 'అసలు దేహధారులు ఎవరికైనా ఇంతటి అందం ఉంటుందా?' రెండు కళ్ళతో ఆయనను చూడటానికి ప్రయత్నించాను. ఆఖరికి ఆయన అందాన్ని చూడలేక రెండు కళ్ళూ మూసేసాను. ఎవరైనా అందమైన వారిని వర్ణించాలంటే Shakespeare అనేవాడు 'Beauty walks on the Earth'. అంటే అందమే ఒక రూపం దాల్చి భూమి మీద నడుస్తుంది అని అర్థం. Shakespeare కూడా ఆంజనేయ స్వామి అందాన్ని వర్ణించలేడు అని అనిపించింది. బాహ్యసౌందర్యం చూడలేకనే నేను కళ్ళు మూసేసుకున్నాను, ఇక ఆంజనేయస్వామి యొక్క అంతఃసౌందర్యం నేనెక్కడ దర్శించగలను అనిపిస్తుంది. అంతఃసౌందర్యం ఎంత అద్భుతంగా ఉంటుందో! అంతఃసౌందర్యమే నిజమైన సౌందర్యం. రామాయణం అంతా తిరగేస్తే సొంతపనంటూ లేనివాడు ఒక్క ఆంజనేయస్వామే. ఎంత సౌందర్యం అంటే సౌందర్యం అంతా ఒక రూపుదాల్చి వచ్చినట్లు ఉంది. ఇప్పుడు కూడా జాగ్రదావస్థ లో ఆ సౌందర్యం ఎక్కడైనా కనిపిస్తుందేమో అని నా కళ్ళు వెతుకుతూ ఉంటాయి. ఇప్పటివరకు ఆ

సౌందర్యం భౌతికంగా ఎక్కడా కనపడలేదు. ఆంజనేయస్వామికి వాల్మీకి కూడా న్యాయం చేయలేడు అనిపించింది. వాల్మీకి మాట విడిచిపెట్టేయండి. ఒకవేళ సరస్వతీదేవి వర్ణించటానికి ప్రయత్నించినా ఆంజనేయస్వామి సౌందర్యం వర్ణించలేదు అనిపించింది. ఎందుకు చెబుతున్నానంటే భౌతికమైన, శారీర సౌందర్యమే అంత గొప్పగా ఉన్నప్పుడు హృదయ సౌందర్యం ఎంత గొప్పగా ఉంటుంది? Beauty is Truth, Truth is beauty. సత్యానికి మించిన సౌందర్యం అంటూ ఏమీ లేదు. సత్యానికి మించిన జ్ఞానం ఏమీ లేదు. సత్యానికి మించిన ఆనందం లేదు. సత్యానికి మించిన శాంతి, కాంతి లేవు. అందుకే సత్యం, జ్ఞానం అనంతం అన్నారు. దాని తాలూకా అనుభవం పొందటానికే ఈ భూమి మీదకు వచ్చాము కాని, కేవలం మన body ని cover చేసుకోవటానికి, అన్నం తిని, బట్టలు కట్టుకోడానికి రాలేదు.

## శ్రీ నాన్నగారి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వప్నదర్శనం



ఒకసారి నేను తిరుత్తణి వెళ్ళాను. అక్కడ ఆలయం ఒక చిన్న కొండమీద ఉంటుంది. తిరుత్తణికి కారులో కూడా వెళ్ళొచ్చు. కాని గుడికి చేరుకోవాలంటే కొండ ఎక్కవలసిందే. నేను తిరుత్తణి చేరుకునేసరికి సాయంత్రం అయింది. సుబ్రహ్మణ్య స్వామికి అర్పించడానికి నాతోపాటు ఏ పళ్ళు-పూలు తీసుకెళ్ళలేదు. కేవలం ఆయనకు నమస్కరించి వచ్చేసాను. ఆ రాత్రి తిరుత్తణిలో బస చేసి మరుసటిరోజే ఫస్ట్ బస్సు పట్టుకుని తిరువణ్ణామలై వెళ్లాలని నా plan. అందుకు busstand వెళ్లి తిరువణ్ణామలై వెళ్ళే first బస్సు ఎప్పుడో కనుక్కొని కూడా వచ్చాను. ఆ రాత్రి నాకొక పెద్ద పాము కలలోకి వచ్చింది. ఆ సర్పం ఎంత పెద్దగా ఉందంటే నాకు ముఖం కనపడుతుంది కాని, తల పూర్తిగా కనిపించడం లేదు. ఆ పాము నాతో మాట్లాడటం మొదలెట్టింది. అది నన్ను అడిగింది: ‘ రేపు నీ కార్యక్రమం ఏమిటి?’ అంటే నేను అన్నాను: ‘తిరువణ్ణామలై తిరిగి వెళ్ళిపోతున్నాను’. సాధారణంగా పామును చూస్తే మనకు భయం వేస్తుంది కాని

సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహం చేత అంత పెద్ద పామును చూసినా నాకు భయం కలుగలేదు. సుబ్రహ్మణ్యేశ్వరుడు సర్పస్వరూపుడు. అప్పుడు ఆ పాము బదులుగా అంది: 'మరి నా సంగతి ఏమిటి? నువ్వు నాకు పళ్ళు గాని పుష్పాలు గాని ఏదీ సమర్పించలేదు. సుబ్రహ్మణ్య నామం కూడా చేయలేదు. ఇక్కడికి వచ్చి ఊరికే వెళ్ళిపోతున్నావా? రేపు పొద్దునే స్నానం చేయి. కాఫీ త్రాగకు (నాకు ప్రొద్దునే కాఫీ త్రాగే అలవాటుంది. ఈ విషయం ఆయనకెలా తెలుసు? అంటే ఆయన అంతర్యామి గనుక ఆయనకు తెలుసు). పూలూ పళ్ళూ పట్టుకొని రా. అవి నాకు సమర్పించాక తిరిగివెళ్ళు'. ఆయన నన్ను అభ్యర్థించినట్లుగా చెప్పలేదు, ఆజ్ఞాపించినట్లుగా చెప్పారు. ఇదంతా కేవలం ఆయన అనుగ్రహం నామీద ప్రసరింప చేయడానికి.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో శ్రీ నాన్నగారి అనుబంధం




దేవతలకు దేవతలకు చుట్టరికాలు ఉంటాయి. మనుష్యులకీ, మనుష్యులకీ చుట్టరికాలు ఉంటాయి. కాని మాకు సుబ్రహ్మణ్యుడికి చుట్టరికం ఉంది. ఆయన దేవతాపురుషుడు, మేము మానవులం. సాధారణంగా దేవతలకు మానవులకు చుట్టరికాలు ఉండవు. కానీ నాకు సుబ్రహ్మణ్యుడు గుర్తువచ్చినప్పుడు relative అనిపిస్తుంది. ఆయన విగ్రహం ఎక్కడైనా కనిపించినప్పుడు నమస్కారం పెట్టాలనిపించదు. ఇష్టం లేక కాదు. ఇంట్లోవాళ్ళు ఇంట్లోవాళ్ళు ఏమి గౌరవించుకుంటారు? మనం కూడా ఆయన family member అనిపిస్తుంది. జన్మాంతరంలో సుబ్రహ్మణ్యుడికి మాకు అనుబంధం ఉంది. ఆయనకు మేము ఏ పూజ చేయం, నమస్కారం చేయం. కానీ హృదయంతో అనుబంధం కాదనలేము. He is very close to my heart.

## శ్రీ నాన్నగారి కంచిపరమాచార్య స్వప్నదర్శనం



కంచి పరమాచార్యులకు నా హృదయంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆయన నిరాడంబరత్వానికి ప్రతిరూపం. నిజమైన అందం నిరాడంబర జీవితంలో ఉంది. ఒకసారి పరమాచార్యుల వారు నాకు స్వప్నంలో కనిపించి రెండు పళ్ళు చేతిలో పెట్టారు. ఆ పళ్ళు స్వీకరించడానికి నేను కొంచం వెనకాడుతుంటే ఆయన అన్నారు: 'ఈ పళ్ళు ఏమిటో నీకు తెలుసా? ఒకటి సత్యం, ఇంకోటి సుందరం. సుందరమైనది ఎప్పుడూ సత్యంగా ఉంటుంది, సత్యమైనది ఎప్పుడూ సుందరంగా ఉంటుంది. కాబట్టి రెండిటి మధ్య విబేధం చూడకు. ఆ రెండూ కూడా ఒకటంటే ఒకటే. అదే అద్వైతానుభవం. అటువంటి అద్వైతానుభవం పొందితే మన కర్మ అంతా కాలి బూడిద అయిపోతుంది.

## శ్రీ నాన్నగారి నరసింహస్వామి స్వప్నదర్శనం



రాత్రి వేదాద్రికి వెళ్ళాము. సాయంత్రం నిద్రపోయేముందు నేను జపం చేసుకున్నాను. ఎలా జపం చేసుకున్నాను? ఓం నమో నారసింహాయ, ఓం నమో నారసింహాయ, ఓం నమో నారసింహాయ - ఇలా జపం చేసుకుంటూ ఉంటే ఇతర తలంపులన్నీ ఆగిపోయాయి. జగ్గయ్యపేటలో ఉన్నాం అన్న తలంపు కూడా పోయింది. time కి సంబంధించిన తలంపు, place కి సంబంధించిన తలంపు - అన్ని తలంపులు పోయాయి. ఇంకా ఒక్క తలంపే మిగిలింది. ఏం తలంపు? ఓం నమో నారసింహాయ- అదీ తలంపే. ఓం నమో నారసింహాయ, ఓం నమో నారసింహాయ- అలా అనుకుంటున్నాం, కళ్ళు మూసుకుపోయినాయి, నిద్ర వచ్చేసింది. ముందు పుణ్యం మాట ఎలా ఉన్నా వెంటనే నిద్ర పట్టేసింది. నిద్ర వెంటనే వచ్చేసింది. ఇక మత్తుబిళ్ళలు అక్కర్లేదు. నిద్ర పట్టడానికి బిళ్ళలు అక్కర్లేకుండా, డాక్టరుగారి దగ్గరికి వెళ్ళక్కర్లేకుండా నిద్ర పట్టేసింది. ఆ నిద్రలో ఏమైంది? నిన్న వేదాద్రిలో నరసింహస్వామిని కొంచం దూరం నుండి చూసాం. నిద్రలో విగ్రహం దగ్గరికి

వెళ్ళిపోయాం. పగలు చాలా దూరానచూసాం. నిద్రలో విగ్రహానికి బాగా సమీపంగా వెళ్లిపోయాము. విగ్రహం దగ్గరికి వెళ్ళగానే sudden గా అది అదృశ్యం అయిపోయింది. ఒక మహావెలుగు కనిపించింది. అక్కడ విగ్రహం కనబడటం లేదు, శరీరం కనబడటం లేదు. ఒక అశరీరవాణి వినిపించింది. ఏమంటుందంటే 'నువ్వు చూసే విగ్రహాన్ని కాదు నేను, ఇది నేను ఒక మహావెలుగును'. ఈ విగ్రహం ఎందుకంటే నీ నిగ్రహం కోసం. ఆ విగ్రహం అదృశ్యమైపోయింది. ఒక మహావెలుగు రెండు కళ్ళతో చూడలేనిది కనిపించింది. ఆ వెలుగులోంచి ఒక అశరీరవాణి - అంటే శరీరం లేదు కాని మాట వినపడుతోంది. ఇదొక విచిత్రం- అక్కడ శరీరం లేదు కాని మాట వినపడుతోంది: 'నేను ఇదిగా (వెలుగుగా) ఉన్నాను. ఆ విగ్రహాన్ని నేనని నువ్వు అనుకుంటున్నావు. నేను అది కాదు ఇది. ఇక్కడికి తీసుకెళ్ళడానికి, నీ మనస్సుని నిగ్రహించుకోడానికి ఆ విగ్రహం సహకరిస్తుంది కాని నేను విగ్రహానికి పరిమితమై లేను. అసలిది నేను' అని చెప్పి ఆ నరసింహస్వామి ఏదిగా ఉన్నాడో, ఏ పరబ్రహ్మముగా ఉన్నాడో ఒక మహాజ్యోతిక్రింద ఒక  మహావెలుగు క్రింద దర్శనం ఇచ్చి మళ్ళీ



ఆ విగ్రహం కనిపించకుండా మెలుకువలోకి జాగ్రదావస్థలోకి తీసుకొచ్చాడు నరసింహస్వామి. 'నన్ను ఆ బొమ్మ అనుకుంటున్నావా? ఆ బొమ్మను కాదు, నేను ఇది (మహావెలుగు)' అని అన్నాడు. ఒక మహావెలుగు, ఒక అద్భుతమైన శాంతి, నోటితో వర్ణించలేనటువంటి కాంతి- అది సూర్యుని కాంతిగా లేదది లేక electricity వారి current కాంతిగా లేదది, ఒక kerosene oil దీపం కాంతిగా లేదది. ఒక మహావెలుగు, ఒక మహాచైతన్యం, ఒక మహాకాంతి - అక్కడ రూపం లేదు, నామం లేదు. ఏమీ కనిపించకుండా ఉందా అంటే కనిపిస్తుంది కాని అక్కడ నామరూపాలు లేవు. 'ఇది నేను, నువ్వు చూసేది నేను కాదు. ఇది నేను. నువ్వు దగ్గరగా చూడలేదు, దగ్గరగా చూడలేదు అనుకుంటున్నావు. ఇది నేను. నువ్వు అనుకున్నది నేను కాదు. ఇది నేను' అని చెప్పాడు నరసింహస్వామి. ఇది రాత్రి స్వప్నం. ఒకోసారి జాగ్రదావస్థకంటే రాత్రి స్వప్నావస్థలో నిజానికి దగ్గరగా ఉంటాం. (Truth is beauty. Beauty is Truth. జాగ్రదావస్థకంటే, స్వప్నావస్థ కంటే గాఢనిద్రలో truth కి ఇంకా దగ్గరిగా ఉంటాం.) రాత్రి స్వప్నావస్థ లో నిజానికి ఎంత దగ్గరగా ఉన్నాం అనిపించింది నాకు.

# శ్రీ నాన్నగారి శ్రీ రాముని స్వప్నదర్శనం






2005 Oct నాలుగో తేదీ నాకు తెల్లవారుజామున 4.30 గంటలకు స్వప్నంలో రాముడొచ్చాడు. ఆ రాముడిది ఎంత సౌందర్యమో అని ఆశ్చర్యమేస్తుంది. రెండు కళ్ళు కాదు లక్ష కళ్ళు పెట్టినా చూడలేము ఆ సౌందర్యాన్ని. జ్ఞానము, ఐశ్వర్యము ఆ గొడవ వదిలేయండి. ఆ రూపములో ఉన్న సౌందర్యం రెండు కళ్ళు కాదు, లక్ష కళ్ళు పెట్టినా చూడలేము. వచ్చాడు కాని మాట్లాడలేదు. ఊరికే సౌందర్యం చూపించాడు. మామూలుగా రాముని యొక్క శరీరం తాలూకు సౌందర్యం ఇలా ఉంటే, మరి చైతన్యం తాలూకు సౌందర్యం, ఆత్మతాలూకు సౌందర్యం, జ్ఞానం తాలూకు సౌందర్యం ఎలా ఉంటుంది? లక్ష కళ్ళు పెట్టికూడా ఆ సౌందర్యాన్ని చూడలేము.

నేను పార్టీని మార్చేసాను కాని మా తాత ముత్తాతలందరూ రాముడినే కొలిచారు. మా నానమ్మకు తులసి మొక్క వద్ద పడుకోవడం, రామ నామం జపించడం - ఈ రెండు తప్పించి ఇంకేమీ తెలియదు. వారు ఎప్పుడూ కొత్త దేవుడి గూర్చి వెతకలేదు. నా చిన్నప్పుడు ఇంట్లో రాముని ఫోటోలు తప్పించి మరే ఇతర దేవుని ఫోటోలు ఉండేవి కావు. దేవుడంటే రాముడనే అనుకునేవాడిని. కృష్ణుడు, శివుడు వంటి ఇతర దేవతల గూర్చి అసలు నాకు తెలియదు.

## జగన్నాథుని బొమ్మను చూడగానే శ్రీ నాన్నగారికి చైతన్యానుభూతి కలగటం



నేను కృష్ణభక్తుడిని కాకపోయినా పరమాత్మ నాకు ఒక మహిమ చేసి చూపించాడు. ఎవరో భక్తులు నాకు పూరీ జగన్నాథుని బొమ్మ ఇచ్చారు. ఆ బొమ్మకు కాళ్ళు చేతులు ఉండవు, పెద్ద ముఖం ఉంటుంది, పెద్ద పెద్ద కళ్ళు ఉన్నాయి. నేను ఆ బొమ్మ వంక అలా చూస్తున్నాను. అలా చూస్తూ ఉంటే నా శరీరం sudden గా అదృశ్యం అయ్యింది. అంటే చూసేవారికి నా శరీరం ఇక్కడ ఉన్నట్లు అనిపించినా నాకు sudden గా అదృశ్యం అయ్యింది. ఆ time లో నాకు ఎలా తోచింది అంటే ఉన్నది ఒక్కటే, అదే చైతన్యం, అది తప్పించి సర్వం శూన్యం అనిపించింది. అక్కడ కూడా నేను ఉన్నాను అన్న సంగతి తెలుస్తోంది. మిగతాదంతా శూన్యంగా ఉంది. మూడు శరీరాలు అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు శూన్యం. మూడు కాలాలు భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్కాలం అన్నీ నూటికి నూరుపాళ్ళు అసత్యంకింద కనిపించాయి. పూర్వం మనం ధరించిన దేహాలు, ఈ దేహం, రాబోయే దేహాలు, అన్నీ మాయ దేహాలే. ఈ శరీరం నాది అని ఇప్పుడు ఎంత గట్టిగా అనుకుంటున్నానో అంత గట్టిగా ఇది మాయే అనేటువంటి అనుభవాన్ని జగన్నాథుడు నాకు ప్రసాదించాడు.

## సుఖదుఃఖాలన్నీ స్వప్నసమానం అని తెలిపిన శ్రీ నాన్నగారి స్వప్నవృత్తాంతం

మీరు ఏదైనా దుఃఖాన్ని భరిస్తూ ఉన్నా మీరు బాహ్యంగా ఏమైనా సుఖాలు అనుభవిస్తూ ఉన్నా అది అంతా స్వప్నమే. నాలుగు రోజుల కిందట నాకొక స్వప్నం వచ్చింది. నేను అన్నం తింటున్నాను. పెద్ద దుమ్ము వచ్చేసి నేను తినే అన్నంలో పడిపోయింది. స్వప్నంలో నాకు దుఃఖం వచ్చింది. అన్నం రుచిగా ఉంది, శుచిగా ఉంది, ఇప్పుడు అన్నం నేను తినటానికి పనికి రాదే అని నేను దుఃఖ పడుతున్నాను. ఆ దుఃఖం ఎంత వేగంగా వచ్చిందంటే ఆ దుఃఖం నేను భరించలేక మెలుకువ వచ్చేసింది. మెలుకువ వచ్చాక అన్నం అసత్యం, దుమ్ము పడటం అసత్యం,

నేను దుఃఖపడటం అసత్యం, ఏమీ లేదే. అన్నం లేదు, దుమ్ము లేదు, ఏడుపు లేదు, ఏమీ లేదు, నేను ప్రశాంతంగా ఉన్నాను. ఏమీలేని దానికి ఇంత దుఃఖం వచ్చిందేంటి అని మెలుకువ రాగానే అనుకున్నాను. అలాగే మనం ఇన్ని జన్మలనుండి ఎన్ని దుఃఖాలు పడుతున్నా అమృతానుభవం కలగగానే అయ్యో ఏమీలేదే, ఏమీలేనిదానికి ఇంత అశాంతి తెచ్చుకొన్నాము అని మనకు అనిపిస్తుంది.

## శ్రీ నాన్నగారికి ఒక వైష్ణవునిపై కోపం వచ్చిన స్వప్నవృత్తాంతం






మల్కిపురంలో ఉండగా నాకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో నాకు చాలా కోపం వచ్చింది. అదొక పబ్లిక్ meeting కాదు కాని నేను పది మంది భక్తుల మధ్య కూర్చొని ఉన్నాను. మేమంతా కూడా అరుణాచలశివ, అరుణాచలశివ, అరుణాచలం, అరుణాచలం అని నామం చేస్తున్నాం. అది చాలా చిన్న సమావేశమే. విష్ణువు ఒక్కడే మహోన్నత దేవత, మిగతా వారంతా పాక్షిక దేవతలు అని నమ్మే ఒక మూఢభక్తి గల వైష్ణవుడు అప్పుడు అక్కడికి వచ్చాడు. ఆయన ప్రకారం విష్ణువు కలెక్టర్ అయితే శివుడు తహసీల్దార్ తో సమానం. ఆయనను చూడగానే నాకేమీ కోపం రాలేదు. ఆయనను నేను కూర్చోమన్నాను. అప్పుడు ఆయన: 'మీరు విష్ణునామం చేస్తేనే తరిస్తారు. శివనామం చేస్తే తరించరు' అని చెప్పడం మొదలు పెట్టాడు. ఆ మాటలు విని నాకు విపరీతమైన కోపం వచ్చింది. నేను ఆయనను తిట్టేలోగా నా కోపాన్ని చూసి ఆయన పారిపోయాడు. నాకు తర్వాత అనిపించింది: 'నేనెందుకు అంతగా ఆయనను పట్టించుకోవాలి?' నాలో అంత కోపం ఉందని ఆ స్వప్నం వచ్చేంత వరకు నాకు తెలియదు.

# ప్రేమ యొక్క శక్తిని తెలిపే శ్రీ నాన్నగారి స్వప్నవృత్తాంతం

ప్రేమకు కూడా చాలా శక్తి ఉంటుంది. ఎంత శక్తి ఉంటుందంటే: కొంతమంది ఇంగ్లాండ్ లో మెకానికల్ గా 'నాన్నగారు, నాన్నగారు' అనేవారు. మరికొంతమంది 'నాన్నగారు' అనేవారు కాని చాలా ప్రేమపూరితంగా ఉండేది ఆ మాట. అంటే నోటితో అనడం కాకుండా వారి హృదయంలోనుంచే ఆ స్పందన వల్ల with Love, with affection, with regard 'నాన్నగారు' అనేవారు. 'నాన్నగారు' అనే మాట ఎక్కడో హృదయంలోంచి, నిర్మలమైనట్టి హృదయంతరాల్లోంచి పొంగివస్తుండేది. రాత్రి ఎవరో 'నాన్నగారు, నాన్నగారు' అన్నట్టు నాకు స్వప్నం వచ్చింది. ఏంటి నాన్నగారు అని ఎవరంటున్నారంటే నిద్రలోంచి మెలుకువ రాగానే ఆ ఇంగ్లాండ్ జ్ఞాపకం వచ్చింది. అంటే ప్రేమకంత శక్తి ఉంది. మామూలుగా అందరూ అన్న మాటే అది. కానీ



ఎక్కడో ఉంది ఆ స్పర్శ, ఆ మృదుత్వం. వారు బండమనుష్యులు కారు. బండమనుష్యులు నాన్నగారు అన్నా బండతనంగా ఉంటుంది. మీకు అర్థం అవుతోందా? ఆ మృదుత్వం, ఆ హృదయంలో ఉన్నటువంటి స్పర్శ వల్ల వారి పిలుపు బండతనంగా ఉండదు. దాని అర్థం ఏమిటంటే దేహం పోయినా, లోకం మనకు కనిపించకపోయినా ఆ ప్రేమ యొక్క స్పర్శ అట్టిది. మామూలుగా ఎవరో పిలుస్తున్నారన్నట్టు నాకు మెలుకువ వచ్చింది. మామూలుగా మనిషి పిలిచినట్టే నాకు మెలుకువ వచ్చింది. అంటే స్వప్నంలోంచి జాగ్రదావస్థలోకి వచ్చాను. వాళ్ళ ఆ మృదువైన పిలుపు heart లో ఉండిపోయింది. అది మెలుకువ తీసుకొస్తుంది. అంటే మామూలుగా ప్రాపంచిక ప్రేమకే ఇంత శక్తి ఉన్నప్పుడు ఈశ్వరుని యొక్క ప్రేమకు ఎంత శక్తి ఉంటుంది? నేనిప్పుడు చెప్పింది ప్రాపంచికమైనది. మామూలుగా ప్రాపంచికమైన ప్రేమలకే ఇంత శక్తి ఉన్నప్పుడు ఈశ్వరుని యొక్క ప్రేమకు, దాని శక్తికి పరిమితులు ఉండవు. మనస్సు లేకుండా, బుద్ధి లేకుండా, ఇష్టం లేకుండా యాంత్రికంగా పూజ చేయటంవల్ల లోకంలో బాగా చేస్తున్నారని చెప్పుకుంటారేమో కాని చివరకు అసలు సున్నా.

## శ్రీ నాన్నగారు సినిమాకు వెళ్ళిన స్వప్నవృత్తాంతం

నేను సినిమా మానేసి 40 సంవత్సరాలు అయింది. మొన్న సోమవారం సైకిల్ మీద సినిమాకి వెళ్ళినట్లు స్వప్నం వచ్చింది. గంటో రెండు గంటలో సినిమా చూసి బయటకి వచ్చాక నా సైకిల్ కనబడలేదు. 'సైకిల్ ఎవడో పట్టుకుపోయాడు. సమాజం అంతా ఇలాగే ఉంది' అని మనస్సులో నేను అనుకున్నాను. అనుకోగానే మెలుకువ వచ్చేసింది. మెలుకువ వచ్చాక సైకిల్ లేదు, సైకిల్ పోయింది అన్న బాధ లేదు, సమాజం లేదు- మూడు పోయినవి. నిజమైన జ్ఞానం పొందినవాడి స్థితి అంతే. హృదయంలోని నిజమైన జ్ఞానాన్ని పొందినప్పుడు ఈ సృష్టంతా అంతే.

## శ్రీ నాన్నగారి ఆదిశంకరుల స్వప్నదర్శనం - సాధనా పంచకం వివరణ

రాత్రి ఆచార్యులు వారు 2 గంటల సమయంలో స్వప్నదర్శనం ఇచ్చారు. ఆచార్యులు వారు ఎర్ర బట్టలు వేసుకుంటారు. కాని తెల్లబట్టలతో దర్శనం ఇచ్చారు. ఆయనకి 5 వ సంవత్సరంలో ఉపనయనం అయ్యింది. 8 వ సంవత్సరంలో ఇల్లు విడిచి పెట్టి వెళ్లిపోయారు. తెల్లబట్టలు తోటి వచ్చారు అంటే అప్పటికి సన్యాసం పుచ్చుకోలేదు. చిన్న వయసులోనే సన్యాసం తీసుకున్నారు. నాకు స్వప్నంలో 6 వ సంవత్సరం పిల్లవాడిలా దర్శనమిచ్చారు. తెల్లబట్టలు వేసుకున్నారు. ఉపనయనం అయ్యింది; జంధ్యం కనిపిస్తోంది ఇంకా గృహ పరిత్యాగం చెయ్యలేదు. ఊరికే అనుగ్రహించటానికి మాత్రమే వచ్చారు. దర్శనం ఇచ్చారు కోపంగా లేరు. అనుగ్రహ స్వరూపులుగా దర్సనం ఇచ్చారు. పొంగుతున్న సముద్రం ఒకసారి ఆ పొంగు ఆగిపోతే ఎలా ఉంటుందో ఆయన స్వప్నదర్శనం ఇవ్వటం వలన నా మనస్సు అలా అణిగిపోయింది. జాగృదావస్థలోకి వచ్చిన తరువాత కూడా అంతే. మాటలతో సంబంధం లేకుండా ఆచార్యులు వారు అనుగ్రహించారు. నేను పైకి ఆచార్యులు వారి గురించి ఎక్కువగా చెప్పకపోయినా నా హృదయంలో ఆయనంటే ఒక తెలియని ఇష్టం ఉంది. ఇష్టం మటుకు ఉంది పైకి ఎక్కువ చెప్పను. ఎవరి మీదైనా ఇష్టం ఉంటే మీ మీద నాకు ఇష్టం ఉంది అని పైకి చెప్పక్కరలేదు. చెపితే ఇష్టం ఉన్నట్టు, చెప్పకపోతే ఇష్టం లేనట్టు అని కాదు. నిజంగా ఇష్టం ఉంటే మనం చెప్పకరలేదు. ఇష్టం

లేనప్పుడు ఎక్కువ చెప్పాలి. పని చేసి చూపించేటప్పుడు మాటలతోటి పని లేదు. పని చెయ్యనప్పుడే మాటలు ఎక్కువ చెప్పాలి. స్వప్నంలో ఆచార్యులు వారు మాట్లాడలేదు. ఊరికే అనుగ్రహించారు. మెలుకువ రాగానే మనస్సు అలా చల్లబడింది. ఆయన సాధనాపంచకము అని వ్రాసారు. పది సంవత్సరాల క్రితం చదివాను. దానిని కొంతమంది సాధనాపంచకం అంటారు కొంతమంది ఉపదేశపంచకం అంటారు. అంటే భగవద్గీతలో ౭౦౦ శ్లోకాలు ఉన్నాయి. సాధనాపంచకం అంటే 5 శ్లోకాలు లో సాధన గురించి చెప్పారు. మనం చేసే పని మంచి పని చేస్తే మనం మర్చిపోయినా అది మనలని విడిచిపెట్టదు. ఎక్కడైనా మంచి మాట వింటే అది విని మర్చిపోయినా సమయానికి అది గుర్తు వస్తుంది. మనం మర్చిపోవచ్చు కాని సమయానికి ప్రమాదంలో పడకుండా ఆ మాట మనల్ని కాపాడుతుంది. అందుచేత మంచిమాట ఆచరించలేకపోయినా శ్రవణం చేసి ఉండటం మంచిది. Sudden గా ప్రమాదం వచ్చినప్పుడు ఆ మాట మనకు ఉపయోగపడుతుంది. సాధనా పంచకములో రెండు మాటలు జ్ఞాపకం వచ్చాయి. ఎప్పుడో పది సంవత్సరాల పూర్వం చూసాను. మీకు కూడా ఎప్పుడూ చెప్పలేదు. నేను కూడా మర్చిపోయాను. సాధనాపంచకంలో ఏమి ఉంది అంటే ఇతరుల పట్ల ఎక్కువ ప్రేమగా ఉండకు, బాహ్యంగా నీవు చేసేది సత్ కర్మ అయినా అతిగా ఉండకూడదు. ఒకవేళ నువ్వు ఏదైనా మంచి చేసినా అతిగా చేయొద్దు. నువ్వు ఎవరినైనా ప్రేమించి వారికి మంచి కలగాలి అని చెయ్యొచ్చు కాని అతిగా ఉండకూడదు. మీకు దయ ఉండొచ్చు; ఆ దయ అతిగా ఉండకూడదు అని సాధనాపంచకము లో చెప్పారు. మనిషి అయ్యాకా ఎప్పుడైనా కోపం వస్తుంది. ఆ కోపం మనం పాడు అయ్యేలా ఉండకూడదు. ఇప్పుడు మనకు ఎవరైనా అపకారం చేశారు అనుకోండి, మనకు కోపం వస్తుంది. ఆ కోపం నీటి మీద గీతలా ఉండాలి కాని దాన్ని నువ్వు స్మశానం లోకి వెళ్లేవరకు దానిని కాపాడుకోకూడదు. సహజంగా ప్రకృతి కదా మనకు ఎవరైనా అపకారం చేశారు అనుకోండి, మనకు కోపం వస్తుంది- అది సహజం. సాధన చేసినవారికి అది పోతుంది కాని సామాన్య మానవునికి కోపం రావటం సహజం. అందుచేత కోపం రాకూడదు, కోపం రాకూడదు అని నేను చెప్పినా ఎంతోకొంత కోపం రాకుండా నువ్వు ఉంటావా? మైండ్ ఉన్నంతకాలం కోపం రావటం సహజం. సాధనాపంచకంలో ఈ రెండు ముక్కలు జ్ఞాపకం వచ్చాయి. ఇతరుల పట్ల దయ ఉండొచ్చు, ఏదో దయ ఉంది

కదా అని మనుషులని ప్రేమిస్తూ అదే పనిగా ఉండకూడదు. నువ్వు అదే పనిలో ఉంటే నీ మనస్సు బయటకు వచ్చేస్తుంది కాని నీ హృదయంలో ఉన్న సత్యం వైపుకు మళ్ళదు. పదిమంది గొప్పగా చెప్పుకుంటారు ఊరేగిస్తారు; చాలమంచి పనులు చేస్తున్నారు అనుకుంటారు. లోపలకి మీ మనస్సు వెళ్లేలాగా చూసుకోండి. ఇవి అన్ని తగు మాత్రమే. అతి పనికి రాదు. ఎదుటివారి పట్ల దయ ఉండకూడదు అని కాదు, దయ ఉండొచ్చు అది ఎంత వరకు ఉండాలో అంత వరకే ఉండాలి. దయ పేరు చెప్పి రోజూ మనస్సుని బయటకు తోలుకు వెళ్లిపోతూ ఉంటే లోపల సున్నా అయ్యిపోతావు. లోపల నువ్వు ఏది తెలుసుకోవటానికి ఈ భూమి మీదకు వచ్చావో అది తెలుసుకోవాలి. జంతువులు అడ్డంగా పెరుగుతాయి, మనిషి నిలువుగా పెరుగుతాడు. అందుచేత మనిషికి జ్ఞానం సంపాదించే అర్హత ఉంది. అందుచేత దయ ఉండొచ్చు, ఉండకూడదు అని కాదు, మంచి పనే కదా అనుకోవచ్చు. మంచి పనే కాని అది అతిగా ఉండటం వలన మనస్సు అంతర్ముఖం అవ్వదు, అంతర్ దృష్టి కలుగదు. నీకు లోపల దృష్టి కలగకుండా లోపల ఉన్న బ్రహ్మపదార్థం నీకు తెలియదు. నీకు లోపల ఉన్న బ్రహ్మపదార్థం తెలియదు అనుకో మంచిని చెడ్డ అనుకుంటావు, మాయని జ్ఞానం అనుకుంటావు. కేవలం మంచి గుణాలు ఉన్నాయి కదా అని అక్కడకి సరిపెట్టుకోవటం మంచిదే కాని అక్కడికి సరిపెట్టుకొని నీవు జీవిస్తూ ఉంటే ఒక గోతిలో నుండి లెగడం, ఇంకో గోతిలో పడటం. ఆ గోతిలో నుండి లెగడం, ఇంకో గోతిలో పడటం. చనిపోవడం, మళ్లీ పుట్టటం - ఈ ప్రయాణంలో ఉంటావు కాని ఇటువంటి అతి మంచి పనులు చేస్తూ ఉంటే  పదిమంది మెచ్చుకుంటారు. అక్కడితో నీ జీవితం సున్నా. నీ జీవితం అనేది అందుకు కాదు.  సత్యాన్వేషణ  సత్యం కోసం ఉండాలి. ఇప్పుడు మీ దగ్గర 10 రూపాయలు ఉంటే ఏదైనా మంచి పని చెయ్యొచ్చు కాని అంతమాత్రాన మీ హృదయంలో ఉన్న వస్తువు తెలియదు. దయ వద్దు అని కాదు, అతిగా పనికి రాదు. కోపం అతిగా పనికి రాదు. అతిగా కోపం ఉంటే మీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. తగు మాత్రంగా ఉండు అప్పుడు నీకు లోచూపు కలుగుతుంది. నువ్వు



ఏదైనా పని చేస్తే అహంకార రహితంగా చెయ్యాలి. అహంకార రహితంగా కనుక పని చేస్తే అది సత్యాన్వేషణకి ఉపయోగపడుతుంది. అహంకారంతో పని చేస్తే పుణ్యం వస్తుంది. అనుభవిస్తావు. అది ఏదో వంతెన కింద నీరు లా జారి వెళ్ళిపోతుంది. సాధనాపంచకం ఎప్పుడో చదివాను మర్చిపోయాను. రాత్రి స్వప్న దర్శనం వచ్చినందువలన జ్ఞాపకం వచ్చింది. సాధనాపంచకం నేనే మర్చి పోయాను. మీకు ఏమి చెపుతాను. కప్ప రాముడితో: 'ఎవరైనా నన్ను చంపుతూ ఉంటే రామ అనుకుంటాను. నువ్వే నన్ను చంపుతూ ఉంటే నేను రామ అని ఏమి అనుకుంటాను' అంది. ఆ కప్ప అన్నట్టు నేనే మర్చిపోయాను ఇంక మీకేమి చెపుతాను?

## శ్రీ నాన్నగారికి కారుల్లో తిరిగే యోగం ఉందని చెప్పిన పాలకొల్లు భక్తుడు







1972 లో నేను సైకిల్ మీద దగ్గరగా ఉన్న ప్రదేశాలకు వెళ్లి భగవాన్ మీద ప్రవచనాలు ఇస్తూ ఉండేవాడిని. ఒకసారి పాలకొల్లు లో ఒక పాత రమణ భక్తుడిని కలవడానికి వెళితే ఆయన అన్నారు: 'నాన్నగారు, నాన్నగారు మీరు సైకిల్ మీద ఇంత దూరం ఇక్కడికి వచ్చారు. మీరు భగవాన్ మీద ప్రవచనాలు ఇవ్వడానికి సైకిల్ మీద దగ్గరగా ఉన్న ప్రదేశాలకు వెళుతున్నారు. ఏదో ఒక రోజు మీరు car లో ప్రయాణిస్తారు' అంటే నేను అన్నాను : 'నాకు నా సైకిల్ సరిపోతుంది. ఎటువంటి car అవసరం లేదు'. అంటే అప్పుడు ఆయన అన్నారు: 'మీకు car కావాలనే కోరిక ఉందని నేను అనటంలేదు. మీ ప్రారబ్ధానుసారం మీరు car లో పయనిస్తారు అని అంటున్నాను'. ఆయన ఉద్దేశ్యం ఏమిటంటే మీకు దేనిమీదైనా కోరిక లేకపోయినా అర్హత గనుక ఉంటే అది లభించి తీరుతుంది.





అరుణాచలం లో ఒక భక్తుడు నాతో అన్నాడు: 'నువ్వు అనసూయుడవు గనుక నీకు భగవద్గీత చెబుతున్నా అని అర్జునునితో కృష్ణుడు అన్నాడు. నాన్నగారు మీపట్ల అసూయ గలవారికి కూడా మీరు సబ్జెక్టు చెప్పడం నాకు తెలుసును'. మన గురించి చెప్పడం కోసం కాదమ్మా, వాక్యం బాగుందని చెబుతానున్నాను.

# శ్రీ నాన్నగారికి ఇష్టమైన మహనీయులు



అందరికంటే నాకు అబ్రహం లింకన్ అంటే చాలా ఇష్టం. కారణం ప్రత్యేకంగా ఏమీ కనిపించడు. పైకి అందరిలానే ఉండేవాడు కాని లోపల వైభవంలో ఆయనకు మనకు ఎంతో వ్యత్యాసం ఉంటుంది. లింకన్ అంటే most natural and most normal. లింకన్ అన్నాడు: 'Administration లో కొన్ని పొరపాట్లు చేసాను, అవి తెలిసికాదు అనుభవం లేక చేసాను'. ఆయన అనేకసార్లు election లో ఓడిపోయాడు. ఓడిపోయినప్పుడు ఎలా ఉన్నాడో గెలిచినప్పుడు అలానే ఉన్నాడు. President అవ్వకముందు అనేకసార్లు ఓడిపోయాడు. ఏంటండి ఇన్నిసార్లు ఓడిపోయారు, బెంగలేదా? అంటే ' ఓడిపోటానికి అలవాటు పడ్డాను' అన్నాడు. వాడు లింకన్. అమెరికా కు వెళితే ముందు లింకన్ birthplace కి వెళ్తాం. అదే మాకు holyplace. Newyork లో ఆయన memorial ఉంది. ఆయన birthplace కొలంబియా లో ఎక్కడో ఉంది. అతనో చిన్న కుటీరంలో జన్మించాడు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవాడు. ఆయన dress లో, talk లో natural గా normal గా ఉండేవాడు. World ని కూడా చాలా quiet గా face చేసేవాడు, cool గా face చేసేవాడు. ఎప్పుడూ కూడా face చేసాడు కాని పారిపోటానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు.

Sir Cotton: భోజనం లో మొదటి ముద్ద పెట్టుకునే ముందు మనం 'గోవిందా గోవిందా' అని అనుకోవాలి. కాని నేను అలా అనుకోను. నేను 'కాటన్ కాటన్' అని అనుకుంటాను. నాకు గోవింద శబ్ధం రావటంలేదు. కాటన్ అంటే నాకు బాగా ఇష్టం. గాంధీ గారి కంటే, రమణ మహర్షి కంటే, రామకృష్ణుడి కంటే, గోవిందుడి కంటే నాకే కాటన్ అంటే ఎక్కువ ఇష్టం. నేను కాటన్ దొర అని అనను. మొదటి ముద్ద పెట్టుకునే ముందు 'కాటన్ మహర్షి, కాటన్ మహర్షి' అనుకుంటాను. నాకు గోవింద నామం రావట్లేదు. మామూలుగా 'గోవింద గోవింద' అంటాను కాని అన్నం తినే




ముందు 'కాటన్' జ్ఞాపకం వస్తున్నాడు. మన జిల్లాలకు అన్నం పెట్టినోడు ఆయన. ఆనకట్ట కట్టక ముందు వందల మంది తిండిలేక చచ్చిపోయారు. ఆకలి తట్టుకోలేక కొంతమంది బంకమట్టి తినేవారట. నాకెందుకు కాటన్ దొర ఇష్టమంటే చాలా కష్టపడి ఆనకట్ట కట్టాడు. పెళ్ళాం తిట్టేదట. రోజూ వెంకటేశ్వర సుప్రభాతం ఏమిటంటే పొద్దున్న లేవగానే కాఫీ ఇవ్వటం మానేసి మొగుడిని తిట్టేదట. ముందు తిట్టటం తర్వాత కాఫీ ఇవ్వటమట. ఆవిడ అనేదట: ఉద్యోగం చేస్తే మద్రాస్ లో గాని విశాఖపట్నం లో గాని చేయాలి, ఈ ధవళేశ్వరంలో చేయటం ఏమిటి? అలాగే గవర్నమెంట్ తిట్టేదట. తిట్టడానికి ఇంగ్లాండ్ రమ్మన్నారట. సన్మానం చేయటానికి కాదు, తిట్టడానికి ఇంగ్లాండ్ రమ్మనేవారట. తిట్టడానికి ఇంగ్లాండ్ రమ్మనడం ఏమిటండి? ఒక పక్కన పెళ్ళాం తిట్లు, ఇంకో పక్క గవర్నమెంట్ తిట్లు. ఆ కూలీవాళ్ళు సరిగ్గా వచ్చేవారు కాదు. పైగా కర్మ కాలి మొదట రోజు ఆనకట్ట కట్టడానికి ముహూర్తం time లో ఎవడో గుండె ఆగి చచ్చిపోయాడట. తిట్లు పడలేక ఆయన పెళ్ళాం తో అనేవారట 'కోట్లాది మందికి సంబంధించిన పని వదిలేసి నేను మద్రాస్ గాని విశాఖపట్నం గాని london గాని ఎలా వస్తాను? ఈ పని ఇంకా రెండేళ్ళు ఉంటుంది. నువ్వు పుట్టింటికి వెళ్ళిపో' అంటే ఆవిడ వెళ్ళదంట అలాగని తిట్టడం మానదంట. పెద్ద

పెద్ద చదువులు చదివి ఈ పల్లెటూరులో ఉద్యోగం ఏమిటి? అని ఆవిడ ఉద్దేశ్యం. ప్రజలకు ఉపయోగపడాలి అని కాటన్ దొర ఉద్దేశ్యం. కాటన్ దొర పడిన కష్టాలన్నీ, తిట్లన్నీ నాకు తెలుసు. ఇన్ని తిట్లు తిని ఒక్క ఎకరం కూడా సంపాదించకుండా ఒట్టి చేతులతో ఇంగ్లాండ్ వెళ్ళిపోయాడు. శాస్త్రం ప్రకారం భోజనం ముందు గోవింద నామం చేయమంటారు కాని నాకు 'కాటన్ మహాశయా, కాటన్ మహాశయా' అని వస్తుంది. అదొక అలవాటు అయిపోయింది నాకు. ఎందుచేతంటే ఆయన పడిన కష్టాలన్నీ నాకు తెలుసు. 1847 లో ఆ ఆనకట్ట మొదలు పెట్టాడు, 1852 లో పూర్తిచేసాడు. సిమెంట్ లేదప్పుడు. సున్నంతోటి కట్టాడు. దీనికి వందేళ్ళు ఆయుర్ధాయం అన్నాడు. 130 సంవత్సరాలు అయినా చెక్కుచెదరకుండా ఉంది ఆ ఆనకట్ట. ప్రతీ ఇటుక దగ్గర కూర్చునేవాడు. పురాణాల గొడవ వదిలేయండి. నిన్నకాక మొన్నటివాడు కదా. ఆయనకు ఒకసారి జబ్బు చేసింది. జబ్బు చేస్తే 6 నెలలు సెలవుపెట్టి switzerland వెళ్ళిపోయాడు. ఈ లోపు బాధ్యతను ఆయన కంటే సీనియర్స్ కు అప్పచెప్పాడు. గవర్నమెంట్ 6 నెలలు సెలవు ఇచ్చింది కాని ఒక నెల్లాళ్లకే ఆనకట్ట పాడుచేస్తున్నారేమో అని బెంగపెట్టుకున్నాడు. ఆ పని వాడి సొంతమా పోనీ, కాదు ప్రజలది, గవర్నమెంటుది. అలా 6 నెలలు సెలవు పెట్టినోడు నెలరోజులకే ధవళేశ్వరం వచ్చిపడిపోయాడు. ధవళేశ్వరం లో ఏముంది? ఇల్లు లేదు, పెసరట్టు లేదు. ఎక్కడికైనా దూరంగా వెళ్ళితే అరటిపండు తిని బతికేవాడు. అంత కష్టాలు పడి కట్టాడు. మీకు కాటన్ విలువ ఎందుకు తెలియటం లేదంటే అయన పడిన కష్టాలు మీకు తెలియదు. అందరూ ఆయన్ని తిట్టడమే. ఇప్పుడు ప్రతీ ఊర్లో ఆయన విగ్రహాలు పెట్టేస్తున్నారు. ఆయన ఎప్పుడో చచ్చిపోయాడు కాని ఆయన చేసిన పుణ్యకర్మ ఇప్పుడు ఫలిస్తుందేమో అని నాకు అనిపిస్తుంది. 96 ఏళ్ళు బతికాడు. ఎవరైనా ఇండియా నుంచి ఆయన్ని చూడటానికి ఇంగ్లాండ్ వెళ్ళితే: 'రావులపాలెం లో కరణం గారు ఉండేవారు. ఆయన మాకు కూలివాళ్ళను పంపేవారు. ఆయన బాగున్నారా?' అని అడిగేవారట. అంతటి జ్ఞాపకశక్తి అమ్మా ఆయనకు. అప్పుడు మునసబ్ కరణాలు ఉండేవారు. వారితో 'మీకు 10 రూపాయలు ముట్టచెబుతాను. మాకు కూలివాళ్ళను పంపండి' అని కాటన్ దొర అడిగేవారట. మనకు లంచాల అలవాటు పూర్వం నుంచి ఉంది. ఈ లంచాల అలవాటు మన రక్తంలోనే ఉంది. మన పనికి మనకు డబ్బులు ముట్ట చెప్పి తీసుకెళ్ళడం. That is India. ఏంటి ఆనకట్ట మనదా? మన గురించి కష్టపడుతున్నాడా?

గోదావరి నది మనదా? పొలాలేమో మనం తడుపుకుంటామా? వాడేమో మనకు లంచం ఇచ్చి కూలి పనులకు తీసుకెళ్ళడమా? ఇంతటి విడ్డూరం ఎక్కడ ఉంటుంది? అసలు అంత కష్టపడవలసిన అవసరం లేదాయనకి. కూలివాళ్ళు లేకపోతే 'కూలివాళ్ళు రావట్లేదు నాకు సంబంధం ఏమిటి?' అని ఆయన వెళ్లిపోవచ్చు. గవర్నమెంట్ కూడా డబ్బు మిగిలిందని సంతోషించేది. That is కాటన్. మనకు గోవింద స్మరణ లేదు, రామస్మరణ లేదు. 'కాటన్ దొర' అనను నేను, 'కాటన్ మహర్షి' అంటాను. రమణ మహర్షి లాగా కాటన్ మహర్షి. అనుష్ఠానవేదాంతం ఆయనది.



నాకు భగవాన్ అంటే తెలిసి ఇష్టం, ఆచార్యుల వారంటే తెలియకుండా ఇష్టం.



## శ్రీ నాన్నగారికి ఇష్టమైన ఇంగ్లీష్ పాట

O God beautiful, O God beautiful, O God beautiful

I do bow at thy feet


Thou are green in the forest, thou are high in the mountain,

Thou are restless in the river, thou are grave in the ocean,

Thou are sympathy to the sorrowful, thou are service to the serviceful,

Thou are bliss to the yogi, thou are love to the lover.

## శ్రీ నాన్నగారికి బాగా ఇష్టమైన బుద్ధుని ప్రబోధనలు



బాహ్యంగా బుద్ధుడు చాలా శుచిగా ఉండేవాడు. రమణ మహర్షి గారి లాగ గోచి కట్టుకొని శరీరానికి దుమ్ము అంటుకొని ఉండేవాడుకాదు. బుద్ధుడు శారీరికంగా చాలా శుచిగా ఉండేవాడు. మైండ్ శుచిగా ఉండాలి. మైండ్ శుభ్రంగా ఉండాలి. కొంతమందిని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. బుద్ధుడు వర్ణించాడు కదా - వెల్ directed మైండ్, వెల్ disciplined మైండ్, వెల్ controlled మైండ్, వెల్ regulated మైండ్, వెల్ ordered మైండ్, వెల్ cultured మైండ్, వెల్ civilized మైండ్, వెల్ purified మైండ్-- నాకు ఆ చెట్టు ఒకటి ఈ మాటలు ఒకటి చాలా ఇష్టం. మెయిన్ అది purified మైండ్. మీ మైండ్ ని purify చేయడమే ఈ సాధనలు మరియు సత్సంగాల యొక్క ప్రయోజనం. వెల్ కంట్రోల్డ్ మైండ్, వెల్ ordered మైండ్ ఇలాంటివి తొంబై చెప్పారు - వీటన్నిటి ప్రయోజనం ఏమిటంటే మైండ్ purify అవ్వాలి.

## శ్రీ నాన్నగారికి ఇష్టమైన భగవద్గీత శ్లోకం

నా సతో విద్యతే భావో నా భావో విద్యతే సతః

ఉభయోరపి ద్రష్టోన్తః త్వన్నాయో తత్త్వదర్శిభిః



భగవద్గీత లోని రెండో అధ్యాయం లో కృష్ణ పరమాత్మ అన్నారు: 'ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు. లేని దానికి ఉండటం అంటూ లేదు. ఇది నిశ్చయం'. భగవంతునికి తెలుసు మనం పెద్ద doubters (సందేహాత్మకులం) అని. అందుకే 'ఇది నిశ్చయం' అని కూడా అన్నాడు. అహంకారానికి అస్తిత్వం లేదు. లేనిది ఉన్నదని నువ్వు అనుకుంటున్నావు. ఈ టీచింగ్ అంతా కూడా ఆ అహంకారం కొరకే. అహంకారం


లేదని అర్థం అయినప్పుడు ఉన్నది ఒక్కటంటే ఒక్కటే అని అర్థం అవుతుంది. భోజనం చేయడానికి ఆకలి ఉండాలి. ఆకలి లేకుండా మీరు ఎలా తింటారు? దాహం వేసినప్పుడే మీరు నీరు త్రాగుతారు. దాహం లేకుండా మీరు నీరు ఎందుకు త్రాగుతారు? అలాగే ఆర్తిగలవానికే జ్ఞానం అవసరం. ఆర్తి లేని వారికి చెప్పినా వారు వినరు. మీకు జ్ఞానం పొందాలనే ఆర్తి గనుక ఉంటే మీరు తప్పక జ్ఞానం పొందుతారు.

రామకృష్ణ మఠము స్వామీజీ ఒకరు భగవద్గీత ను సైన్స్ తో సమానం అని పోల్చి చెప్పటానికి ఆయనలో ఆయన కష్ట పడిపోతున్నారు. ఆయన ఉద్దేశ్యం మంచిదే, చెడ్డది కాదు. భగవద్గీత గౌరవం పెంచుదాం అని ఆయన ఉద్దేశ్యం. కానీ భగవద్గీత గౌరవం పాడు చేసేస్తున్నాం అన్న విషయం ఆయనకు తెలియటం లేదు. సైన్స్ అనేది బుద్ధిలోనుంచి వచ్చింది. భగవద్గీత బుద్ధి కాదు పరమాత్మ లోనుంచి వచ్చింది. దేహము, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి- వీటన్నిటికీ అతీతంగా ఉంది చైతన్యం. అది బుద్ధికి ఒక object కాదు. చైతన్యం చెప్పింది అన్న మాట మిస్ అయిపోయి ఆయన భగవద్గీత కూడా సైన్స్ తో సమానం అని చెప్పటానికి ప్రయత్నం చేశారు. ఏదో కొన్ని మాటలు నాకు వినపడుతున్నాయి, కొన్ని వినపడటం లేదు. ఆయనే బాధ పడిపోతున్నారు. మననేమి సుఖ పెడతారు అని వచ్చేసాం. ఎలా పోల్చి చెప్పాలని ఆయనలో ఆయన బాధ పడిపోతున్నారు.

## శ్రీ నాన్నగారు తరచుగా చెప్పిన అక్షరమణమాల లోని ద్విపద

నీవు నే నణగ నిత్యానందమయముగ

నిలుచు స్థితి కరుణింపు అరుణాచలా



నీవు నేను అణగ - అరుణాచలేశ్వరుని తో రమణ స్వామి చెబుతున్నాడు నేను అణిగి పోతాను నువ్వు కూడా అణిగి పో. నువ్వు వేరుగా ఉండద్దు. నేను వేరుగా ఉండను. కలసిపోదాం. ఒకటియై ఒకటిగానే ఉందాం. నువ్వు కూడా అణిగిపో, నేను కూడా అణిగిపోతాను. నన్ను బాగు చేసిన తర్వాత, నీ స్వరూపం నాకు ఇచ్చేసిన తర్వాత నువ్వు వేరుగా ఉంటావా? నిత్య ఆనందమయముగ - అంటే అది broken happiness కాదు, permanent happiness. అది eternal happiness. నిన్న మనస్సు బాగానే ఉందండి, ఇవాళే బొత్తిగా పుండైపోయింది — ఇలాంటిది కాదు; always eternal అక్కడకు తీసుకుపోతున్నాడు. అక్కడ పగలు లేదు, అక్కడ రాత్రి లేదు, అక్కడ సూర్యుడు లేడు, అక్కడ చంద్రుడు లేడు. అది లౌకికం కాదు అలౌకికం; భౌతికం కాదు అభౌతికం. అక్కడకు తీసుకుపోతున్నాడు. కళ్ళు ఉన్నవారు చూడండి, చెవులు ఉన్నవారు వినండి. ఆ హృదయం యొక్క లోతుల్లోకి తీసుకుపోతున్నాడు. రస హృదయం ఉన్నవారు ఈ poetry ని ఆనందించండి. జ్ఞాన శిఖరాలకు, శాంతి శిఖరాలకు, ఆనంద శిఖరాలకు తీసుకుపోతున్నాడు, మోసుకుపోతున్నాడు మనని.

## శ్రీ నాన్నగారు స్వరపరచిన శ్రీ రామకృష్ణుని పాట



వినరా బాబు అనరా బాబు గోవిందుడే గురువు, గురువే గోవిందుడు

దేహము గోవిందుడు, మనసు గోవిందుడు, లోకము గోవిందుడు,

ప్రాణము గోవిందుడు, అంతా గోవిందుడు, తెలుసుకోరా బాబు తెలుసుకో


వినరా బాబు అనరా బాబు అంతా గోవిందుడని తెలుసుకో

ఒరేయ్ నేను అలౌకికుడిని రా, నన్ను లౌకికునిగా చేయకండిరా

వినరా బాబు అనరా బాబు

నువ్వు కానిది కానట్టుగా తెలుసుకోరా

దుస్సాంగత్యము విడిచిపెట్టు, సత్సాంగత్యం చెయ్యిరా బాబు



వినరా బాబు అనరా బాబు

దుర్వాసనలు పోగొట్టుకొని, సద్వాసనలు సంపాదించుకోరా

వినరా బాబు అనరా బాబు

నీకెన్ని దుర్వాసనలు ఉన్నా భయపడకురా బాబు,

సత్సంగం చేస్తే అన్నీ పోతాయిరా

వినరా బాబు అనరా బాబు

నువ్వు బాగు పడాలంటే భక్తి మార్గానికి మించిన మార్గం లేదురా బాబు

వినరా బాబు అనరా బాబు

## శ్రీ రామకృష్ణుని విషయంలో నాన్నగారిని అరెస్ట్ చేసిన మాట



రామకృష్ణుడు దగ్గర నన్ను అరెస్ట్ చేసిన మాట ఏమిటి అంటే: రామకృష్ణుడు వివేకానందుడితో అంటాడు ఇప్పుడు మన మీద town టాక్ ఏమిటీ? అని. మిమ్మల్ని ఎవరూ bad అనుకోవటం లేదు కాని mad అనుకుంటున్నారు అంటాడు వివేకానంద. అప్పుడు పరమహంస అంటారు వాళ్ళకి విషయాల పట్ల పిచ్చి ఉంది, నాకు భగవంతుని పిచ్చి ఉంది. నా పిచ్చ వాళ్ళకు ఎప్పుడు పడుతుందా అని చూస్తున్నాను అంటారు. ఇది నన్ను అరెస్ట్ చేస్తుంది పరమహంసలో. నాకు ఆ పిచ్చోడంటే చాలా ఇష్టం (ఇక్కడ పిచ్చోడంటే శ్రీ రామకృష్ణులు). పడుకునే ముందు వాడిని తలపెట్టుకోవడం చాలా ప్రమాదకరం. అలా తలపెడితే ఇక నిద్ర పట్టదు.

## రామాయణం లో నాన్నగారికి బాగా ఇష్టమైన మాట

నా ఊపిరి ఆగి పోయిందా, చచ్చి పోతానా, గుండెజబ్బు వచ్చిందా? అనిపించింది రాముని ఈ ఒక్క మాట విని; నాకు జబ్బు వచ్చి చచ్చి పోతానేమో అనిపించింది: 'రాముడు రావణాసురుని రాజ్యం విభీషణునికి ఇచ్చాడు. ఇస్తూ ఇలా అన్నాడు : శివుడు రావణునికి ఐశ్వర్యం ఇచ్చాడు. అదే నేను నీకు ఇస్తున్నాను కానీ నాదంటూ నీకేమీ ఇవ్వడంలేదని సంకోచిస్తున్నాను'. ఇది మంచితనానికి పరాకాష్ట అనిపిస్తుంది.

## నాన్నగారికి ఇష్టమైన రామాయణంలోని పాత్రలు





రావణాసురుని భార్య మండోదరి మరియు వాలి భార్య తార - వాళ్లిద్దరూ దేవాంతకులు. వారు మీకు తెర మీద కనపడరు (కష్ట పడి పనిచేసేవారు, మంచి సలహాలు చెప్పే వారు తెరమీద కనపడరు). చాలా గొప్ప తెలివైనవారు. ఈ వాలి-రావణాసురుడు బుడబుక్కలోళ్లు. మామూలుగా బలవంతులే కానీ అది వారి సంసారానికి ఉపయోగపడదు, సమాజానికి ఉపయోగపడదు.

రామునికి సుగ్రీవునికి మైత్రి కుదిరాక రాముడు వాలిని చంపాడు. ఒప్పందం ప్రకారం సుగ్రీవుడు వానరసైన్యాన్ని వర్షాకాలం తరువాత సీతాన్వేషణకు పంపాలని అనుకున్నారు. విషయభోగాలు అనుభవిస్తూ రామునికి ఇచ్చిన మాట సుగ్రీవుడు మరచిపోయాడు. బాగా కోపం వచ్చిన లక్ష్మణుడు కిష్కింధకు వచ్చి 'వాలి ఎక్కడికి వెళ్ళాడో సుగ్రీవుడిని కూడా అక్కడికి పంపుతాము' అని హెచ్చరించాడు. అప్పుడు తార వచ్చి లక్ష్మణుడికి నమస్కరించి

ఇలా అంటుంది: 'మేము కోతులం. మనుష్యులు ఇంద్రియభోగాలు దొరికినప్పుడు బయటికిరాలేరు. చావు దగ్గరికి వచ్చినా భోగప్రవృత్తి నుంచి బయటకు రారు. మేము కోతులం లక్ష్మణా. మేము బుద్ధి లేని వారము. మేము డ్యూటీ ని మరచిపోయాము. మనుష్యులే భోగాలు దొరికినప్పుడు మత్తులో పడిపోయినప్పుడు, మేము కోతులం కదా అలా ఉండమా. మాది కోతిబుద్ధి (చపలచిత్తులం) అని నీకు తెలుసుకదా. స్త్రీ, సారా, మాంసం ఈ మూడూ లేక లేక దొరికినప్పుడు ఆ కోతిబుద్ధి ఎలా ఉంటుందో ఊహించగలవు. సుగ్రీవుడిది తప్పే కానీ తప్పు చేయాలని చేయటంలేదు. మత్తులో పడి మరచిపోయాడు'. అంత ఉద్రేకంగా వచ్చిన లక్ష్మణుడు తార మాటలకు చప్పగా అయ్యి పడిపోయాడు. ఇవి immortal వర్డ్స్ అండి. ఈ తార మాట్లాడుతుంటే కృష్ణుడు (దేవాదిదేవుడు) కూడా సరిపోడు అనిపిస్తుంది.



రావణాసురుని భార్య మండోదరి కూడా అంతే తెలివైనది. రావణాసురుడు సీతను బాగా కలవరించినప్పుడు మండోదరి అంది: ' ఇష్టం లేని స్త్రీ తో ఎప్పుడు కూడా రమించ కూడదు. పరస్పరం ఒకరి మీద ఇంకొకరికి ఇష్టం లేనప్పుడు ఆ సంభోగ స్థితిలో వారిద్దరికీ ఆనందం రాదు. సీత అన్నం మానేసి చీపురు పుల్లలాగా ఒంగి పోయి ఉంది. రామ రామ అని సీత ఏడుస్తుంది. సీత సీత అని నువ్వు ఏడుస్తున్నావు. నిజంగా సీతను పెళ్లాడినా నీకు రతిసుఖం లభించదు. నిన్ను ఇష్టపడని ఆడదాన్ని రమిస్తే నీకు ఎనర్జీ వేస్ట్ అయిపోతుంది, ఆనందం రాదు, ఆరోగ్యం చెడిపోతుంది. పైగా మేమంతా ఎంత అందమైన స్త్రీలం. మమ్మల్ని వదిలేసి ఎక్కడో చెట్టుకింద ఏడ్చేదాని వెనుక నువ్వు పడతావేమిటి? నీకు కామ సుఖం కావాలంటే మేము ఉన్నాము కదా'.

వండర్ఫుల్ టాక్ అండి. ఆ సబ్జెక్టు లో ఉన్న లోతులు చూడండి ఎంత వండర్ఫుల్ గా ఉందో. నాకు వీరిద్దరూ అంటే గొప్ప సంతోషం. ఆడవాళ్ళ కింద మీకు తెర మీద కనపడరు కానీ వాళ్ళ మాటలు మాత్రం అపూర్వంగా ఉంటాయి. భగవద్గీత కంటే అపూర్వంగా ఉంటాయి.


## ‘భక్తిని భరించటం కష్టం’ అంటూ చెప్పిన నాన్నగారు



కృష్ణుడు రూపంలో ఉన్నది నారాయణుడే అని భీష్ముడికి తెలుసు. భారత యుద్ధంలో ఒక రోజు భీష్ముడు బాగా విజృంభించి యుద్ధం చేస్తూ ఉంటాడు. భీష్ముడు అలా యుద్ధం చేస్తే ఆ రోజు పాండవులు, మొత్తం సైన్యం అంతా కూడా చనిపోయేటట్లు ఉన్నారు. అప్పుడు కృష్ణుడు రథం పైనుండి దుమికి బండి చక్రం ముక్కను పట్టుకుని భీష్ముడి వైపుకు పరిగెడతాడు. ఏమిటి కృష్ణుడు ఇలా చేస్తున్నాడు అని మనకు అనిపిస్తుంది. అర్జునుడు ఏమన్నాడు అంటే 'కృష్ణుడు ఆయుధం పట్టను అని చెప్పాడు. ఇప్పుడు ఆయుధం పడితే ఆయనకు అపకీర్తి వస్తుంది. అర్జునుడు బాగా యుద్ధం చేయలేదని నాకు అగౌరవం వస్తుంది' అని అంటాడు. భగవంతునికి కీర్తి, అపకీర్తి ఏమిటి? ఇవన్నీ జీవలక్షణాలు. 'మీరు చనిపోయిన తర్వాత కీర్తి ఏమి చేసుకొంటాను?' అంటాడు కృష్ణుడు. భీష్ముడు ఏమి అంటున్నాడంటే 'కృష్ణుడి చేతిలో చనిపోతే అంతకంటే నాకేమి కావాలి? నాకు వైకుంఠం వస్తుంది. రా' అంటూ తన చేతిలో ఉన్న బాణాలు ప్రక్కన పడేస్తాడు.

భాగవతంలోని పైన వివరించిన ఘట్టం చెబుతూ శ్రీ నాన్న గారు గద్గద కంఠం తో అన్న మాటలు: జ్ఞానం గురించి చెప్పగలను కానీ భక్తి గురించి చెప్పలేను. చైతన్యం గురించి చెప్పమంటే చెబుతాను కానీ భక్తి దగ్గరికి వచ్చేసరికి చెప్పలేను. భక్తిని భరించటం కష్టం. జ్ఞానం గురించి ఎన్ని గంటలైనా చెప్పుకోవచ్చుగాని భక్తి గురించి - ఆ ఘట్టం మనం భరించటం కష్టం. ఎప్పుడైనా భక్తి గురించి చెప్పాలంటే కంఠం తడౌతుంది. చైతన్యం గురించి, ఆ నిరాకార వస్తువు గురించి ఎంతైనా చెప్పగలను కాని భక్తి గురించి చెప్పాలంటే కంఠం పెగలడం కష్టం. ఆ సన్నివేశాలు మనం భరించలేము. Unlimited లవ్ - ఒక హద్దుల్లేని పరిమితుల్లేని ప్రేమ ప్రవాహంలో మీ వాసనలు, పునర్జన్మ హేతువులు అన్నీ కొట్టుకు పోతాయి. అది ప్రేమ యొక్క వైభవం. అది భక్తి యొక్క వైభవం. జ్ఞానం గురించి చెప్పినంత తేలికగా భక్తి గురించి చెప్పలేను.

## శ్రీ నాన్నగారికి బాగా నచ్చిన Shakespeare మాట



నాకు Shakespeare ఈ వాక్యం అంటే చాలా ఇష్టం. చాలా స్వీట్ గా ఉంటుంది. పాయసం నోట్లో పోసుకున్నట్లు ఉంటుంది. పాయసం ముక్కులో పోసుకున్నట్లు ఉండదు. నోట్లో పోసుకున్నట్లు ఉంటుంది. 'We are such a stuff as dreams are made on. Our little lives are rounded within sleep'. మన జీవితాలన్నీ స్వప్న సమానమే. రాత్రి నిద్రలో వచ్చే స్వప్నం పొట్టిగా (2 లేక 3 గంటలే) ఉంటుంది కానీ జీవితం అనే స్వప్నం పొడుగ్గా (70 నుండి 100 సంవత్సరాలు) ఉంటుంది. Duration తేడా కానీ అదెంత అసత్యమో ఇదీ అంటే అసత్యం. Our little life is rounded within sleep - కలలు ఎప్పుడు వస్తాయండి? నిద్రలో వస్తాయి అంటే ఈ అజ్ఞానం అనే నిద్రలో ఈ జీవితం అనే స్వప్నం జరుగుతుంది.

## శ్రీ నాన్నగారు తరచుగా పాడిన సినిమా పాట

> జగమే మాయ బ్రతుకే మాయ, వేదాలలో సారమింతేనయా
>
> కష్ట సుఖాలు కావడి కుండలు, ఆశా మోహాలు దరిజేరనివ్వకు

సముద్రాలు వ్రాసిన పాట, ఘంటసాల స్వరం, సావిత్రి, నాగేశ్వరరావు నటించిన చిత్రం.

సావిత్రి చనిపోయింది. ఇక మనకు కనిపించదు. మళ్ళీ అటువంటి నటి పుట్టలేదు. ఏదో పెళ్ళిలో నేను అక్కినేని నాగేశ్వరరావు పక్క పక్కన కూర్చున్నాం. 'ఏవండీ సావిత్రి మీతో చాలా సినిమాల్లో act చేసింది కదా' అని అన్నాను. నేను అన్న మాటకు ఒక మాట అన్నారు ఆయన ' సావిత్రి తన భావాలన్నీ తన కళ్ళల్లోనే చూపించేసేది. ఇప్పుడు మీకు ఏదైనా మాట చెప్పాలనుకోండి ఆ మాట కళ్ళతో చూపించేసేది'. ఈ పాట తాత్పర్యం: మనం ఈ లోకంలోకి training అవ్వటం కోసం వచ్చాము. లోకంలో ఎన్నో ఆకర్షణలు ఉంటాయి. నీవు ఏ ఆకర్షణలోను పడకుండా ఉంటే ఒడ్డుకి వస్తావు. ఈ భూమి ఒక ట్రైనింగ్ గ్రౌండ్.



బుద్ధుడిది కర్మయోగం, రామకృష్ణుడిది భక్తియోగం, భగవానుది జ్ఞానయోగం, ఆచార్యుల వారిది అవగాహన యోగం. ఇవన్నీ సమన్వయము చేసుకున్న సమన్వయాయోగం అమ్మా నాది.

# ఆదివారం సమావేశాలు ఎలా ప్రారంభమయ్యాయి?

ఈ ఆదివారం సమావేశాలు ప్రత్యేకంగా ఒక ఉద్దేశ్యంతోగాని ఒక purpose తో గాని ఒక ప్రణాళికా బద్ధంగా గాని ఏర్పాటుచేయబడలేదు. ప్రతీ ఆదివారం వడ్లవానిపాలెం నుంచి రామచంద్రరాజుగారు ఏ ఒంటిగంటకో రెండింటికో వచ్చి కూర్చునేవారు. ఏదో నాకు తోచింది చెప్పేవాడిని. ఇంత శ్రద్ధగా వస్తున్నారని నేనుకూడా ఆయన వచ్చే timeకి ఇంట్లోనే ఉండి ఏ రెండుగంటలో మూడుగంటలో రామచంద్రరాజుగారికి చెబుతూ ఉండేవాడిని. రామచంద్రరాజుగారు వస్తున్నారని చింతపల్లి నుండి అప్పలరాజుగారు, కాపవరం నుండి సూర్యనారాయణరాజుగారు రావటం ప్రారంభించారు. తర్వాత వారిని చూసి ఊరిలో మిగితా భక్తులు కూడా ఆదివారంనాడు రావడం ప్రారంభించారు. మా ఇంటి దగ్గర సుమారు అయిదారు నెలలు ఈ సమావేశాలు జరిగాయి. తర్వాత పోస్ట్‌ఆఫీస్ లో సమావేశం అవ్వడం ప్రారంభించాం. ఇక్కడ పోస్ట్‌ఆఫీస్ లో పెట్టి సంవత్సరం అయినట్లు నాకు పోస్ట్ మాస్టర్ గారు చెప్పేదాకా తెలియదు. నేనేమి date note చేసుకోలేదు. పోస్ట్ మాస్టర్ గారు 'ఏవండి నేను date note చేసుకున్నాను. మీరు నా postoffice కి వచ్చి సంవత్సరం అయ్యింది' అని చెప్పారు. ఇక్కడ వార్షికోత్సవం



చేస్తున్నారు. కాని వార్షికోత్సవం చేస్తున్నట్లుగా లేదు. అసలు నేను డేటే (date) note చేసుకోలేదు. అంటే ఇదొక purpose తో గాని లేక ఎవరినైనా బాగుచేద్దాం అనే ఉద్దేశ్యంతో ప్రారంభించలేదు. గదిలో పదిమంది కూర్చునేవారం. తర్వాత జనాలు ఎక్కువైతే పందిరేయటం సమావేశంగా జరపడం జరిగింది. అనంత కాలప్రవాహంలో ఒక సంవత్సరం అంటే ఎక్కువేమీ కాదు. ఒక మనిషి జీవితంలో ఒక సంవత్సరం పరిగణలోకి వస్తుందిగాని అనంత కాలప్రవాహంలో ఒక దేశం యొక్క చరిత్రలోగాని, కాలం యొక్క ప్రవాహంలోగాని ఒక సంవత్సరం అంటే పెద్ద ఎక్కువేమీ కాదు. ఒక మనిషి జీవితంలో సంవత్సరం అంటే ఎక్కువై ఉండవచ్చు. ఈ వార్షికోత్సవ సందర్భంగా చెప్పిన మాట ఇది. తర్వాత నా జన్మదినం అని ఇక్కడ నాలుగు మాటలు చెప్పారు. నా

శరీరం జన్మించింది కొమ్మరలో. జన్మదినం అంటే శరీరానికి యాభై సంవత్సరాలు వచ్చినాయి. యాభై సంవత్సారాలు అంటే 50 సంవత్సారాల పూర్వం మనం లేమని కాదు. ఈ శరీరానికి యాభై సంవత్సరాలు. అయితే నేనేమి అనుకుంటున్నానంటే నా వయస్సు పాతిక సంవత్సరాలు. ఈ శరీరానికి యాభై సంవత్సరాలు కాని నాకు వయస్సు మాత్రం పాతిక సంవత్సరాలు. ఏవండి కూడికలు ఏమైనా తప్పు చేసానా? లెక్క



తెలియటంలేదా? అంటే నాకు భగవాన్ తో పరిచయం అయ్యి పాతిక సంవత్సరాలు. అంటే భగవాన్ నన్ను ఆశీర్వదించి భగవాన్ యొక్క fold లోకి తీసుకుంది పాతిక సంవత్సరాలు. అందుచేత ధాన్యం మారిస్తే, బియ్యం బియ్యంక్రింద, చిట్టు చిట్టుక్రింద, తవుడు తవుడు క్రింద మార్చేసినట్లు అలాగ నా యాభై సంవత్సరాల జీవితంలో ఒక పాతిక సంవత్సరాలు తీసేస్తే ఇంకో పాతిక సంవత్సరాలు నాకు లెక్కలోకి తీసుకోవచ్చు. శరీరానికి యాభై సంవత్సరాలు ఉండొచ్చు కాని నా వయస్సు పాతిక సంవత్సరాలు ఎందుచేతనంటే నాకు భగవాన్ తో సంబంధం ఏర్పడి పాతిక సంవత్సరాలు అయింది కాబట్టి.

## శ్రీ నాన్నగారి ప్రసంగాల వైభవం



కృష్ణా జిల్లాలో ఒక భక్తుడు నాతో అన్నాడు: 'నాన్నగారు! మీ ప్రసంగాలు శ్రద్ధగా వింటే బీపీ, షుగర్ కంప్లైంట్స్ రావు. మీరు చెప్పే సబ్జెక్టు అర్థం అవుతా ఉంటే బీపీ-షుగర్ రాదు. అలా proper గా అర్థం చేసుకున్నవాడికి లేనిపోని ఉద్రేకాలు కలుగవు; ఏదైనా సంఘటనలు జరిగినా జరగనిదానితో సమానంగా ఉంటుంది ఎందుకంటే అందులోని నిస్సారత వాడికి తెలుస్తూ ఉంటుంది. వాడు ఈ ప్రపంచంలో దేనికీ హర్ట్ అవ్వడు. ఎక్కడో బ్రాహ్మీ స్థితి అంటున్నారు వదిలేయండి. మీ మాట సరిగ్గా అర్థం అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ వాడు హర్ట్ అవ్వడు. వాడు హర్ట్ అవ్వనప్పుడు వాడికి వచ్చే రోగాలు తగ్గిపోతాయి'.

## శ్రీ నాన్నగారి ప్రసంగాల ప్రయోజనం

మీరు అందరూ బాగుపడాలి, బాగుపడటమే కాదు మిమ్మల్ని సుఖం, శాంతి వరించాలి. ప్రారబ్ధాన్ని బట్టి మిమ్మల్ని అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా కూడా మీరు సుఖ సముద్రంలో, శాంతి సముద్రంలో ఉండాలి. ఈ ప్రవచనాల యొక్క ధ్యేయం అది.



ఈ సభలు పెట్టటంలో ప్రధానమైన ఉద్దేశం ఏదో ఒక మతాన్ని ప్రచారం చేయటం కాదు. మనిషి అయిన తరువాత రకరకాల కారణాల వలన భయం వస్తూ ఉంటుంది. సముద్రంలో కెరటాలు వస్తూ ఉంటే ఆ కెరటాల మధ్య స్నానం చేసి ఎలా బయటపడతామో అలాగే మీకు వాతావరణాన్ని బట్టిగాని, వ్యక్తిగతంగాకాని, సహవాసదోషం వలన కాని ఇలా ఎన్ని సమస్యలు వచ్చినా వాటికి అతీతంగా మీరు దుఃఖం లేని స్థితిలో అశాంతిలేని స్థితిలో ఉండి మీరు ఒంటరిగా ఉన్నా, నలుగురి మధ్యలో కూర్చున్నా కూడా పూర్ణశాంతి, పూర్ణసుఖం మీచేత అనుభవింప చేయటమే ఈ సభల యొక్క ప్రయోజనం. కులమతాలకు అతీతంగా జరుగుతున్న ప్రవచనాలు ఇవి. ఇందులో రిజర్వేషన్లు ఏమీ లేవు. జీవన్ముక్తుడు ఎటువంటి సుఖాన్ని అనుభవిస్తాడో మీ శరీరాలు ఈ భూమి మీద తిరుగుతున్నప్పుడే అటువంటి సుఖాన్ని మీరు అనుభవిస్తూ, ఈ శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటికి పోయేటప్పుడు అశాంతితో కాకుండా శాంతిగా శరీరాన్ని విడిచిపెట్టేటట్లు చేయటమే ఈ ప్రవచనాలు యొక్క ప్రయోజనం.

## సబ్జెక్టు విషయం లో compromise అవ్వలేము అన్న శ్రీ నాన్నగారు

మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి. పని విడిచి పెట్టవద్దు. పని మానేస్తే జ్ఞానం రాదని చాలా మీటింగ్స్ లో చెబుతున్నాను. అలా అని చెబుతూంటే కొంతమందికి కోపాలు వస్తున్నాయి. మీకు కోపాలు రావటం నాకేమీ

నష్టం లేదు. మీకు సంతోషం వచ్చినా నాకేమీ లాభం లేదు; మీరు పదిమంది వచ్చి కూర్చున్నారు. మీరు రాక పోయినా నష్టం లేదు. మీరు పది వేలమంది వచ్చి కూర్చున్నా నాకేమీ లాభం లేదు. నాన్నగారు నాన్నగారి లాగే ఉంటారు. అంటే నా ఉద్దేశ్యం ఏమిటంటే నా మీద మీకు కోపం ఉన్నా పర్లేదు. మీ పని విడిచిపెట్టకూడదు. పని విడిచిపెట్టేస్తే భక్తి, జ్ఞానం రాదు. పని విడిచిపెట్టేస్తే సోమరితనం వచ్చేస్తుంది. మీకు నామీద విరోధం వచ్చినా పర్వాలేదు కానీ మీరు బాగుపడాలి. సబ్జెక్టు అక్కడ జ్ఞానమే చెబుతాము కానీ మీకు అనుకూలంగా చెప్పే సమస్యలే లేదు. అది మీకు నచ్చవచ్చు నచ్చక పోవచ్చు.



## శ్రీ నాన్నగారు ప్రబోధించే subject విశిష్టత

మేము చెప్పింది రాయటానికి ఈ భూమి కూడా సరిపోదు. మేము చెప్పకుండా విడిచిపెట్టిన విషయమే లేదు. మన సబ్జెక్టు సైన్స్ కన్నా accurate. సైన్స్ లో మార్పులు వస్తూ ఉంటాయి. మనం చెప్పుకునే సబ్జెక్టు ఇప్పుడెంత నిజమో వెయ్యి సంవత్సరాల తరువాత కూడా అంతే నిజం. ఇది naked spirituality. ఏదో రోజుకి మీ శరీరం చనిపోతుంది. ఆ రోజులకి మీ బాహ్యా పరిస్థితులతో సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్లు సుఖంగా ఉండగలిగితే మీకు శరీరాలు రావు. మిమ్మల్ని ఆ దుఃఖ స్పర్శ లేని స్థితికి తీసుకు వెళ్ళడానికే ఈ సబ్జెక్టు వచ్చింది.

ఒక భక్తురాలు నాన్నగారితో అన్నారట: ' నాన్నగారు మీరు చెప్పిన సబ్జెక్టు విన్న తరువాత నాకు ఇంకేమీ వినాలి లేక చదవాలని అనిపించడంలేదు. నాకు వాటి మీద గౌరవం లేక కాదు కానీ చదవాలని అనిపించడంలేదు'. అంటే నాన్నగారు అన్నారట: 'అవన్నీ నేచర్ క్యూర్ లాగ చప్పగా ఉంటాయి. న్యూట్రిషన్ సరిపోతాయి గాని చప్పగా ఉంటాయి. మనది న్యూట్రిషన్ తో పాటు రుచిగా కూడా ఉంటాయి. మన సత్సంగాలలో చెప్పే మాటలు చిటారు కొమ్మమ్మా. చైతన్యం లో ఇంకా ముందుకు వెళదామంటే ఇక లేదు కదా'.

## తనను భక్తులు ఎలా గౌరవించగలరో వివరించిన నాన్నగారు

ఒక పెద్ద మనిషి నన్ను అడిగారు. అడిగింది సరదా కోసం కాదు. సిన్సియర్ గానే అడిగారు. అది జోక్ కోసం కాదు. 'మిమ్మల్ని నేను గౌరవించాలి అనుకుంటున్నానండి. ఎలా గౌరవించమంటారు?' దండలు వేయడం వల్ల గౌరవించినట్లు కాదు. గౌరవం అగౌరవం అనేవి ప్రకృతికి సంబంధించినవి. మన మనస్సు ప్రకృతిలో ఉంది కాబట్టి గౌరవం ఏదో గొప్పది, అగౌరవం ఏదో తక్కువది అనిపిస్తుంది. అప్పుడు నేను చెప్పాను: 'నేను చెప్పే మాటలు, ఏ స్పిరిట్ తోటి చెబుతున్నానో, ఏ సెన్స్ తోటి చెబుతున్నానో, నేను చెప్పే మాటలు proper గా ట్విస్ట్ చేయకుండా, ఉన్న మాట ఉన్నట్లుగా, నా హృదయంలోంచి ఏ స్పిరిట్ తోటి, ఏ మీనింగ్ తోటి ఆ వర్డ్ వస్తుందో, ఆ మాటను ఆ శబ్దాన్ని ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకోవడమే నన్ను గౌరవించినట్లు. నేను చెప్పిన మాటను మీరు అర్థం చేసుకోవడమే నన్ను గౌరవించినట్లు. ప్రత్యేకంగా దండలు వేస్తేనే గౌరవించినట్లు మీరు అనుకోనక్కర్లేదు. మీరు నమస్కారాలు కూడా పెట్టక్కర్లేదు. నేను చెప్పే మాటలు అర్థం చేసుకునే శక్తి లేకపోతే మీరు దండలు వేసినా గౌరవించినట్లు కాదు. ఈ దండలు దండాలు బాహ్యామైనటువంటి గౌరవాలకు సంబంధించిన విషయాలు. మన సంప్రదాయాన్ని బట్టి ఇవన్నీ వచ్చినవి. గొప్ప విషయం ఏమిటంటే అర్థం చేసుకునే హృదయం. అది జీవితంలో చాలా కష్టం. నేను మాట తేలికగా చెబుతున్నాను కానీ ఇది మాట చెప్పినంత తేలిక కాదు. అర్థం చేసుకునే హృదయాలు దొరకటం చాలా కష్టం. అర్థం చేసుకునే హృదయం కనుక లేకపోతే ఆ మనిషికి అవగాహన కాదు. మనిషి కానీ మనిషి చెప్పే మాటకాని అవగాహన కాదు. అర్థం చేసుకునే హృదయం చాలా ముఖ్యం.



## మిమ్మల్ని రమణ భక్తులుగా మార్చడం శ్రీ నాన్నగారి ఉద్దేశ్యం కాదు

This is a speech not for fame. This is a speech not for money. This is a speech not for publicity. This is a speech with a purpose. ప్రత్యేకమైన గౌరవాలు గాని, దండలు వేయడం గాని, దండాలు పెట్టడం గాని, అక్కర్లేదు. నేను చెప్పే మాటలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయండి. ఇవాళ పొద్దున్న తొమ్మిది గంటలకు ఒకరు నా దగ్గరికి వచ్చారు. 'ఏసుక్రీస్తు ప్రచారం చేసే వారందరూ ఏసుక్రీస్తుని తలచుకోండి లేకపోతే మీకు మోక్షం లేదు అని చెబుతున్నారు. సర్వమతాలను సమన్వయము చేసిన మా మెహెర్ బాబా ని తలచుకోండి అని మెహెర్ బాబా భక్తులు చెబుతున్నారు. అలాగే రమణ మహర్షి గారిని తలచుకోండి మీకు మోక్షం వచ్చేస్తుంది అని మీరు చెబుతున్నారు'. నేను సరిగ్గా భోజనానికి వెళ్లే టైం కి వచ్చి ఇలా అన్నారు. రమణ మహర్షి గారిని తలచుకోండి మీకు మోక్షం వచ్చేస్తుంది అని నేను ఎప్పుడైనా అన్నానా? మీకేమైనా ప్రమాణం ఉందా? ఎవరికి ఇష్టమైన దైవాన్ని వారు స్మరించుకోవచ్చు. ప్రతీ ఆదివారం వచ్చే భక్తుల్లో మీరు రమణ భక్తులు అవ్వండి అని ఎవరినైనా compulsion చేసానా? నేను నారాయణ, కృష్ణ లేక శివ నామాలు చేసుకుంటున్నాను. ఒకవేళ భగవాన్ ఇష్టం ఉండి వారి నామం చేసుకుంటూంటే నేనెవరిని అడ్డు వెళ్ళడానికి? అప్పుడు నేను చెప్పాను: ' నన్ను స్మరించండి మీకు మోక్షం వచ్చేస్తుందని రమణ మహర్షి గారు చెప్పలేదు. కనుక నేను ఎలా చెబుతాను? ఎవరైనా భగవాన్ని స్మరించుకుంటున్నాం అన్నారు అనుకోండి స్మరించుకోండి అని చెబుతాము. ఆ రూపమంటే వారికి ఇష్టం ఉందని అలా చెబుతాను. భగవాన్ చెప్పిన thesis ఏమిటంటే 'నేను ఎవడను?' అనే ప్రశ్న. తన స్వరూపం ఏమిటో తెలుసుకోవడానికి సహాయ పడుతుంది ఆ ప్రశ్న. భగవాన్ చెప్పింది విచారణా మార్గం. ఎవరైనా 'స్వామీ మాకు విచారణా మార్గం తెలియటంలేదు. ఏదో మీయందు మాకు ప్రీతి. రమణ రమణ అనుకుంటాం. మిగతా గొడవలు మాకేమీ తెలియదు' అని భగవాన్ దగ్గర అంటే 'సరి సరి' అనేవారు భగవాన్. దాని అర్థం భగవాన్ publicity చేసుకుంటున్నాడా? కాదు. ఇంతటి చిన్న విషయాలు కూడా మనకు అర్థం అవ్వటం లేదు.




## 'నా జీవితానికి ఈ ఒక్క సర్టిఫికేట్ చాలు' అని శ్రీ నాన్నగారు అన్న సన్నివేశం

మహాదేవపట్నంలో అందరూ వెళ్ళిపోయాక ఒక్కరే మిగిలారు. 'నాకీ రోజున దుఃఖం నశించింది' అన్నారు. అందరి ముందు చెబితే బాగుండదని చివరి వరకు ఉండి 'నాకు అశాంతి నశించింది' అని చెప్పి వెళ్ళిపోయారు. చాలు మాకు ఇంకేమీ అక్కర్లేదు. 'అశాంతి నశించింది' అన్నారు. అవ్వే మాకు సర్టిఫికెట్లు. ఎందుచేతంటే అశాంతి డబ్బు వల్ల నశించదు, భోగం వల్ల నశించదు. భోగం వల్ల భోగం పెరుగుతుంది కాని అశాంతి నశించదు. కోరికలు తీర్చుకోవడం వల్ల ఇంకొక కోరిక పెరుగుతుంది కాని అశాంతి నశించదు. నిన్న 'అశాంతి నశించింది' అని చెప్పేసి వెళ్ళిపోయారు. చాలు మాకు ఇంకేమీ అక్కర్లేదు.

## రమణ కేంద్రాన్ని అభివృద్ధి పరచాలని శ్రీ నాన్నగారు ఎలా ప్రేరేపితులయ్యారు

ఇన్ని సంవత్సరాలు నేను లక్షల కొలది రూపాయలు ఎన్నో సంస్థలకు విరాళాలుగా ఇస్తూ వచ్చాను. ఎంత ఇచ్చానో నేను చెప్పలేను. అది అక్కర్లేని advertisement కు దారి తీస్తుంది. ఇతరులను గమనించి నేర్చుకునే విషయాలు కొన్ని ఉంటాయి. ఈ మధ్య నేను మద్రాస్ కు వెళ్ళాను. అక్కడ నాకు రామచంద్రన్ అనే వ్యక్తి కలిసారు. ఆయనకు సుమారు 50 సంవత్సరాలు ఉండవచ్చు. అయన బ్రహ్మచారి. సంవత్సరానికి సుమారు పది లక్షల కాపీలు అమ్ముడుపోయే 'రీడర్స్ డైజెస్ట్' అనే పత్రిక నిర్వాహణ లో ఆయన భాగస్వాములు. ఆయన ఆదిశంకరుల పరమ భక్తులు. తిరునల్వేలి ఆయన స్వస్థానం. చాలా పెద్దచదువులు చదివారు. సత్సాంప్రదాయం గల కుటుంబం వారిది. అయిదు కోట్లు ఖర్చు పెట్టి చెన్నై లో ఒక స్థలం కొని పెద్ద building కట్టారు. ఆ డబ్బంతా ఆయన కష్టార్జితం. 'శృంగేరి మఠం తమ ఆశీస్సులను వ్యక్తపరుస్తూ ఒక లక్ష రూపాయల విరాళం ఇచ్చింది' అని ఆయన చెప్పారు. ఎవరి సహాయం లేకుండా ఆయన ఒక్కరే ఆ స్థలం కొని కట్టడం జరిగింది. నన్ను ఆయన ఆ place కి తీసుకువెళ్ళారు. అయిదారుగురు భక్తులు కూడా నాతోపాటు ఆ place కు వచ్చారు. వారు 'తత్త్వలోక' అనే ఇంగ్లీష్ పత్రిక నడుపుతున్నారు. అది చూసాక నాకు అనిపించింది: 'ఇన్ని సంవత్సరాలు ఎన్నో సంస్థలకు విరాళాలు ఇస్తూ వచ్చాను. వారిలా మన రమణ కేంద్రాన్ని కూడా ఎందుకు అభివృధిపరచకూడదు?'

## మనోధైర్యం మరియు మనశ్శాంతి కలుగ చేసే ఆధ్యాత్మిక పత్రిక రమణ భాస్కర




అనేకమంది భక్తులు నేను ప్రవచనాలలో చెప్పిన మాటలను రాసుకొని, భద్రపరుచుకొని ఇతరులతో పంచుకుంటూ ఉంటారు. అలా రాసుకున్న మాటలే 'రమణ భాస్కర' గా రూపుదాల్చింది. రమణ భాస్కర గురించి పాఠకుల మాటల్లో చెప్పాలంటే: ' అది అద్భుతం, అనిర్వచనీయం'. కేవలం రెండు వేల కాపీలు ప్రచురింపబడినా దాదాపు పదివేల మంది 'రమణ భాస్కర' చదువుతున్నారు. ఎప్పుడెప్పుడు రమణ భాస్కర వస్తుందా అని కాచుకుని ఎదురు చూసే భక్తులు ఎంతోమంది ఉన్నారు. వారి జీవితాల్లో రమణ భాస్కర 'ఫ్రెండ్ అండ్ ఫిలాసఫర్' గా మారింది. చాలా మంది రమణ భాస్కర గురించి తమ తమ అనుభవాలు నాతో పంచుకున్నారు. అలాంటి రెండు అనుభవాలు మీకు చెబుతాను. ఒక ప్రొఫెసర్ గారు తమ కొడుకు కోడలు ఇద్దరినీ రోడ్ ఆక్సిడెంట్ లో కోల్పోయారు. దుఃఖసాగరంలో మునిగి ఉన్నప్పుడు ఆవిడకు రమణ భాస్కర లభించింది. అది చదివిన వెంటనే ఆవిడ దుఃఖం సంపూర్ణంగా నిర్మూలింపపడింది. అలాగే యండగండి గ్రామస్తులు ఒకరు తమ సన్నిహితులను కోల్పోయినప్పుడు వారి దూరపు చుట్టాలు ఒకరు వారికి రమణ భాస్కర తెచ్చి ఇచ్చారట. అది చదివాక వారికి ఆ దుఃఖం ఎదుర్కొనే మానసిక స్థైర్యం మరియు మనశ్శాంతి కలిగాయట. ఇలా ఎంతోమంది భక్తులు రమణ భాస్కర గురించి వారి వారి అనుభవాలు నాకు చెబుతూ ఉంటారు.



నాన్నగారు తమ ఫోటో చూసి 'ఇది అందరికీ నచ్చేసిందండి; foreignors కూడా ఇది కొనుక్కెళ్తున్నారు. ఆ కళ్ళు ఎంత బాగున్నాయో. నాకే ధ్యానం చేసుకోవాలి అనిపిస్తుంది' అని అన్నారట.

## శ్రీ నాన్నగారి లండన్ అనుభవాలు

ఈ మధ్య మేము విదేశాలకు వెళ్లి వచ్చాము. నాకు ఇతర దేశం వెళ్లి వచ్చినట్టు లేదు. కాకినాడో, విజయవాడో వెళ్లి వచ్చినట్టు ఉంది. అందరూ లండన్ వెళ్లి వచ్చాము అని చూడటానికి వస్తున్నారు. ఎందుకు చూడటానికి వస్తున్నారు? మీ కాలం వేస్ట్, నాకాలం వేస్ట్. మనం టైమ్ కూడా వేస్ట్ చేసుకోకూడదు. ఇందులో ఏమీ లేదు. ఇతర దేశాలు వెళ్ళటం అంటే పూర్వం విశేషం. ఓడ మీద వెళ్లేవారు. ౽-3 నెలల సమయం పట్టేది. అందుచేత మేము లండన్ వెళ్లినా మీ అందరి మధ్యలో ఎలా ఉందో అలాగే ఉంది కాని అక్కడ నాకు ప్రత్యేకత ఏమీ కనిపించలేదు. ఏ దేశం వెళ్లినా ఏషియా వెళ్లినా, జర్మనీ వెళ్లినా, ఇంగ్లాడ్ వెళ్లినా నా మనస్తత్వము ఏమిటి అంటే జిన్నూరు లో మా ఇంటి దగ్గర నేను కూర్చుంటే ఎలా ఉంటుందో అలానే ఉంటుంది. అందరూ మనవాళ్లే, ఊరికే రంగులు తేడా. వాళ్ళు white people, మనం Black people. Human Nature ఈ world లో ఎక్కడైనా ఒక్కటే. మన రంగులు వేరైనా, మన కులాలు వేరైనా, మన మతాలు వేరైనా, మన సాంప్రదాయాలు వేరైనా లోపల



మన హృదయంలో వీటి అన్నింటికీ అతీతంగా ఉన్న సద్వస్తువు, సత్యవస్తువు, బ్రహ్మ వస్తువు అది ఒక్కటే. అదే ఏసు క్రీస్తు మతం వారు The kingdom of Heaven అంటారు. గౌతమ బుద్ధుడు నిర్వాణస్థితి అన్నారు. హిందువులు మోక్షం అన్నారు. ఇవన్ని మాటలు తేడా కాని వస్తువు ఒక్కటే. ఒక్కో మతంలో ఒక్కో పద్ధతిలో చెపుతారు కాని గమ్యం ఒక్కటే. ఈ మధ్య నేను ఇంగ్లండ్ లో చూసింది ఏమిటంటే కేవలం మూఢనమ్మకాలు లేకుండా స్వతంత్రంగా ఆలోచించే మనుషులు కొంతమంది ఉంటారు. Open mind, open heart తోటి ఉంటారు. సంకుచితంగా ఉండరు. వాళ్ళు సత్యాన్వేషకులు. ఏమతమైనా, ఎవరు ఏది చెప్పినా, సత్యం దగ్గరకి

మనల్ని తీసుకువెళ్లాలి అనేటువంటి సత్యం గురించి తపించే సత్యాన్వేషకులు మన భారతీయతత్వ శాస్త్రం పట్ల కొంతమంది మేధావులు ఆకర్షణ చూపిస్తున్నారు. అది USA లో అవ్వవచ్చు, ఇంగ్లాండ్ లో అవ్వవచ్చు వేరే ఏ దేశంలో అయినా కావచ్చు. సత్యాన్వేషకులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మన ఇండియన్ ఫిలాసఫీ పట్ల ఆకర్షణ చూపిస్తున్నారు. ఇంగ్లాండ్ లో మమ్మల్ని రమణ మహర్షి ఫౌండేషన్ వారు ఆహ్వానించారు. అక్కడకి నేను, డాక్టర్ సూర్యనారాయణ రాజు గారు (children specialist) వెళ్లాం. ఇద్దరిని రమ్మన్నారు. అందుచేత ఇద్దరం కలిసి వెళ్లాము. రమణ మహర్షి ఫౌండేషన్ లో మాకు ఇంగ్లీష్ అంత బాగా రాకపోయినా వచ్చీరాని ఇంగ్లీషులో ఏదో మాట్లాడాము. మేము ఇంగ్లీషులో తప్పులు మాట్లాడుతున్నాము అని మాట్లాడేటప్పుడు మాకు తెలిసినప్పటికీ మీరు బాగా మాట్లాడుతున్నారు మాట్లాడండి అన్నారు, అంటే encouragement ఇవ్వటం కోసం. వారు చెప్పేది ఏమిటి అంటే communication ముఖ్యం. మీరు చెప్పే సబ్జెక్ట్ మాకు అర్థమవుతోంది. Grammar mistakes ఉన్నా పరవాలేదు. మధ్య, మధ్యలో తప్పులు రావచ్చు మీరు చెప్పే విషయం మాకు అర్థం అవుతున్నప్పుడు ఎలా మాట్లాడినా పరవాలేదు మాట్లాడండి అన్నారు. రమణ మహర్షి ఫౌండేషన్ లో మాట్లాడాము. తరువాత బాత్ లో మాట్లాడాము. వారు నాకు crowd puller అని ఒక పేరు పెట్టారు. అంటే రమణ మహర్షి ఫౌండేషన్ లో 360 మంది సభ్యులు ఉన్నారు. లండన్ లో సర్వసాధారణంగా వారి మీటింగులకు 30 మందో , 40 మందో వస్తారట. రమణ మహర్షి ఫౌండేషన్ లో మేము మాట్లాడేటప్పుడు వర్షం వచ్చింది. నేను అక్కడకు వస్తున్నట్టు పేపర్ లో ప్రచారం చెయ్యలేదు, మామూలుగా ఫోన్ లో ఎవరో నాన్నగారు వస్తున్నారు అని చెప్పుకున్నారు. ప్రతి నెలా 20-30 మంది సభ్యులు వచ్చేవారు, అలాంటిది ఇప్పుడు 150 మంది వచ్చారు. ఆ హాల్ లో 90 మందికంటే పట్టరు. పాపం బయట వర్షంలో తడిసిపోయి నిలబడి ఉన్నారు. నాకు 45 నిమిషాలు సమయం కేటాయించారు. 'నేను చాదస్తుడిని ఆ టైమ్ నాకు సరిపోదు. నేను టైమ్ ఎక్కువ మింగేస్తాను' అని చెప్పాను. మీ ఇష్టం వచ్చినంత సేపు మాట్లాడండి. ఒక ఐటమ్ తగ్గిస్తాను అన్నారు. గంటంపావు మాట్లాడాను తరువాత వాళ్ళు ప్రశ్నలు వేశారు. మనిషికి feelings వస్తూ ఉంటాయి కదా! Feeling అంటే ఏమిటి? తరువాత మనం రమణమహర్షిని, శంకారాచార్యుల వారిని జ్ఞాని అంటాము కదా, జ్ఞాని అంటే మీరందరూ వింటున్నారు బానే ఉంది. జ్ఞాని అంటే

ఏమిటి? శంకరాచార్యులు, రామకృష్ణులు మనలాగా మనుషులే. రమణమహర్షి మనలాగే మనిషి లాగే కనిపిస్తున్నారు. మనలాగే తిరుగుతున్నారు బయటకు అందరూ మనలాగే మాములుగానే ఉన్నారు, మరి జ్ఞాని ఎలా ఉంటాడు? జ్ఞానిని ఎలా define చెయ్యాలి? జ్ఞానికి నిర్వచనం చెప్పాలి అని వారికి వచ్చిన doubts అన్నీ సిన్సియర్ గానే అడుగుతున్నారు. అందులో వేళాకోళం ఏమి లేదు. హిందువులకు పూజలు జపాలు, యజ్ఞాలు బాగా ఇష్టం. మీకేమో ధ్యానం అంటే బాగా ఇష్టం అని వారితో చెప్పాను. 'తేలికైనవన్నీ మీరు చేస్తున్నారు. కష్టమైనవన్నీ మేము చేస్తున్నాము' అని వారు అన్నారు. పూజ చెయ్యటం తేలికే, చప్పట్లు కొట్టటం, భజన చేయటం తేలికే. ధ్యానం చెయ్యటం కష్టం. తేలికైనవి మీరు చేయండి, కష్టం అయినవి మేము చేసుకుంటాము అని వారు అన్నారు. భజన, పూజ అంటే పెద్ద ఇష్టపడరు. ధ్యానం మాత్రము చాలా కష్టపడి చేస్తారు. వాళ్ళు result చూస్తారు, వారు result oriented. ఏదైనా పని చేస్తే దాని result వారికి ముఖ్యం. వారు practical people. అయితే రమణ మహర్షి foundation లో రమణ మహర్షి గురించి ముందు చెప్పలేదు. అన్నం పెట్టిన వాళ్ళని మరిచిపోకూడదు అని ముందు కాటన్ దొర గురించి 15 నిమిషాలు చెప్పాను. ఈ రోజు మనందరం అన్నం తింటున్నాము అంటే కాటన్ దొరగారు కారణం. కాటన్ దొరగారిది ఇంగ్లాండ్. 1847వ సంవత్సరంలో ధవళేశ్వరంలో ఆనకట్ట కట్టి 1852 వ సంవత్సరానికి పూర్తి చేశారు. 5 సంవత్సరాలలో ఆనకట్ట పూర్తి చేశారు. నా gratitude చూపించటం కోసం ఇలాగ మీ దేశస్తులు కాటన్ దొర గారు మాకు ఆనకట్ట కట్టారు. ఆయన పేరు మీదే మేము అన్నం తింటున్నాము అని కాటన్ దొరగారి గురించి 15 నిమిషాలు చెప్పాను. మేము రమణమహర్షి గురించి చెపుతాము అని వారు prepare అయ్యి ఉన్నారు. కాని నాకు ఆశ్చర్యం వేసింది ఏమిటి అంటే, కాటన్ దొర పేరు మేము వినలేదు, మాకు తెలియదు అని వారు అన్నారు. ఎందుచేతనంటే దానికి కారణం లేదు. కాటన్ దొర ఇంగ్లాడ్ వాడే. కావేరి నది మీద, గోదావరి నది మీద ఆనకట్టకట్టి అతని జీవితం అంతా India లో ఖర్చు పెట్టి చివరి రోజులలో ఇంగ్లాండ్ వెళ్లి చనిపోయాడు. ఇండియా లో కాటన్ దొర కి ఉన్న పేరు, గౌరవం ఇంగ్లాండ్ లో లేదు. ఆయన గౌరవం మాట వదిలివేయండి ఆయన పేరు కూడా తెలియదు వారికి. మా లండన్ స్పీచ్ అంతా మీ పేపర్లో వేయిస్తాను అంటున్నారు. సందర్భం లేకుండా కాటన్ దొర గురించి మాట్లాడాను

కాని ఆయన మీద నాకు తెలియని ప్రేమ ఉంది. అందుచేత రమణ మహర్షి గురించి నేను మాట్లాడిన వాఖ్యాలు మీరు శ్రద్ధగా ఎలా ప్రింట్ చేస్తారో కాటన్ దొర గురించి అలా ప్రింట్ చేయండి అని ముందు కాటన్ దొర గురించి మాట్లాడాను. ఎందుకంటే అన్నం పెట్టిన వారిని మర్చిపోకూడదు. ఆనకట్ట కట్టకముందు ఈ ప్రాంతంలో కొన్ని వేలాదిమంది ఆకలితో చనిపోయేవారు. అందుచేత కాటన్ దొరని మనం హృదయంలో పెట్టుకోవాలి. మనం స్మరించాలి. ఈ రోజు మనం అన్నం తింటున్నాము అంటే, మనం సుఖంగా ఉన్నాము అంటే కాటన్ దొర కారణం. మనకి ఉపకారం చేసిన మనిషిని మనం కృతజ్ఞతతో గుర్తుపెట్టుకోవాలి. దాని వలన మనకు భగవత్ అనుగ్రహం కూడా కలుగుతుంది. ఆ స్పీచ్ అయిపోయిన తరువాత మమ్మల్ని "బాత్" తీసుకువెళ్లారు. మమ్మల్ని Western కంట్రీస్ కి పరిచయం చేసిన వ్యక్తి రోజర్. అతని స్వగ్రామం బాత్. England లోవున్న బ్యూటిఫుల్ cities లో బాత్ ఒకటి. అక్కడ కొన్ని ముఖ్యమైన ప్రదేశాలు చూపించాడు. మాకు తరువాత 4 గంటలకు అక్కడ మీటింగ్ పెట్టారు. అక్కడ హాల్ పెద్దది. ఆ హాల్ లో ఒక్క మనిషి లేడు. రోజర్ ని అడిగాను: 'ఏమిటయ్యా మమ్మల్ని మీటింగ్ పెడతానని తీసుకొచ్చావు. ఇక్కడ మనుషులు కనపడుటలేదేంటి?' అంటే నవ్వుకుని ఊరుకున్నాడు. సమాధానం చెప్పలేదు మాకు. హాలూ లో నుంచి పక్కగదిలో కి తీసుకుపోయాడు. 'సరే మీరు కొంచెం సేపు రెస్ట్ తీసుకోండి, ఈ మంచం మీద రిలాక్స్ అవ్వండి' అని మంచం చూపించాడు. మీటింగ్ కు జనం ఎవ్వరు లేరు ఏంటి అంటే మాట్లాడడు. నన్ను గదిలో నుంచి హాలులోకి 5 గంటలకు తీసుకువచ్చాడు. ఆశ్చర్యం ఏంటంటే 125 మంది ఉన్నారు. ఎవరి చిన్న కార్లలో వారు వచ్చేస్తారు. మీటింగ్ వింటారు ప్రశ్నలు అడుగుతారు, సమాధానాలు వింటారు. తరువాత ఎవరి చిన్న కార్లలో వారు వెళ్లిపోతారు. టైమ్ అన్న మాట. ఇక్కడ మన మీటింగ్ లో మధ్యాహ్నం 2 గంటలకు అయితే పొద్దున్న 10 గంటలకు వచ్చి కూర్చుంటారు. మీటింగ్ అయిపోయిన తరువాత ఒక్క విషయం నాకు ఆశ్చర్యం వేసింది. ఒక ఆవిడ (లిన్ గోస్వెల్) అలానే కూర్చుంది. ఏంటి? ఈవిడ ఇలాగే కూర్చుంది అందరూ వెళ్లిపోతున్నారు అనుకుని డాక్టర్ గారిని అడగమన్నాను. డాక్టర్ గారు అడిగారు 'ఎందుకు కూర్చున్నారు నాన్నగారు అడగమన్నారు' అని అంటే ఆవిడ 'నాన్నగారికి కృతజ్ఞత చెప్పడానికి' అంది. కృతజ్ఞత ఏంటి? అన్నాను. అందరూ విన్నారు అందరిలాగే ఆవిడ వెళ్లిపోవచ్చు కదా. అంటే ఆవిడ అంది 'నేను 5

సంవత్సరాలు నుండి సాధన చేస్తున్నాను. ధ్యానం చేస్తున్నాను, జపం చేస్తున్నాను, చర్చికి వెళుతున్నాను. నేను చేసుకునే ప్రార్థనలు చేస్తున్నాను. నేను 5 సంవత్సరాలు సాధన చేసి పొందలేనిది మీ సమక్షంలో 5 నిముషాలలో పొందాను'. ఇంగ్లాండ్ వెళ్ళినందుకు ఆ ఒక్క వాక్యం సరిపోతుంది నాకు అనిపించింది. మిగతా సన్మానాలు, దండలు, గౌరవాలు, ఊరేగింపులు ఇవన్ని ఊరికే పైకి కనిపించేవి. ఆ ఒక్క వాక్యం చాలు ఇంగ్లాండ్ వెళ్ళినందుకు అనిపించింది. అప్పుడు రామకృష్ణ పరమహంస జ్ఞాపకం వచ్చాడు. It is glorious to help even one man. ఈ ఊరేగింపులు సన్మానాలు తీసి పక్కన పెట్టండి. ఇవన్నీ లాంఛనం కోసం మర్యాద కోసం సభా సంప్రదాయాన్ని అనుసరించి చేస్తారు. ఆవిడ ఒక్కటే మాట అంది. నేను 5 సంవత్సరాల నుండి చర్చ్ కి వెళుతున్నాను, ప్రార్థనలు చేస్తున్నాను, జపం చేస్తున్నాను, ధ్యానం చేస్తున్నాను. మీ ఇండియా పుస్తకాలు కూడా చదువుతున్నాను. ఇంత కాలం ఇన్ని చేస్తున్నా నేను పొందలేనిది మీ ప్రెజెన్స్ లో 5 నిముషాల్లో పొందాను. మరి ఇంత పొందిన తరువాత కనీసం మీకు థాంక్స్ చెప్పకుండా ఎలా వెళ్ళిపోను. కారు ఉంది అని లేచివెళ్లిపోనా! విమానంలో ఎగిరిపోయి వెళ్లిపోయినట్టు వెళ్లిపోనా! మీకు థాంక్స్ చెప్పటానికి కూర్చున్నాను. తరువాత నేను లండన్ నుండి వచ్చే చివరి రోజుల్లో ఎక్కడ ఉన్నానో అడ్రస్ తెలుసుకొని నేను ఇండియా వచ్చేముందు మళ్ళీ వచ్చి నన్ను చూసి చాలా కృతజ్ఞతా భావంతో ఇంగ్లీష్ లో కొన్ని పద్యాలు కుడా రాసి ఒక కవర్లో పెట్టి కొన్ని పుష్పాలు ఇచ్చి చాలా కృతజ్ఞతా భావం చూపించింది. నేను వెళ్ళిన పని ఆ ఒక్క పనికే సరిపోతుంది అనుకున్నాను. తరువాత బ్రిస్టన్ పిలిచారు. ఆవిడ అంది మీకు ఇష్టం అయితేనే ప్రసంగం చేయవచ్చు. మీకు ఇష్టం లేకపోతే ప్రసంగం మానేయొచ్చు. మాకు మీరు ముఖ్యం కానీ మీ మాటలు ముఖ్యం కాదు అంది. మీ ప్రెజెన్స్ ముఖ్యం. మీరు ఊరికే అలా కూర్చోండి చాలు అని బ్రిస్టన్ పిలిచారు. కానీ మాకు అవకాశం లేదు. బ్రిస్టన్ వెళ్ళలేదు. తర్వాత రిట్రీట్ కి వెళ్ళాం. రీట్రీట్ అంటే 3 రోజులు కలిసి ఉంటారు. రిట్రీట్ లో రమణ మహర్షి ఫౌండేషన్ వాళ్ళు పూర్వం మీటింగ్ పెడితే 30 మంది వచ్చేవారట కానీ ఇప్పుడు రిట్రీట్ కి 100 మంది వచ్చారు, గదులు సరిపోలేదు. చిన్న కుటీరాలు వేసుకుని బయట పడుకున్నారు. రాత్రుళ్ళు కూడా డేరా కింద కట్టుకొని బయట పచ్చగడ్డి లో పడుకున్నారు. వాళ్లు పశువులకు కూడా చేతి మేత పెట్టక్కర్లేదు. 24 గంటలు పచ్చగడ్డే

తింటూ ఉంటాయి. ఆ పచ్చగడ్డిలోనే పడుకున్నారు. నిద్ర పట్టిందా? అని అడిగితే చాలా బాగా నిద్ర పట్టింది అన్నారు. అది నాకు ఆశ్చర్యం వేసింది. రీట్రీట్ అయిపోయి వెళ్ళేటప్పుడు 3వ రోజున నేను చెప్పాను: 'విమానం టిక్కెట్లకి నాకు డాక్టర్ గారికి 96 వేలు ఖర్చు పెట్టి మమ్మల్ని లండన్ తీసుకువచ్చారు'. రమణ మహర్షి ఫౌండేషన్ చైర్మన్ పేరు అలన్ జాకబ్. అతని భార్య పేరు జేమ్స్. వాళ్ళిద్దరికి ఇదే పని. రమణ మహర్షి గురించి మాట్లాడడం, రమణ మహర్షి మీద పత్రిక నడపడం. ఇద్దరికి భగవంతుడు ఎలా సంకల్పించాడో ఇద్దరూ ఒకే మాట మీద వుంటారు. ఇద్దరికీ సాహిత్యం తెలుసు, ఇద్దరూ రచనలు చేయగలరు. ఇద్దరూ బాగా మాట్లాడ గలరు. ఇద్దరూ ఒకరకి ఒకరు సహకరించుకొంటారు. అయితే అది భగవంతుడి యొక్క కల్పన. Self enquiry అనేటువంటి పేపర్ వాళ్ళు నడుపుతున్నారు. 3 నెలలకు ఒకసారి ఇంగ్లీష్ లో వస్తుంది ఆ పేపర్. ఐతే నేను వాళ్ళతో చెప్పాను: 'మీరు 96 వేల రూపాయలు ఖర్చుపెట్టి మమ్మల్ని ఇంగ్లండ్ తీసుకువచ్చారు. మాకు మిమ్మల్ని అందర్నీ చూసినట్టు అయింది. ఇంగ్లండ్ కూడా చూసినట్టు అయ్యింది కానీ డబ్బు మటుకు మీరు ఖర్చుపెట్టి మమ్మల్ని ఇంగ్లండ్ తీసుకువచ్చారు' అని నేను వీడ్కోలు సమావేశం లో అన్నాను. అప్పుడు జకోబ్ అన్నాడు: 'మీరు వచ్చినందుకు మేము సంతోషిస్తున్నాం. ఆ 96 వేల మాట పక్కకి పెట్టండి. We are very very lucky అని చెబుతూ ఒక ఉదాహరణ చెప్పాడు. మీరు ఇక్కడికి రావడం వలన ఈ రెండు రోజుల్లో మొత్తం నాకు ఖర్చులన్నీ పోను 3 లక్షలు మిగిలింది' అన్నాడు. నాన్నగారు వచ్చారు అని 100 పౌండ్లు, 200 పౌండ్లు, 300పౌండ్లు అలా అందరూ ఇస్తే ఖర్చులన్నీ పోను 3 లక్షలు మిగిలింది. మీకు టికెట్లు ఖర్చుపెట్టింది 96 వేలు. ఈ 96 వేలు తీసేస్తే రమణ మహర్షి ఫౌండేషన్ కి 2 లక్షలు లాభం వచ్చింది. మీరు రావడం వల్ల మాకు టిక్కెట్లకి డబ్బు అయిపోయింది అని మీరు అనుకుంటున్నారు. మీరు ఇచ్చిన మెసేజే కాకుండా రమణ మహర్షి ఫౌండేషన్ కి డబ్బు కూడా మిగిలింది. We are very lucky. జ్ఞానం సైడే కాకుండా డబ్బు సైడ్ కూడా మాకు మీరు మిగిల్చి వెళుతున్నారు' అని వీడ్కోలు సమావేశం లో జాకబ్ చెప్పాడు. రిట్రీట్ లో మాకు సెండాఫ్ చెప్పినప్పుడు మేము మాట్లాడిన తరువాత వాళ్ళందరూ కూడా నా గురుంచి ఇంగ్లీష్ పోయెమ్స్ రాసుకొచ్చి చదివారు. వాళ్లు పొందినటువంటి అనుభవాలు రాశారు. అక్కడ ఇంకొక ఆచారం ఒకే పేపర్ అందరికీ ఇస్తున్నారు. ఏంటి అందరికీ ఇస్తున్నారు? అనుకున్నాను.

మీకు నాన్నగారి గురించి ఏదైనా మాట రాయాలంటే, ఆయన గురించి మీ హృదయంలో పొందిన స్పందన ఏదైనా ఉంటే, ఆ మాట రాసి ఇవ్వండి. నాన్నగారు వెళ్ళిపోతున్నారు కదా. ఆయనకి ఆ మాటలన్నీ చూపిస్తాం. ఒక్క వాక్యమే రాసి ఇవ్వాలి; ఎక్కువ వాక్యాలు రాయకూడదు. ఇష్టమైతే రాయొచ్చు లేకపోతే మానేయచ్చు. అందరూ రాసిన తర్వాత చైర్మన్ గారి భార్య ఆ పేపర్ నాకు తెచ్చి ఇచ్చింది. ఏమిటి ఇదంతా? అనుకున్నాను. అక్కడ ఎల్లమ్మ గారు పుల్లమ్మ గారు ఉన్నారు. ఆవిడ అభిప్రాయం రాసి సంతకం పెడుతుంది. అక్కడ అది సంప్రదాయం. అక్కడ వాళ్ళు ప్రాక్టికల్ పీపుల్. మన దేశంలో పురుష స్వామ్యం అంటే స్త్రీలకంటే మేము ఎక్కువ వాళ్ళని పైకి చెప్పుకోకపోయినా పురుషులకి లోపల అహంకారం ఉంటుంది ఇక్కడ. అక్కడ అది ఏమీ కనబడదు. అక్కడ ఏ పనయితే అవసరమో పురుషుడు చేసే పని స్త్రీ చేసేస్తుంది, స్త్రీ చేసే పని పురుషుడు చేసేస్తాడు. కానీ ఈ పని స్త్రీలే చెయ్యాలి పురుషులు చేయకూడదు అనే భావన ఉండదు. ఇంగ్లాండ్లో మనం ముఖ్యంగా నేర్చుకోవలసింది శుభ్రత. మన ఇల్లు మనం ఎలా శుభ్రంగా చూసుకుంటామో అలాగే రోడ్లు కూడా చూసుకుంటారు. రోడ్లమీద ఉమ్మి వేయరు. రోడ్లను జాగ్రత్తగా చూసుకుంటారు. వీధిలో తిరిగే కుక్కలు ఉండవు, పెంపుడు కుక్కలు ఉంటాయి. అది రోడ్లమీద చెరిపితే (దొడ్డికి వెళితే) అది తీసేస్తారు వాళ్ళు. తీసేసి డిస్పోసబుల్ బ్యాగులు ఉంటాయి దానిలో వేసి అది ఎక్కడ వేయాలో అక్కడకు పట్టుకెళ్ళి వేస్తారు. ఆరోగ్యానికి చాలా ప్రముఖ స్థానం ఇస్తారు. మంచి నీళ్లు ఎవరి ఇంటికి వెళ్లినా చాలా శుభ్రంగా ఉంటాయి. ఇల్లు మాట వదిలేయండి కాఫీ హోటల్ కి వెళ్లి తాగినా మనకేమి జలుబు పట్టదు. నేను ఇంటిదగ్గర వేడినీళ్లు తాగుతాను. మరి నేను ఇంగ్లాండ్ లో ఉన్న 18 రోజులు కూడా చల్లని నీళ్ళు తాగాను. నాకు జలుబు పట్టలేదు. అంత స్వచ్ఛంగా ఉంటాయి. అద్దములో మన మొఖం ఎలా కనిపిస్తుందో ఆ నీళ్ళలో మన ముఖం కనిపిస్తుంది. అందుచేత వాటర్ బోర్న్ డిసీజెస్ ఇంగ్లాండ్ లో కనబడవు. మరి ఆశ్చర్యం ఏమిటంటే అక్కడ దోమ ఈగ ఏమీ కనబడవు. అన్నీ మూతలు వేసేసి ఉంటాయి. ఒకవేళ తీసేసి ఉన్నా ఈగలు దోమలు వాలవు. అవి ఉండనే ఉండవు. ఇక్కడ దోమల్ని, ఈగల్ని చూడటం నాకు అలవాటు. ఒక్క దోమ అయినా ఈగ అయినా కనబడదు ఏంటి? అని అక్కడ నేను బెంగ పెట్టుకున్నాను. రిట్రీట్ లో మటుకు చివరికి బాత్రూం లో ఒక దోమ కనబడింది.

లిన్ గోస్వేల్ వ్రాసిన పద్యాలు:

**సాధనా రహస్యం**

శుక్రవారపు ముందురోజున మనం కలుసుకున్న పిదప ఎంత త్వరగా వెళ్ళిపోయింది కాలం!

మాకు లభించిన ప్రేమతో మా గుండెలు నిండిపోయాయి.

ఈ మనస్సు రహదారి మీద రణగొణ ధ్వనివంటిది, మేకల కేకల వంటిది



శరణు పొందండని భగవాన్ గుసగుసలాడారు, కానీ లొంగడానికి మాకే అభ్యంతరం.

మౌనంగా ఇలా కూర్చున్నప్పుడు, పక్షుల కిలకిలారావాలు తప్ప ఏమీ లేనప్పుడు

మౌన బోధ మమ్మల్ని ఏ అగాధాలలోకో తీసుకు పోతుందని ఎరుక కలుగుతుంది.

భగవాన్ అనుగ్రహమెల్లెడలా విస్తరిస్తోందని ఈ గదిని శాంతితో నింపేస్తోందని అనిపిస్తుంది మాకు.

అన్నింటినీ విడిచిపెట్టు - నీ హృదయానికి స్వేచ్ఛ లభిస్తుందని వారంటారు మాతో



గురువు దేహధారి కావచ్చు, పంచభూతాలతో ఏకమవచ్చు

ఏమైతేనేం - ఆయనకు విశ్వాసాన్నంతా అర్పించటమే ముఖ్యం.

ప్రతీ అవమానాన్నీ ప్రతీ గాయాన్నీ ఓర్చుకో ఇంతకన్నా గొప్ప సాధనేదీ లేదు.

ప్రభూ! కృతజ్ఞతా సూచకంగా నీకేమి అర్పించగలం?

మనసుని విడిచిపెట్టు, అహాన్ని విడిచిపెట్టు, శాంతిని ప్రేమను ఆనందాన్ని విరజిమ్ము! అంటారు మీరు

ప్రియతమ నాన్నగారూ! మాకివ్వండి మీ ఆశీర్వాదం, మీ అనుగ్రహం

భగవాన్ అనుగ్రహానికి ప్రతిబింబమైన మీ అనుగ్రహంతో మా హృదయాలు నిండిపోవుగాక!

శ్రీ నాన్న గారి వివరణ:

తెల్లవారికి ధ్యానం అంటే చాలా ఇష్టం. మీకు పూజలు మరియు మాటలంటే చాలా ఇష్టం. కాని తెల్లవారికి ధ్యానం అంటే ఇష్టం. ధ్యానం వల్ల మీ వివేకం అభివృద్ధి అవుతుంది. ధ్యాన బలం పెరుగుతూ ఉంటే మీ భావనా బలం కూడా పెరుగుతూ ఉంటుంది. మీ ధ్యానం యొక్క లోతులు పెరగ్గా పెరగ్గా ఎక్కడో బయట ఉన్నాడన్న గురువు మీ హృదయంలో ఉన్నాడన్న సంగతి మీకు అనుభవంలోకి వస్తుంది. మీకు స్పీచ్ అంటే ఎక్కువ ఇష్టం. సైలెన్స్ అంటే ఇష్టం ఉండదు.

మీ మాటలు నన్ను మోసుకువెళ్లలేని దూరాలు, మీ ధ్యానం నన్ను మోసుకు పోతాయి. ఆ విషయం మాకు తెలియనిదేమీ కాదు. ఆ విషయం మాకు తెలుసు కాబట్టే దానికి ఇంతటి ప్రాముఖ్యత ఇస్తున్నాం.

భగవాన్ చెపుతున్నాడట. గొడవ గొడవగా భగవాన్ చెప్పటంలేదు; వారి చెవిలో ఊదుతున్నాడట. ఎందులో ఊదుతున్నాడట? చెవిలో. నిప్పుని గొట్టాలతో ఊదుతాము కదా అలాగే భగవాన్ వారి చెవిలో ఊదుతున్నాడట. ఏమని ఊదుతున్నాడట? ఆయన సరెండర్ అవ్వమని ఊదుతున్నాడట. సరెండర్ అవుదామంటే లోపల ఉన్న ఇగో (అహంకారం) అవ్వనివ్వటంలేదటండి. ఎందుకు అవ్వనివ్వటంలేదట? అంత బలంగా ఉందటండి. అంటే లొంగదీసుకుందామంటే లొంగలేనంత బలిసిపోయి ఉందటండి లోపల అహంకారం. దాన్ని సరెండర్ అవ్వమని అడుగుతా ఉంటే అది అవ్వను అంటుందట. భగవాన్ చెపుతున్నారు కదా అని లోపల ఉన్న అజ్ఞానాన్ని 'సరెండర్ అవ్వు' అని వారు అడుగుతున్నారట. 'నేనెక్కడ అవుతాను? అవ్వను' అంటుందట. అది బలిసిపోయి ఉందట లోపల.

లోపల హృదయానికి, లోపల ఈశ్వరునికి శరణాగతి పొందటానికి అహంకారం ఒప్పుకోవడంలేదు. నీళ్లు ఎలాగైతే మన శరీరాన్ని కడుగుతాయో, భగవాన్ అనుగ్రహం కూడా మమ్మల్ని అలా కడుగుతుంది అనే స్పృహ మాకు ఉంది. అంత మొద్దులుగా లేము. ఆయన కడగటమే కాదు. కడిగేటప్పుడు మాకు తెలుస్తుంది. ఈ చాకలివారు బట్టలు ఉతుకుతారు చూడండి. అలా మమ్మలను ఉతుకుతున్నట్లు మాకు తెలుస్తుంది.

శరణాగతి చెందినప్పుడు 'ఫ్రీడమ్ ఫ్రమ్ ది నోన్' అంటే మీకు అస్తమానం ఏ గొడవలు వచ్చి చిరాకు పెడుతున్నాయో అందులో నుంచి మీకు ఫ్రీడమ్ వస్తుందట. ఏ name అండ్ form మిమ్మలను చిరాకు పెడుతున్నాయో ఆ name అండ్ form ని మీరు మరచిపోతారు.

'ఓ మా ప్రియతమ నాన్నగారు, భగవాన్ యొక్క గ్రేస్ యొక్క ప్రతిబింబమే మీ sweetness'.

## గురుస్తవం

గురుదేవా!  ఎంత అద్భుతమయ్యా నీవు

జన్మజన్మాంతరాలలో   మా తప్పటడుగులు సరిదిద్దుతూ

మేము నీ కంటే భిన్నము కాదని గ్రహించే వరకూ

మమ్మల్ని ఎంత మృదువుగా గమనిస్తున్నావయ్యా!

ఓరి భగవంతుడా! ఎంత అద్భుతమయ్యా నీవు




ఆనందం కోసం లోకపు సిరులలో ఆత్రంగా వెతుక్కునే మమ్మల్ని

ఎంత ఓర్పుతో గమనిస్తావయ్యా

సంపదా ఖ్యాతీ నెమ్మదిగా ఆరిపోయే దీపాలనీ

నిత్యజ్యోతి మాలోనే ఉన్నదని గ్రహిస్తాము క్రమేణ



విజ్ఞతతో, నిరహంకారంతో బ్రతకాలి

ప్రేమపూరిత హృదయంతో, విశ్వాసంతో, స్పష్టతతో పలుకాలి

దయతో కారుణ్యంతో ప్రతి పనీ చేయాలి

నిత్యనూతనమైన ఔదార్యంతో మెలగాలి.



జీవితమనే రైలుబండిలోని ప్రయాణీకులం మేము

ఇంజన్ వైపు మా ముఖాలు లేవు

దాటిపోయిన దృశ్యాలే కనబడతాయి మాకు

ముందేమి రానున్నదో కనబడదు మాకు

అయినా బండిని నడిపే నీపై విశ్వాసముంది మాకు

గమ్యానికి చేరుస్తావని నమ్మకముంది మాకు



మేము పయనించవలసిన మార్గాన్ని మా కర్మే నిర్ణయించింది

ఇక్కడ ఎవరి కర్మ వారిది

ఒకోసారి వేగంగా, చీకటిలో భయంతో పోతుంది;

అయినా, గమ్యాన్ని చేరుతామని నమ్మకముంది



జీవితమంటే ఇదేననిపిస్తుంది కాని స్వప్నమే కదా ఇది

ఆత్మకి హాని ఎట్లా కలుగుతుంది

తండ్రి చేతిలో హాయిగా నిదురించే బిడ్డ ముఖం మీద చిట్లిమ్మే కదా ఇది

ఆఖరికి స్వప్నం నుండి మేల్కొన్నప్పుడు వర్తమానమే మనసు పొరలను చీల్చి

ఎల్లవేళలా ఉన్నదేనని తెలియజేస్తుంది

గడచిన గాథని తెలియజేసేదెవరూ లేరు!



## శరణాగతి

మన ప్రియతమ భగవాన్ ని విశ్వసించు

సజీవ గురుని ధ్యేయం ఆధ్యాత్మిక జ్ఞానాన్నీ మంచితనాన్నీ అందరికీ పంచటం.



సత్యాన్ని మననుంచి మరగుపరచే వాసనలని దగ్ధం చేస్తుంది

మనోవికారాలని ఏరిపారవేస్తుంది అనుగ్రహం

నా సొంతమనిపించే ఏ భావమైనా లోపల శాంతిని విఘాతపరుస్తుంది

విముక్తినొసగే స్పష్టమైన దృష్టిని కప్పివేస్తుంది




గురుదేవా! ఎప్పుడూ నా హృదయంలోకి సత్యానికి మార్గం చూపు

అప్పుడుగాని ఆది నుంచి అది ఉండనే ఉందని, కళ్ళు తెరచి చూడలేను.

శిష్యుడు ఏ ప్రయత్నం చేయగలడు?

గురుని విశ్వసించు, అన్నిటినీ విడిచిపెట్టు

సుఖదుఃఖాలలో ఆయనే మార్గం చూపుతారని నమ్ము.



ఇది నిజం ఏది జరిగినా మన మంచి కొరకే

ఏ కష్టం కలిగినా - దానిని స్వీకరించు, భరించు.

అంతా సవ్యంగా ఉన్నప్పుడు వారిని విశ్వసించటం సులభం

భయాందోళనలో కూడా వారిని స్మరించటం కొందరికే సాధ్యం!



జీవితపు దుఃఖాలని వరాలుగా మార్చి

శాంతిని ఒసగే పరుసవేది శరణాగతి

అప్పుడే గ్రహిస్తాం మన నిజ స్వరూపాన్ని

వాగుతూండే మనస్సు మూలం

మౌనం ద్వారా కనుగొంటాం అదే పరమోత్కృష్టం



నీవూ గురువూ దైవమూ - అన్నీ ప్రేమే ఇది విస్మరింపకు

మనసు మూలంలో ఉన్నదొకటే - అదే మౌనం.

## భక్తి భావాలు

వేకువ జామున నాలో ఏ తలంపు ఉదయించక ముందే

నా తనువునీ మనస్సునీ హృదయాన్నీ

విశ్వాసముతో నా గురువునకు సమర్పింతును గాక!



దరహాసం నాన్నగారిదైనా శ్రీ భగవాన్ దైనా,

అంతరంగం లోని గురుముఖానికి భౌతికరూపమే కదా!

వీడని కాంక్షతో గురుని వీక్షించు,

నీ నిజ తత్త్వాన్ని గాంచు అది చాలు నీకు.



వేదనలో, శోకపు సమయంలో ఉపశమనమేదో గుర్తెరుగు

దుఃఖంలో వారి చూపుని స్పర్శించు, అంతటితో ఊరట చెందు.

మనస్సు మోడైనప్పుడు, బీటలు వారినప్పుడు

వారి ప్రియస్పర్శ కరువైందనిపించినప్పుడు

నీ ప్రేమకు వారి ప్రతిస్పందనను వినమ్రతతో వేచియుండు

దానినే వారికి సమర్పించు.



ఆ ఆనందానుభూతి నేను రమ్మంటే వస్తే

అహంకారం ఉబ్బుతుంది, అది మనకు ఏమి లాభం?

అది ఎక్కడో దూరాన ఉన్నట్లనిపిస్తే వినయముతో గ్రహించు

వర్షమెంతగా కురుస్తున్నా మేఘాల మాటున సూర్యుడున్నాడని

వారి ప్రేమ కాంతికై దూర ప్రయాణమేల,

స్వకల్పిత మేఘాలను దాటు, దాపుననే ఉన్నారు వారు.



గురుని ప్రేమ నిగూఢం, మనది దురవగాహం

ఆ వీక్షణం నీకు సోకినప్పుడు సర్వస్వమూ వారికే విడనాడు

గురుని ప్రేమానురాగాలు దుఃఖాన్ని అంతమొందిస్తాయి

అవి ఇప్పుడే, ఇక్కడే లభ్యం; నిన్నో, నేడో, ఎప్పుడో కాదు.




గురుని వీక్షణం నీపై అనుగ్రహాన్ని వర్షిస్తుంది

నీవు నిత్యవిముక్తమైన ఆత్మవనీ, నీ నిజతత్త్వమదేననీ

దేహమూ మనస్సూ కావనీ గ్రహింపచేస్తుంది.

ఆత్మవిచారానికి భక్తి అవసరం

సత్యదర్శనానికి హృదయార్పణం అవసరం



మౌనం సమాయత్తపరుస్తుంది మనస్సు తన మూలాన్ని కనుగొనటానికి

విస్తృతమయే మౌనాకాశమది అనుగ్రహపు ఎరుక అది.

అరుణాచలా! సుందరా! ఈ అహాన్ని ధ్వంసం చెయ్యి

ఆనందంలో దానిని అంతమొందనియ్యి, పులి నోట పడింది.

ఈ పంక్తులను స్మరించినప్పుడల్లా నా గురుని ముఖం దర్శనమిస్తుంది

ఊరటతో నవ్వుకుంటాను, ఆయన నా స్వరూపమని నమ్మి నా భయాలను పారద్రోలుతాను.

## Ashton Lodge, Dorset లో శ్రీ నాన్నగారు చేసిన ప్రసంగం (19-21 June 1998):

సోదర సోదరీమణులారా, నా ప్రియతమ భక్తులారా,



Alan Jacob నన్ను రమణ మహర్షి ఫౌండేషన్ తరఫున ఆహ్వానించడం జరిగింది. ఆయన Self Enquiry అనే పత్రిక కు ఎడిటర్ కూడాను. ఆయన ఆంగ్ల భాష చాలా సరళంగా, సహజంగా వ్రాస్తారు. Jane, Alan Jacob, గంగ మరియు రామ్ నన్ను ఎంతో ప్రేమ మరియు ఆదరపూర్వకంగా airport లో receive చేసుకున్నారు. Airport నుండి నన్ను మరియు నా డాక్టర్ మిత్రుడిని రామ్ తన ఇంటికి తీసుకు వెళ్లారు. అక్కడ మేము 3 - 4 రోజులు గడిపాము. రమణ మహర్షి ఫౌండేషన్ లండన్ లో స్థాపించి మీరు ఎంతో మంచి పని చేసారు. రామ్ ఇంటినుండి మేము రమణ మహర్షి ఫౌండేషన్ కు వెళ్లి, అక్కడ జరిగిన ఒక మీటింగ్ లో పాల్గొన్నాము. అక్కడ నేను భగవాన్ ఉపదేశాల గురించి ప్రవచనం చేసాను. అక్కడ హాల్ నిండుగా ఉండింది. అందరు భక్తులు హాల్ లో సరిపోలేదు. కనుక కొంతమంది భక్తులు హాల్ విడిచి వెళ్లిపోయారు.

ఈ మాటలు విన్న Alan అన్నారు: మరి మీరు అంత పెద్ద crowd puller కదా.

నాన్నగారు నవ్వేసి ఇలా కొనసాగించారు: అవును, అవును. ఇది మీకు చాలా పెద్ద crowd. కానీ ఇది మాకు చాలా చిన్న crowd. (అందరూ నవ్వుతారు) మా భారత దేశం లో, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో సుమారు 23 జిల్లాలు ఉన్నాయి. నేను సుమారు అన్ని జిల్లాల్లోనూ భగవాన్ జీవితం మరియు ఆయన ఉపదేశాలను ప్రబోధించాను. వేలాది మంది భక్తులు ఆ ప్రవచనాలను ఆలకించారు.

రమణ మహర్షి ఫౌండేషన్ నుండి మేము చంపాపటేల్ ఇంటికి వెళ్ళాము. వారు భారతీయులు. వారిది చాలా మంచి కుటుంబం. వారు నా పట్ల చూపించిన ప్రేమానురాగాలను నేను మాటల్లో చెప్పలేను. వారు ఎంతో తెలివైనవారు మరియు నిండు హృదయులు. వారి తెలివైన మరియు నిరహంకార ప్రవర్తనను చూసి నేను ఎంతో stun అయ్యాను. మాకు కావాలిసినవి అన్నీ వారు సమకూర్చారు. వారి ఇంట్లో మేము ఎంతో విలాసపూరితమైన జీవితం గడిపాము. వారు చాలా ఆదరణీయులు. వారి హృదయాలు భగవాన్ భక్తి తో నిండి ఉన్నాయి. వారింట్లో లెక్క లేనన్ని భగవాన్ ఫొటోస్ ఉన్నాయి.



ప్రియతమ మిత్రులారా, మీ అందరి ఇళ్లల్లో భగవాన్ ఫొటోస్ ఉండి ఉంటాయి కదూ! మీరు నిరంతరం లేక మీ సమయానుసారం భగవాన్ ముఖాన్ని చూస్తూ ఉండటమే అతి పెద్ద సాధన, అతి గొప్ప సాధన. ఎటువంటి కంగారు లేకుండా ఆయన ముఖం చూస్తూ ఉండటం- అంతే. సాధన అనేది చాలా చాలా తేలిక. అది కష్టం కాదు. మీ table పైన భగవాన్ ఫోటో పెట్టుకొని ఆయన అద్భుతమైన కళ్ళను మరియు చిరు నవ్వును ఆస్వాదించండి. అప్పుడు మీకు automatic గా మెడిటేషన్ కుదురుతుంది. మీ మనస్సు కూడా అతి తేలికగా అంతర్ముఖం అవుతుంది. భగవాన్ని ప్రేమించండి, మరి మరి ప్రేమించండి. మీరు త్రికరణశుద్ధిగా భగవాన్ని ప్రేమిస్తే, ప్రేమ కొరకు ప్రేమిస్తే, శాంతి ఆనందం ఖ్యాతి మరియు అనుగ్రహం లభిస్తాయి. కేవలం భగవాన్ ముఖాన్ని చూడండి. ఆయన కళ్ళను చూడండి. ఆయనను ప్రేమించండి. అది సరిపోతుంది.

రమణ జీవితాన్ని, రమణ సందేశాన్ని జీర్ణించుకోవటానికి ప్రయత్నించండి. ఆయన జీవితం చాలా సరళమైనది. ఆయన ఆధ్యాత్మికత చాలా సహజమైనది. ఆయన ప్రవచనాలలో ఎటువంటి అలంకరణ ఉండదు. ఆయన సందేశం చాలా చాలా సరళమైనది. ఆయన సుమారు ముప్పై వేల మందికి సమాధానాలు చెప్పారు. ఆయన

మాతృ భాష తమిళం. ఆయన చాలా సరళమైన తమిళం లో మాట్లాడేవారు, వ్రాసేవారు. కేవలం ౨౦ నిమిషాలలో ఆయన ఒక ఋషి, ఒక saint మరియు సాక్షాత్తు భగవంతుడే అయిపోయాడు. భారతీయ ఆధ్యాత్మిక చరిత్ర లో ఇలా ఎప్పుడూ జరగలేదు.

ఆ మరణానుభవం ద్వారా తాను దేహం కాదు, మనస్సు కాదు, మృతిలేని ఆత్మను అని అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. అది ఆయన ఊహాగానం కాదు. అది ఒక intellectual excercise కాదు. దానిని సజీవమైన సత్యంగా అనుభవించారు. మీకు ఇష్టం లేకపోతే నా మాటలను తిరస్కరించండి, నా జీవిత విధానాన్ని తిరస్కరించండి కానీ నా అనుభవాన్ని మీరు కాదనలేరు. మతం అన్నది అనుభవానికి అందవలసిన విషయం. శాంతి, ఆనందమే మతం యొక్క సారం.



చంపాపటేల్ ఇంటి నుండి ఈ retreat కు వచ్చాను. నేను భారత దేశంలో కొన్ని ఆశ్రమాలను సందర్శించాను. వారు కూడా నన్ను retreats కి పిలిచారు. కానీ నేను వెళ్ళలేదు (అందరూ నవ్వుతారు) సాధారణంగా భారత దేశంలో retreat అన్నది ఒక్క రోజు కన్నా ఎక్కువ ఉండదు. ఇది నేను పాల్గొంటున్న మొదటి retreat. Alan Jacob నుంచి నేను retreats గురించి విన్నాను. Jacob అన్నాడు: ఇది మామూలు retreat కాదు. ఇది చాలా పెద్ద retreat. ఇది నాలుగవ retreat. ఇక్కడికి చాలా మంది వచ్చారు. బహుశా ఇది అతిపెద్ద retreat. గత రెండు రోజులుగా నేను ఇక్కడ ఉన్నాను. మనందరమూ ఇక్కడ సమావేశం అయ్యాము. హృదయం హృదయం తో మాట్లాడేటప్పుడు మాటలతో పనిలేదు.

మాటలు, ప్రవచనాలు, జపము, పూజ, ధ్యానము - ఇవన్నీ కూడా గురువు అనుగ్రహం తో పోలిస్తే అప్రధానమైనవి. మీ అందరికీ భగవాన్ అనుగ్రహం ఉంది. మీ అందరికీ నేను ఒక్క విషయం ఖచ్చితంగా చెప్పగలను: మీ అందరికీ unbroken peace, undiluted peace మరియు unworldly peace లభిస్తుంది. మీరు ఇప్పుడు అనుభవించే peace ఈ ప్రపంచానికి సంబంధించినది కాదు. ఇది చావులేని వస్తువుకి సంబంధించినది; సత్యానికి మరొక పేరే శాంతి. చావులేని స్థితికి మరొక పేరే శాంతి. మీకు అటువంటి శాంతి

లభించినప్పుడు సాక్షాత్తు భగవంతుడే వచ్చి దర్శనం ఇచ్చినా, మీకు ఆయన్ని చూడాలని అనిపించదు. 'నీ అవసరం మాకు లేద'ని చెబుతారు (అందరూ నవ్వుతారు). అట్టిది ఆ శాంతి యొక్క వైభవం.

నిజమైన దేవునికి రూపము లేదు, నామము లేదు. మన హృదయమే ఆయన స్థావరం. సందేహము లేదు. మనం ఆ దేవుడిని అభ్యాసం మరియు సత్సంగం ద్వారా అనుభవంలోకి తెచ్చుకోగలం. మనం సాధుసాంగత్యం చేయాలి. దాని వలన భగవత్ కృపకు పాత్రులమౌతాం. మీకు నిజమైన శాంతి, సుఖం లభిస్తే దేవతలతో కూడా పనిలేదు. పుట్టుక అన్నది దేహానికే గాని ఆత్మకు లేదు. మనం ఆ ఆత్మకు సంబంధించిన శాంతిని, ఆనందాన్ని అనుభవించగలము. అది undiluted, unbroken మరియు unborn happiness. అది శాశ్వతమైన ఆనందం.




నా ప్రియతమ భక్తులారా, నా ప్రియతమ స్నేహితులారా, మీరు ఖచ్చితముగా ఈ జీవితములోనే అటువంటి శాంతిని, ఆనందాన్ని పొంది తీరుతారు. భగవంతుడు మిమ్మలను అటువంటి శాంతి తో అలంకరిస్తాడు. మనందరమూ భగవాన్ ప్రేమలో ఉన్నాం. మనందరమూ భగవాన్ భక్తులం. మనందరమూ భగవాన్ పిల్లలం. ఎక్కడ శాంతి, అమరత్వం, ఆనందం, జ్ఞానం కలదో అక్కడ దుఃఖ స్పర్శ ఉండదు. భగవాన్ అంటారు: ' ఆనందమే నీ నిజ స్వరూపం. నీ నిజ స్వరూపమే స్వర్గరాజ్యం. అది ప్రపంచానికి సంబంధించిన శాంతి కాదు, అది అభౌతికమైన శాంతి'.

అలాగే అప్పుడప్పుడూ భగవాన్ ప్రబోధనలను చదువుతూ ఉండండి. మీ అందరికీ నా వినయపూర్వక విన్నపం ఏమిటంటే: మీ కొద్ది సమయాన్నైనా భగవాన్ కి కేటాయించండి. ఆయన మాటలు కూడా అనుగ్రహపూరితమైనవి, శాంతిపూరితమైనవి. భగవాన్ రూపాన్నే కాదు, ఆయన మాటలను కూడా ధ్యానం చేయండి. చదివి, జీర్ణించుకొని, ధ్యానం చేయండి. Bible లో ఒక మాట ఉంది: 'మాట దేవుడై ఉన్నది'. మీరు భగవాన్ శ్రీ రమణ మహర్షి మాటల మీద ధ్యానం చేస్తే, రోజు రోజుకీ మీ చైతన్య స్థాయి పెరుగుతుంది. చివరకు

మీకు నో-మైండ్ స్టేట్ లభిస్తుంది. మీరు త్రికరణశుద్ధిగా భగవాన్ని ప్రేమిస్తూ ఉంటే, భగవాన్ని ప్రార్థిస్తూ ఉంటే, భగవాన్ కోసం జీవిస్తూ ఉంటే, భగవాన్ పని చేస్తూ ఉంటే, ఆయన అనుగ్రహానికి పాత్రులౌతారు. ఆ అనుగ్రహమే మిమ్మలను పునీతులను చేస్తుంది.

నేను బాగా చదువుకున్న వాడిని కాదు. నేను ఒక సామాన్య రైతును. నేను హృదయపూర్వకంగా, త్రికరణశుద్ధిగా భగవాన్ని ప్రేమిస్తాను. పాక్షికంగా కాదు హృదయపూర్వకంగా ప్రేమిస్తాను. ఆయన పని చేస్తాను. ఆయన సందేశాన్ని భారత దేశంలో ఒక భాగమైన ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రంలో వ్యాప్తి చేయడానికి నా జీవితాన్ని అంకితం చేసాను. భగవాన్ కూడా నన్ను ప్రేమించారు. నన్ను హత్తుకొని ముద్దు పెట్టుకున్నారు. మాటలకందని జ్ఞానాన్ని అనుగ్రహించారు. నేను ఇంగ్లాండ్ కి వచ్చింది మీకేదో బోధించడానికి లేక ఏదో ఇవ్వటానికి కాదు. భగవాన్ అన్నారు: 'మౌనం కూడా ప్రబోధిస్తుంది. మౌనం మాటల కన్నా ఎంతో శక్తివంతమైనది. మాటకు కూడా శక్తి ఉంది కానీ మౌనం కూడా ప్రబోధించగలదు'.



మామూలుగా మౌనం అంటే మనం నోర్లు మూసుకుంటాం కానీ మన మనస్సును మూసుకోవడం ఉత్తమం. నిరంతరం భగవాన్ని స్మరిస్తూ ఉంటే మనస్సు యొక్క చపలత్వం తగ్గుతుంది.

Mr. Philips! My friend! నేను ఇండియన్ ఇంగ్లీష్ లో మాట్లాడింది బ్రిటిష్ ఇంగ్లీష్ లో అనువదించగలవా? Philips చాలా వినయశీలి. (అందరూ నవ్వుతారు).

Philips అంటాడు: నాన్నగారు మీరు అనువదించవలసినదంతా ఒకసారి రిపీట్ చేయగలరా? (అందరూ గట్టిగా నవ్వుతారు)

అప్పుడు నాన్నగారు మళ్ళీ తమ ప్రసంగం కొనసాగిస్తారు:

భగవాన్ని మీ హృదయం లో ఉంచుకోండి. భగవాన్ కి మీ హృదయంలో కొంత స్థానం ఇవ్వండి. మీ హృదయంలో ఎన్నో విషయాలు ఉన్నాయి. మనం మన family ని ప్రేమిస్తాం, దేశాన్ని ప్రేమిస్తాం, మతాన్ని

ప్రేమిస్తాం. ఆశ్రమంలో జీవిస్తాం. ఇలా మన హృదయంలో ఎన్నో విషయాలు ఉన్నాయి. కానీ నా వినయపూర్వక విన్నపం ఏమిటంటే భగవాన్ కి కూడా మీ హృదయంలో కొంత చోటు ఇవ్వండి, ఆయన స్థానం ఆయనకు ఇవ్వండి.

ఆధ్యాత్మిక జీవితం లో brain అనేది ముఖ్యం కాదు. ఈ ప్రపంచం లో ఎంతో తెలివైన వారు ఉన్నారు. కానీ వారందరికీ ఆత్మసాక్షాత్కారం కలుగదు. ఆధ్యాత్మిక విషయాలలో brain కన్నా కూడా హృదయం ప్రధానమైనది.



మీరు ఏదైనా హృదయపూర్వకంగా చేస్తే, మీకు దైవానుగ్రహం లభిస్తుంది. మీరు ఏది చేసినా natural గా, normal గా, simple గా చేయండి. కృత్రిమంగా చేయకండి. పేరు ప్రతిష్టల కోసం చేయకండి. దైవానుగ్రహం కోసం చేయండి. ఆధ్యాత్మిక జీవితంలో గురువు అనుగ్రహం, దైవానుగ్రహం చాలా ముఖ్యమైనవి. మీరు వీటికి అత్యంత ప్రాముఖ్యతనివ్వాలి. మీరు నిష్కామంగా పనిచేస్తే, కొంత ధ్యానం చేస్తే, ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రార్థన చేస్తే, మీకు automatic గా దైవానుగ్రహం లభిస్తుంది. అనుగ్రహం అనేది ఇక్కడా ఉంది, అక్కడా ఉంది, అంతటా ఉంది.

మన మనస్సుని పరిపక్వము చేయడానికి సాధన చేయాలి. చిన్న పిల్లల మనస్తత్త్వం గల వారు భగవాన్ మాటలను అర్థం చేసుకోలేరు. పరిపక్వము చెందిన మనస్సులే భగవాన్ మాటలను అర్థం చేసుకోగలవు. భగవాన్ అన్నారు: 'సత్యానికి ప్రచారం అక్కర్లేదు. అందుకనే అర్హత ఉంటే ఆ సత్యమే మీకు వ్యక్తం అవుతుంది'. కానీ నా ప్రియతమ స్నేహితులారా, ఈ ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి: అనుగ్రహం వస్తుంది. భగవంతుని అనుగ్రహం, కరుణ, మెర్సీ - అన్నీ మీకు లభిస్తాయి. Divine interference అనేది మీకు చప్పుడు చేసుకుంటూ రాదు, అది నిశ్శబ్దంగా వస్తుంది. మౌనం ద్వారా అనుగ్రహం ప్రవహిస్తుంది.

ఇంగ్లీష్ లో ఒక సామెత ఉంది: Silence is gold. Speech is silver. ఈ సామెత అంటే నాకు ఎంతో ఇష్టం. భగవాన్ చూపు మన మీద ఉంది; ఆయన స్పర్శ మన మీద ఉంది; ఆయన అనుగ్రహం మన మీద ఉంది. ఆయన

చూపు ద్వారా, స్పర్శ ద్వారా, మాట ద్వారా ఎన్నో విధాలుగా మనలను అనుగ్రహించగలరు. ఆయన చూపు ఒక్కటే కాదు; ఆయన మాట, ఆయన నడక అన్నీ అనుగ్రహమే. ఆయన దేహంలోని ప్రతీ కదలిక అనుగ్రహమే.

కనుక మీ అందరికీ నేను ఎంతో కృతజ్ఞుడను. మేము లండన్ లో ఎంతో సుఖంగా ఉన్నాము. నా టీనేజ్ నుండి నాకు ఈ దేశం అంటే ఎంతో ఇష్టం. గత సంవత్సరం కొంతమంది కెనడా కు చెందిన భక్తులు నన్ను ఆహ్వానించారు కానీ నేను వెళ్ళలేదు. నాకు లండన్ చూడాలి అనిపించింది (అందరూ నవ్వుతారు). నాకు మీ రచయితలు అంటే కూడా చాలా ఇష్టం. నాకు Shakespeare, the greatest dramatist, the greatest poet అంటే చాలా ఇష్టం. ఇంగ్లీష్ లిటరేచర్ లో ఆయనకు సాటి ఎవరూ లేరు. నిస్సందేహంగా Shakespeare కి కూడా ట్రుథ్ యొక్క glimpses ఉన్నాయి. ఆయన వ్రాసిన ఒక్క వాక్యం గుర్తుకు వస్తుంది: To do or not to – that is the question! (అందరూ నవ్వుతారు). Wonderful! ఇది చాలా wonderful sentence. అప్పుడు అక్కడి భక్తులు దానిని సవరిస్తూ: 'To do or not to do కాదు, To be or not to be' అని అంటే నాన్నగారు అన్నారు: To be or not to be that is the question! అని Shakespeare అనవచ్చు కానీ నేను దాన్ని మార్చేస్తున్నాను: Do or die! That is the question in the end!



తపస్సు అనేది ఒక సంస్కృత పదము. మీరు నిష్ఠతో చేసే పని కూడా తపస్సు తో సమానమే. ఇతరులతో సరిగ్గా వ్యవహరించడం, ఇతరులతో సరిగ్గా ప్రవర్తించడం కూడా తపస్సుతో సమానమే. దైనందిన జీవితంలో మీరు నిరహంకారముగా జీవించ గలిగితే, భగవంతుడు మిమ్మలను అభౌతిక సుఖం మరియు శాంతితో అలంకరిస్తాడు. తపస్సు అంటే మీరు భయ పడనక్కర్లేదు. అది చాలా చిన్న విషయం. మీ నిజ జీవితాల్లో మీరు జాగ్రత్తగా ఉండాలి. అనవసరమైన మాటలు మాట్లాడకూడదు. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకో కూడదు. కోరికలను అదుపులో పెట్టుకోవాలి. కంట్రోల్ వలన ఎక్కువ సుఖం లభిస్తుంది. తెలివి కన్నా కంట్రోల్ ఎక్కువ సుఖం కలుగచేస్తుంది. మీకు ఎన్నో సుఖాలు ఉండవచ్చు. కానీ ఒక కంట్రోల్డ్ మైండ్, సాత్త్విక్ మైండ్, peaceful మైండ్ మీకు ఎక్కువ సుఖాన్ని కలుగచేస్తుంది. Comfort అన్నది అప్రధానమైనది.

నా ప్రియతమ స్నేహితులారా, Ladies and Gentlemen (అందరూ నవ్వుతారు), ఒక గొప్ప దేవుడు, ఒక నిజమైన దేవుడు మన హృదయం లో ఉన్నాడు. ఆయన్ను మీరు ముఖా ముఖిగా చూడగలుగుతారు. Chruches మరియు టెంపుల్స్ లో కూడా దేవుడు ఉన్నాడు. కానీ మీ దేహం ఎంత నిజమో ఆ దేవుళ్ళు కూడా అంతే నిజం. మీకు అర్థం అవుతుందా? (భక్తులందరూ అవును అని అంటారు). మీరు వివేకాన్ని సంపాదించండి. వివేకపూరితమైన అభ్యాసం చేయండి. సత్పురుషుల సహవాసం చేయండి. భగవంతుడు ఎవరు? ఆయన ఎక్కడ ఉన్నాడు? అంటే ఆయన సర్వ హృదయవాసిగా ఉన్నాడు. మీకు జ్ఞాన నేత్రం కలిగితే, నియంత్రిపబడిన మనస్సు కలిగితే, ప్రశాంతమైన, స్వచ్ఛమైన మనస్సు కలిగితే, భగవంతుడు మీకు అంతరంగమున గోచరిస్తాడు. నిజమైన దేవుడు ఎప్పుడూ మీతోనే ఉన్నాడు. మీ ముందట ఉన్నాడు; మీ వెనుక ఉన్నాడు. మీ హృదయాలలో ఎల్లప్పుడూ ఉన్నాడు. ఆయన్ను పొందటానికి మొదట మనం అభ్యాసం ద్వారా జ్ఞాన నేత్రం సంపాదించాలి. భగవంతుడిని పొందటానికి, ఆ అమృత స్థితి ని పొందటానికి మన జీవితాలను deepen చేసుకోవాలి. మన విశ్వాసాన్ని deepen చేసుకోవాలి. వినయ పూరితమైన  మాటలు, ప్రవర్తన, సహజమైన సంభాషణ అలవరచుకోవాలి.




భగవాన్ చాలా సరళమైన మాటల్లో ఉపదేశించేవారు. మన brain చాలా complicated. కనుక మన brain కి complicated మాటలు అంటే ఇష్టం. మన హృదయం చాలా సింపుల్. జీసస్ కూడా చాలా సరళమైన చిన్న చిన్న మాటల్లో ఉపదేశించారు. ఎందుకంటే అది హృదయానికి సంబంధించిన భాష; హృదయాన్ని స్పందింప చేసే ప్రబోధ.  మన brains కి complication మరియు litigation అంటే చాలా ఇష్టం. మన మనస్సు యొక్క సహజమైన స్థావరం బ్రెయిన్ కాదు, హృదయం.

మనం నెమ్మదిగా కూల్ మైండ్ మరియు steady మైండ్ తో గనుక విచారణ చేస్తే, అసలు మనస్సే లేదని తెలుస్తుంది. అది నిజమైన విచారణ.  మీకు శరణాగతి ఇష్టమైతే, శరణాగతి మార్గాన్ని అవలంబించండి. భగవాన్

శరణాగతి మార్గాన్ని కూడా ప్రోత్సహించారు. నిన్న మేము ఒక Church గోడపైన ఒక వాక్యం చదివాము: 'Thy will be done'. శరణాగతి మార్గం అంటే అది. విచారణ మార్గానికి కూడా ప్రాముఖ్యత ఉంది ఎందుకంటే అది కాష్ బేరం వంటిది. మీకు వెంటనే ఫలితం లభిస్తుంది.

So నేను చాలా సమయం తీసుకున్నట్లు ఉన్నాను; అలాగే వచ్చి రాని బ్రోకెన్ ఇంగ్లీష్ లో మాట్లాడాను.

అప్పుడు పాల్ అనే భక్తుడు అన్నాడు: 'మీ హృదయం ఇంకా స్పష్టంగా, గట్టిగా మాట్లాడుతుంది'.



నాన్నగారు అన్నారు: మీ అందరికీ చాలా చాలా చాలా ధన్యవాదాలు. Thank you very much, very much, very very much. మీరు నా పట్ల ఎంతో ఆదరణ, ప్రేమానురాగాలు చూపించారు. అవి నేను మాటల్లో చెప్పలేను. ఇంత చిన్న విషయాన్నే నేను మాటల్లో చెప్పలేకపోయాను మరి నా భగవద్ అనుభవాన్ని నేను మాటల్లో ఎలా చెప్పగలను? అది తలంపులకు అతీతం, మాటలకు అతీతం.

అనుగ్రహం గురించి మీరు కించిత్తు కూడా సందేహించనక్కర్లేదు. అనుగ్రహం తప్పక వచ్చి తీరుతుంది. అనుగ్రహం అంతటా ఉంది. నేను మిమ్మలను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. మీ అందరికీ ఒక ప్రార్థన; ఇది నా చివరి ప్రార్థన (లాస్ట్ బట్ నాట్ ది లీస్ట్ ప్రేయర్) - త్రికరణశుద్ధిగా మీ అందరికీ చేసే ప్రార్థన: మీ హృదయం లో భగవాన్ కు కొంత చోటు ఇవ్వండి. ఆయన పని ఆయన చేసుకుంటాడు. ఒక్క విషయం మాత్రం నిశ్చయం. మనకు తెలిసినా తెలియకపోయినా, మనందరం భగవాన్ శ్రీ రమణ మహర్షి ప్రేమకు పాత్రులం. మనకు తెలిసినా తెలియకపోయినా నిజము ఎప్పటికీ నిజమే. నేను మిమ్మలను గుర్తు పెట్టుకుంటాను, కనుక మీరందరూ కూడా నన్ను గుర్తు పెట్టుకోగలరు.




నాన్నగారు: Philip ఇప్పుడు చెప్పగలుగుతావా?

Philip: ఇంకేమి చెప్పగలను?

నాన్నగారు: నిలబడి మాట్లాడు. (అందరూ నవ్వుతారు)

Philip: నిలబడి మాట్లాడమంటారు, అంతే కదా. మీరు చెప్పిన దానిని మించి నేనింకేమీ మాట్లాడలేను, నాన్నగారు. మీరు చెప్పిందంతా చాలా శ్రద్ధగా విన్నాను. దాన్ని మించి ఇంకేమి చెప్పనవసరం లేదు. (అందరూ నవ్వుతారు) మీరు మా మధ్యలో ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాను. సాక్షాత్ శ్రీ రమణ భగవాన్ పాదముల చెంత కూర్చున్నాను అనిపిస్తుంది. మీ సమక్షం లో పొందిన శాంతి వలన నాకు భగవాన్ సమక్షం లో ఉన్నట్లు అనిపిస్తుంది. భగవాన్ దేహం విడిచినప్పుడు నా వయస్సు మూడు సంవత్సరాలు. కనుక నేను ఆశ్రమం వెళ్లి భగవాన్ని దర్శించలేకపోయాను.



నాన్నగారు: 1950 లో మీ వయస్సు కేవలం మూడు సంవత్సరాలేనా?

Philip: అవునండి. కాబట్టే నేను ఆయన సన్నిధానంలో కూర్చోలేకపోయాను అని బాధ కలుగుతూ ఉండేది. కానీ మేము రమణ భక్తులు, ఆయన ప్రత్యక్ష శిష్యుల నుండి విన్నప్పుడు, ఆయన అనుగ్రహం యొక్క ప్రత్యక్షానుభవం మా హృదయాలకు లభిస్తుంది. అప్పుడు మేము పయనించే మార్గం సార్థకం అవుతుంది. అది ఉట్టి థియరీ కాకుండా, reality గా పరిగణిస్తుంది. మా నిజ సాధనలో ఒక భాగం అవుతుంది. అంతే. కనుక అది చాలా తేలికైన మార్గం. కానీ కేవలం మా సాధన సరిపోదు. మౌన భాష పరిమళాన్ని ఎంతగా అందుకోగలమో దాని మీద ఆధారపడి ఉంటుంది. మౌన భాష పరిమళాన్ని మనం తయారు చేయలేము. దాని కోసం ఎదురు చూసి తపించాలి. మీరు మా సమక్షంలో లేనప్పుడు, మేము మిమ్మల్ని స్మరించాలి. అది మీ presence యొక్క పరిమళాన్ని జ్ఞప్తికి తీసుకొని వస్తుంది. అంతే. ధన్యవాదాలు.

నాన్నగారు: Thank you very much. Concluding (చివరి) mantra, closing mantra?

Alan: Yes, Please, yes the concluding mantra.

OM NAMO BHAGAVATE SRI RAMANAYA (All)

రోజర్ హౌస్డెన్ శ్రీ నాన్నగారితో తన అనుభవాలను 'Travels through Sacred India' అనే పుస్తకంలో పంచుకున్నారు. దాని గురించి ప్రస్తావిస్తూ శ్రీ నాన్నగారు అనేవారు: 'నా గురించి ఎంతో మంది భక్తులు చెప్పటం జరిగింది కానీ రోజర్ నాకు న్యాయం చేసాడు అనిపిస్తుంది'.

## శ్రీ నాన్నగారి తో రోజర్ హౌస్డెన్ అనుభవాలు



ఒకే గురువు నుండి జ్ఞానం పొందిన ఇద్దరు వ్యక్తులు ఇంత వేరుగా ఉంటారా అంటే శ్రీ పూంజా ను, శ్రీ నాన్నగారిని చూడాలి. ఇద్దరూ రమణ మహర్షి అనుగ్రహము చేతనే ఆధ్యాత్మిక ఉన్నతిని పొందిన వారే, అయినా, బాహ్యంగా వారు ఇరువురు చాలా వేరుగా కనిపిస్తారు.

శ్రీ నాన్నగారు, వారి జీవితం యొక్క చాలా భాగం ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా లో వ్యవసాయం చేస్తూ, రైతు గా జీవించారు. ఒక 20 ఏళ్ల క్రితం, ఓ మహనీయుడు ఆయన స్వప్నం లో వచ్చి, బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నారు. కొన్నాళ్ల తరువాత, ఒకానొక దినపత్రిక లో ఆధ్యాత్మిక పుస్తకము యొక్క ప్రకటన వారి దృష్టిని ఆకర్షించింది. ఆ పుస్తకము మద్రాసు నుండి తెప్పించుకున్నారు. ఆ పుస్తకము తెరచి చూస్తే, తన బుగ్గ మీద ముద్దు పెట్టుకున్న మహానుభావుని ఫొటో  కనిపించింది. ఆ ఫోటో రమణ మహర్షిది. ఆయనను ఇదివరకు ఎప్పుడూ చూడలేదు వారు. తదనంతరం తీర్థ యాత్రలకై అరుణాచలం వచ్చి, రమణాశ్రమం దర్శించారు. అది మొదలు, భగవాన్ మహాసమాధి అయ్యి 15 ఏళ్లు గడిచినా, వారు తరచు రమణాశ్రమం



దర్శించేవారు. వారి జీవితం రమణుడి బోధ చుట్టే తిరగటం ప్రారంభించింది. అలాగే రమణుడి బోధను వారు, వారి స్వగ్రామం చుట్టూ ఉన్న గ్రామాలలో బోధించటం ప్రారంభించారు. కొన్ని ఏళ్ల తరువాత, రమణాశ్రమం లో ఉన్నప్పుడు, ఉషా సమయములో, మెలకువకు నిద్రకు మధ్యలో, (ఆయన సొంత వాక్యాలలో) 'మనస్సు హృదయములో పెర్మనెంట్ గా జారి పడిపోయింది'. ఆ రోజు నుంచి ఆయన జీవితం మారిపోయింది. ఒక వ్యక్తి గా కాకుండా, ఒక శక్తి యొక్క అధీనం లో పనిముట్టుగా జీవితము సాగుతోందని, వ్యక్తి అక్కడ లేడని, గోచరించింది. భక్తులు ఆయనను వక్తగా, ప్రబోధకుడిగా కాకుండా, గురువుగా భావించటం, గౌరవించటం ప్రారంభించారు. ఆయన పేరు ఆంధ్రప్రదేశ్ అంతటా వ్యాప్తి చెందింది.

ఈ మధ్య ఆయన దక్షిణ భారతం అంతటా తిరుగుతూ, భక్తుల ఇళ్లల్లోనే ఉంటూ, బోధన చేస్తున్నారు. ఆయన ఏ ప్రాంతం వస్తే అక్కడి భక్తులు వచ్చి ప్రవచనం వినటమే కాకుండా, వారి వారి బాధలు, సమస్యలు విన్నవించుకుంటారు. ఆయన రోజంతా, వారి సమస్యలను అత్యంత శ్రద్ధ తో విని, పరిష్కారం సూచిస్తారు. భక్తులు సమావేశమైనప్పుడు కొంత సేపు ప్రవచనము చేస్తారు, కొంత సేపు మౌనంగానూ ఉంటారు. ఆయన సాంప్రదాయక భారతీయ గురువువలె భక్తులకు ఆత్మబంధువు, ఆప్తుడు, మిత్రుడు, పెద్ద దిక్కు, మరియు శ్రద్ధ ఉన్నవారికి ఆధ్యాత్మిక కేంద్రము, గురువు.

నేను మొట్టమొదటి సారిగా, 1993 లో, నాన్నగారిని తిరువణ్ణామలై రమణాశ్రమం లో చూసాను. సాయంకాలం లైబ్రరీ దగ్గర ఎవరో గురువు దర్శనమిస్తారని నా మిత్రుడు చెప్పాడు. అరుణాచల గిరి, రమణుడి గుహ నాకు సరిపోతాయి అనిపించేది; ఇంకొక గురువు దర్శనం అవసరం అని నాకు గట్టిగా అనిపించలేదు. నాకు రమణాశ్రమం లో ఇవ్వబడిన గది లైబ్రరీ పక్కనే ఉండటం చేత, నేను గుహ నుండి తిరిగి వచ్చే సమయానికి అనేక పాశ్చాత్య భక్తులు లైబ్రరీ దగ్గర ఉన్న చెట్టు కింద, సుమారు 60 ఏళ్ల వ్యక్తి చుట్టూ, మౌనంగా కూర్చుని

ఉండటం చూసాను. ఆయన పాదాల వద్ద అనేక భారతీయ స్త్రీలు కూర్చుని ఉన్నారు. వారందరు తదేకంగా ఆయన్నే చూస్తున్నారు. ఆయన దృష్టి మెల్ల మెల్లగా ఒకరి పై నుండి ఒకరి పై ప్రసరిస్తున్నారు. మధ్య మధ్య లో పొట్ట ను నిమురుతూ, పెద్దగా తేనుపులు తీస్తున్నారు. అప్పుడు నాకు ఆయన వీధి చివర కిరాణా కొట్టు వాడిలా అగుపించారు.



నేను కూర్చున్నాను. మొదటి దోమ ఎప్పుడు కుడితే అప్పుడు లేచి వెళ్లి పోదామనే ఉద్దేశ్యము తో కూర్చున్నాను. నా చుట్టూ ఉన్న వాళ్ల మౌనం లోతుల్లో ఉన్నారని అనిపించింది. నాన్నగారు మెల్లగా అందరి మీద దృష్టి సారిస్తున్నరు. కొందరి మీద ఎక్కువ కాలం దృష్టిని నిలుపుతూ, కుడి చెయ్యి ఎత్తి ఆశీర్వదించటం గమనించాను. నా దేహము రాయి వలె చలనము లేకుండా ఉండిపోయింది.  లేచి వెళ్లి పోదామన్న తలంపు పోయింది. మెల్లిగా అన్ని తలంపులు మాయమయ్యాయి. ఆయన దృష్టి సహానుభూతి భరితమై, ప్రియుడు ప్రియురాలిని చూచినట్లు, అత్యంత ప్రేమభరితమై ఉంది. ఆ దృష్టిలో ఎటువంటి కర్తృత్వ భావము గానీ, ఏదో కోరిక గానీ, ఏదో చేద్దాము, సాధిద్దాము అన్న కాంక్ష గాని ఇంచుకైనా లేవు. ఆ చూపు ప్రేమపూరితంగా, పసి పిల్లవాడివలే అమాయకంగా అందరికీ సమానంగా లభ్యమై, అదే సమయానికి ఎవరికి వారు తమకు మాత్రమే సొంతం అనుకునేలా ఉంది. వారిలో ఏ విధమైన tension కనపడదు. ఆయన ఉనికి, ఎరుక ఆయన కళ్ల ద్వారా ఎడతెగకుండా ప్రవహిస్తున్నట్లు ఉంది. అరగంట తరువాత ఆయన మౌనంగా లేచి, నమస్కరించి, తమ గదికి వెళ్లి పోయారు. కూర్చున్నవారందరు కూర్చున్నట్లే ఉండి పోయారు. కదలిక లేదు. ఆ మౌనము కొద్ది నిముషాల పాటు అలాగే కొనసాగింది. నేను నెమ్మదిగా లేచి పూర్వ ప్రణాళిక లేకుండా, ఆయన గదికి వెళ్లాను. తలుపు దగ్గర వేసి ఉంది. ద్వారము లో శిష్యులొకరు ఉన్నారు. నాన్నగారిని చూడవచ్చా అని వారిని అడిగాను. వారు నన్ను లోపలికి తీసుకునివెళ్లారు. మంచం మీద కూర్చుని, దిన పత్రికను తీసుకుంటున్నారు నాన్నగారు.



'ఏ దేశం?' అని ఆంగ్లం లో అడిగారు. నేను చెప్పినపుడు, నీవు 'ది టైమ్స్' దినపత్రిక చదువుతావా?' అని అడిగారు. 'నేను చదవను' అని చెప్పగా, ఇంగ్లాండ్ లో వేరే మంచి దినపత్రికలు ఏవని అడిగారు. నేను ఏదో చెప్పాను. నా ప్రశ్న వెంటనే అడిగాను. 'మీరు మమ్మల్ని తీసుకెళ్లిన మౌనస్థితి నన్ను ముగ్ధుడ్ని చేసింది. కాని, ఎక్కడ ఉన్నా, అన్నివేళలా ఆ స్థితిలో ఉండాలని నా తపన. నేను భారత దేశం లో మీ వంటి వారి సమక్షము లో ఎల్లప్పుడూ ఉండలేను కదా!' అని. 'నీకు మౌనం నచ్చిందా?' అని చిన్న పిల్లవాని వలె ఆహ్లాదంతో, ముందుకు వంగి అడిగారు. 'రేపు విరూపాక్షుడి గుహకు రా. నీ ప్రశ్నకు సమాధానం ఇస్తాను' అని చెప్పారు. మరుసటి రోజు 3 గంటలకు ఆశ్రమానికి వస్తే వారే కారులో గుహకు తీసుకెళతానన్నారు.

మరుసటినాడు నేను సమయానికి హాజరైయ్యాను. ఒక అర డజను భక్తులతో నేను ambassador కారు ఎక్కాను. నాన్నగారు వేరొక కారు ఎక్కారు. టౌను వరకు వెళ్లి, అటు నుంచి గుహకు వెళ్లాము. అక్కడ ఆతృతతో వేచి ఉన్న భక్తులు కనిపించారు. నాన్నగారు గుహ లోనికి వెళ్లి, నమస్కరించి, తిరిగి బయటకు వచ్చి, ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. అక్కడ ఉన్న భారతీయ భక్తులను సంబోధిస్తూ తెలుగులో అర గంట పాటు ప్రవచనం చేసారు. నేను, మరియు ఇతర పాశ్చాత్యులు మౌనంగా కూర్చున్నాము. ఆయన మాట్లాడుతున్నా సరే, మాకు మౌనం అందుతోంది. నా ప్రశ్నకు ఆయన మాటల్లో సమధానం ఇవ్వలేదు. కాని, ఆయన తీసుకెళ్లిన మౌనస్థితి మాటలకు మించినదని తెలిసింది. ఆ రోజు సాయంత్రం నేను ఆశ్రమానికి వెళ్లినపుడు, నాన్నగారు అందరి తో బాటు నేల మీద కూర్చుని భోజనం చేస్తున్నారు. మామూలు మనిషిలా, తెల్ల ధోవతి ధరించి ఉన్నారు. ఏ విధమైన విశేష చర్యలు కాని, ఉపచారాలు కాని కానరాలేదు. ఆయన  నడుస్తూంటే, ఆ నడక నడకలా కాక సెలయేరు పారుతున్నట్లు అనిపించింది నాకు.

ఆ సాయంత్రం ఆయన దర్శనానికి నేను వెళ్లినప్పుడు, వచ్చి పక్కన కూర్చొమ్మని సైగ చేసారు. పది నిమిషాల కోసారి నా వంకకు తిరిగి చూసేవారు, కోమలంగా అమాయకపు చిరునవ్వు తో నా తల నిమిరేవారు. మొదట్లో,



అందరి ముందు వారు నా పై కురిపిస్తున్న ప్రత్యేక వాత్సల్యానికి కొంచం ఇబ్బంది గా ఫీల్ అయ్యాను. కాని ఆ భావము మెల్లిగా శాంతిలో మాయమయ్యింది. ఈ శాంతి కొన్ని వారాల పాటు నాతో ఉండి పోయింది. మరుసటి రోజు నాన్నగారు బయలుదేరు సమయానికి గుమిగూడిన జనావళి లో నేను కూడా ఉన్నాను. వారి మధ్య నుండి కారు వైపుకు వెళుతూ, నా వైపు వచ్చి, నా చేతులు పట్టుకుని 'రోజర్' అన్నారు. చల్లని చూపుతో, ముసిముసి నవ్వులతో మళ్లీ 'రోజర్' అన్నారు. ఓ ప్రేమికుడు ప్రియురాలి నుండి సెలవు తీసుకుంటున్నట్లు. పలువురిని ఇదే విధంగా ఆప్యాయంగా పలకరించటం చూసాను. ప్రతి ఒక్కరిని లోకం లో నాకు మీరు మాత్రమే ముఖ్యులు అన్నట్లుగా చూసేవారు. వారికి కూడా అలాగే అనిపించేది. ఇలా, శ్రీ కృష్ణుడు గోపికలతో ప్రవర్తించే తీరు యొక్క సజీవ నిదర్శనం నేను ఇదే చూడటం, ఇది వరకు ఎక్కడా చూడ లేదు.

కొన్ని నెలల తరువాత, నేను శ్రీ నాన్నగారి స్వగ్రామానికి వెళ్లాను. అక్కడే నివసించి ఆయనతో బాటు ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాలు తిరిగాను. భారతదేశం యొక్క హృదయస్థానం ఈ గ్రామాలు. ఇక్కడ సాంప్రదాయక పద్ధతిలో కట్టిన ఇళ్లు చూసాను. ఇంటి ముందున్న వరెండా లో పెద్ద పెద్ద చెక్క స్థంభాలు ఉంటాయి. పైకప్పు పెంకులతో చేస్తారు. ఇంచుమించు స్పేన్ దేశం హసిఎండాలు గుర్తుకు వస్తాయి. ఇలాంటి ఒక ఇంట్లో నాన్నగారు వరండాలో కూర్చుని దినపత్రిక చదువుతూ, తమను దర్శించటానికి వచ్చిన వారిని పలకరించటం, ఆయన దినచర్య లో ముఖ్య భాగం. ఇలా ఎల్లప్పుడూ భక్తులు ఇంటికి రావటం వారి కుటుంబ సభ్యులకు ఇబ్బంది

కలిగించేది. బహుశా అందుకేనేమో వారు అంతలా ప్రయాణాలు చేసేవారు. వారి పక్కింట్లోనే నేను ఉండవచ్చన్నారు. ఇల్లు గల వారు ప్రస్తుతం వేరే ఊరు వెళ్లారు. ప్రొద్దున్నే తలుపు తట్టడం విని, తలుపు తెరిచాను. చేతిలో కాఫీ కప్పు పుచ్చుకుని ఎదుట నాన్నగారు నిలుచున్నారు!!!! సాయంత్రము వారి ఇంట్లోనే, వంట గదిలో, నాకు వారి సతీమణి స్వయముగా వండిన వంట వడ్డిస్తూ ఉంటే, ఆయన అక్కడే ఉండి నాకు అనుకూలంగా ఉందా లేదా అని చూసుకున్నారు. 'మంచి భోజనమా?' అంటూ (ఆంగ్ల భాష వచ్చి రానట్లు) ఆంగ్లము లోనే అడిగారు. 'చాలా మంచి వంటకమా?' అని మళ్లీ అడిగారు. నాకు నచ్చిందని చెప్పగా వారు ఇంకొంచెము తినమని బలవంత పెడుతూ, 'చాలా మంచి వంటకం, చాలా మంచి వంటకం' (ఆంగ్లము లో) అన్నారు.

జిన్నూరు నుండి ఓ వంద మైళ్ల దూరములో ఉన్న చాలా గ్రామాలకు నేను ఆయనకూడా వెళ్లాను. నా అవసరాలన్నీ ఒక శిష్యుడు చూసుకున్నారు. ప్రతి గ్రామములో మొదట నాన్నగారికి, నాకు భోజనము పెట్టేవారు.




మేము భోజనము చేస్తూంటే అక్కడి స్త్రీలు చుట్టూ నిలుచుని, నాన్నగారిని వీక్షిస్తూండేవారు. నాన్నగారు మాత్రం, నా వైపు చూస్తూండేవారు. మా భోజనము తరువాత ఇంట్లోని మగవాళ్లకు వడ్డించేవారు. చివరిగా స్త్రీలు పిల్లలు భోజనము చేసేవారు. ఇది వాళ్ల సాంప్రదాయం. తరువాత భక్తులందరూ సమావేశమైనప్పుడు నాన్నగారు తెలుగులో ప్రవచనం చేసేవారు. వారెవరైనా సమస్యల గురించి అడిగితే, పరిష్కారం చెప్పేవారు. కొద్ది సమయము మౌనంగా కూర్చునేవారు. ప్రవచనాలే కాకుండా, నేను వారితో మూడు పెళ్లిళ్లకు వెళ్లాను, గృహప్రవేశం వెళ్లి అశీర్వదించటం చూసాను, ఒక పేపర్ ఫాక్టరీ కి వెళ్లాను, అలాగే ఒక గుడిని దర్శించాను. ఎక్కడికి వెళ్లినా, ఎవరితో మాట్లాడుతున్నా, ఏమి చేస్తున్నా, ప్రవచనం చేస్తున్నా, మౌనంగా ఉన్నా... ఎప్పుడూ కూడా వారు ఎరుక గా, చైతన్యంగానే ఉండటం గమనించాను. ఇంచుకైనా, ఏ కొంచెమైనా ఆయన మనస్సులో reaction లేదని అనిపించింది. ఆయన నడుస్తూ ఉంటే సెలయేరు పారుతున్నట్లు అనిపించింది. ఒక గ్రామము నుండి మరొక గ్రామానికి వెళుతున్నపుడు, కారులో,

తమ ఒడిలో ఉన్న చిన్న భగవాన్ ఫోటో వంక చూసేవారు. అప్పుడు ఆయన మన లోకం లో లేరు, కారులో ఉన్న మాకు, ఈ లోకానికి, అతీతంగా ఎక్కడో ఉన్నారు అనిపించింది. కాని, కారు ఆగగానే మాతోపాటు, పూర్తిగా మన లోకం లో, మనతో పాటే ఉన్నట్లు, ఆ సమయనికి అనుగుణంగా correct గా ఉండేది ఆయన ప్రవర్తన.

నాలాగే పాశ్చాత్యులు పలువురు జిన్నురు లో ఉండి ఆయన తో ఇలా పలు గ్రామలు అనుసరించారు. కొందరు నాకంటే ఎక్కువ కాలము నివసించారు. వారి అనుభవాలు చెప్పమని నేను కోరగా, అందరూ వ్యక్తపరచినది ఏమనగా....ఆయన సమక్షము లో పొందే సుదీర్ఘ శాంతి, మౌనము, మరియు ఇతరుల నుండి ఏమీ ఆశించని ఆయన సరళత. న్యుయార్క్ వాస్తవ్యులు ౭౦ ఏళ్ల వృద్ధులు ఒకరు ఇలా చెప్పారు- 'ఒక రోజు ఒక వృద్ధురాలు వచ్చి నాన్నగారితో తన బాధలు చెప్పుకుంటూ ఏడుస్తున్నారు. చాలా సేపు చెపుతూనే ఉన్నారు వారు. వారి మాటలు నాన్నగారు వింటూ, నాన్నగారు కూడా ఏడవడం ప్రారంభించారు. వారి సమక్షములో నాకు ఆహ్లాదంగా ఉన్నా, నా లో ఏ మార్పూ కనిపించలేదు. కాని అక్కడ నుండి బయలు దేరిన తరువాత, అప్పటి వరకు నా జీవితం లో కమ్ముకున్న దు:ఖము, నిరాశ, బాధ మటు మాయమయ్యాయి అని గుర్తించాను' అని.




ఆయన అత్మానుభవం ఏదో ప్రత్యేక సాధన వల్ల కాక, కేవలం భగవాన్ మీద ఉన్న అపరిమిత ప్రేమయే కారణమని తామే చెప్పిన నాన్నగారు, తమ ఉపదేశములలో కూడా ఏ ఒక్క ప్రత్యేక పద్ధతి ని అవలంబించమని చెప్పరు. ఆయన స్వంత పద్ధతి ఏమనగా, దైనందిన పనులు చేసుకుంటూ, ఎరుక లో ఉండటం. అది వారు గృహస్థులై ఉండి, ఆధ్యాత్మిక మరియు లౌకిక జీవితాలు వేరు కావని, ఆచరణలో చూపించారు. ఆయన రోజువారి జీవితం లో ఎక్కువ సమయం భక్తుల సమస్యలు పరిష్కరిస్తూ, సందేహాలకు సమధానం చెప్తూ, సమాజానికి తమ వంతు పని చేస్తూ గడిచిపోతుంది. భారతీయ భక్తుల తో గంటల తరబడి

మాట్లాడుతారు, అద్వైతాంశాల గురించి ప్రవచనం చేస్తారు. అదే పాశ్చాత్యులకు ప్రత్యేకంగా ఎవరైనా సందేహాలు అడిగితే లేదా విలేఖరులు ముఖాముఖి లో ప్రశ్నలు అడిగితే మాత్రమే మాట్లాడుతారు. ఎక్కువగా మౌనం వహిస్తారు. ఆంగ్ల భాషలో ప్రావీణ్యం లేకపోవటం ఒక కారణం కావొచ్చు. కాని పాశ్చాత్యులు మాటల కన్నా మౌనానికే ప్రాముఖ్యత ఇస్తారని వారికి తెలుసు. పాశ్చాత్యులు ఇది వరకే అనేక పుస్తకాలు చదివి, పుస్తక జ్ఞానం తో విసిగి, నిజమైన అనుభవం కోసం ఆతురత తో వేచి ఉన్నవారు. వారికి పుస్తకాలలో, గోష్టి లో అందని శాంతి, మౌనము అందిస్తున్న నాన్నగారికి వారు కృతజ్ఞులు.

ఇచట భక్తులు వచ్చి పోయే రీతి గమనిస్తే, ప్రత్యేకమైన గురు శిష్య సంబంధమేమి కనిపించదు. కాని, పారంపరిక వైఖరి, గురు-శిష్య బాంధవ్యానికి మిక్కిలి ప్రాముఖ్యత ఇచ్చు వారు కూడా ఆయనకు ఆకర్షితులవ్వటం గమనించాను. హృదయం విప్పి మాట్లాడే వారికి వెంటనే స్పందిస్తారు నాన్నగారు. ఆయన మాటలలో, ఇలాగే చెయ్యి అని ఆజ్ఞాపించే పద్ధతి ఉండదు, ఇతరులు పాటించి తీరవలెనన్న అపేక్ష ఉండదు. ఆయన చూపులో హృదయం లోతుల్లోనికి రమన్న ఆహ్వానం (open invitation) కనిపిస్తుంది. ఆ లోతుల్లో అన్ని భేద భావాలు, లౌకిక బంధాలు, బాంధవ్యాలు కరిగి పోతాయి. రమణ మహర్షి కూడా మౌనమే బోధకు సరియైన పనిముట్టు అని చెప్పారు. నాన్నగారి శిష్యులు తిరువణ్ణామలైలో రమణాశ్రమం దగ్గర ఒక ఆశ్రమం (ఆంధ్రాశ్రమం) నిర్మించారు. అక్కడ ప్రతి సంవత్సరం, కొన్ని నెలలు ఉండాలని ఆయన సంకల్పము. ఇలా ఇంకెందరినో తరింపచేస్తారని నా అంచనా.



## ధ్వనించే మౌనం - శ్రీ నాన్నగారితో సీన్ కాంబెల్ అనుభవం

డాబా మీద సత్సంగం జరుగుతోంది. మేము అప్పటికే ఆలస్యం అయ్యాం. నిజానికి మేము ఆలస్యం కాలేదు, ఆయనే ముందు విచ్చేశారు. ఏమైనా ఫలితమొక్కటే కదా. ఒక ఇనుప మంచం మీద ఆ చిన్న విగ్రహం ఆసీనమై ఉంది. ఆయన పాదాల చెంత చక్కని దుస్తులు ధరించిన వందలాది స్త్రీలు కూర్చుని ఉన్నారు. పైన అందమైన అచ్ఛాదన రెపరెపలాడుతోంది, దానిని పట్టించుకోలేదాయన. ఆయన అందరివంకా పరిపూర్ణమైన మౌనంతో మృదువుగా చూస్తున్నారు. ఆయన మామూలు మనిషి వలెనే కనబడ్డారు, అయినా - ఎంతో వృద్ధ రూపాన్నీ నవ్వు కొలిపే రూపాన్నీ చూస్తాననుకుంటూ వచ్చాను - కాని ఆయన మౌనం ముందు ఆ నవ్వు పరారైంది. ఓరి భగవంతుడా! ఆ మౌనం ఎంత ప్రగాఢం, ఎంత గంభీరం, ఎంత నిశ్చలం - ఏమిటి నేననుభవిస్తున్నది?

తలుపుదగ్గర ఉన్న ఒకాయన, మమ్మల్ని చిన్నగుంపుగా కూర్చున్న పాశ్చాత్త్యుల మధ్య కూర్చోమని సంజ్ఞ చేశారు. ఆ జనసమ్మర్ధం లో దారి చేసుకొని వెళ్ళాం. అంతకు పూర్వం నాకెప్పుడూ అటువంటి అనుభవం కలుగలేదు. ఆయన నుండి ఏదో ప్రసరిస్తున్నట్లుంది. ఏ క్షీరాబ్దిలోనో నేను త్రోవ చేసుకుంటూ వెళ్తున్నాననిపించింది. నిటారుగా నిలబడలేకపోయాను! నాలో ఏదో ఒక అంశం మెల్లగా నా చుట్టూ పెనవేసుకు పోతున్న అఘోషించే మౌనంలో ఇంకిపోతోంది, అంతరాంతరాలలోని ఏ అగాధాలలోనో ఇంకిపోతోంది.

నేను ఎప్పుడు కూర్చున్నానో జ్ఞాపకం లేదు. కానీ ఆ కోతి జ్ఞాపకం ఉంది. నాన్నగారికై ఎవరో అరటిపళ్ళు తెచ్చారు. ఒక కోతి వచ్చి ఆయన ఎదురుగానే ఆ పళ్ళని తీసుకుంది. అది విపరీతంగానూ ఉంది, సహజంగానూ ఉంది. నాన్నగారి వద్ద నుండి వెదజల్లబడుతున్న దానితో పొంతన కలిగి ఉంది. ఏదీ నాకవగాహన కావటం లేదు. నా మెదడు నిశ్చలమైపోయింది. అందరివైపూ ఎంతో నిశితంగా, లోతుగా ఆర్ద్రంగా చూస్తూ, ఒక్కొక్కరి మీద ఒక్కొక్క క్షణమాగుతూ, మరలిపోయే ఆయన చూపుల వైపే నేను లగ్నమైపోయాను. వారి చూపులు నా చూపులను సోకాయి, ఎంత సేపో నాపై కేంద్రీకృతమయ్యాయి. నేను కరిగిపోతున్నానా మెల్లగా మాడిపోతున్నానా అనిపించింది, నా మెదడు వేడెక్కిపోయింది. 'ఈ మౌనమింత బిగ్గరగా ఎందుకుంది' అని తెలివి తక్కువగా నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

ప్రేమ వెల్లువ నన్ను ముంచివేయగా, ఆనంద పారవశ్యంతో పులకరింపగా అన్ని ఆలోచనలూ అంతర్థానమైపోయాయి. ఏదో ఆనందం, ఏదో భ్రమ  అనుభవమయ్యాయి. ఆ దృక్కులను గుర్తింపగానే! అసలు అటువంటి చూపులు మానవ మాత్రులలో అంతకు పూర్వం నేనెక్కడా ఎదుర్కోలేదు. అయినా, టిబెట్ మఠాలలో ఉండే కొన్ని శిలా ప్రతిమలలో, కొన్ని చిత్రాలలో అటువంటి కళ్ళనే చూశాను, "బుద్ధుని కళ్ళు" అని కొట్ట వచ్చేట్టు అనిపిస్తున్నాయి. అర్ధ నిమిలీతమైన ఆ చూపుల పట్ల నాకు ఆకర్షణా ఉంది, వెగటూ ఉంది, ఏదో నిరాకారమైన ఆదర్శానికి అవి ప్రతీకలు మాత్రమేనని  అనుకునే వాడిని.  అవి మానవాతీతమైనవని కూడా అనుకునే వాడిని. కాని, ఆశ్చర్యమేమంటే, నేనిప్పుడు వాటివైపే చూస్తున్నాను!



ఆయన దృక్కులు మరలిపోయాయి, మళ్ళీ వచ్చాయి. ఆ మౌనాన్నే నేను నమ్మలేక పోతున్నాను. ఎంత అందంగా ఉంది! ఆ ఆనంద సాగరంలో, అరుణాచల నేపథ్యంలో, మునిగి పోయాను.  ఎంతో మృదువైన దరహాసం వెలార్చి ఆయన లేచి వెళ్లిపోయారు. నేను అచేతనుడనైనాను.  మంత్రముగ్ధుడనైనాను!

భోజనం చేసేటప్పుడూ, ఆ రాత్రి అంతా కూడా ఏదో అర్థంకాని స్థితిలో గడిపాను.  నేనూహింపని ఏ మహత్తరశక్తో నాలోని భావాలనన్నిటినీ తుడిచిపెట్టివేసింది. నాకు కునుకు పట్టలేదు. ఇంతటి మహనీయమైన దానిని నేను ఎదుర్కొన్నప్పుడు ఎట్లా పట్టుతుంది? ఆ రాత్రంతా సలసలా కాగిపోయాను. అక్షరాలా! నా చర్మమంతా ఏదో గగుర్పాటుతో నాట్యమాడింది. నా తల విప్పారుతున్న పుష్పమైంది. ఆ పుష్పం పూర్తిగా విచ్చుకోలేదు. రేకులు ఒకదాని వెంట ఒకటి విప్పారుతూనే ఉన్నాయి రాత్రంతా. నా కల్పనేమో తెలియదుగాని నేను వ్యాకోచిస్తున్నట్లనిపించింది. అట్లా వ్యాకోచిస్తున్న నా శరీర పరిధి చెట్లను, దాదాపు ఏభైఎడుగుల దూరంలో ఉన్నవారిని తాకుతున్నట్లు అనిపించింది. దేనినీ విశ్లేషింపలేను. ఇది ఎక్కడికి తీసుకొని వెళ్తుందో, అక్కడికే పోవాలి నేను.

ఉదయం ఎనిమిదైంది. మళ్ళీ ఆ జన సమూహంలో మొదటినుండి ఏడెనిమిది వరుసల వెనుకగా మెల్లగా ఇరుక్కున్నాను. నిన్నటివలె ఆయనకు సమీపాన లేను. అయితేనేం! ఏ విషయమూ పట్టించుకోలేక పోయాను.



మనస్సులేదక్కడ. ఆయన వచ్చి మంచం మీద కూర్చొన్నారు. ఒక బ్రాహ్మణుడు వచ్చి ఏదో సంస్కృత స్తోత్రాన్ని పాడనారంభించాడు. అది ఎప్పటికీ అవ్వదు! అంతసేపూ నాన్నగారు తమ చేతులని మోకాళ్ళ మీద ఆనిచి, దూరంగా ఉన్న అరుణాచలం వైపే నిశ్చలంగా చూస్తూ ఉండిపోయారు. అరుణాచలం పట్ల వారి ఆదరం ఆ చూపులో స్పష్టంగా కనబడింది. అప్రయత్నంగా నా కళ్ళవెంట నీళ్లు కారాయి. ఆయన పట్ల, అరుణాచలం పట్లా, అందరి పట్లా కలిగిన ఆ ప్రేమ నన్ను ముంచి వేసింది.

నా మనస్సు చెప్పలేని, నా హృదయం చెప్పగోరే ఆ ప్రేమని నా దేహం వ్యక్తం చేసింది కన్నీరుగా. ఆ తరువాత కొంత సేపటికి కాబోలు ఆ బ్రాహ్మణుడు అదృశ్యమైనాడు. మళ్ళీ తమ చూపులతో, తమ ప్రేమలో అందరినీ నాన్నగారు ముంచివేశారు. ఆయన వీక్షణం అటూ ఇటూ తిరుగుతూ, అప్పుడప్పుడూ నా వీక్షణాన్ని స్పృశిస్తూ, మళ్ళీ వెళ్ళి పోతోంది, అందులో ఎంతటి కోమలమైన కరుణ! ఎంతటి ప్రేమ! మౌనం గాఢమౌతోంది, నా చైతన్యమంతా ఆయనపైనే కేంద్రీకృతమౌతోంది, నాకు బయట ఎక్కడో గందరగోళంలో ఒక ప్రపంచముంది. కాని దాని ధ్యాసే లేదు నాకు. నాకు తెలిసినదల్లా చెవులలోఘోష, దేహపుమంట, ఆ నేత్రాలు!

ఆ చూపులు నా చూపులను తాకాయి మళ్ళీ, భయానకంగా గగుర్పాటు కలిగేటట్టుగా ఆయన రమ్మని సంజ్ఞ చేసారు. నన్నా, నన్ను పిలుస్తున్నారా, నమ్మ లేకపోయాను, నమ్మటానికి సాహసింపలేకపోయాను. నా వెనకనున్న వారినెవరినో పిలుస్తున్నారేమోనని నేను కదలలేదు. అయినా ఆయన మళ్ళీ సంజ్ఞ చేసారు. మళ్ళీ మరోసారి కూడా. ఒక్క క్షణం పాటు చెప్పలేని భయం, సంతోషం. నా వెనకనున్న భారతీయ స్త్రీలు నన్ను తాకి, ముందుకు పొమ్మన్నారు. గత ఇరవై నాలుగు గంటలలో అట్లా ముందుకు తోసుకెళ్ళటం ఇది రెండవ సారి. చచ్చి పోతాననుకున్నాను. ఈ సారి అజ్ఞాతంగా వెనుక పడిపోవటమంటూ లేదు, బహిర్గతమవటం నుంచి

తప్పించుకోవటము లేదు. ఆ క్షణంలో నాకు కలిగిన భావాలను చెప్పలేను. ఆయన నన్ను గుర్తించినందుకు, నాపై ప్రేమ చూపినందుకు నా ప్రాణాలైనా ఇవ్వగలనని ఒక వంక అనిపిస్తే మరో వంక అక్కడ్నుంచి పారిపోయి ఎక్కడైనా దాక్కుందామనిపించింది.

ఆయన పాదాలను ఆడిస్తున్నారు. ఆయన మంచానికి ప్రక్కన ఒక కాంతిపుంజంలో పడిపోయాను. సూర్యుని కిరణాల వల్ల పైకి చూచినా ఏమీ కనబడలేదు. కానీ నాలో అస్పష్టంగా ఏదో ఇట్లా పలుకుతున్నట్లనిపించింది: "భగవంతుడు నిన్ను తన పాదాల వద్ద కూర్చుని దర్శనం చేసుకోమంటుంటే నువ్వు ఎక్కడో దూరంగా కూర్చోవటానికి ప్రయత్నించావు." ఇటువంటి భావమే నాన్నగారికి కలిగిందేమో. ఆయన కొద్దిగా నవ్వారు. తన కుడివైపుకు రమ్మన్నారు. అసంకల్పితంగా యాంత్రికంగా అటు కదిలాను. తలక్రిందుగా నిలబడు అని ఆయన అన్నా అట్లా చేయటానికే సిద్ధమైనాను.



నా దేశం, నా వృత్తి, నేను భారత దేశానికి ఎన్ని సార్లు వచ్చాను, ఎక్కడుంటున్నాను అంటూ నెమ్మదిగా ప్రశ్నించారు. ప్రశ్నలు వేస్తున్నంత సేపూ ఆయన నా తలని నిమురుతూనే ఉన్నారు, నా నుదిటిని తాకారు. నా చేతిని ఎంతో ఆప్యాయతతో, కోమలత్వంతో నిమిరారు. నేను ఒక్కసారిగా ప్రియుడనో, పిల్లవాడినో, శిష్యుడనో అయిపోయాననిపించింది. అందరూ నన్నే చూస్తున్నారనిపించింది. అక్కడ దాదాపు రెండు వందలమంది ఉన్నా, అక్కడ ఎవ్వరూ లేనట్టే అంతటి సన్నిహిత్యము, ఆయనలో ఉన్న కేంద్రీకృతమైన ప్రేమ, సహజంగా అన్నిటినీ స్వీకరించే లక్షణం నేనెక్కడా చూడలేదు. సహజమైన పురుషత్వంతోబాటు, సంపూర్ణమైన స్త్రీత్వం కూడా ఉంది ఆయనలో. నాలో నాకే తెలియని పరిపూర్ణమైన విశ్వాసాన్ని వారు వెలికి తీశారు. అవిచ్ఛనంగా ప్రవహించే వారి ఎరుకలో వారు నాలోని ప్రతి అణువుతోను సంభాషిస్తున్నారా అనిపించింది. ఆ ప్రేమమయ చూపులు, నా కళ్ళకు కొద్ది అంగుళాల దూరంనుండి తొలిచివేస్తున్నాయి. వర్ణనాతీతమది. నిత్యమది దానిని వర్ణింపబూనటమే

దానిని కలుషితం చేయటం. అటువంటి సౌందర్యాన్ని, అంతటి అంతర్గత ప్రశాంతిని, ఆప్యాయతనీ నేనెప్పుడూ చూడలేదు. కాలగతి తెలియలేదు నాకు. హృదయం నిండి పోగానే కళ్ళు మూసుకునే వాడిని, ఇంకా కావాలి అనిపించినప్పుడు కళ్ళు తెరిచేవాడిని - ఆ చూపు నావంక, నా లోపలికి వెళ్తూనే ఉంది. పరిపూర్ణభావం కలిగింది. నీటి బిందువు సాగరాన్ని చూచినట్టూ, ఆ సాగరం సాదరంగా దానికి స్వాగతం చెప్పినట్టూను, అంతసేపూ



ప్రేమజ్వాల నడుమ నేను, కరిగి పోయే జ్వాలా మధ్య నేను!

ఈ మహనీయుడు శ్రీ రమణుల అనుగ్రహం వల్ల ఆత్మసాక్షాత్కారం పొందారు. రమణ మార్గాన్ని కొన్ని సంవత్సరాలుగా బోధిస్తున్నారు. శ్రీ రమణుని గురూత్తమునిగా కొనియాడారు. నిష్కళంకమైన జ్ఞాని, ఆత్మవిచారమార్గ ప్రబోధకులు. నాలోని అనుమానాలనూ, అన్వేషణలను మాతృప్రేమసదృశమైన కరవాలంతో ఛేదించారు. నా హృదయంలో ప్రేమ జ్వాలను రగిల్చారు. మాటలను, విశ్లేషణలను విసర్జించి నా అంతరాంతాలలో ఉన్న మౌనానికి మార్గం చూపారు. అక్కడ ఏకమైనాము. దానికి మాటలు లేవు, ఎప్పుడూ ఉండజాలవు. అక్కడ ఒక అరగంట సేపు కూర్చున్నాను. ఆయన లేచివెళ్లారు. నేను అక్కడే కూర్చున్నాను లేవలేక, లేచి వెళ్ళటానికి ఇష్టంలేక. నా చూపు అరుణాచలం వైపు కేంద్రీకరించి కూర్చున్నాను. అనుగ్రహస్పర్శ వల్ల నా హృదయంలో అంకిత భావం కలిగింది. అందంగా నిలిచిపోయింది.

ఆ రోజు రాత్రి గణేశన్ గారి ఇంట్లో జరిగిన సత్సంగానికి వెళ్ళాను. చివరకు గణేశన్ నా దగ్గరకు వచ్చి 'ప్రొద్దున మీకు కబురు అందజేయలేకపోయాను మన్నించండి' అన్నారు. అర్థంకాక, తెల్లముఖం వేశాను. 'ఉదయం సత్సంగానికి ఇక్కడికి రావద్దు. నాన్నగారి వద్దకు వెళ్ళండి, అని కబురుపంపుదామనుకున్నాను' అన్నారు. 'ఆ కబురు నాకు అందింది ఎట్లాగో గణేశన్ గారూ ' అని మాత్రం అనగలిగాను.

**ఆ వర్తమానం నాకెట్లా వచ్చింది?**

**గోవిందా అనే భక్తుడు తన గిటార్ వాయిస్తూ శ్రీ నాన్నగారి సమక్షం లో పాడిన పాట:**



Songs to be sung.....never become.....

You, the breathing of my breath

You, the truth of....

The end of the path I dreamt I was

Beyond the words I dreamt

Such a glorious pool of emptiness

Your eyes on fire with tenderness

Never was one so beautiful.....



Child to you my Father,

Tears to my eyes

At the mention of your name, Bhagavan

Silence to my soul

At the mention of your name, Bhagavan

Love has brought me to your feet

Your Grace is all that I have to meet

---. told me to remember you

In everything I ever do.

You said there's no disciple, no guru

Still I lay my head before you.



What can I do? I have no choice,

When I speak it is not my voice.

I am running out of words for This,

Sat chit Ananda, eternal bliss




Tears to my eyes

At the mention of your name, Bhagavan

Silence to my soul

At the mention of your name, Bhagavan





ఇంగ్లాండ్ లో ఒకరు నాకు బెండకాయలు అంటే ఇష్టం అని చెప్పారు. ఎవరు చెప్పారో నాకు అర్థం కాలేదు. లండన్లో బెండకాయలు కేజీ 300 రూపాయలు. మేము రిట్రీట్ లో ఉండగా అలన్ జాకబ్ భార్య నన్ను అడగకుండా నేను ఏమి తింటానో లిస్ట్ రాసుకున్నారు. ఆ 300 రూపాయలు పెట్టి బెండకాయలు తెచ్చారు. ఏవో నేను తినేవే తేచ్చారు పాపం. ఆ దొరలకు వండటం చేతకాలేదు. చివరికి ఎందుకూ పనికి రాకుండా పాడు చేసేశారు. నేను తరువాత జాకబ్ భార్యతో 'మీరు ఇంత డబ్బు పెట్టి బెండకాయలు తెచ్చారు, తినటానికి పనికి రాకుండా పోయాయి. మీకు వండటం చేతకాదు. అనవసరంగా ఎందుకు అవన్నీ?' అని అడిగాను. ఆవిడన్నారు: 'మాకు వండటం చేతకాకపోయినా, మేము వండినది మీ నోటికి అందకపోయినా, కనీసం మీకు ఇష్టమైనది బజారులో కొని తెచ్చాము అనే చిన్న సంతృప్తి అయినా మిగులుతుంది కదా'. వాళ్ళు ఎంత తెలివైన వాళ్ళో చూడండి. మాటకు దొరకటం లేదు.

లండన్ లో మేము ఒకరి ఇంటి దగ్గర ఉన్నాము. ఆయన పేరు చంద్రవదన్. వారి ఇంటి దగ్గర ఒక యూరోపియన్ 'మీరు ధ్యానం చేసేటప్పుడు కళ్ళు మూసుకోరు ఏంటి?' అని తమ సందేహం అడిగారు. నేను ఇంకా సమాధానం ఏమి చెప్పలేదు. ఆశ్చర్యం ఏమిటి అంటే ఈ చంద్రవదన్ అన్నారు: "Because it is natural state". సర్వసాధారణంగా ధ్యానం చేసేటప్పుడు కళ్ళు ముసుకుంటారు. మంచిదే కళ్ళు ముసుకోవచ్చు తెరిచి ఉండవచ్చు. నాకు కళ్ళు మూసుకునే అలవాటు లేదు కాబట్టి మాములుగా అలా కూర్చున్నాను. మీరు ధ్యానం చేసేటప్పుడు కళ్ళు మూసుకోరేమిటి? అని అంటే అది "Natural state" కాబట్టి కళ్ళు ముసుకోవలసిన పనిలేదు అని ఆ ఇంటి యజమాని చంద్రవదన్ అన్నారు.

లండన్ లో రమణ మహర్షి ఫౌండేషన్ సెంటర్ లో 'సత్యం హృదయం లోనే ఉంది; అది మనకు తెలియకపోవచ్చు' అని నేను అన్నాను. మాట్లాడేటప్పుడు ఊరుకున్నారు కానీ మీటింగ్ తరువాత question hour లో ఒకరు ఇలా అడిగారు: 'ఇంతకుముందు మీటింగ్ లో మాట్లాడేటప్పుడు మీరు నిజం హృదయంలోనే ఉంది అన్నారు. నిజం హృదయంలో ఉండి ఇంక ఎక్కడా లేకపోతే అది నిజం ఎలా అవుతుంది?' అంటే వారు చెప్పేది ఏమిటంటే ఇప్పుడు నరసాపురంలో నిజం ఉంది, భీమవరంలో నిజం లేదు అనుకొండి అది నిజం కాదు. గుడిలో దేవుడు ఉన్నాడు, బయట దేవుడు లేడు అనుకోండి ఆ దేవుడు నిజమైన దేవుడు కాదు. మీరు గుడిలోకి వెళ్ళటం లేదని గుడిలో దేవుడికి కోపం వచ్చింది అనుకోండి వాడు దేవుడు కాదు. మీరు నిజం హృదయంలో ఉంది అని చెపుతున్నారు అది హృదయంలో ఉండి ఇంక ఎక్కడా లేదు అనుకోండి అది నిజం ఎలా అవుతుంది? కాలానికి దేశానికి అతీతంగా అన్ని ప్రాంతాల్లో, అన్ని కాలాల్లో ఉన్నది నిజం అవుతుంది కాని హృదయం లో ఉండి ఇంక ఎక్కడా లేకపోతే అది నిజం ఎలా అవుతుంది? అది partial truth' అన్నారు. అప్పుడు నేను చెప్పాను: 'నేను చెప్పింది పాక్షిక సత్యం, నువ్వు చెప్పింది పూర్ణ సత్యం. అయితే కృష్ణుడు 'మీ అందరి హృదయాలలోనూ' ఉన్నాను అని చెప్పాడు. అలా ఎందుకు చెప్పాడు? అంతటా ఉన్న వస్తువు మీ హృదయంలోనే ఉంది అని specific గా ఎందుకు చెప్పాడు భగవంతుడు? నువ్వు ఎక్కడ ఉన్నాను అని అనుకుంటున్నావు? అంతటా ఉన్నాను అని నువ్వు అనుకోవటం లేదు. నువ్వు లోపల ఉన్నాను అని అనుకుంటున్నావు. నీ లోపల ఒక కేంద్రం చూపించటం కోసం హృదయం, హృదయం అని చెప్పాడు.'నువ్వే అంతటా ఉన్నది, అంతటా ఉన్నది నువ్వు; దీనికి, దానికి బేధం లేదు' అన్న సంగతి నీ హృదయంలో తెలుసుకున్నాక తెలుస్తుంది అని మళ్ళీ ఆ దేవుడే చెప్పాడు' అని చెప్పాను. అయితే అతనికి అహంకారము లేదు. అహంకారము ఉన్నవాడికి, సిగ్గు, మోహమాటం ఉన్న వాడికి జ్ఞానం రాదు. వెంటనే ఆయన ఏమన్నారంటే: 'మీరు చెప్పింది చాలా సహజంగా ఉంది. నేను ప్రశ్న ఎటువంటి సత్యాన్వేషణ కోసం వేశానో అటువంటి సహృదయం తోటి, సద్బుద్ధి తోటి మీ సమాధానాన్ని కూడా స్వీకరిస్తున్నాను'.

లండన్ లో రమణ మహర్షి ఫౌండేషన్ లో మాట్లాడుతూ ఉంటే ఒక ఇంజినీర్ అన్నాడు మనకు ఫీలింగ్స్ వస్తూ ఉంటాయి. మనిషి అయ్యాక ఏవో ఫీలింగ్స్ వస్తూ ఉంటాయి కదా! ఈ ఫీలింగ్స్ గురించి చెప్పమన్నారు. అంటే మనస్సు ఎంత నిజమో ఈ ఫీలింగ్స్ కూడా అంతే నిజము. నేను ఏ విషయం గురించి ఆలోచిస్తున్నానో ఆ ఆలోచించే విషయానికి, ఆలోచించే మనసుకి ఉన్న సంబంధం ముఖ్యమైనది. మిమ్మల్ని చూసి నాకు కోపం వచ్చింది అనుకోండి. కోపం ఎవరికి వచ్చింది? నా మనసుకి వచ్చింది. ఎవరి మీద వచ్చింది? నీ మీద వచ్చింది. అంటే మనస్సుకీ నీకూ ఉన్న సంబంధాన్ని బట్టి ఫీలింగ్ వస్తోంది. ఫీలింగ్ అంటే relative truth. ఇవన్నీ పాక్షికమైన సత్యాలే కాని, అసలు సత్యానికి, అసలు దైవానికి, అసలు పూర్ణ స్థితికి, అసలు ఆత్మకి ఈ ఫీలింగ్స్ కి ఎటువంటి సంబంధం లేదు. మీ మీద నాకు కోపం ఉంది అనుకోండి అప్పుడో రకమైన ఫీలింగ్ వస్తుంది. మీరంటే నాకు ఇష్టం అనుకోండి అప్పుడోరకమైన ఫీలింగ్ వస్తుంది. కాని ఇష్టము పూర్ణ సత్యం కాదు, అయిష్టము కూడా పూర్ణ సత్యం కాదు. రాగము, ద్వేషము పూర్ణసత్యాలు కాదు. ఇవి అన్నీ కూడా పాక్షిక సత్యాలే. ఆయన ఇంకో మాట అన్నారు: 'ఈ రమణ మహర్షి ఫౌండేషన్ లో ఇప్పుడు 350 మంది సభ్యులు ఉన్నారు. తరువాత సంవత్సరం మళ్ళీ మీరు లండన్ వచ్చేసరికి 700 మంది అవుతారు'. మీరు అలా ఎందుకు చెప్పగలుగుతున్నారు అని అడిగాను. అంటే ఆయన అన్నారు: 'నేను నెలకు ఒకసారి మీటింగ్ కి వస్తూ ఉంటాను. రమణ మహర్షి భక్తులే వస్తారు. మిగతా వారు ఎవరూ ఇక్కడికి రారు కాని ఈ రోజు మీరు వచ్చారని రమణ మహర్షి భక్తులు కానివారు చాలామంది వచ్చారు. వారందరూ మా ఫౌండషన్ లో చేరుతారు. అందుచేత మీరు Next year వచ్చేసరికి 700 మంది అవుతారు'.

## శ్రీనాన్నగారికి ఆంగ్లేయులు ఇచ్చిన బిరుదులు

ఇంగ్లాండ్లోని భక్తులు నాకు రెండు పేర్లు ఇచ్చారు. ఒకటి 'The Child of Bhagavan'. వారు నన్ను నాన్నగారు అని పిలవలేదు. వారి ఉద్దేశ్యం ఏమిటంటే నేను రాజయమ్మ సంతతని కాదు, భగవాన్ యొక్క సంతతని. మరొక పేరు 'The crowd puller'. London లో ఒక రమణకేంద్రం ఉంది. నేను London వెళ్ళాక ఆ రమణ కేంద్రానికి ఎక్కువమంది రావటం మొదలుపెట్టారు. కనుక వారు నన్ను 'crowd puller' అని పిలిచారు.



గురువులందరూ దళారులే. అంటే వారెప్పుడూ జీవుడిని ఈశ్వరునిలో ఐక్యం చేయడానికి ప్రయత్నిస్తారు. కనుక నేను కూడా దళారినే.

## Janet Attwood చేసిన ఇంటర్వ్యూ లో శ్రీ నాన్నగారి వ్యక్తీకరణ

భగవాన్ శ్రీ రమణ మహర్షి మెసేజ్ వ్యాప్తి చేయడమే నా జీవితలక్ష్యం. ఎంతో మందికి భగవాన్ బోధనలు చేసి వారికి శాంతి, విద్య చేకూరుస్తున్నాను. భక్తి అనే నెపముతో విద్య యొక్క ప్రాముఖ్యత, ఆధ్యాత్మిక జీవితంలో ఎలా ఎదగాలి?  దైనందిన జీవితంలో ఎలా సంతోషంగా ఉండాలి? అనేటివి అవగాహన పరుస్తున్నాము. భగవాన్ బోధలే కాకుండా సామాజిక ప్రవర్తన, నిరహంకార ప్రవర్తన, వివేకవంతమైన ప్రవర్తన కూడా నేర్పుతున్నాము.  ఎంతోమంది భక్తుల జీవితాలను సరిదిద్ది, అద్వైతానుభవం పొందేందుకు సరైన మార్గదిశలో నడుపుతున్నాము.

నా దగ్గరికి భారతదేశపు నలుమూలల నుండే కాకుండా విదేశాల నుండి కూడా ఎంతో మంది వస్తూ ఉంటారు. వారిలో కొంతమంది సత్యాన్వేషకులు మరికొంతమంది అశాంతితో బాధపడేవారు. రోజుకు నా దగ్గరికి ౨౦౦ మంది వస్తారు. వారు భౌతికవాదులా లేక ఆధ్యాత్మిక పిపాసకులా అన్నది వేరే విషయం.  వారు వచ్చి ఎంతో ఆనందంగా, ఆప్యాయంగా, నాకు దగ్గరిగా కూర్చుంటారు. నా వైబ్రేషన్స్ వారిపైన పనిచేస్తాయి. వారు నా దగ్గర 5 - 10 నిమిషాలు కూర్చుంటే ఆటోమేటిక్ గా, సహజంగా శాంతి పొందుతున్నారు. మెల్లిగా ఆత్మసాక్షాత్కారం కలిగే దిశలో పయనిస్తున్నారు. కొంతమంది కేవలం శాంతి లేక మానసిక ఆరోగ్యం గురించి నా దగ్గరకు వస్తున్నారు. నా శాంత మనస్సు, సాత్త్విక ప్రవృత్తి, నా ప్రేమపూరితమైన ప్రవర్తన వారి దైనందిన జీవితంలో శాంతి కలుగచేస్తుంది. సత్యానుభవం కలిగిన వాడి వైబ్రేషన్స్ ఎంతోమందిని ప్రభావితం చేస్తాయి. నా విషయంలో కొన్ని వందలమంది కాదు కొన్ని వేలమంది వారి దైనందిన జీవితంలో శాంతిని పొందుతున్నారు. ఎటువంటి ప్రయత్నం లేకుండా వారికి శాంతి, మానసిక ఆరోగ్యం automatic గా, సహజంగా లభిస్తున్నాయి. వారికి నా సమక్షంలో ఒక గంట ఒక నిమిషం లా గడిచిపోతుంది. నా సమక్షంలో వారు ఎంతో శాంతిని అనుభవిస్తారు. నా సమక్షం విడిచి వెళ్ళాక వారికి ఆ శాంతి యొక్క విలువ తెలిసివస్తుంది. ఆ శాంతిని పొందటానికి వారు ప్రయత్నం చేస్తారు. ఆ శాంతిని తిరిగి పొందటానికి వారు సరియైన ఆలోచన, సరియైన మాట, సరియైన ప్రవర్తన, ధార్మికమైన జీవనం అవలంభించాలి. ఆ శాంతి ద్వారా వారు స్వేచ్ఛను,

సత్యసాక్షాత్కారాన్ని పొందుతారు. ఆ శాంతి యొక్క ప్రాముఖ్యత తెలిసిన తరువాత వారి ఆలోచనలో, ప్రవర్తన లో ఎంతో మార్పు వస్తుంది. వారు సమాజానికి ఉపయోగపడే పనులు, నిష్కామ కర్మలు చేస్తారు. నా దగ్గర థియరీ నేర్చుకుంటారు; తర్వాత ఆ థియరీ ని ఆచరణ లో పెడుతారు. ఇది వారిని పర్ఫెక్ట్ చేస్తుంది. ఆఖరికి వారు వారి గమ్యమైన శాంతియుతమైన జీవితాన్ని పొందుతారు.

నాకు కష్ట జీవులంటే చాలా ఇష్టం. మనం వర్క్ కల్చర్ ని గౌరవించాలి. నిష్కామ కర్మ వల్లనే మనం భౌతిక మరియు ఆధ్యాత్మిక అభివృద్ధి పొందుతాము. నిష్కామ కర్మ కేవలం ఒక మనిషికే కాదు మొత్తం మానవాళికి సహకరిస్తుంది. ప్రాక్టీకాలిటీ అన్నది చాలా ముఖ్యం. మనం గ్రౌండ్ రియాలిటీస్ (వాస్తవాలు) నుండి పారిపోలేము. ఉన్నతమైన ఆలోచనలను ప్రాక్టీకాలిటీ దిశలో మలుచుకోవాలి. టీచింగ్ అనేది చాలా ముఖ్యమైనది. ఎంతో పెద్ద పెద్ద ఆధ్యాత్మిక సంస్థలు కూడా సోషల్ వర్క్ కి ఇచ్చే ప్రాముఖ్యత టీచింగ్ కి ఇవ్వటంలేదు. ఒక ఆత్మసాక్షాత్కారం పొందిన వారి టీచింగ్స్ అర్ధంచేసుకుంటే, మీరు ప్రపంచంలో అద్భుతమైన పరిణామాలు తీసుకురాగలరు. భగవంతుని చేతిలో పనిముట్టువుగా మారి ఆయన పని చేస్తూ చివరికి ఆయనలో ఐక్యం అవుతారు.

## శ్రీ నాన్నగారిని సుందరంగారు చేసిన ఇంటర్వ్యూ వివరాలు

ప్ర: మీకు ప్రత్యక్ష గురువు లేరు కదా?

నాన్నగారు: ప్రత్యక్ష గురువు అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి? మాకు అసలు ఎప్పుడూ ఈ ప్రశ్న ఉదయించలేదు. భగవాన్ కి అతి సన్నిహితంగా ఉండి 10 సంవత్సరాలకి పైగా భగవాన్ని సేవించిన వారికన్నా మాకు భగవాన్ గురించి ఇంకా బాగా తెలుసు. భగవాన్ వద్ద 20-30 సంవత్సరాలు నివసించిన వారికన్నా భగవాన్ హృదయానికి మేము అత్యంత సమీపంగా ఉన్నాము. మీరు అడిగిన ప్రశ్న మాకెప్పుడూ ఉదయించలేదు. భగవాన్ సశరీరులు అయ్యి ఉండటం - లేకపోవటం అనే బేధం మాకెప్పుడూ కలుగలేదు. అసలు వేరొక గురువు దగ్గరికి వెళ్ళాలి అన్న తలంపు కూడా ఉదయించలేదు. ఎవరైనా 'రమణ మహర్షి జ్ఞాని కాదు' అని విమర్శించినా మాకు

ఎటువంటి గాయం కలుగదు, మా భక్తి చెదరదు. నాకు ఇతరుల అభిప్రాయాలతో సంబంధం లేదు. నాకు భగవాన్ వద్ద లభించే ప్రత్యక్షానుభవమే ముఖ్యం. భగవాన్ యొక్క అనుగ్రహస్పర్శ నా హృదయానికి తాకుతుంది.

ప్ర: మీ వద్దకు చాలామంది వస్తారేమో కదా?

నాన్నగారు: మా ఇంటికి రోజు సుమారుగా ౨౦౦ మంది వస్తారు. అందరూ కూడా కేవలం జ్ఞానం కోసం రారు. కానీ వారి దుఃఖాన్ని మేము పంచుకుంటాము అన్న అవగాహన వారికి ఉంది.

ప్ర: మీరు వారిని ఎలా పరామర్శిస్తారు?

నాన్నగారు: అది మనస్సుకి అందని విషయం. దానిని మాటలలో చెప్పలేము.

ప్ర: అంతా మీ చూపులోనే ఉంది అనిపిస్తుంది.

నాన్నగారు: ఈ మధ్య గణపవరం నుంచి ఒక భక్తురాలు వచ్చింది. ఆమె భర్త ఆక్సిడెంట్ లో పోయారు. ఆమె తన సమస్యను అందరిలో చెప్పుకోలేరని ఆమెతో ఏకాంతంలో మాట్లాడాము. తన భర్త మరణానికి ఆవిడ కారణం అడిగింది. 'అది తెలుసుకుంటే మీ దుఃఖం తగ్గుతుందా?' అని మేము అడిగాము. కావలసి ఉంటే ఆవిడ అడిగే కారణాలు మేము చెప్పవచ్చు. కానీ దానివలన ఆవిడ దుఃఖం తగ్గడం అంటూ జరుగదు. మీరడిగే ప్రశ్నకి మేము మాటలలో సమాధానం చెప్పలేము. ఆధ్యాత్మిక అభివృద్ధి కోరే వారు కపటరహితులై ఉండాలి. నా ఆధ్యాత్మిక జీవితంలో నేను తెలుసుకున్నది ఏమిటంటే సత్యాన్వేషకులు కపటరహితులై ఉండాలి. వారు కపటాన్ని అధిగమించాలి. అది వారి ఆధ్యాత్మిక పురోవృద్ధికి ఆటంకం. అటువంటి వారు ఎంత సాధన చేసినా, ఎంతటి ధర్మకార్యాలు చేసినా ఫలించదు. ఆదాయం 16000 పెట్టుకుని సిగరెట్లు మీద 18000 ఖర్చుపెడతానంటే దానికి ఏమైనా అర్థం ఉందా? అలాగే ఎంతటి సాధన చేసినా కపటాన్ని అధిగమించలేకపోతే ఆధ్యాత్మిక అభివృద్ధి పొందలేరు.

ప్ర: మిమ్మల్ని ఎంతోమంది సందర్శిస్తారు కదా. రకరకాల మనుష్యులు వస్తారా?

నాన్నగారు: రకరకాల మనుష్యులు మా దగ్గరికి వస్తారు. కొంతమంది ఉపాధి కోసం వస్తే మరికొంత మంది ఆరోగ్యం గురించి వస్తారు. కొంతమంది దానం ఆశించి వస్తే మరికొంతమంది పేరు ప్రతిష్టల కోసం వస్తారు. కొంతమంది రాజకీయనాయకులు అయితే మరికొంతమంది పారిశ్రామికవేత్తలు అయిఉంటారు. ఎవరు దేనికోసం వస్తున్నారో మాకు బాగా తెలుసు. మేము ప్రతీది హృదయంలోకి తీసుకోము. ఎవరితో ఎలా మెసలాలో మాకు బాగా తెలుసు.

ప్ర: మీ హృదయానికి దగ్గర అయ్యారు అంటే వారికి ఆధ్యాత్మిక కాంక్ష ఉందని అర్థమా?

నాన్నగారు: వారి స్వచ్ఛమైన హృదయం మరియు ఆధ్యాత్మిక కాంక్ష వారిని నా దగ్గరికి తీసుకు వస్తుంది.

ప్ర: అటువంటి వారికి ఆధ్యాత్మిక జీవితంలోనే కాకుండా భౌతిక జీవితం లో కూడా మీరు సహకరిస్తారా?

నాన్నగారు: ఖచ్చితంగా. అది చేయాలని లేదు కాని ఖచ్చితంగా చేస్తాము.

ప్ర: మీకు ఏమైనా సిద్ధులు లభించాయా?

నాన్నగారు: సిద్ధుల గురించి మాకు ఎప్పుడూ ఆలోచన కలగలేదు. కొంతమంది భక్తులు ఎంతో ఆదరపూర్వకంగా బాబా గారి పుస్తకాలు మాకు తెచ్చి ఇస్తారు. మేము సిద్ధులకు సంబంధించిన పేజెస్ వదిలేసి మిగితావి చదువుతాము. సాధారణంగా ఏ పుస్తకంలోనైనా అవసరమైనవి చదివి అనవసరమైనవి వదిలేస్తాము. విమర్శలు అనవసరం. అది మా పాలసీ. ఈ మధ్య కొంతమంది ముస్లిమ్స్ మా వద్దకు వచ్చారు. మా ప్రవచనాలు విన్న తరువాత వారికి ఖురాన్ బాగా అర్థం అవుతుందని అంటున్నారు.

ప్ర: భగవాన్ బోధనలు మరియు మీ బోధనలు ఏ మతము మీద ఆధారపడి లేవుకదా? ఎవ్వరైనా అర్థం చేసుకుని ఆచరించవచ్చు కదా?

నాన్నగారు: మీరు చెప్పింది 100 % కరెక్ట్. మేము మతం యొక్క అవలక్షణాల్లోకి వెళ్ళం.

ప్ర: మౌంటెన్ పాత్ అనే పుస్తకంలో ఒక విదేశీయుడు వ్రాసాడు: 'నేను అనుకోకుండా భగవాన్ని కలుసుకున్నాను. భగవాన్ బోధనలు ఆచరిస్తూ వందలాది మంది ఆత్మసాక్షాత్కారం పొందారు'. ఇది చదివి మాకు చాలా ఆశ్చర్యం వేసింది.

నాన్నగారు: అట్టిది భగవాన్ బోధనల ప్రత్యేకత. భగవాన్ మార్గం బాగా అర్థం అయినవారు ఎటువంటి బాధ లేకుండా సత్యసాక్షాత్కారం పొందుతారు. ఒక మంచి విషయాన్ని వివరించేందుకు ఎన్నో పేజెస్ వ్రాస్తారు. కానీ భగవాన్ లేక రామకృష్ణులు అలా కాదు. వారు ట్రుథ్ ని డైరెక్ట్ గా తెలియపరచడానికి ప్రయత్నించడం మన అదృష్టం.



ప్ర: ఈ తరం వారికి భాషాప్రావీణ్యత లేక పురాణాలు గాని ఉపనిషత్తులు గాని చదివే టైం ఉండదని భగవాన్ కి రామకృష్ణులకు బాగా తెలుసేమో. అందుకే భగవాన్ జ్ఞానమార్గాన్ని మరియు రామకృష్ణులు భక్తి మార్గాన్ని మనకు ప్రసాదించారు అనిపిస్తుంది. అంతేకదా?

నాన్నగారు: 'మా ఇంటికి వైష్ణవులు కూడా వస్తారు' అనే మాట చెప్పడం సరిపోతుందేమో. మేము వారిని కూడా గౌరవిస్తాము. కానీ మాకు ఈ మార్గం అనుకూలంగా ఉంది. ఇది చాలా సరళమైన, సాధారణమైన మార్గమే కాదు వడ్డించిన విస్తరి లాంటిది.

ప్ర: ఈ మార్గంలోకి రావటం అంతతేలిక కాదేమో అనిపిస్తుంది. మేము గతజన్మల్లోనే కావాల్సిన వంటకాలు కొనేసుకొని ఉంటాము. అందుకు ఇప్పుడు ఇది 'వడ్డించిన విస్తరి' లా కనిపిస్తుంది. ఈ సబ్జెక్టును మించి తరువాత ఏమీ ఉండదేమో. మీరేమంటారు?

నాన్నగారు: సబ్జెక్టు చెప్పేటప్పుడు మేము రామాయణాన్ని మహాభారతాన్ని కూడా ప్రస్తావిస్తాం. అది శ్రోతలకు కొంత diversion కలుగచేయడానికి చేస్తాం. పెరుగన్నానికి మనం పచ్చడి నంచుకు వేసుకున్నట్లు ఈ గాథలు సబ్జెక్టు ని సపోర్ట్ చేస్తాయి.

ప్ర: భగవాన్ బోధనలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. ఎవరికైతే ఈ బోధనలు అర్థం చేసుకొనే శక్తి లేదో, సాధన చేసి తరించే శక్తి లేదో అట్టి అతి సామాన్య ప్రజలకు ఈ బోధనలు అర్థం అయ్యేలాగ చెప్పగలగడం మీ అవతార ప్రయోజనం. అలా చెప్పడం అనేది సామాన్యమైన విషయం కాదు. అయినా మీరు నిర్విరామంగా ఈ పని చేస్తున్నారు. ఊరికే ప్రబోధించడం కంటే సత్యానుభవం కలిగాక ప్రబోధించడం వేరు అనిపిస్తుంది. మీరేమంటారు?

నాన్నగారు: అవును. ఊరికే ప్రబోధించడం వేరు. సత్యానుభవం కలిగాక ప్రబోధించడం వేరు.

ప్ర: మీరు కారణ జన్ములు. ఏదో కారణ నిమిత్తం మీరు జన్మించారు. భగవాన్ కూడా అంతే. ఏ కారణ నిమిత్తం దేహం ధరించారో అది నెరవేర్చారు. మీరూ అంతే కదా?



నాన్నగారు: ఈ విషయంలో మాకు ఎటువంటి చపలత్వం లేదు. భగవాన్ పట్ల భక్తి విషయంలో కూడా మాకు ఎటువంటి చెపలత్వం లేదు. మా భక్తి శనివారం ఒకలాగా ఆదివారం ఒకలాగా ఉండదు. భగవాన్ని ప్రత్యక్షంగా చూడలేదు అన్న బాధ మాకు ఎప్పుడూ కలుగలేదు.

ప్ర: 'మేము భగవాన్ని చూసాము' అని కనకమ్మ గారు అన్నారు. కానీ భగవాన్ని చూడకుండానే, ఆయన కృపావీక్షణాలు అనుభవించకుండానే మీరంతా అద్వైత సుఖాన్ని అనుభవిస్తున్నారు. మీరంతా చాలా గొప్ప భక్తులు అనిపిస్తుంది.

నాన్నగారు: మాకు భగవాన్ యొక్క అంతర్గత మార్గదర్శకత్వం ఎప్పుడూ ఉంది. ఒక చేయి ఇంకో చేతిని స్పర్శిస్తే ఎంత స్పష్టంగా ఉంటుందో మాకూ ఈ మార్గదర్శకత్వం అంత స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. ఎవరైనా ఒక అరగంట మాట్లాడినప్పుడు మనం జాగ్రత్తగా పరిశీలిస్తే వారు ఊరికే వాగుతున్నారా లేక ట్రుథ్ యొక్క గ్లింప్సెస్ కలిగివుండి మాట్లాడుతున్నారా అనేది మనకు అర్థం అవుతూ ఉంటుంది. ఈ ప్రపంచంలో రకరకాల మనుష్యులు

ఉన్నారు. కానీ మాకు సత్వగుణం అత్యంత ప్రధానమైనది. రకరకాల మనుష్యులు లేకపోతే అది లోకం ఎలా అవుతుంది? లోకం ఉండటం వల్లనే మనకు ఎంత సత్త్వగుణం ఉందో తెలుస్తూ ఉంటుంది. ఇది చాలా ముఖ్యం. ఈ లోకంలో ఉన్నవారంతా మనకు గురువులు ఎందుకంటే వారు మన సత్త్వగుణ బలాన్ని పెంచుతున్నారు.

ప్ర: మీ సహాయం అర్థించి మీ ఇంటికి వచ్చే భక్తులకు మీరు సలహాలు ఇస్తారా?

నాన్నగారు: భక్తులు వారి లౌకిక సమస్యలను వివరించినప్పుడు మేము వాటిని ఎంతో సహనంగా వింటాము. అలా సహనంగా వినటంలోనే కొంతవరకు వారి సమస్యలు పరిష్కారం అవుతాయి. మాకు పరిష్కారం తెలిస్తే వారికి చెబుతాం. తెలియకపోతే మౌనం వహిస్తాము. వారి పరిస్థితి అర్థం అయ్యాక వారు సహనాన్ని కోల్పోకుండా సలహా చెబుతాం. ఈ పద్ధతి వేలాదిమందికి సహకరిస్తుంది. మేము వినినంత మాత్రాన్నే వాళ్లకు ఊరట కలుగచేస్తుంది. వారి లౌకిక సమస్యలను వినటంలో మాకు ఎటువంటి అసౌకర్యం కలుగదు. మాకు పరిష్కారం తెలిస్తే చెబుతాం; తెలియక పోతే పరిష్కారం చేయగలిగే బంధువుల వైపుకు వారిని మరలిస్తాం.



ప్ర: మీరు ఎన్నో గ్రామాలు పర్యటిస్తున్నారు. వందలాది మంది బాధలను వింటున్నారు. గంటల తరబడి ప్రవచనాలు చేస్తున్నారు. మీరు అలసిపోవడం లేదా?

నాన్నగారు: బాడీ టైర్ అయినప్పుడు మాకు ఒక గంట రెస్ట్ సరిపోతుంది. ఎంతోమంది శాంతిని కోరుతూ మా దగ్గరికి వస్తున్నారు ఎందుకంటే శాంతి అనేది మార్కెట్లో దొరకదు కదా. మా దగ్గరికి వచ్చే ముస్లిమ్స్ 'మీ ప్రవచనాలు విన్న తర్వాత మాకు Quran ఇంకా బాగా అర్థం అవుతుంది' అని అంటున్నారు. 'మీరు ఎలా ఉన్నారు?' అని మేము ఒకసారి వారిని అడిగాం. వారన్నారు: 'మీరు ఉండగా మేము బాగుండక పోవడమేమిటి?' 'మేము హైదరాబాద్ వెళుతున్నాం' అని చెబితే, వారు ఎంతో ఆప్యాయంగా 'అక్కడ ఎక్కువ

రోజులు ఉండకండి' అని ప్రాధేయ పడ్డారు. 'మాకు మసీదులు ఉన్నాయి. ఆ మసీదుల్లో Quran ప్రబోధించే ప్రవక్తలు ఉన్నారు. కానీ వారికే Quran సరిగ్గా తెలియదు. మీ ప్రవచనాలు విన్న తరువాత మాకు Quran ఇంకా బాగా అర్థం అవుతుంది' అని అన్నారు.



మేము ఎప్పుడూ కూడా దైనందిన జీవితంలోని వాస్తవాలకు (గ్రౌండ్ రియాలిటీస్) దూరంగా ఉండము. మేము ప్రబోధించేది అదొక ఎడ్యుకేషన్ (చదువు). ఎవరైనా వారి సమస్యలు చెప్పినప్పుడు మేము ఎంతో శ్రద్ధగా వింటాము. అది కూడా సాధనలో ఒక భాగమే. కొన్నిసార్లు వారు ఎంతో ఉద్రిక్తంగా ఉంటారు. అప్పుడు వారి అహంకారాన్ని గాయపరచకుండా వారి ఉద్రిక్తతను అదుపుచేసుకోమని ప్రశాంతంగా సలహా చెబుతాము. వారి నెగటివ్ థింకింగ్ చూసి వారిని జాగ్రత్తగా సరిదిద్దటానికి ప్రయత్నిస్తాము. అప్పుడప్పుడు వారి మనస్సుకు గాయం తగిలితే ఒక ఓదార్పు సరిపోతుంది. అటువంటి వారితో మాట్లాడేటప్పుడు వారి మనస్సుకు గాయం తగలకుండా మాట్లాడాలి. అది సత్త్వగుణం ఉన్నప్పుడే సాధ్యం. వారి మనస్సుకు గాయం కలగకుండా మాట్లాడితేనే వారు మన మాటలను గౌరవిస్తారు. అందుకే సత్త్వగుణం చాలా ప్రధానమైనది. ఈ ప్రపంచంలో రకరకాల మనుష్యులు ఉన్నారు. కొందరు వారు సంతోషంగా ఉండరు, ఇతరులను సంతోషంగా ఉండనివ్వరు. వారు సంతోషంగా ఉండక పోయినా పర్వాలేదు. అక్కడే వదిలేయరు. ఇతరులను కూడా సంతోషంగా ఉండనివ్వరు. ఈ ప్రపంచమంతా అటువంటి వారి మిశ్రితమే. కపటరాహిత్యం అనేది చాలా ముఖ్యమైనది. చిల్లు ఉన్న కుండను ఎప్పటికైనా నీటి తో నింపలేము. అలాగే కపటం కలిగివుండి సాధన చేసేవారు ఎప్పటికీ రాణించలేరు.

శ్రీ నాన్నగారు ఒకసారి ప్రసంగిస్తూ ఇలా అన్నారు: 'దేహాభిమానం ఉన్న ప్రతీ వాడు స్త్రీయే. పురుషోత్తముని తెలుసుకోవడమే మన లక్ష్యం. అదే మన destination'. అప్పడే ఒక light వెలగడం జరిగింది. అది చూసి నాన్నగారు అన్నారు: 'అదిగో light కూడా వచ్చింది. చూడండి ఎలా వచ్చిందో'.

## శ్రీ నాన్నగారికి టీచింగ్ ఆపేయాలని ఉన్నా ఆపలేకపోవడం

మీ శరీరం ద్వారా ఏ పనైతే జరగవలసి ఉందో అది 'వద్దు వద్దు ఈ పని విడిచిపెట్టాలి' అని మీరు అనుకున్నా లాభం లేదు. ఈశ్వరుడు మొట్టికాయలు వేసి ఆ పని చేయిస్తాడు. (పనిని) పట్టుకోవడం మీ ఇష్టం కాదు, విడిచిపెట్టడం మీ ఇష్టం కాదు. ఇప్పుడు ఇదే ఉదాహరణ. మాకేమీ చెప్పకూడదు అనిపిస్తుంది. ఎక్కడో అక్కడ మౌనంగా కూర్చొని కాలక్షేపం చేస్తే సరిపోతుంది అనిపిస్తుంది. మాకు నూటికి నూరుపాళ్ళు teaching ఆపేయాలని ఉంది కాని teaching పెరిగిపోతుంది. మేము హృదయపూర్వకంగా చెప్పాలని చెప్పటంలేదు. కాని



పరిస్థితులు అలా వస్తున్నాయని చెప్పాల్సివస్తుంది. నాన్నగారు బాగా చెబుతున్నారు అని మీరు అనుకోవచ్చు కాని ఏదో చెబుతున్నాం. నూటికి నూరుపాళ్లు నేను ఇష్టంగా చెప్పడంలేదు. తంతు గడవటానికోసం ఏదో కాలక్షేపానికి చెబుతున్నాం. భగవద్గీతలో కృష్ణుడు ఏమి చెప్పాడంటే: 'నీ దేహప్రారబ్ధం లో ఏదైనా పని ఉంటే అది చేయక తప్పదు అర్జునా. ఆ పని అయిష్టంగా చేసేబదులు ఇష్టంగా చేయవయ్యా. అది యోగం. ఏదో duty చేస్తున్నారు-ఇంటికాడో బయటో duty చేస్తున్నారు. అది అయిష్టంగా చేయకూడదు. ఇష్టంగా చేయాలి, శ్రద్ధగా చేయాలి. ఇప్పుడు మా పనేమిటి అంటే కృష్ణుడు చెప్పినట్టు లేదు. ఇష్టంగా చేయటంలేదు. చేస్తున్నాం అంటే చేస్తున్నాం. అది అయిష్టంగా చేయడం మానేయ మంటున్నాడు కృష్ణుడు. చేసే పని మీద liking ఉండాలి. ఇష్టంగా చేయడం వలన లాభమేమిటంటే పాత వాసనలు పోతాయి కొత్త వాసనలు రావు అన్నాడు కృష్ణుడు. పాత అప్పులు అన్నీ ఊడిపోతాయి, కొత్త అప్పులు చేయనక్కర్లేదు. నువ్వు అయిష్టంగా చేస్తే పాతఅప్పులు ఉండిపోతాయి, కొత్త అప్పులు వచ్చి మీద పడతాయి. అందుచేత చేసే పని అయిష్టంగా చేయకు. ఇష్టంగా చేయి. ఇష్టంగా చేస్తే లోపల పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలన్నీ పోతాయి. కొత్త వాసనలు రావు. వాసనా శూన్య స్థితి వస్తుంది. అప్పుడు వర్షాకాలంలో తళుక్కున ఆకాశంలో మెరుపు మెరిసినట్లు, నీ లోపల వస్తువు నీకు వ్యక్తమౌతుంది.

## శ్రీ నాన్నగారి ఇల్లు ఒక హాస్పిటల్ లాంటిదే

చితి-చింత: వల్లకాటులోనిది చితి. మనస్సులో ఉన్నది చింత. చింత కంటే చితే మెరుగు అన్నారు. చితి శవాన్ని రెండు మూడు గంటల్లో కాల్చేస్తుంది. చింత అలాకాదు. జీవితం పొడుగునా మనస్సును కాలుస్తుంది. చితే మెరుగు ఈ చింత కన్నా. చింత అంటే లోపల ఉన్న బెంగ. ఏదో ఒకటి బెంగలు పెట్టుకుంటారు, ఏదో ఒకటి లోపల కల్పించుకుంటారు. జీవితం పొడుగునా ఏడుస్తూనే ఉంటారు. ఈ చింత ఉంది చూసారు ఇది జీవితం పొడుగునా కాలుస్తుంది. మీ ఇష్ట దేవతను, దేవతా పురుషులను, మహా జ్ఞానిని, మహా గురువును ఆశ్రయించి ఆ చింతను తొలగించుకోండని పెద్దలు చెబుతున్నారు. ఆ చింత డాక్టర్ల దగ్గరికి వెళితే పోదు. శారీరక రోగాలు ఉన్నవారు డాక్టర్ల దగ్గరికి ఎలా వెళతారో అలా మనస్సులో బెంగ పెట్టుకున్నవారు మా దగ్గరికి వస్తారు. నూటికి నూరుమంది కాకపోయినా ఎంతో కొంతమందిని cure చేస్తాం. మాదీ ఒక hospital లాంటిదే ( పది పదిహేను రోజులుండే శారీరిక రోగాలకు కాదు, జీవితాంతం పీడించే మానసిక రోగాలకు).

## శ్రీ నాన్నగారి జీవితంలోని ఒక హాస్య సన్నివేశం

ఒకసారి నేను బాగా ముసలి దంపతుల షష్ఠిపూర్తి ఉత్సవానికి వెళ్ళాను. అక్కడికి ఎంతోమంది పండితులు, కవులు వచ్చారు. వారిలో ఒకరు ఆ ముసలి దంపతులను సీతా రాముల తో పోలుస్తూ ఒక పద్యం చదివారు. అప్పుడు నా పక్కనే ఉన్న ఒకతను అన్నాడు: ‘ ఆ భార్యా భర్తలు ఇద్దరూ గత ౨౦ సంవత్సరాలుగా మాట్లాడుకోవడం లేదు. వారిని సీతా రాముల తో పోల్చడం ఎంతవరకు భావ్యం ?’ అంటే నేనన్నాను:‘కవుల తీరు ఇలాగే ఉంటుంది. మీరు ఇప్పుడు నోరు మూసుకోకపోతే ఈ function కు భంగం కలుగుతుంది’.



## శ్రీ నాన్న నామధేయం వచ్చిన కారణం

ఒకసారి ఒక professor నన్ను అడిగారు: 'మిమ్మల్ని నాన్నగారు అని ఎందుకు పిలుస్తారు?' నేను అన్నాను: 'నాలో ఎటువంటి ప్రత్యేకత లేదని నాకు తెలుసు. అందుకే అందరూ నన్ను నాన్నగారు అని పిలుస్తారు. నాలో ఏదైనా ప్రత్యేకత ఉందని నాకు అనిపిస్తే నేను నాన్నగారిని ఎలా అవుతాను?" ఇది విన్న professor 'అద్భుతం' అని అన్నారు.

## శ్రీ నాన్నగారు కుల మతాలకు అతీతులు

ఒక మాదిగ పిల్లాడు చనిపోగా ఆ శవాన్ని ఎత్తడానికి ఎవరూ ముందుకు రాలేదట. అప్పుడు ఆ అబ్బాయి తండ్రి నాన్నగారి దగ్గరకు వచ్చి 'శవాన్ని మోయటానికి ఎవరూ లేరు' అని నాన్నగారితో చెపితే నాన్నగారు వెంటనే ఆ చనిపోయిన పిల్లాడి దగ్గరికి తీసుకువెళ్ళమన్నారట. అక్కడికి వెళ్ళాక నాన్నగారు అన్నారట: 'వాడిని నా వీపుమీద వేయండి. నేను ఒక్కడినే వాడిని స్మశానానికి మోసుకు తీసుకెళ్తాను' అంటే అప్పుడు ఆ చుట్టుప్రక్కలవారు అది చూసి ఆ శవాన్ని మోయటానికి ముందుకొచ్చారట.

రమణాశ్రమంలో భోజనం పెట్టేటప్పుడు brahmins కి, non brahmins కి వేరు వేరుగా పెట్టేవారు. భగవాన్ non brahmins తో కలిసి తినేవారు. మొరార్జీ దేసాయ్ ని ఒకరు ప్రశ్న అడిగారు: 'brahmins, non brahmins వేరు అనే బుద్ధి ఉంటే భగవాన్ జ్ఞాని ఎలా అవుతాడు?' అంటే మొరార్జీ దేసాయ్ అన్నారు: భగవాన్ కి ఆ బేధభావం లేదు. ఆయన పక్కన ఉన్న వారికి ఈ బేధభావం ఉంది. మేము బ్రాహ్మలం అని వారు అనుకుంటూంటే వారి బ్రాహ్మణ బుద్ధిని బలవంతంగా పోగొట్టాలిసిన అవసరం భగవాన్ కి ఏముంది?' 'ఈ మొరార్జీ దేసై సమాధానం వల్ల నాకు సంతోషం వస్తుందేంటి?' అని అన్నారు నాన్నగారు.





ఒక ముస్లిం భక్తురాలు తరచుగా నాన్నగారి దగ్గరికి వెళ్ళటం చూసి ఆవిడ బంధువులు అన్నారట: ' నాన్నగారు నిన్ను హిందువుగా మార్చేస్తారేమో జాగ్రత్త' అంటే ఆ భక్తురాలు సమాధానమిస్తూ అన్నారట: 'మీరు ముందు వచ్చి నాన్నగారి ప్రసంగం వినండి. నాన్నగారి ప్రసంగం వింటే మనకు అల్లాహ్ మీద భక్తి పెరుగుతుంది. ఒక్కనాడు కూడా నాన్నగారు మీ మతం మార్చుకోండి అని చెప్పలేదు. నమాజ్ చేయడం మానకు, ఖురాన్ చదవడం మానకు అని చెబుతారు నాన్నగారు'. ఈ విషయం ఆ ముస్లిం భక్తురాలు నాన్నగారికి చెబితే 'నేను ఒక్కడినే కాదమ్మా. హిందూ మతంలో ఎవరికీ కూడా ఇతర మతస్తులను తమ మతంలోకి మార్చుకోవాలని ఉండదు. మతమార్పిడి అన్నది హిందూ మతం రక్తంలోనే లేదు. అట్టిది హిందూ మతం యొక్క వైభవం' అని నాన్నగారు అన్నారట.

నాన్నగారు ఏసు క్రీస్తు గురించి చెప్పిన మాటలు విని ఒక క్రైస్తవ భక్తుడు ఇలా అన్నాడట: 'మేము ఏసుక్రీస్తు గురించి ఎన్నడూ వినని మాటలు మీ దగ్గర వింటున్నామేమిటి?'


మామూలుగా ఖతార్ దేశం లో ఎవరూ కూడా తమ ఇళ్లల్లో కానీ షాప్స్ లో కానీ ఫొటోస్ పెట్టుకోరు. కానీ నాన్నగారు ఖతార్ దేశం వెళ్లొచ్చాక ఒక భక్తురాలు తన షాప్ లో నాన్నగారి పటం పెట్టుకోవడం మొదలు పెట్టారు. ఆమె నాన్నగారితో అన్నారు: ' షాప్ లో సేల్స్ ఎక్కువ అయిపోయాయి నాన్నగారు. పటం చూడటానికి చాలామంది వస్తున్నారు. ఏంటి ఆ కళ్ళు అంత ప్రశాంతంగా ఉన్నాయి? ఎవరు ఈయన? ఆ కళ్ళు మాకెంతో శాంతిని కలుగ చేస్తున్నాయి. మేము కూడా సలాం చేసుకోవచ్చా? అని అడుగుతున్నారు. 'ఆయన మా గురువుగారు. వారానికి ఒకసారి ఆయన దగ్గరకు వెళ్లేవారము. ఇప్పుడు రోజూ చూసుకోవచ్చని ఈ పటం పెట్టుకున్నాము' అని వారికి జవాబు చెప్పాము'.

# గుప్త దానాలను ఇష్టపడేవారు శ్రీ నాన్నగారు

బుద్ధుడు calm in face, calm in thought and calm in action. Silent గా మాట్లాడుతాడు, Silent గా ఆలోచిస్తాడు. Emotion కి గురి అవ్వడు. పని కూడా రెండో కంటివాడికి తెలియకుండా quiet గా cool గా చేస్తాడు. Advertisement లేదు. ఈ మధ్య మేము తయారయ్యాము. ఒక కవర్లో 500 rs పెడతాము. ఆ పుచ్చుకునేవాడిని రమ్మనడం ఫోటోలు తీయించుకోవడం. ఆ cover లో డబ్బు ఎంతుంటుంది అంటే 500 రూపాయలు. మేము వాడిని stage మీదకు రమ్మంటాము. మేము ఇస్తాము, వాడు పుచ్చుకుంటాడు; మాకు ఫోటోలు. అది పేపర్లో news. ఎక్కడ బుద్ధుడు, ఎక్కడ మనం? పైగా 500 rs అని ఎవ్వరికీ తెలియకుండా cover లో పెట్టడం. దేనికిది? ఇదంతా publicity కా లేక వారు బాగుపడటానికా? ఇటువంటి డబ్బు పుచ్చుకుంటే వారు అసలు సుఖపడతారా? అసలు మన డబ్బు వారిని సుఖ పెట్టాలి కదా? అక్కడ photographer మన గురువు. ఇలా నుంచోవాలి, అలా నుంచోవాలి అని మనకు చెబుతాడు. వాడు మాకు గురువు. వాడు చెప్పినట్టు వినకపోతే photo తీయడు. ఆ photo తీయకపోతే పేరు paper లో పడదు!

'మీరు ఫలానా వారికి సహాయం చేసారట కదా' అని నాన్నగారు ఒకరిని అడిగితే వారన్నారట: 'లేదండి. మీకు ఎవరు చెప్పారు? నేనేమి చేయలేదే. మీకేదో wrong information వచ్చింది'. దానికి నాన్నగారు అన్నారట: 'అదేంటండి చేయని పనులు కూడా మేము చేసాము అని చెప్పుకునే రోజులివి. మీరు చేసిన మంచి పనిని కూడా ఎందుకు ఒప్పుకోరు? మీ అంతట మీరు చెప్పటం లేదు కదా. నేను అడిగితేనే కదా మీరు చెప్పేది' అంటే ఆయన అన్నారట: 'మేము ఊరులు ఏలాల, ఉద్యోగాలు చేయాలా లేక votes సంపాదించాలా? దేనికండి? చెప్పుకోవాల్సిన అవసరం ఏముంది? మీతో చెప్పాల్సిన అవసరం ఏమిటి మాకు?' ఇది చెబుతూ నాన్నగారు అన్నారు: 'వారికా లేక మనకా మోక్షం? ఇప్పుడు ఈ కలియుగంలో కూడా అటువంటి వారున్నారు. సృష్టి ఎప్పుడూ కొంతమంది మంచివారు కూడా లేకుండా ఉండదు. కలియుగంలో చెడ్డవారు ఎక్కువ, మంచివారు తక్కువ ఉండవచ్చు కాని అస్సలు మంచివారు లేకుండా ఉండదు. అటువంటి మంచివారితో association మంచిది'.

## ఒక సాధువు శ్రీ నాన్నగారికి వివరించిన సంఘటన



కొంతమంది భక్తులు నాకు కొన్ని బంగారు నాణాలు తెచ్చి ఇచ్చారు. అప్పటిదాకా నేనెప్పుడూ బంగారాన్ని చూడలేదు. కేవలం రామనామం చేస్తూ ఉండేవాడిని. బంగారం లభించగానే రామనామం చేయటం ఆపేసి ఇలా ఆలోచించటం మొదలెట్టాను: 'ఈ బంగారం విలువెంత? దీనిని నేను ఎవరికి అమ్మాలి? వచ్చిన డబ్బుని ఎలా సద్వినియోగం చేయాలి?' ఈ నా సందిగ్ధాన్ని ఇంకో మహాత్మునికి తెలియపరిచాను. 'ఈ బంగారాన్ని అమ్మొద్దు. దానిని మట్టిలో పూడ్చేయి' అని ఆయన నాకు సలహా ఇచ్చారు. ఆయన సలహా పాటించగానే నా మనస్సు కుదుటపడింది. బంగారాన్ని అమ్మి, ఆ వచ్చిన డబ్బును సద్వినియోగం చేయొచ్చు అని నాకు అనిపించింది. కాని మాయ యొక్క శక్తి చూడండి. నేను రామ నామం చేయటం మానేసి ఆ బంగారాన్ని ఎలా అమ్మాలి అని ఆలోచించడం మొదలుపెట్టాను. ఆ మహాత్ముడు అన్నాడు: 'నువ్వు బంగారాన్ని అమ్మి, వచ్చిన డబ్బును సద్వినియోగం చేసినా, 'నేను మంచిపని చేసాను' అని అనుకుంటావు. ఆ డబ్బు దానం చేసినా 'నేను దానం చేసాను' అని అనుకుంటావు. చివరకు పాడైపోతావు'. అందుకే ఆ మహాత్ముడు బంగారాన్ని అమ్మడం కన్నా పూడ్చివేయడం ఉత్తమం అని సలహా ఇచ్చారు.

## 'శ్రీ నాన్నగారు నిజమైన సన్యాసి' అని చెప్పిన రామకృష్ణ మఠం స్వామీజీ

ఒకసారి ఒక రామకృష్ణమఠం స్వామిజి తో నేను అన్నాను: 'సన్యాసినవ్వాలని నా చిరవాంఛ కోరిక. కాని ఇప్పుడు సాంప్రదాయపరంగా సన్యాసం పుచ్చుకునే అవకాశం నాకు లేదు. మీరు సన్యాసి కాబట్టి మీరు చాలా అదృష్టవంతులు'. అంటే ఆ స్వామీజీ అన్నారు: 'నాన్నగారు మమ్మల్ని మభ్య పెట్టకండి. సన్యాసం అన్నది బట్టలకు సంబంధించినది కాదు. నిజమైన సన్యాసం హృదయానికి సంబంధించినది. ఎర్ర బట్టలు కట్టగానే మేము సన్యాసులం అయిపోము. సాంప్రదాయం కోసం మేము ఎర్ర బట్టలు ధరిస్తాం గాని సన్యాసం అన్నది బట్టలకు సంబంధించినది కాదు. హృదయం ఖాళీ అయితే గృహస్థుడు కూడా సన్యాసితో సమానం'.

# శ్రీ నాన్నగారి స్థితప్రజ్ఞత తెలిపే సన్నివేశం

ఈ మధ్య ఒక అమ్మగారు నన్ను ఏమన్నారంటే 'మీరు దేవునితో సమానం'. ఆవిడ ఈ మాట (మీరు దేవునితో సమానం) ఎందుకంటున్నారో తెలియకుండా అంటున్నారు కాని నాకు తెలుసు కాబట్టి ఏమీ సంతోషం కలుగలేదు. 'మీరు దేవునితో సమానం' అనే మాట నన్ను అర్థం చేసుకొని అన్న మాట కాదు. అందుచేత నాకేమీ వికారం కలుగలేదు. మాటవరుసకు అనేసారు కాని అనుభవం అక్కడ లేదు. అది పొగడ్త. 24 గంటలు తిరగకుండా మళ్ళీ 'మీకు అహంకారం ఉంది' అని అన్నారు. 24 గంటలు తిరగకుండా మళ్ళీ 'మీరు దేవుడు' అన్న మనిషే 'మీకు అహంకారం ఉంది' అన్నారు. అప్పుడు కూడా నాకేమీ వికారం కలుగలేదు. ఎందుచేతంటే ఇప్పుడూ  నేను అర్థం అవ్వలేదు ఆవిడకి. నన్ను దేవుడు అన్నప్పుడు నేనెవరినో ఆవిడకు తెలియదు. నాకు అహంకారం ఉందన్నప్పుడు నేనెవరినో ఆవిడకు తెలియదు. ఒక ప్రయోజనాన్ని ఉద్దేశ్యించి ఆవిడ నన్ను దేవుడన్నారు. ఆ ప్రయోజనం నెరవేరలేదు కాబట్టి నాకు అహంకారం ఉందన్నారు. నా ముఖాన్ని అద్దంలో చూసుకుంటే ఎంత



స్పష్టంగా తెలుస్తుందో ఆవిడ మనస్సు అంత స్పష్టంగా నాకు తెలిసినప్పుడు ఇక నాకు reaction ఎందుకు వస్తుంది? తన స్వరూపం తనకు అనుభవంలో ఉన్నప్పుడు ఇటువంటి మాటలకు ఎవడూ గల్లంతవ్వడు. అహంకారం అని చెప్పినా దేవుడని చెప్పినా తానెవరో తనకు తెలుసున్నప్పుడు ఇటువంటి కుప్పిగంతులకు ఎవరూ జడవరు. సముద్రం ఉంది. అది వర్షాకాలంలో పెరిగిపోయి వేసవి కాలంలో ఎండిపోతుందా? పొలంలో బోర్లు ఎండిపోతాయి గాని సముద్రం ఎండిపోతుందా? ఏ వ్యక్తి తో మాట్లాడుతున్నామో ఆ వ్యక్తి ఎక్కడున్నాడసలు? ఆవిడ దేవుడన్నప్పుడు నాకు రవ్వంత ముల్లంత emotion రాలేదు. నాకు అహంకారం ఉంది అన్నప్పుడు కూడా చింతాకంత చింతలేదు. ఎందుచేత? రెండూ కూడా తెలియని మాటలు. అంటే ఏసు చెబుతాడు చూడండి: 'ఓ తండ్రి వారేమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు. వారిని క్షమించి ఆశీర్వదించు'.


# ఒక విదేశీ భక్తురాలు నాన్నగారిని హృదయవాసిగా గుర్తించడం

ఇన్ని ఉపన్యాసాలు మీరు వింటున్నారు. ఇంతమంది మన భక్తులు ఉన్నారు. ఆ ఉత్తరం ఎప్పుడైనా చదివిస్తాను. నేను మొన్న అరుణాచలం నుండి వస్తుంటే ఒక 25 సంవత్సరాల అమ్మాయి ఒక కాగితం వ్రాసి నాకు ఇచ్చింది. అది నేను అరుణాచలం నుండి మద్రాస్ వస్తుంటే కారులో కూర్చొని ఆ ఉత్తరం చదివాను. ఆ ఉత్తరం మీకు కూడా ఒకసారి చదివి వినిపిస్తాను. అందులో ఆ అమ్మాయి ఒక మాట రాసింది. నువ్వు దేవుడవని లేకపోతే ఈశ్వరుడవని లేకపోతే జ్ఞానివని అటువంటి మాటలు ఏమి నా గురించి రాయలేదు. “మీ దగ్గర 4 రోజులు నుండి కూర్చుంటున్నాను. అందరి హృదయాలలో ఏదో ఉంది అంటున్నారు. అందరి హృదయాలలో ఉన్నది నాలో కూడ ఉంది. నా హృదయంలో ఉన్నది నీవే అన్న సంగతి ఈ నాలుగు రోజులు నీ దగ్గర కూర్చోవడం వలన నాకు తెలుస్తోంది. నా కంటే నీవు పరాయివాడివి అని నేను అనుకోవటం లేదు” అని అంది. ఆ గ్రహింపు శక్తికి నాకు ఆశ్చర్యం వేసింది. జర్మనీ అమ్మాయి తను. నేను ఎవరో ఆ అమ్మాయి కి తెలియదు, ఆ అమ్మాయి ఎవరో నాకు తెలియదు. నాలుగు రోజులు వచ్చి నా దగ్గర కూర్చుంది. నేను ఆ అమ్మాయితో మాట్లాడలేదు, ఆ అమ్మాయి నాతో మాట్లాడలేదు. నేను వచ్చేస్తుంటే కారులో జాయిన్ అయ్యేముందు ఒక తెల్ల కాగితంపై ఇంగ్లీష్ లో రాసి ఇచ్చింది. నేను చదివి వినిపిస్తాను. నువ్వు ఇంద్రుడివి, చంద్రుడివి, దేవుడివి అని నన్ను ఏమి పొగడలేదు. లేకపోతే నువ్వు జ్ఞానివి అని ఏమి చెప్పలేదు.  అటువంటి మాటలు ఏమి అనలేదు. అందరి హృదయాలలో ఏదో ఉంది అంటున్నారు అదే నా హృదయంలోనూ ఉంది అని నాకు తెలుస్తోంది. నా హృదయంలో ఉన్నది నువ్వు అన్న సంగతి నాకు తెలుస్తోంది. ఈ నాలుగు రోజుల నుండి గ్రహించగలిగాను. ఈ విషయం మీకు ఎందుకు చెపుతున్నాను అంటే ఆ గ్రహింపు శక్తి గురించి చెప్పటం కోసం, ఆ వివేకం గురించి చెప్పటం  కోసం, sharp intellect గురించి చెప్పటం కోసం, ఆ సూక్ష్మబుద్ధి  గురించి చెప్పటం కోసం చెబుతున్నాను.



## రామకృష్ణ మఠం ప్రబోధకులు నాన్నగారిని గొప్ప యోగి గా గుర్తించడం

నేను 15 సంవత్సరాల పూర్వం మాట చెపుతున్నాను (అంటే సుమారు 1971 వ సంవత్సరం కావచ్చు) అప్పటికి ఇంకా ఈ ఆదివారం సమావేశాలు ఇంకా మొదలవలేదు. మద్రాస్ లో triplicane లో పార్థసారథి కోవెల ఉంది. నేను సాయంత్రం 6 గంటలకి పార్థసారథి కోవెలకు వెళ్ళాను. ఆ రోజు శనివారం, పార్థసారథికి నమస్కారం పెట్టాను. అది చూసి పూజారి గారు 'ప్రతి శనివారం సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు రామకృష్ణ మిషన్ వారు భాగవతం చెపుతారు; మీరు వెళ్లి వినాలి అనుకుంటే వినవచ్చు' అని అన్నారు. నాకు జ్ఞానం గురించి ఎన్ని చెప్పినా లోపల హృదయంలో భక్తి వాసన కూడా ఉంది. అయినా భక్తికి, జ్ఞానానికి మధ్య



బేధం చూడక్కర్లేదు. ఎవరి (శ్రీ కృష్ణుడు) నోటి నుండి జ్ఞానం చెప్పారో వారి నోటి నుండే భక్తి, కర్మ, యోగం చెప్పారు. అందులో బేధం చూడటం మనది పొరపాటు. సరే భాగవతం వినటానికి వెళ్ళాము. అక్కడ 20 మంది కంటే ఎక్కువ లేరు. అసలే లేట్ comer ని; ముందుకు వెళ్ళి కూర్చుంటే బాగోదని వెనుక వరుసలో కూర్చున్నాను. భాగవతం చెప్పే స్వామివారు చెపుతూ మధ్య, మధ్యలో నా వైపు చూస్తున్నారు. కాని నాది ఏ ఊరు అని ఏమి పలకరించలేదు. 'ఒక యోగి వచ్చి మన మధ్యలో కూర్చున్నారు' అని అన్నారు. ఎవరయ్యి ఉంటారు అని నేను అటూ ఇటూ చూస్తున్నాను. యోగి అంటే నన్ను అంటున్నారు అని నేను ఎలా అనుకుంటాను? అప్పుడు నాకు ఆ భావనే లేదు అసలు. రాజయమ్మ గారి అబ్బాయిని యోగి అంటారు ఏమిటి ఈయన. అక్కడ కూర్చున్న వారు కూడా చూస్తున్నారు ఎవరిని యోగి అంటున్నారు? అని. అప్పుడు ఆయన నన్ను వేలు పెట్టి చూపించారు. భాగవతం చెప్పటం పూర్తి అయ్యింది. నన్ను ఏమి అతను పలకరించలేదు, నాతో మాట్లాడలేదు, మీది ఏ గ్రామం అని కూడా నన్ను అడగలేదు. మీరు ఎందుకు వచ్చారు ఇక్కడికి? అని అడగలేదు. ప్రశాంతంగా ఒక చూపు మాత్రం నా వైపు 10 నిమిషాలు అలా చూశారు. ఆటోలో వచ్చారు, ఆటోలో వెళ్లిపోయారు. అప్పుడు నాకు అనిపించింది ఈయన అంచనా పూర్తిగా తప్పు అని. అది అబద్ధం అవ్వవచ్చు,

ఆయనే నన్ను యోగి అని ఎందుకు అన్నారు? చిన్నప్పటి నుండి నాతో స్నేహము చేసేవాళ్ళు ఎవరూ నన్ను యోగి అనలేదు. కాని నాకు అప్పుడు ఆయన అంచనా నూటికి నూరుపాళ్లు తప్పు అనిపించింది. నన్ను యోగి అంటాడు ఏమిటి? అనిపించింది. ఇది జరిగి సుమారు 10 సంవత్సరాలు అయ్యింది. అప్పటికి ఈ ఆదివారం సమావేశాలు లేవు.

## శ్రీ నాన్నగారంటే జ్ఞానమహాసముద్రం


నాన్నగారి దగ్గర నేర్చుకోవడం మానేసి, నాన్నగారికి మేమే జ్ఞానం ఇచ్చాము అనే వారు నా స్నేహితుల్లోనే కొంతమంది ఉన్నారు. వారు అలా అనుకున్నా మనకు నష్టం లేదు. నదులు వెళ్ళి సముద్రంలో కలవడం మానేస్తే సముద్రానికి ఏదైనా నష్టం ఉందా? సముద్రం యొక్క లోతులుగాని విశాలత్వంగాని తగ్గుతుందా? సముద్రం సముద్రమే. Ocean is Ocean. Knowledge is Knowledge. Power is Power. ఆకాశం ఆకాశమే. జ్ఞానం జ్ఞానమే.

## ఒక భక్తురాలు 'వండర్ఫుల్ వండర్ఫుల్' అని నాన్నగారి మౌనాన్ని అభినందించడం

టాటా ఫ్యామిలీ ఆమె ఒకరు ఉన్నారు. ఆమె పేరు రోసీ ఏదో ఉంది. ఆమె ఎప్పుడో పూర్వమే లండన్ లో settle అయ్యిపోయారు. ఎప్పుడైనా నా పక్కనే కూర్చునేవారు. నేను ఏమి మాట్లాడకుండానే ఆవిడ వండర్ ఫుల్, వండర్ ఫుల్ అంటారు. నేను ఏమైనా మాట్లాడితే ఆమెకు ఆమాట నచ్చితే వండర్ ఫుల్ అనవచ్చు. నేను ఏమి మాట్లాడకుండానే నా ప్రక్కన కూర్చుని వండర్ఫుల్, వండర్ఫుల్ అనేవారు. నేను ఏమి మాట్లాడటలేదు, ఆవిడకు ఏది చెప్పటంలేదు. ఆవిడకు ఏదైనా టీచ్ చేస్తే వండర్ ఫుల్ అనవచ్చు. నేను మొద్దు అబ్బాయిలా కూర్చుంటే వండర్ఫుల్, వండర్ఫుల్ అనేది. అప్పుడు నేను 2, 3 రోజులు చూశాను. నేను ఇండియాకి వచ్చేటప్పుడు ముందురోజు వచ్చింది. 2-3 రైళ్లు మారి వచ్చింది. అప్పుడు కూడా కొంత సేపు కూర్చొని వెళ్లిపోయేటప్పుడు వండర్ఫుల్, వండర్ఫుల్ అంటోంది. ఏదో సరదాకి అంటోందా అని ఆవిడ వెళ్లిపోయేటప్పుడు వండర్ఫుల్ అంటే ఏమిటి? అని అడిగాను. నేను ఆవిడ దగ్గర కూర్చోవటం వండర్ఫుల్ కాదు. ఆవిడ చెప్పిన మాట వండర్ఫుల్. ఆమె

వండర్ఫుల్ అని ఎందుకు అన్నారంటే 'silence with speech. No doubt it is silence with speech'. ఎవరు ఏది చెప్పినప్పటికీ మనకున్న అర్హతను బట్టి యోగ్యతను బట్టి గ్రహించగలం గాని తగిన అర్హత యోగ్యత లేకపోతే గ్రహించలేము. క్లాస్ లో మాష్టారు ఏదైనా చెప్పినప్పటికీ మన యోగ్యతను బట్టి రిసీవ్ చేసుకోగలము. మనకు తగిన యోగ్యత లేకపోతే ఆ నోటి నుండి immortal words జారుతున్నప్పటికి గ్రహించలేము. "ఇట్ ఈజ్ సైలెన్స్ విత్ స్పీచ్".

## భగవాన్ తనని షిరిడీకి ఎలా మరలించాడో ఒక భక్తుడు నాన్నగారికి వివరించిన ఘట్టం



ఈ మధ్య ఒక భక్తుడు అరుణాచలంలో నాకు రహస్యంగా చెప్పాడు. ఆయన రమణ భక్తుడు కాని పద్యాలూ పాటలు భజనలు అంటే ఆయనకు చాలా ఇష్టం. మహిమలు అంటే ఆయనకు సరదా పాపం. 'ఈ రమణ మహర్షి గారు చెప్పిన నేనెవడను ఏంటి రా బాబు? శిరిడీ సాయిబాబా చెప్పిన మాటలే బాగున్నాయి' అనుకున్నాడట. విచారణ చేసుకోండి, మీ దుఃఖం నశిస్తుంది, పాపం నశిస్తుంది, ఆత్మజ్ఞానానికి అడ్డు వచ్చే వాసనలన్నీ నశిస్తాయి అని భగవాన్ అంటున్నాడు. ఆత్మవిచారణ చేసుకోండి అని భగవాన్ చెబుతున్నాడు. మనకేమో భజన చేసుకోవడం సరదాగా ఉంది. నీకు రోగం తగ్గిపోతుంది, నీకు ఫస్ట్ మార్కులు వచ్చేస్తాయి, నువ్వు చచ్చిపోయాక స్వర్గం వెళ్ళిపోతావు- అని ఇటువంటి మాటలు చెప్పేవారంటే ఆయనకు ఇష్టంగా ఉందట. ఈ అరుణాచలంలోకి వచ్చి పడ్డానేంటి? అనుకుంటున్నాడట. 4 నెలల క్రితం ఆయనకు భగవాన్ స్వప్నంలోకి వచ్చి, ఆయన్ని ఇలా touch చేసి ఆశీర్వదించి అన్నాడట: 'You go to Shiridi. You be happy. నీ క్షేమం నాకు కావాలి. నీ శాంతి నాకు కావాలి. నువ్వు అశాంతిగా ఉన్నప్పుడు నువ్వు రమణ మహర్షి భక్తుడైతే ఏంటి, రమణ మహర్షి శిష్యుడైతే ఏంటి? You go to Shiridi. అక్కడ కొంతకాలం ఉండు. బాబా సమాధి సన్నిధిలో కొంతకాలం ఉండు. ఈ మాటలు నీకు ఎందుకు చెబుతున్నానంటే నేనంటే నీకు ఇష్టం లేదని కాదు; నీ సంస్కారాన్ని బట్టి, నీ పూర్వజన్మ వాసనబట్టి, నీ మనోప్రవృత్తి బట్టి కొంతకాలం వెళ్లి షిరిడీలో జీవించు'. 'నాకు షిరిడీ ఎక్కడుందో తెలియదు, నాకు తమిళ భాష

తప్పించి వేరే భాష రాదు, అక్కడేమో మరాఠి భాష- ఈ language problem ఒకటి, నా దగ్గర పైసాలు కూడా లేవు' అన్నాడట ఆయన. అంటే భగవాన్ అన్నారట: 'నిన్ను తీసుకెళ్ళేవాడు వస్తాడు, రెండు భాషలు తెలిసినవాడు వస్తాడు, పైసాలు ఇచ్చేవాడు వస్తాడు. You go to Shiridi'. ఈ మధ్య నెలనాళ్ళు అలాగే షిరిడీలో ఉండి వచ్చాడట ఆయన. 'వాడు గురువంటే' అని చెబుతూ ఆయన కన్నీళ్లు కార్చాడు.

## నేను 'ఉండటానికి సంబంధించిన వాడన'ని డాక్టర్స్ తో చెప్పారు శ్రీ నాన్నగారు

నాన్నగారు వైజాగ్ లో వైద్యం చేయించుకొని నాలుగు రోజుల్లో దీపోత్సవం ఉందనగా జిన్నూరు తిరిగి వచ్చారు.



డాక్టర్స్ నాన్నగారితో అన్నారు: 'మీకు ఒంట్లో బాగోలేదు గనుక మీరు ఆశ్రమంలో మౌనంగా కూర్చోండి. భక్తులకు మీ presence సరిపోతుంది. మీ బదులుగా భక్తులెవరైనా మాట్లాడుతారు'. దానికి నాన్నగారు అన్నారట: 'నాన్నగారికి ఆరోగ్యం బాగుంది లేక నాన్నగారికి ఆరోగ్యం బాగోలేదని మీకు ఎవరు చెబుతున్నారు? అలా చెప్పేది మీ మనస్సు. నేను దేహానికి సంబంధించిన వాడను కాను; నేను మనస్సుకు సంబంధించిన వాడను కాను. నేను ఉండడానికి సంబంధించిన వాడను. కనుక నేను చెప్పే మాట మీరు నమ్ముతారా లేక మీ మనస్సు చెప్పే మాట మీరు నమ్ముతారా? మీరు మమ్మల్ని మాట్లాడవద్దు అంటున్నారు. సబ్జెక్టు వినడానికి వచ్చిన భక్తులకు మా సన్నిధిలో వాళ్లకు అవసరమైన వాక్యాలని వారి హృదయానికి మేము పట్టిస్తాం. కనుక మీరు మాట్లడకూడదు అంటే కుదరదు. నేను ఉండడానికి సంబంధించిన వాడను. మీరు కూడా ఉండడానికి సంబంధించిన వారే. నా ఆరోగ్యం సంగతి పక్కకు పెట్టి ఈ వాక్యాన్ని మననం చేసుకోండి. అలా మననం చేస్తూ ఉండగా కూడా మీకు ప్రారబ్ధానుసారం ఎదురు సమస్యలు రావచ్చు. గంగానదిలో మనం దీపం విడిచి పెడితే ఆ గంగానది ప్రవాహాన్ని దీపం ఏమైనా ఆపగలదా? ఆపలేదు. కాసేపు ఆ దీపం గంగానది ప్రవాహంలో కదిలి కదిలి ఆరిపోతుంది. అలాగ 'నేను ఉండడానికి సంబంధించిన వాడను' అని మీరు మననం చేస్తూ అదిగా ఉండడానికి ప్రయత్నం చేస్తుంటే మీ ప్రారబ్ధపు సమస్యలు గంగా నదిలో వదిలిన దీపంలాగా అలా కాసేపు కదిలి ఆరిపోతాయి'.

## శ్రీ నాన్నగారు తమ పనిని వివరించిన తీరు

ఈశ్వరుడు కర్మఫలాన్ని అనుభవింప చేసేలా చూస్తాడు. వాడు రాతగాడు. అందుచేత ఈశ్వరునికి కర్మఫలదాత అనే పేరు ఉంది. కర్మఫలాన్ని ఇచ్చేవాడు - మంచికి మంచి చెడ్డకి చెడ్డ. మేము అలా కాదు కత్తిరించి వదిలేస్తాం. మేము కత్తిరించాక ఈశ్వరుడు ఏమీ చేయలేడు. అది కోత అనమాట. దేహాభిమానం కత్తిరించాము అనుకో ఈశ్వరుడు ఏమి చేయగలుగుతాడు? ఏమీ చేయలేడు. కర్మఫలం ట్రూథ్ కి చైతన్యానికి ఉండదు. పుట్టిన దానికి కర్మఫలం ఉంటుంది కానీ పుట్టనిదానికి ఉండదు. నువ్వు పుట్టని దానవు అన్న అనుభవం నీకు తీసుకొచ్చామనుకో దానికి అసలు కర్మఫలము ఉండదు. నిన్ను ఆ స్టేట్ కి వెళ్లి వదిలేసాను అనుకో ఆ దేవుడైనా ఏమీ చేయలేడు. జైలు లో నుంచి బయటకు వచ్చేస్తే జైలు అధికారులు ఇంకేమి చేస్తారు?

## శ్రీ నాన్నగారంటే full manifestation of సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఒక కమిషనర్ గారు నాన్నగారి దగ్గరికి వచ్చి: 'నేను తిరుచందూర్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించటానికి వెళ్తున్నాను. అక్కడ దర్శించుకున్నాక ఇంటికి వెళ్లే ముందు మళ్ళీ మీ దగ్గరికే వస్తాను' అని అన్నారట. ఆయన వెళ్ళిపోయాక నాన్నగారు అన్నారట: కమిషనర్ గారు తిరుచందూర్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దగ్గరకి వెళ్లే ముందు ఎందుకు నా దగ్గరికి వచ్చారు? దర్శనం అయ్యాక మళ్ళీ మన దగ్గరికే వచ్చి అప్పుడు ఇంటికి వెళ్తాను అని ఎందుకు చెబుతున్నారు? తిరుచందూర్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రూపం లో నాన్నగారి రూపం దర్శనిమిచ్చిందటమ్మా ఆయనకి. కనుక నేనే తిరుచందూర్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అని ఆయన విశ్వాసం. (నాన్నగారు ఏ స్థాయికి చెందినవారో ఆయన దిగివచ్చి చెబితే గాని భక్తులకు అర్థం కాదు. ఆ స్థాయిలో ఆయన్ని ఆరాధిస్తే ఆ స్థాయి చైతన్యాన్ని అందుకుంటాము అని నాన్నగారే దిగివచ్చి చెబుతున్నారు.Full manifestation of Subrahmanya is Tiruchandur Subrahmanya అని నాన్నగారు అనేక ఉపన్యాసాలలో చెప్పారు. తిరుచందూర్ లో సుబ్రహ్మణ్యుడు తారకాసురుని వధించాడు. అక్కడి సుబ్రహ్మణ్యుడు అన్ని కోణాలు వికసించిన సుబ్రహ్మణ్యుడు. కనుక నాన్నగారు Full manifestation of Subrahmanya అంటే అన్ని కోణాలు వికసించిన జ్ఞానావతారం).

## శ్రీ నాన్నగారి అభయ స్థితిని వర్ణించే ఘట్టం

ఒకసారి తోటలో తిరుగుతూంటే అనుకోకుండా ఒక పెద్ద ముసలి త్రాచుపాము ఎదురైంది. ఒక్క అడుగు వేస్తే నా పాదం ఆ త్రాచు పాము పడగ మీద పడేది. అంత దగ్గరిగా ఉంది ఆ పాము. అది నన్ను చూసి కంగారు పడలేదు. నేను కూడా అస్సలు కంగారు పడలేదు. నేనే నెమ్మదిగా పాదం పక్కకి పెట్టేసాను.

## హద్దులు లేని కరుణా సముద్రం శ్రీ నాన్నగారు

ఒకరు నాన్నగారిని ఇలా అడిగారట: 'మీరు ఫలానా వారిపైన అంతటి ప్రేమ చూపిస్తున్నారేమిటి? వారు ఎంతటి లౌకికులో మీకు తెలుసా? వారు ఎంతమందిని మోసం చేసారో నేను చెప్పలేను. వారి ఆస్తులన్నీ ఇతరులను మోసం చేసి సంపాదించినవే' అంటే నాన్నగారు అన్నారట: 'మంచి పని కుడి చేయి ఒక్కటే చేస్తుంది, ఎడమ చేయి చేయదు అనేసి ఎడమ చెయ్యి తెగితే దానికి కట్టు కట్టకుండా ఉంటామా? ఎడమ చేయి మనదే, కుడి చేయి మనదే కదా. అలాగే మంచివారు చెడ్డవారు అందరూ మనమే కదా. వారు లౌకికులని మనం ప్రేమించకుండా ఎలా ఉంటామమ్మా?' అట్టిది నాన్నగారి కరుణ మరియు సమానత్వం.

ఆఖరి రోజుల్లో ఒక ఫిజియోథెరపిస్ట్ ఎంతో నీరసంగా ఉన్న నాన్నగారిని అడిగారట:'అందరికీ ఉపదేశాలు చేశారు కాని మాకేమీ చెప్పటంలేదు' అంటే నాన్నగారు చాలా కష్టంగా మాట్లాడుతూ ఇలా అన్నారట: 'Be happy with yourselves, Be happy with others, Be happy with God'.



## శ్రీ నాన్న గారి ఆప్యాయత బుద్ధుడికి మానవ జాతి మీద ఉన్న ప్రేమవంటిది

ఈ మధ్య కూరలో కారం ఎక్కువ వేయద్దు అంటే కారం ఎక్కువ వేయడం మానేసి నూనె ఎక్కువ వేస్తున్నారు. నూనె ఎక్కువ వేయద్దు అని చెబుతూంటే కారం ఎక్కువ వేసేస్తున్నారు. కొన్ని సార్లు ఏమి జరుగుతుంది అంటే నేను చెప్పింది వింటారు కాని అక్కడ వండే వారు వేరు. ఆ వండే వారికి వీరు నూనె ఎక్కువ వేయద్దు అని చెప్పడం మర్చిపోతారు. మాకేమో కంఠం పట్టేస్తుంది. మరుసటి రోజు జ్వరం వచ్చేస్తుంది. కొమ్మర మీటింగ్ నేను జ్వరంతోనే చెప్పాను. మా బాధలు మీకు తెలియదు. మీటింగ్ మీటింగ్ అని మీరు అంటారు. ప్రతీ ఇంటి కాడ కారం ఎక్కువ వేయద్దు, నూనె ఎక్కువ వేయద్దు అని ఎక్కడ చెప్పగలము? మేము ఎవరికైతే చెబుతామో వారు వండరు. ఆ వండేవారు వాళ్ళ అలవాటు ప్రకారం వండేస్తారు. మామూలుగా నా ఆరోగ్యం మంచిదే. కాని



భోజనాల గురించి అనారోగ్యం వస్తుంది. మీలో బాగా వండే వారు ఉన్నారు అనుకోండి, నాన్నగారి ఉపన్యాసం మానేద్దాం వంట జాగ్రత్తగా చేద్దాం అని అనుకునేవారు మీలో ఒక్కరు లేరు. నాన్నగారి ఆహార విషయం చూద్దాం, ఉపన్యాసం పోతే పోయింది అని ఆ మాత్రం త్యాగం చేసే వారు కూడా మీలో ఒక్కరు లేరు. నేను ఏ పట్నం వెళ్లినా అంతే. ఈ విషయం లో బుద్ధుడికి ఏ బలహీనత ఉందో మాకు అలాంటి బలహీనత ఉంది. ఎవరైనా బుద్ధుడిని భోజనానికి పిలుస్తే ఆహారం ఎలా ఉన్నా తినేసేవాడు కాని తర్వాత బాధ పడేవాడు. బ్రాహ్మణుల ఇంటికాడ ఎలా తింటాడో, వైశ్యుల ఇంటికాడ ఎలా తింటాడో, దళితుల ఇంటికాడ కూడా అలాగే తింటాడు. మాంసం వండినా 'పాపం ప్రేమగా పెట్టాడు కదా' అని తినేసేవాడు. బుద్ధుని ప్రేమకు పరిమితులు లేవు. చివరి రోజుల్లో ఒక దళితుడు సరిగ్గా ఉడకని మాంసం పెడితే మోషన్స్ పట్టుకుని బుద్ధుడు చనిపోయాడు. కానీ ఆ ప్రేమమాత్రం అమోఘం. బుద్ధుని కరుణ ముందు మన దేవతలు కూడా సరిపోరు అనిపిస్తుంది. బుద్ధుడు చనిపోయేటప్పుడు అన్న ఈ ఒక్క మాట చాలు నన్ను చాలా చలింపచేసింది. ఆయన మాంసం తిన్నా పర్వాలేదు, చేపలు తిన్నా పర్వాలేదు. బుద్ధుడి శరీరం చనిపోయే రోజుని సవతి తమ్ముడు ఆనంద్

అడుగుతాడు 'మీ శరీరాన్ని ఏమి చేయమంటారు?' అప్పుడు బుద్ధుడు అంటాడు: 'ఆనంద్, మనం ఉన్నది ఒక గ్రామం కదా ఇది. గ్రామం స్మశానం లేకుండా ఉంటుందా? ఈ గ్రామం లో అందరి శవాలను తీసుకెళ్లి ఏ స్మశానంలో దహనం చేస్తున్నారో ఈ శరీరాన్ని కూడా అక్కడే దహనం చేసేయండి. బుద్ధుడు ఫలానా చోట చనిపోయాడు అన్న గుర్తు కూడా అక్కర్లేదు. కాని నేను ఎవరి ఇంటి కాడ మాంసం తిన్నానో వాడి పేరు ఈ లోకానికి తెలియకూడదు.వాడికి చెడ్డపేరు రాకూడదు ఎందుకంటే వాడు కావాలని పెట్టలేదు, ఎంతో ఆప్యాయంగా పెట్టాడు'. అట్టిది బుద్ధుడికి మానవ జాతి మీద ఉన్న ప్రేమ.

## బ్రహ్మాన్ని వర్ణించడంలో ఆదిశంకరులను మించిపోయిన శ్రీ నాన్నగారు

'ఉన్నది బ్రహ్మం ఒక్కటే' అనే పుస్తకం గురించి పండితులు చాలా ఉత్తరాలు రాస్తున్నారమ్మా. ఏమని అంటే మీరు కూడా శంకరునిలా రాసేశారు. అంటే స్టాండర్డ్ అలా maintain చేసారు అని వారి ఉద్దేశ్యం. శంకరుని భాష మనకు రాదు. West Godavari లో collector గా చేసిన రామకృష్ణ గారిని 'ఉన్నది బ్రహ్మం ఒక్కటే' మీద వారి అభిప్రాయం అడిగాను. బ్రహ్మసూత్రాలు లాగ రాసేశారు' అని వారన్నారమ్మా. ఉపనిషత్తులో పేచీలు ఉన్నాయి. ఒక ఉపనిషత్తు ఒకలా ఉంటే ఇంకో ఉపనిషత్తు ఇంకోలా ఉంటుంది. ఉపనిషత్తులో differences ఉన్నాయి. ఇవన్నీ వ్యాసుడు బ్రహ్మసూత్రాలలో సమన్వయము చేసాడు. ఉన్నది బ్రహ్మం ఒక్కటే పుస్తకాన్ని పొగుడుతూ ఒక పండితుడు నాతో ఇలా అన్నాడు: 'నాన్నగారు మీరు బ్రహ్మాన్ని వర్ణించడంలో ఆదిశంకరులను మించి పోయారు'. నేను అడిగాను: 'అదెలా సాధ్యమండి? ఆదిశంకరులు గొప్ప పండితులు. నన్ను మీరు ఆదిశంకరులతో ఎలా పోలుస్తారు?' అంటే ఆ పండితుడు అన్నాడు: 'మీరు చెప్పింది నిజమే నాన్నగారు. పాండిత్యంలో ఆదిశంకరులని మించి ఎవరూ లేరు. కానీ బ్రహ్మాన్ని వర్ణించడంలో వివేకచూడామణి కన్నా ఉన్నది బ్రహ్మం ఒక్కటే పుస్తకంలో ఎక్కువ క్లారిటీ ఉంది'.



## భక్తుల సందేహాలను నివారించే శ్రీ నాన్నగారు

ఏకాదశి రోజున నేను మైండ్ ని ఎలా ప్యూరిఫై చేయాలి, ఎలా అంతర్ముఖం చేయాలో దాని గురించి చెబుతూ ఉంటే సడన్ గా ఒక తెలుగు లెక్చరర్ గారు 'మైండ్ ని పురిఫ్య్ చేయడానికి అది ఉంటే కదా' అని అన్నారు. 'నీకు ఎవరు చెప్పారు?' అని అడిగాను. 'రమణ మహర్షి చెప్పారు' అని అన్నారు. మామూలుగా సమాజంలో ఒక gentleman అసత్యం చెప్పడు మరి రమణ మహర్షి అబద్ధం ఎందుకు చెబుతాడు? రమణ మహర్షి చెప్పింది ఏమిటంటె : 'There is no mind if Truth is realized '. లెక్చరర్ గారు ఏమి చేశారంటే భగవాన్ చెప్పిన మొదటి వాక్యం 'There is no mind' పట్టుకున్నారు కానీ భగవాన్ చెప్పిన తర్వత వాక్యం 'if Truth is realized' అది వదిలేశారు.

ఒక భక్తుడు నాన్నగారిని అడిగాడు: 'నేను నా ప్రారబ్దాన్ని ఇష్టంగా అనుభవించలేకపోతున్నాను. నాకు ఉపాయము ఏమిటి?' అంటే నాన్నగారు అన్నారు: మీకు ఈ క్రింది విషయాలు థియరిటికల్ గా కాకుండా ప్రాక్టికల్ గా అనుభవపూర్వకంగా అర్థం అవ్వాలి: 1) భగవంతుని సంకల్పమే నెరవేరుతుంది. కనుక 'ఓ భగవంతుడా నీ సంకల్పమే నా సంకల్పం అగు గాక. నీ సంకల్పమే నెరవేరు గాక'. 2) భగవంతునికి తెలియకుండా మనకు ఎటువంటి కష్టము రాదు. 3) ఇప్పుడు మనకు చెడ్డగా అనిపించేది భవిష్యత్తులో ఒక పెద్ద మంచికి దారి తీస్తుంది. కాబట్టి భగవంతునికి శరణాగతి చెందితే నీ ప్రారబ్దాన్ని ఇష్టంగా అనుభవించగలవు.

ఈ మధ్య నన్ను ఒకరు ఒక ప్రశ్న అడిగారు: 'మనిషి దేవుడిని సృష్టించాడా లేక దేవుడు మనిషిని సృష్టించాడా?' అంటే నేను చెప్పాను: 'ఎవ్వరూ ఎవరినీ సృష్టించలేదు ఎందుకంటే మనిషి, దేవుడు ఇద్దరూ కూడా వ్యవహారిక సత్యాలే'.

'ఒక భక్తురాలు మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుదాం అనుకుంది కానీ ఏమీ అడగలేక పోయింది' అంటే నాన్నగారు అన్నారు: 'Doubter ఉంటే doubts వచ్చి తీరుతాయి. Doubter లేనప్పుడు ఇక doubts అనేవి రావు. Live in faith in Bhagavan's help'.

ఒకసారి ఒక భక్తుడు నన్ను అడిగాడు: ‘భగవంతుడు ఒకే మనిషికి ముళ్ళతో సహా రోజా పువ్వు ఇవ్వకుండా ఒకరికి ముళ్ళు ఇంకొకరికి పువ్వు ఎందుకిస్తున్నాడు? అంటే నేను అన్నాను: ‘భగవంతుడు ఒకరికి పూలు మరొకరికి ముళ్ళు ఎందుకిస్తాడో నేను చెప్పలేను కాని ఒకటి మాత్రం నిశ్చయంగా చెప్పగలను. పూలు అందుకున్న వారు ఆ పూలనుండి నేర్చుకోవలసినది ఏదో ఒకటి ఉంటుంది, ముళ్ళు అందుకున్నవారు ఆ ముళ్ళ నుండి నేర్చుకోవలసినది ఏదో ఒకటి ఉంటుంది’.

## శ్రీ నాన్నగారి మాతృప్రేమ





మా అమ్మగారి అస్థికలు గంగా నదిలో కలుపుతూ 'కృష్ణా కృష్ణా' అని భగవంతుడిని స్మరించుదాం అనుకున్నాను. కానీ సరిగ్గా సమయానికి నాకు లోపల నుండి ‘అమ్మా అమ్మా’ అని వచ్చింది. అనుకునేది మన సంకల్పం జరిగేది ఈశ్వర సంకల్పం. ఆ క్షణం లో మరుపు ఇచ్చేసాడు ఈశ్వరుడు. నేను 'అమ్మా అమ్మా' అని అనుకోవడం ఈశ్వర సంకల్పం అయితే 'కృష్ణా కృష్ణా' అని ఎలా అనుకోగలను?



రాముడిది ధర్మావతారం, కృషుడిది లీలావతారం, రామకృష్ణ పరమహంసది సాధనావతారం, భగవానునిది ఆత్మనిష్ఠ, మరి మీది ఏమిటి? అని అడిగితే నాన్నగారు అన్నారు: 'నాది ప్రేమావతారం'.

## శ్రీ నాన్నగారికి భక్తులతో గల అనుబంధం

నేను శ్రోతలను అమితంగా ప్రేమిస్తాను. నేను వారి పట్ల ఉదార బుద్ధితో వ్యవహరిస్తాను. శాంతితో మెలుగుతాను. వారిలోని సామాన్యమైన లోపాలను పట్టించుకోను. వారికి ఆత్మవిద్యను బోధించటంతో సరిపెట్టుకోకుండా, వారి భౌతికాభివృద్ధిని కూడా కాంక్షిస్తాను. వారిలో ఉన్న మంచితనాన్ని మేలుకొలుపుటకు సహకరిస్తాను. వారు శాంతి మార్గంలో నడిచి శాంతి స్థానమును పొందుటకు నా వంతు కృషి నేను చేస్తాను. నా పట్ల భక్తుల విశ్వాసం కూడా సజీవంగా ఉంటున్నది. నేను భక్తులను నా మిత్రులుగానే చూస్తాను. కానీ వారు నన్ను దైవ సమానంగా చూస్తారు. అందువలన వారి గురించి ఆలోచించటంలో గాని, బోధించడంలో గాని జాగ్రత్త పడతాను. ఏనాడూ వారి పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించలేదు. నా అర్హతకు మించిన గౌరవాన్ని వారు నా పట్ల చూపిస్తున్నారు అనిపిస్తుంది. వారు ఏదైనా పొరపాటు చేస్తే అది నేను చేసినట్లుగానే భావిస్తాను. ఏదో ఒక స్థాయి లో వారి బాధలో నేను భాగం పంచుకుంటాను. ఆలోచనే కేంద్రంగా పెట్టుకొని జీవించుటకు నా బోధలు వారికి కొంతవరకు సహకరిస్తాయి. నాకు భక్తులకు ఉన్న సంబంధం గురు శిష్యుల సంబంధం లాంటిది కాదు. ఒకే కుటుంబ సభ్యుల వలె మెలుగుతాము. భక్తులు తమ జీవిత పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా, వారికి నాతోటి ఉన్న ప్రేమానుబంధం మాత్రము ఎన్నడూ తెగలేదు, మానసిక అనుబంధం ఉంటూనే ఉన్నది. దైనందిన జీవితంలో వారి సమస్యలకు నేను చెప్పే మాటలలో సమాధానాలు దొరుకుతున్నాయి. ఆ మాటలు వినటం వల్ల వారికి శాంతి కలుగుతుంది. శాంతి లేని వాడికి సుఖం లేదు. నా ప్రవచనాల వల్ల వారికి సుఖం కలుగుతుంది. నా ద్వారా ప్రవహిస్తున్న ప్రేమ, కరుణ, ఆప్యాయత, ఆదరణ, అనురాగము వారికి శాంతి సాగరంలో ఈదుతున్నట్లుగా అనిపిస్తుంది. భక్తుల పట్ల నాకున్న అభిమానాన్ని వారు కూడా గుర్తిస్తున్నట్లు నాకు అవగాహన అవుతున్నది. అందుచేత నేను కూడా బోధించలేకుండా ఉండ లేకపోతున్నాను. క్లిష్టమైన విషయములను తేలికైన మాటలతో విశదపరచుటకు ప్రయత్నిస్తాను. నేను చెప్పిన విషయము వారికి అందక పోతే అది నా లోపముగానే పరిగణిస్తాను. భక్తులు నా పట్ల చూపిస్తున్న ఆదరణ, విశ్వాసం తెంపు లేకుండా ఉన్నది. అందువలన నా శరీరం మరణించినా నేను వారి హృదయాలలో జీవించే

ఉంటాను. దుఃఖం లేని స్థాయికి వారిని తీసుకువెళ్ళుటకు తత్త్వమును గురించి చిన్న చిన్న మాటలతో, పొట్టి పొట్టి వాక్యములతో వారికి ఉపదేశించుటకు ప్రయత్నిస్తున్నాను.

## భక్తుల పట్ల శ్రీ నాన్నగారి అపార కరుణ



మేము దురాశలో ఉన్నాం. సాధన చేసుకోండి, ధ్యానం చేసుకోండి, జపం చేసుకోండి అని చెప్పటంలేదు. మీకు ఎర్రచీమ కుట్టినట్లు ఉండకూడదు కాని direct గా happiness లోకి పంపేయాలని నా ప్రయత్నం. మరి ఇది దురాశ కదా? సాధన కూడా చెప్పాలి కదా! మీరేమీ కష్టపడకూడదు, realization వచ్చేయాలి అంటే ఎలాగ? మీకు తెలియకుండా అక్కడికి తీసుకెళ్ళిపోవాలి అన్నది నా ప్రయత్నం. మిమ్మల్ని ఇబ్బంది పెట్టకూడదు అనుకుంటున్నాం మరి! చెప్పడం ఏమీ లేదు, sharing చేసుకోవడమే. only sharing, giving లేదు. మీకు ఏమి సాధన లేకుండా, pain లేకుండా తీసుకుపోవాలి. అది ఎలా సాధ్యం అవుతుంది? సాధ్యం కాదని తెలిసినా ప్రయత్నం మానలేక పోతున్నాం. ఈ ప్రయత్నంలో fail అయినా అవ్వచ్చు. ఇది గారడీ కాదు, pure science. సాధన ఎందుకు చెప్పడం లేదంటే సాధన పేరు మీద suffering కి గురి అవ్వకూడదని. మీకు ఏ మార్గాలు చెప్పటంలేదు. గమ్యానికి తీసుకెళ్ళిపోవడానికి పేరాశలో ఉన్నాం. ఏమి జరుగుతుందో చెప్పలేము.

అందరినీ ఒక్కసారే తరింప చేసేద్దాం అన్న పేరాశ వస్తుందమ్మా. కానీ అది ఈశ్వర చట్టానికి విరుద్ధం.

# శ్రీ నాన్నగారికి భద్రిరాజుగారితో ఉన్న అనుబంధం





భద్రిరాజుగారు executive engineer గా చేసి retire అయ్యారు. వారి ఇంటి పేరు భద్రిరాజు, వారి పేరు కూడా భద్రిరాజు. అంటే డబల్ రాజు. నేనంటే ఆయన చాలా ఇష్టపడేవారు. నేను ఎప్పుడన్నా వారింటికి వెళ్ళినప్పుడు వారు మజ్జిగన్నం తింటున్నారనుకోండి, అది పూర్తిగా తినకుండా చేయి కడుక్కోని బయటకు వచ్చేసేవారు. పూర్తిగా మజ్జిగన్నం తిని బయటకి వస్తే చూడటానికి late అవుతుంది అనిపించి అలా చేసేవారు. ఆయన నరసాపురం లో ఉన్నప్పుడు ఎప్పుడైనా వెళ్లి అరగంట ఉండి వచ్చేవాడిని. ఒకసారి ఆయన అన్నారు: 'మీరు వెళ్లి పోతారేమో అని, నేను మిమ్మల్ని మిస్ అవుతానేమో అని మూత్రం వచ్చినా బందించుకుంటున్నాను'. నాకు అనిపించేది ఆయన నన్ను ఎందుకింతగా ప్రేమిస్తున్నాడు? భద్రిరాజు గారు నరసాపురంలో ఇంజనీర్ గా పనిచేసేటప్పుడు ఒకసారి మా ఇంటికి వచ్చారు. 'చదవటానికి ఏదైనా పుస్తకం ఉంటే ఇవ్వండి' అని అడిగారు. నాకు ఆ టైం కి 'నేనెవడను?' పుస్తకం చేతికి వచ్చింది. కాబట్టి ఆ పుస్తకం ఆయనకు చదవడానికి ఇచ్చాను. కానీ ఆ పుస్తకం ఆయనకు అస్సలు నచ్చలేదు. ఆయనకు భక్తి అంటే ఇష్టం అన్న సంగతి నాకు తెలీదు. ఆయన అన్నారు: 'ఇదేమి పుస్తకమండి? సాంబార్ లేని ఇడ్లీ లాగ చప్పగా ఉంది'. ఆయనకు భగవాన్ అంటే ఇష్టం లేనివారుగా మాట్లాడారు. భగవాన్ అంటే ఆయన ఎందుకు ఇష్ట పడాలి? అని నాకూ అనిపించింది. తర్వాత భగవాన్ నాకు స్వప్నంలోకి వచ్చారు. భద్రిరాజుగారిని చూపిస్తూ 'ఈయన ఎవరు?' అని అడిగారు. నేను అప్పుడు భగవానుతో అన్నాను: ' నాకు నీకు సంబంధం ఉంది. నాకు భద్రిరాజుగారికి సంబంధం ఉంది. కానీ నీకు భద్రిరాజు గారికి సంబంధం ఏమిటి? భద్రిరాజుగారు ఎవరు అని నన్ను ఎందుకు అడుగుతున్నావు? ఆయనతో నీకు పనేమిటి?' అప్పుడు భగవాన్ 'భద్రిరాజు గారు నీకు సంబంధించినవాడు లేక నాకు సంబంధించినవాడు అని అనలేదు; మనకు

సంబంధించినవాడు' అని అన్నారు. 'మనకు భద్రిరాజు గారికి పూర్వ జన్మ అనుబంధం ఉంది. భద్రిరాజుగారు అది మరచిపోయారు. ఆయన మనకు పరాయివాడు కాదు. ఆయన్ని మన సొంతంగా భావించు. ఇంతకు ముందు జన్మలో మీరిద్దరూ సహోదరులు. ఒకే ఇంట్లో మెలిగినవారు' అని అన్నారు. (శరీరాలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు - ఇవన్నీ మారిపోయినా, గురువుతో ఉన్న సంబంధం జన్మ జన్మలకు కొనసాగుతుంది. అది ఎడతెగని సంబంధం. గురువుకి భగవంతునికి బేధం లేదు. గురువును చేరేవరకు ఆయన మనలను వదలడు).

## భక్తులు నా దగ్గర పొందేది undiluted happiness అని చెప్పిన నాన్నగారు



1987 నుండి 'రమణ రూపం' 'రమణ నామం' తప్ప వేరే తెలియని సూర్యగారు అనే రమణ భక్తుడు శ్రీ నాన్నగారిని సందర్శించడానికి వచ్చారు. వారన్నారు: 'నేను మీ భక్తులను అడిగాను: 'నాన్నగారంటే దైవాంశ సంభూతులు. కానీ మీరు ఇంకో మాటలో నాన్నగారి గురించి చెప్పండి' అంటే అక్కడ ముగ్గురు కూర్చున్నారు. ముగ్గురూ ఒక్కటే మాట చెప్పారు: 'నాన్నగారు అనే రమణాంశ అక్కడ లేకపోతే ఈ పాటికి ఈస్ట్ గోదావరి వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఆడవారు స్మశానంలో శవాలుగా మిగిలేవారు. మనో స్వాతంత్ర్యం, బాహ్య స్వాతంత్ర్యము ఎలా తెచ్చుకోవాలో మాకు చెయ్యి పట్టుకుని నేర్పించి, పునర్జన్మ అనేది ఇచ్చి, అంతర్ముఖులని చేసి లోపలకు నడిపిస్తున్నారు'. నేను అప్పుడు ఒక ప్రశ్న అడిగాను: 'రమణులు ఎలా దేహం చాలించారో అలాగే రమణాంశ కూడా ఏదో ఒక రోజు దేహం చాలిస్తుంది కదా. ఆ తర్వాత మీరు గురువుగారికి ఇచ్చే గురుదక్షిణ ఏమిటి?' అంటే వారన్నారు 'మేము ఇంకా సంసిద్ధంగా లేము. ఎందుకంటే మా గురువుగారు ఈ దేహంలో మాకు కనిపించే వరకూ ఆ ఆలోచన మేము రానివ్వము'. దీనికి నాన్నగారు సూర్యగారితో అన్నారు: 'వారు పొందేది పీస్ అండి. కరెక్ట్ గా చెప్పలేక పోయారు. అది undiluted happiness'.

## ఈశ్వరుని సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తుంది అని శ్రీ నాన్నగారు తెలియచెప్పిన సన్నివేశం

ఆ మధ్య చెన్నై వెళ్ళినప్పుడు నర్సాపురం కాలేజిలో పని చేసే అబ్బాయి నా దగ్గరకు వచ్చాడు. నర్సాపురంలో 2500 రూపాయల ఉద్యోగం చేసేవాడు. తండ్రిపోయాక ఆ college లో ఈ అబ్బాయికి ఉద్యోగం ఇచ్చారు. అప్పుడప్పుడు జిన్నూరు కూడా వచ్చేవాడు. 'నువ్వు పెళ్లి చేసుకోవచ్చుగా' అనేవాడిని. 'అమ్మను చూసుకోవాలి. పెళ్ళాం వస్తే తనకూ తిండి పెట్టాలి కదా. ఇప్పుడు అమ్మను చూసుకోగలుగుతున్నాను. నాకు పెళ్లి ఎందుకు?' అన్నాడు. ఆ అబ్బాయి Bsc చేసి ఎలా నేర్చుకున్నాడో గాని computers బాగా నేర్చుకొని చెన్నై లో 60 వేల రూపాయల ఉద్యోగం సంపాదించాడు. ఎలాగో చెన్నైలో నా address తెలుసుకొని నా దగ్గరకు వచ్చాడు. 'నాకు 60 వేల రూపాయల ఉద్యోగం వచ్చింది. income tax కూడా కట్టేస్తున్నాను. పెళ్లి అయిపోయింది. మా ఆవిడ MTech చదివింది. ఆవిడా ఉద్యోగం చూసుకుంటోంది. వచ్చే నెలలో ఆవిడకు ఉద్యోగం వచ్చేస్తుంది' అని చెప్పి ఒక 15 వేల రూపాయలు నా పాదాల దగ్గర పెట్టి మంచి కార్యక్రమాలకు ఉపయోగించమన్నాడు. నాకు నర్సాపురంలో అతని జీవితం గుర్తు వచ్చి తీసుకో బుద్ధి కాలేదు.



అందుచేత 'ఇది నాదే నీ జేబులో పెట్టుకుంటాను' అని తిరిగి అతని జేబులో పెట్టేసాను. ఆ అబ్బాయి గమనించేసాడు. 'మీరు ఎంతసేపూ నా నర్సాపురం జీవితం గుర్తు పెట్టుకుంటున్నారు. మీ దయ వల్ల నాకిప్పుడు ఏ లోటూ లేదు. అందుచేత ఈ సొమ్ము మీరు తీసుకోవాలి లేకపోతే జిన్నూరు కాలువలో పడేయండి. ఒక వేళ నా ఎదుటే బయట పడేసినా నేనేమి చింతించను' అని తిరిగి ఇచ్చేసాడు. అప్పుడు నేను ఏం చేసానంటే తీసుకుని పాలకొల్లు లో కడుతున్న సరస్వతి శిశుమందిర్ కు donate చేశాను. దానికి ఎవరు donate చేసినా income

tax మినహాయింపు ఉంటుంది. వాళ్లకు డబ్బు ఇచ్చి వాళ్ళ దగ్గర income tax మినహాయింపు కాగితాలు తీసుకొని చెన్నైలో ఉన్న ఆ అబ్బాయికి courier లో పంపేసాను. ఆ డబ్బు తీసుకోటానికి తడిగుడ్డను పిండితే నీళ్ళు ఎలా వస్తాయో అంత బాధపడ్డాను. ఎందుకంటే అమ్మను ఎలా పోషించాలి అని బాధపడేవాడు. చాలా కష్టపడి ఆ జీతం కోసం నర్సాపురంలో పని చేసేవాడు. అదే నా మెదడులో ఉండి పోయింది. తిరిగి ఎప్పుడు తీసుకున్నాను అంటే 'జిన్నూరు కాలువలో పడేయండి' అన్నప్పుడు తీసుకున్నాను. ఇదంతా ఆ అబ్బాయి సహృదయానికి సద్బుద్ధికి గుర్తుగా చెప్తున్నాను. తర్వాత చెన్నై station కి తల్లిని భార్యను తీసుకొచ్చి చూపించాడు. అతని భార్యకు కూడా మొదలే 40 వేల రూపాయలు ఉద్యోగం వచ్చింది. మొత్తానికి లక్షాధికారి అయ్యే యోగం ఉంది లక్షాధికారులు అయిపోయారు. ఇదంతా ఆ అబ్బాయి తెలివితేటలు కాదు. ఈశ్వర సంకల్పం. ఆయన ఎక్కడ నిలబెడితే అక్కడ ఉండటానికే సరిపోతాం. ఆయన నిర్ణయంలో ఒక fullstop కాని comma కాని తేడా ఉండదు. అందుచేత ఆయన ఇష్టాన్ని మన ఇష్టంగా చేసుకుంటే మన దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. 'ఈశ్వరుని సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తుంది' అని తెలుసుకోవాలి. ఏ మార్గంలో ప్రయాణించినా ఇది అర్థం కావాలి. ఇది అర్థం అయితే సుఖపడతావు లేకపోతే నీకు మిగిలేది దుఃఖం. ఈ వాక్యం ఒక్కటే ఒక ఉపనిషత్తు.

1987 లో నేను చాలా అస్వస్థతకు గురి అయ్యాను. నా చావు చాలా సమీపంగా ఉంది అనిపించింది. నా రోజులు దగ్గర పడ్డాయి అనుకుని పాలకొల్లు డాక్టర్లు కూడా వారి కాంపౌండర్ల ద్వారా 'మీకు ఏది తినాలి అనిపిస్తే అది తినేయండి' అని నాకు కబురు పంపారు. నేను అతిత్వరలో చనిపోతాను అని వినగానే నాకు చాలా ఆనందం వేసింది. ఎందుకంటే ఇక ఈ శరీరంతో ప్రయాణాలు చేయనక్కర్లేదు, ఇక శరీరానికి ఎటువంటి చాకిరీ చేయనక్కర్లేదు అనిపించింది. కాని అలా సంతోషపడటం కూడా correct state కాదు. అదికూడా ఒక బలహీనత. మన మరణం గురించి విన్నప్పుడు సంతోషం కలిగినా దుఃఖం కలిగినా మనం ఈశ్వర సంకల్పాన్ని అగౌరవ పరిచినట్లే అవుతుంది.

## శ్రీ నాన్నగారిని అభినందించిన భక్తులు

అరుణాచలంలో ఒక ౯౦ సంవత్సరాల భక్తుడు వచ్చాడు. '౯౦ సంవత్సరాల నుండి హృదయం అనే గిన్నె ఖాళీగా ఉంది. ౯౦ సంవత్సరాల తరువాత ఈ గిన్నెను అమృతంతో నింపారు అన్నారు. ఆత్మానందం గురించి పుస్తకాలలో చదివాను. ఇప్పుడు అది మీ సమక్షంలో అనుభవంలోకి వచ్చింది. నా పని పూర్తి అయ్యింది' అన్నాడు. 'నన్ను నిమిత్త మాత్రంగా పెట్టుకొని మీ హృదయాన్ని అమృతంతో నింపినది భగవంతుడే' అని చెప్పాను.

America నుండి వచ్చిన 'లీ' అనే ఆమె 'మిమ్మలను రాజుగారు, రాజుగారు అని అంటున్నారు దాని అర్థం ఏమిటి?' అని అడిగింది. ఇది భారతదేశంలో ఒక కులం అని చెప్పాలి. మాములుగా king అని చెప్పాను. 'నువ్వు నా హృదయానికి రాజువు' అంది.

## ఒక నాలుగవ తరగతి అబ్బాయి నాన్నగారి స్వరాన్ని 'స్వీట్ వాయిస్' అని అభినందించడం

నిన్న ఒక అమ్మాయి వచ్చింది. ఆ అమ్మాయి బెంగుళూరు లో ఉంటుంది. వాళ్ళ అబ్బాయి నాలుగవ తరగతి చదువుతున్నాడు. ఆ అబ్బాయి తల్లి ఎప్పుడైనా నా కాస్సెట్స్ వింటూ ఉంటుంది. ఆ నాలుగవ తరగతి అబ్బాయి వాళ్ళ అమ్మతో అంటాడట: 'అమ్మ నాకు నిద్ర తొందరగా రావాలి అంటే ఆ స్వీట్ వాయిస్ ఒకసారి వినిపించు. నిద్ర రావటం కోసం మాత్రలు ఏమి మింగుతాను. ఆ స్వీట్ వాయిస్ (అంటే నాన్నగారి కేసెట్) ఒకసారి వినిపించు'. అంటే పేరు ఏమి పెట్టడు. 'ఆ స్వీట్ వాయిస్ వినిపించు. నాకు నిద్ర వచ్చేస్తుంది. సరిపోతుంది' అంటాడు. స్వీట్ వాయిస్ అని పేరు పెట్టాడు. వాడు చదువుకున్న చదువు ఏమిటి? నాలుగవ తరగతి పిల్లవాడు. వాడి ఉద్దేశ్యం ఏమిటంటే: 'ఏమో ఆ సబ్జెక్టు నాకు తెలియక పోయినా నిద్ర పట్టడానికి నాకు ఆ స్వీట్ వాయిస్ బాగుంది. సబ్జెక్టు నాకు తెలియకపోయినా నా నిద్రకు ఉపయోగపడుతుంది. అంతవరకు ఉపయోగించుకుంటాను. నేను నిద్ర పోతాను అమ్మ నాకు స్వీట్ వాయిస్ వినిపించు. నాకు నిద్ర టైం అయిపోయింది. తొందరగా నిద్ర వచ్చేస్తుంది. మెలుకువగా అయినా ఉండాలి లేక నిద్ర అయినా పోవాలి. ఎటూ

లేకపోతే పిచ్చ పిచ్చ ఆలోచనలు వస్తాయి. నాకు నిద్రపోయే టైం అయ్యింది. ఆ స్వీట్ వాయిస్ వినిపించు. నేను నిద్రపోతాను'. ఈ నాలుగవ తరగతి పిల్లవాడు ఫీల్ అయ్యి అన్న మాటలివి. ఎవరో చెబితే అన్న మాటలు కావు. ఎంగిలి ముక్కలు కాదు. వాడి హృదయంలో ఫీల్ అయ్యి అన్న మాటలు. మీరు మాకు చేసే సన్మానాల కంటే ఆ మాట స్వీట్ గా ఉంది. ఆ అబ్బాయి మాట ఎక్కడో హృదయాంతరాలలో నుండి వచ్చింది కాబట్టి ఆ మాట నాకు శాంతిని, ఆలోచనని పరిశీలనా శక్తిని పెంచింది. మీరు నాకు సన్మానాలు చేయొచ్చు. ఈ సన్మానాల కన్నా ఆ అబ్బాయి మాట నాకు satisfaction ఇచ్చింది.

## రామకృష్ణ మఠం వారు నాన్నగారు పట్ల చూపించిన ఆదరణ

హైదరాబాద్ లో రామకృష్ణమఠం వారన్నారు: 'మీరు ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా గృహస్థుల ఇంటికాడ ఉండకండి. ఇక్కడికి వచ్చేయండి. మీకు మంచి room కేటాయిస్తాము' అంటే నేన్నాను: ' మా భక్తులు మీ మాట వింటారా? మీరు నాలుగింటి దాకా గేటు తీయరు. భక్తులు రెండింటికే వచ్చి కూర్చుంటారు. ఇక భక్తులకూ మీకూ దెబ్బలాట. మీరు చెప్పింది మా భక్తులు వినరు. మీకేదో పద్ధతి ఉంది కదా అలా నడుపుకోండి. నేను వస్తూ ఉంటాను. చూసి వెళ్తూ ఉంటాను'.

## పెద్ద తిరుపతి పండితునితో శ్రీ నాన్నగారి అనుభవం

పెద్ద తిరుపతి కింద రామకృష్ణ మిషన్ లో ఒక మీటింగ్ అయ్యింది. అక్కడ రమణ మహర్షి రథాన్ని ఊరేగించారు. తిరుపతి తెలుగు ప్రదేశం కారణంగా రమణ ఆశ్రమం వారు నన్ను కూడా రమ్మన్నారు. నాతో పాటు రెడ్డిగారు మరియు ఆ ఊరి పండితులు కూడా వచ్చారు. అందులో ఒక పెద్ద పండితుడు వచ్చాడు. ఆయన నా పక్కనే కూర్చున్నాడు. ఆయన ఆంగ్ల భాషలో కూడా పండితుడు. వేదాంతం మరియు సంస్కృతంలో కూడా ఆయన పండితుడు. ఆయన వ్రాసిన వ్యాసాలన్నీ భవన్స్ వంటి పెద్ద పెద్ద జర్నల్స్ లో వేసేవారు. వాళ్ళ అమ్మాయి మొన్నటి వరకు ఇక్కడ పాలకొల్లు కాలేజీ లో ప్రిన్సిపాల్ గా పని చేసింది. ఆయన చాలా మంచివారు కూడాను. ఆయన ప్రసంగం ప్రారంభించారు. ఆయనకు రమణ మహర్షి సభలు అలవాటు లేదు. ఊరికే రమణ మహర్షి చరిత్ర

చెప్పి ఊరుకోవలసింది. కానీ ఈ నేను గురించి చెప్పాలేమో అనుకుని నేను గురించి మొదలుబెట్టారు. ఈ నేను ఆ నేను అర్థం అవ్వడం లేదు. అడవిలో  పడిపోయాడు. ఆల్జీబ్రా లెక్కల కింద కంగారు పడిపోయాడు. అప్పుడు



నేను ఆయన భుజం మీద చెయ్యి వేసాను. భుజం మీద చేయి వేసి 'ఏవండీ మీరు పండితులు. మీరు ఇంకా పెద్ద పెద్ద విషయాలు చెబుదురుగాని ఈ నేను గొడవ చాలా చిన్న విషయం అది నాకు వదిలేయండి' అన్నాను. ఆయన అలాగే వదిలేసాడు పాపం. అంటే ఆయన్ని నేను రక్షించాలని తప్పించేసాను. ఆయన అవ్వటానికి పెద్ద పండితుడైనా అడవిలోకి వెళ్లిపోయారు.  ఈ నేను ఆ నేను అని ఆయనకు confusion వచ్చేసింది. లాభం లేదు కంగారు పడిపోయారని 'మీరు వదిలేయండి. మీరు పెద్ద పండితులు అని నాకు తెలుసు. పెద్ద పెద్ద విషయాలు చెబుదురు గాని ఈ నేను గొడవ ఎందుకులేండి? ఇది బాగా చిన్న విషయం. అది వదిలేయండి. తరువాత నేను మాట్లాడుతాను కదా అది వదిలేయండి' అని అంటే ఆయన వదిలేశారు. తరువాత నేను ఒక పొరపాటు చేసాను. ఆయన ఒక నెల రోజుల్లో చనిపోతారనగా నాకు ఒక ఉత్తరం వ్రాసారు. అంతక ముందు నేను తిరుపతి వెళితే చూడటానికి వచ్చేవారు. ఆ ఉత్తరంలో 'నాకు మిమ్మల్ని చూడాలని ఉంది. అందుకు జిన్నూరు వస్తాను. మీరు అనుమతించగలరు' అని వ్రాసారు. అది ఇప్పటికి కూడా నాకు బాధ కలుగుతా ఉంటుంది. 'ఏవండీ మీకు వయస్సు ఎక్కువ ఉంది. నేను అప్పుడప్పుడు తిరుపతి వస్తున్నాను కదా. అప్పుడు వచ్చి చూడండి. జిన్నూరు రావటానికి అక్కడ express ఎక్కితే ఇక్కడ పాలకొల్లు లో దిగవచ్చు. కానీ మీకు అంత శ్రమ ఎందుకు? నేను వచ్చినప్పుడు మీరు వచ్చి నన్ను చూడొచ్చు కనుక రాకండి' అని చెప్పాను. నేను రావద్దు అని రెండు సార్లు అనేసరికి ఆయన జిన్నూరుకి రావటం మానేశారు పాపం. తరువాత నెల రోజులకు చనిపోయారు. 'నేనే పొరపాటు చేశాను. వస్తానంటే రానివ్వవలసింది' అనుకున్నాను.

ఒక వృద్ధ భక్తుడు నాన్నగారి అనుగ్రహ ప్రసంగం విని వెళ్ళిపోతూ ఇలా అన్నాడు:  'నాన్నగారు! మీరు తల్లిలా బుజ్జగిస్తూ, తండ్రిలా గమ్యం చూపిస్తున్నారు'.

## కాశీలో భక్తులు శ్రీ నాన్నగారు ఊరిలో లేని లోటు గ్రహించడం

విశాఖపట్నం లో పెళ్లి ఉందని మేము కాశినుండి రెండు రోజులు ముందు వెళ్ళిపోయాము. మేము 2nd వ తారీకు వచ్చేస్తే మరికొంతమంది భక్తులు 4 లేక 5 వ తారీఖు తిరిగి వచ్చారు. ఆ 4 వ తారీకు వచ్చేసిన పెద్దమనిషి ఈ మధ్య కనిపించి అన్నారు: 'నాన్నగారు మీరు 2nd వ తారీకు వెళ్లిపోయారు. అప్పుడు అనిపించింది 'The Light has gone away'. దీపం వెళ్లి పోయింది. దీపం ఆరి పోయింది అని నేను చెప్పడంలేదు, దీపం వెళ్ళిపోయింది. ఇంకా కాశీలో ఉన్న సుఖం కూడా మాకు కనపడలేదు. 3 వ తారీకు మరియు 4 వ తారీకు కూడా కాశీలోని ఉన్నాము కానీ కాశీ లో ఉన్న సుఖం కనపడలేదు. 'The Light has gone away'. మీరు ఆరిపోయారు అని చెప్పటంలేదు, వెళ్లిపోయారు అని చెపుతున్నాను. దీపం ఆరిపోయింది అనటంలేదు కాశీ విడిచి వెళ్ళిపోయింది. ఇవి immortal words. వాక్యం పలికిన వాడికి చావు ఉంటుందేమో కానీ ఆ వాక్యానికి చావు లేదు.

ఒక భక్తుడిని నాన్నగారు అడిగారు: 'మీరు బైపాస్ సర్జరీ చేయించుకొని ఎన్నాళ్ళు అయ్యింది?' అంటే ఆయన 22 సంవత్సరాలు అని చెప్పారు'. అప్పుడు నాన్నగారు అన్నారు: 'బైపాస్, స్టెంట్, కిడ్నీ మార్పిడి - వీటన్నిటి లైఫ్ 12 సంవత్సరాలు. ఆ తర్వాత మనిషి ఉండొచ్చు ఉండకపోవచ్చు. గడియారం ముల్లు ఆగినట్లు వారి ప్రాణం ఆగిపోవచ్చు. ఇది Miracle అండి. మీరు ప్రయాణం ఒంటరిగా చేయకూడదు. మీరు మెడికల్ సైన్స్ కి above గా వెళ్లిపోయారు' అంటే ఆ భక్తుడు అన్నాడు: 'మీరుండగా మాకు సైన్స్ ఎందుకు నాన్నగారు?'

నాన్నగారు ఒక భక్తురాల్ని అడిగారు: 'భగవాన్ టీచింగ్ కన్నా ఆచార్యుల వారిది స్వీట్ గా ఉంటుందంటావా?' అంటే ఆవిడ అన్నారు: 'మీరు ఏది చెప్పినా స్వీట్ గా ఉంటుంది నాన్నగారు'.

నేను Thank you All - అంటే మీరు మాట్లాడటం లేదేంటి? మీరు ఎందుకు thanks చెబుతున్నారు అని అడగటం లేదేంటి? నేనే మీకు thanks చెబుతున్నాను for your coming. వచ్చారు కదా. మీరు రాకపోతే ఎవరికి చెబుతాను?

నాన్నగారు బయటకు వెళ్లాల్సి ఉంది. కనుక 'time ఎంతైంది?' అని అడిగారు. ఒక భక్తురాలు time చెబితే నాన్నగారు ఇలా అన్నారు: 'మీ అందరికి waiting అక్కర్లేకుండా ఇంకో పది నిమిషాల తర్వాత వెళ్తాము. దీనికి mathematics algebra లో ఒక సిద్ధాంతం ఉంటుంది: మీరు ఇక్కడ 10 మంది కూర్చున్నారు. మిమ్మల్ని నాలుగింటికి రమ్మని నేను ఎక్కడికో బయటకి వెళ్ళిపోయి రెండు నిమిషాలు లేట్ గా వచ్చాననుకో నేను ఏమి అనుకుంటాను? రెండు నిమిషాలు లేటుగా వచ్చాను అనుకుంటాను. కాని అది తప్పు. 10 మందిలో మీకు రెండు నిమిషాలు వేస్ట్ అయినట్లే కదా. అంటే మీ టైం నేను 20 నిమిషాలు పాడు చేసినట్లు. నేనేమి అనుకుంటా? నా రెండు నిమిషాలు వేస్ట్ చేసుకున్నాను అనుకుంటాను. కాని మీ 10 ★ 2 = 20 నిమిషాలు వేస్ట్ చేసింది ఎవరు? నేనే వేస్ట్ చేసాను. Europe లో time is money.

నాన్నగారు చాలా అస్వస్థత గా ఉన్నప్పుడు ఒక MLA గారు నాన్నగారిని చూడటానికి వచ్చారు. అక్కడ సుమారు ఒక 200 మంది భక్తులు నాన్నగారు గురించి వేచిఉండటం చూసి ఆయన దిగ్భ్రాంతి చెందారు. ఆయన నాన్నగారితో: 'ఇలాంటి సమయం లో కూడా మిమ్మల్ని భక్తులు వదలరా?' అని అంటూ మళ్ళీ ఆయన నాన్నగారిని అడిగారట: 'ఇంతకీ ఒక మాట చెప్పండి. మీకు భక్తులంటే ఎక్కువ ఇష్టమా లేక భక్తులకు మీరంటే ఎక్కువ ఇష్టమా?' అంటే నాన్నగారు అన్నారట: 'దీనికి నా దగ్గర సమాధానం లేదండి. దీనికి సమాధానం చెప్పడం చాలా కష్టం అండి'.

'నా దగ్గరికి రావటం మీ కాలాన్ని వృధా చేసుకోవడం అనుకోకండి. నా దగ్గర గడిపిన క్షణాలు మీ జీవితాల్లో అత్యంత మధురమైన గడియలు' అని నాన్నగారు చాలా సార్లు చెప్పారు. ఒకసారి అరుణాచలం లో ఇలా అన్నారు: ఇటువంటి రోజు మళ్ళీ ఎప్పుడు వస్తుంది. చంద్రుడు ఈ రోజు పూర్ణంగా ఉన్నాడు. ఇవే మనకు మధుర గడియలు. జీవితంలో ఇలాంటి క్షణాలు కొన్నే ఉంటాయి. ఇవ్వే మనకు రేపటికి స్వీట్ memories (తీపి గుర్తులు). వెన్నెల పిండి ఆరబోసినట్లుంది.

చోడవరం డాక్టర్ గారు ఎప్పుడు జిన్నూరు రాత్రి సమయంలో వచ్చేవారు. 'ఏమండీ మీరు కష్టపడి రాత్రుళ్ళు వస్తున్నారు, పగలు వస్తే బాగుంటుంది కదా?' అంటే 'పగలు నాకు రావటం కుదరదు' అని చెప్పేవారు. 'నేను చాలా తిరిగాను కాని మీ దగ్గర పొందే శాంతి నేను ఎక్కడా పొందలేదు. అందుకే కష్టపడి వస్తున్నాను. నేను మీ కోసం రావడంలేదు; నా కోసం మీ దగ్గరకు వస్తున్నాను' అని చెప్పేవారు. ఆయన చనిపోయేముందు రోజున భార్యతో ఇలా అన్నారట 'ఈ జన్మలో నాన్నగారు ఇక్కడకి రారు, నేను జిన్నూరు వెళ్లలేను, ఇంకా ఈ జన్మలో ఇద్దరం కలుసుకొనే అవకాశం లేదు' అని చెప్పారట. ఏదో మామూలుగా అంటున్నారు అని భార్య ఆ మాటలు పట్టించుకోలేదు. మరుసటి రోజున ఆయన చనిపోయారు. అది జన్మాంతర అనుబంధం. శరీరాలు ఎక్కడ ఉన్నా మానసిక అనుబంధం పని చేస్తుంది.

భక్తుల పట్ల శ్రీ నాన్నగారు తమకు గల ప్రేమను ఈ విధంగా వ్యక్తం చేసారు: ‘నా శరీరం మరణించినా వారి హృదయాలలో జీవించే ఉంటాను'.

‘చెప్పటం కాదు ఇవ్వటమే. ఏ ఒక్కరికి ఇవ్వకపోయినా బాధపడతారు కదా, అందుకని అందరికీ ఇచ్చేద్దాం' అని నాన్నగారు ఎప్పుడూ అనేవారు.  ఆయన దయ అటువంటిది.



## హృషీకేష్ నుంచి శ్రీ ఆత్మానంద స్వామీజీ శ్రీ నాన్నగారి దర్శనార్ధం రావటం



కొన్ని words mortal. ఇవాళ వింటాం, రేపు మరచిపోతాం. కొన్ని words immortal. అంటే శరీరాలు పోయినా, అవి మన మనస్సులో మెదులుతూ ఉండాలి. హృషీకేష్ స్వామి వచ్చినప్పుడు 'మా ఆశ్రమానికి మీరు రండి' అని అనలేదు. 'మన ఆశ్రమానికి వెళ్ళిపోదాం రండి' అన్నారు. ఆ expression very beautiful. Singular నెంబర్ వాడలేదు, plural నెంబర్ వాడారు. అవి immortal words. మీరు ఎవరైనా పిలిస్తే 'మా ఇంటికి రండి' అని అంటారు. కానీ ఆయన ' హృషీకేష్ లో మన ఆశ్రమానికి వెళ్ళిపోదాం. మన ఆశ్రమానికి ఆనుకొని గంగా నది ప్రవహిస్తోంది' అన్నారు. కొన్ని మాటలు మన మనస్సును కడిగేసి వదిలేస్తాయి. It is not a mortal word. It is an immortal word. పోనీ ఆయనకీ నాకు బహుకాల పరిచయం ఉందా అంటే పరిచయం లేదు. హృషీకేష్ నుండి పక్కనే ఉన్న టౌన్ లో ఉన్న airport వెళ్లి ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి విజయవాడ airport కి వచ్చారు. విజయవాడ నుంచి జిన్నూరు ఎక్కడ ఉందో తెలుసుకున్నారు. పాలకొల్లు దగ్గర అని తెలుసుకొని, పాలకొల్లు వచ్చి నాకు తెలియకుండానే lodging తీసుకొని, ఆయన సహచర్యుని తీసుకొని ఇక్కడకు వచ్చారు. ఆయన పెద్ద స్వామి. ఇతర దేశాలు కూడా వెళ్లి మాట్లాడుతా ఉంటారు. ఆయనతో మాట్లాడినప్పుడు తెలుస్తుంది నా హృదయం కంటే ఆయన హృదయం విశాలమైనది అని. He is a big man. నేను ఆయన్ను చూడటానికి వెళ్ళాలి కానీ ఆయన నన్ను చూడటానికి వచ్చారు - అది ఈశ్వరుని లీల.

## శ్రీ నాన్నగారినే ఆలోచింప చేసిన భక్తుడు




Calcutta లో వివేకానందుని neighbours ఉన్నారు. వారు మన తెలుగు అమ్మాయిని చేసుకున్నారు. వాళ్ళ father Calcutta corporation లో పనిచేసి చనిపోయారు. Mother ఇంకా ఇంటికాడ ఉన్నారు. వీరు వీరి భార్య Paris లో పనిచేస్తారు. మేము కలకత్తాలో ఉన్నప్పుడు వారు వచ్చారు అందుచేత వారింటికి తీసుకెళ్ళారు. వారు చదువులో మనకన్నా పెద్దోళ్ళు. ఏదో తింగరితనంగా: 'మీ అమ్మగారికి ఏదైనా డబ్బు పంపుతారా? మీకు Paris లో income ఎంత ఉంటుంది? మిగిలిన డబ్బు ఏమి చేస్తున్నారు?' ఇటువంటి ప్రశ్నలు నేను వారిని అడుగుతున్నానమ్మా. మనం చెప్పేవన్నీ విన్నాడమ్మా. 'ఏవండి ఈ ప్రశ్నలంతా ఏమిటి? నేను సమాజానికి ఎలా ఉపయోగపడతానో చెప్పరేంటి? ఈ గొడవలేంటి? మిమ్మల్ని ఎందుకు తీసుకొచ్చాను ఇక్కడికి? అసలు సమాజానికి ఎలాగ ఉపయోగపడతానో ఒక్క మాటైనా చెప్తున్నారా మీరు? మిమ్మల్ని ఇక్కడికి ఈ మాటలు చెప్పటానికి తీసుకొచ్చానా? మీరు అసలు society గురించి ఏదైనా ఆలోచిస్తున్నారా? పైగా నాన్నగారు అని పేరా?' వారు అడిగింది బాగానే అడిగారు కదా. నాకు కాస్త సిగ్గేసిందమ్మా. అప్పుడు నేను 'మొత్తానికి వివేకానందుని పొరుగువాడు అన్పించుకున్నారు మీరు' అని అన్నాను.

## 'మీకంటే మీ భార్యే గొప్పది' అని శ్రీ నాన్నగారు బోధించిన సన్నివేశం

మేము ఒక shop కి వెళ్ళాము. ఆయనకు సంవత్సరానికి 50 లక్షల ఆదాయం వస్తుందట. ఆయన అన్నారు: '50 లక్షలలో నేను 30 లక్షలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తున్నాను. అయితే ఇప్పటివరకు అలా సహాయం చేసిన వారిని ఎవ్వరిని కూడా మీ కులం ఏమిటి లేక మతం ఏమిటి అని అడగలేదు'. అప్పుడు మేము చెప్పాము: 'మీ కంటే మీ భార్యదే గొప్ప మనస్సు. ఎందుచేతనంటే ఆవిడ మీకు సహకరించకపోతే మీరు ఇంత ధనసహాయం చేయలేరు'. 'ఆ మాట నిజమండి. నా పేరు కన్నా నా ఆవిడ పేరు మీరు ఎక్కువ తలపెడుతున్నారు' అన్నారాయన.

## భక్తురాలి సమాధానం తో నిశ్చేష్టులైన నాన్నగారు

నాన్నగారు వెళ్లిన పెళ్ళికి వచ్చిన ఒక భక్తురాలు నాన్నగారి పక్కనే కదలకుండా కూర్చున్నారట. పెళ్లి అయిపోయాక వారు నాన్నగారికి నమస్కరిద్దాం అని వస్తే నాన్నగారు అడిగారట: 'మీ పేరేంటి? మీది ఏ ఊరమ్మా?' అంటే ఆవిడ అన్నారట: 'అదేంటి నాన్నగారు? నా పేరులో గాని ఊరులోగాని ఏముందండి? రూపబుద్ధిని నామబుద్ధిని భగవాన్ పచ్చడి చేసేయమన్నాడు కదా నాన్నగారు. నా పేరుతోని ఊరితోని పనేముందండి?' అంటే నాన్నగారు అన్నారట: 'ఏమిలేదమ్మా నువ్వు కాలు చేయి కదపకుండా కూర్చున్నావు. అందుకే అడుగుతున్నాను'. అంటే దానికి ఆవిడ అన్నారట: 'మిమ్ముల్ని చూసిన ఆనందం లో నా మనస్సు స్తంభించిపోయింది. కాలు చేయి కదలక పోవడానికి అదే కారణం. నా పేరులో గాని ఊరులోగాని ఏముందండి? రూపబుద్ధిని నామబుద్ధిని భగవాన్ పచ్చడి చేసేయమన్నాడు కదండి.' 'నన్ను ఇలా తిట్టి పోసిందమ్మా ఆవిడ. పడున్నామమ్మా ఇలాగ' అని అన్నారు నాన్నగారు.

'పవిత్రత, ఏకాగ్రత - ఈ రెండు పదాలు విన్నప్పుడల్లా నాకు కంట నీరు ఆగటం లేదండి ' అని ఒక భక్తురాలు నాన్నగారితో చెబితే, నాన్నగారు అన్నారు: 'ఒక మంచి ఆశయం గురించి కంట నీరు కారినప్పుడు ఆ నీరు తీయగా ఉంటాయి. కోపం ఉద్రిక్తత వలన వచ్చే కన్నీరు పుల్లగా ఉంటాయి'.

# శ్రీ నాన్నగారి గురుతత్త్వం యొక్క ప్రధానమైన అంశం

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ గారు గురుపూర్ణిమ సందర్భముగా మాట్లాడిన మాటలు:



శ్రీ గురుభ్యో నమః. పరమేశ్వర స్వరూపులైన నాన్నగారికి, ఈ సమావేశానికి సముద్ర తరంగాలలా తరలి వస్తున్న అశేష ప్రజానీకానికి, నా హృదయ పూర్వక నమస్కారాలు. ఈ రోజు గురుపూర్ణిమ పుణ్యదినోత్సవం. శ్రీమన్నారాయణుని దగ్గర నుంచి నాన్నగారు వరకు ఉన్నటువంటి గురుపరంపర అందరికీ శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నాను. ఈ గురుతత్త్వం ఏమిటి? గురువు ప్రాధాన్యత జీవితంలో ఏమిటి అన్నది నేను తెలుసుకున్నది సరిగ్గా 21 సంవత్సరాల క్రితం. ఈ జిల్లా కలెక్టర్ గా వచ్చిన కొత్తలో సద్గురు నాన్నగారు యొక్క దర్శన భాగ్యం నాకు కలిగింది. 'రమణ మహర్షి యొక్క సిద్ధాంత సారాన్ని అంతా సామాన్యులకు అర్థం అయ్యే భాషలో చెప్పి ఎంత మందినో పునీతులను చేసిన మహామనీషి శ్రీ నాన్నగారు. వారి దర్శనం మీకు ఇప్పిస్తాను' అని ఒక స్నేహితుడు నాతో అన్నాడు. కాపీన జటాదారులన్నీ ఉన్నటువంటి వారిలా ఋషి రూపం లో నాన్నగారు కనిపిస్తారేమో అని అనుకున్నాను. చూస్తే ఎప్పుడో గతించినటువంటి మా నాన్నగారు నా మీద చూపించేటువంటి ఆత్రతా భావన ఏదైతే ఉంటుందో - ఆ ఆత్రతా భావన తోటి, చిరు నవ్వు తోటి, నాన్నగారిని చూడటం జరిగింది. అంటే గురు స్వరూపం ఎలా ఉంటుంది? అనేటువంటి దాని మీద మనం కొంచెం జాగ్రత్తగా ఉండాలి. గురువు ఒక ప్రత్యేకమైన వేషంతోటి, ఒక ప్రత్యేకమైన రూపం తోటి వస్తారు అనేటటువంటి అపోహ భక్తులకు పనికి రాదు. గురు రూపం ఎలా అయినా ఉండొచ్చు. అందుకే దత్తాత్రేయులవారు 'నాకు గురువు 24 రూపాలలో కనిపించారు' అని చెప్పారు. స్వస్వరూప అనుసంధానం కోసం, మన స్వరూపం మనకు బోధించడానికి వచ్చిన గురువు యొక్క తత్త్వం సరిగ్గా అర్థం చేసుకున్నప్పుడు, ఆ గురు బోధల్ని, ఆ గురువు యొక్క ప్రవర్తనని, ఆ గురువు సామీప్యాన్ని సక్రమంగా అర్థం చేసుకోగల అవకాశం మనకు వస్తుంది. సాధారణంగా గురువులు శిష్యులకు దీక్ష ఇచ్చే విధానాలు శాస్త్రీయంగా మూడు పద్ధతులు అని చెబుతారు. ఒకటి మత్స్య దీక్ష, రెండవది కుక్కుట దీక్ష, మూడవది కూర్మ దీక్ష. అంటే ఒక చేప గుడ్లు పెట్టినప్పుడు, ఆ గుడ్లు పొదగడానికి దోహదకార్య గుడ్లను చూస్తూ వెళ్తుంది; అంతే ఇంకేమీ చేయదు. కేవలం చూడటం వలన గుడ్లు పొదిగి

చాప పిల్లలా తయారు అవుతాయి. ఈ తాంబేలు ఏమి చేస్తుందంటే వడ్డుకొచ్చి, ఇసుక తవ్వి, అందులో గుడ్లు పెట్టి మళ్ళీ వెళ్ళిపోతుంది. కానీ తాను పెట్టిన గుడ్లు పొదగాలని, ఆరోగ్యంగా ఎదగాలని మనస్సులో నిత్యం ఆలోచిస్తుంది. అంటే నేత్ర దృష్టి లేదు కానీ ఆలోచనా దృష్టి ఉంది. మనస్సులో పెట్టుకుంది ఆ గుడ్లని. కుక్కుట దీక్ష ఏమి చేస్తుందంటే, కోడి గుడ్లు పెట్టిన తర్వాత, వాటి మీద కూర్చొని స్పర్శించి పొదుగుతుంది. కాబట్టి గురువులు మూడు రకాల దీక్షలు కూడా ఇస్తారు. ఎవరికి ఏ రకమైన దీక్ష ఇస్తారు? మనం ఒక రోజున గురువు దగ్గరికి వెళ్తాం. బాగా పలకరిస్తూ ఉంటారు. అందరి ముందర కుర్చీ వేసి మనలను కూర్చో పెడుతారు. మన మనస్సులో 'గురువుగారికి నేను ప్రధానికుడిని, మిగతా శిష్యులందరూ సెకండరీ' అని బయలుదేరుతుంది. ఈ గురువుకి 'నేను ప్రధానికుడిని' అన్న అభిప్రాయమే అహంకారం. గురువుకు అందరూ సమానమే. మరి దేని మీద ఆధారపడి ఈ రకమైన దీక్షలు ఇస్తారు? దేనిమీద ఆధారపడి ఇస్తారంటే మన అహంకారం యొక్క స్వరూపాలు ఎలా మారుతున్నాయో దాన్ని బట్టి వారు ఆ దీక్షలు ఇస్తారు. ఒక్కో రోజు మనం అనుకుంటాం: 'ఎప్పుడూ మనం కనపడగానే ప్రీతిగా మాట్లాడే గురువుగారు ఇవాళ నాతో అసలు సంభాషించలేదు. పక్కన ఎవరితోనో మాట్లాడారు' అంటారు. అంటే గురువు యొక్క స్వరూపాన్ని అర్థం చేసుకోక ఈ రకమైన అనుమానాలు మనకు వస్తూ ఉంటాయి. జిన్నూరు నాన్నగారు వంటి గురువుగారు నేను చూసినటువంటి గురుతత్త్వంలో చాలా అరుదుగా కనిపించేటటువంటి వ్యక్తి. 1994 లో నాకు పరిచయం అయ్యారు. ఈ 21 సంవత్సారాల నుంచి వారు నన్ను ప్రభావితం చేస్తున్నారు. నేను ఏడాదికి లేక రెండేండ్లకు ఒకసారి వచ్చాను. వారి పాదస్పర్శ తీసుకొని వెళ్ళాను. కానీ నిరంతరం లోపల ఉండి ఎప్పటికప్పుడు నాకు ప్రబోధిస్తూ, అనేక క్లిష్టమైనటువంటి సమస్యలు పరిష్కారం లేకుండా ఉన్నప్పుడు, నాకు వారు సులభమైన పరిష్కారాలు తోపించి, ఎప్పటికప్పుడు నన్ను నడిపిస్తున్నారు. ఇది గురుతత్త్వం యొక్క ప్రధానమైన అంశం. గురువు కనపడినప్పుడు మనతో ఎలా ఉన్నారు అన్నది కాకుండా, మన మనస్సుని ప్రభావితం చేసే విధానం ఏమిటో మనకు తెలిసిపోతుంది. గురుకృప అంటే అది. నిత్యం మనం సన్నిహితంగా ఉండకపోయినా కూడా ఒక్కసారి వారు మనతో మాట్లాడారంటే, ఒక్కసారి వారి చూపు పడిందంటే సరిపోతుంది. హైదరాబాద్ లో ఒకసారి నాన్నగారు: 'రామకృష్ణగారికి దండ వేయండి' అని అన్నారు. అంటే నేను అన్నాను: 'మీ చూపు వెయ్యి దండల సాటివస్తుంది. మీ

చూపు చాలు కదా, ఇక దండ ఎందుకు స్వామీ?' నాన్నగారి అనుగ్రహం, ఆత్రత, వారి చూపు చాలు. అయితే కొన్ని అనుభవాలు కూడా ఉన్నాయి. మా మిత్రుడు ఒకాయన సైంటిస్ట్. డాటర్ మ్యారేజ్ కాలేదని వర్రీ పడుతూ ఉండేవాడు. ఒకసారి నా కూడా హైదరాబాద్ నుంచి బయలుదేరి నాన్నగారి దగ్గరకు వచ్చాడు. నాన్నగారి దర్శనం అయ్యింది. మాట్లాడాము, ఆశీర్వదించారు, వెళ్ళాము. అతను వెళ్ళేటప్పటికి అనూహ్యంగా మగపెళ్లి వారు ఇతని కోసం ఎదురు చూస్తున్నారు. అంతవరకు వారు అసలు మాట్లాడుకోలేదు. తరువాత ఆ మిత్రుడు నాతో అన్నాడు: 'నాన్నగారిలో అపారమైన మహిమ కూడా ఉందా?' కానీ నాన్నగారు మహిమల గురించి ఎప్పుడూ చెప్పలేదు. 'నేను చూపెడుతున్నాను, మీరు చూసారు' అని ఎప్పుడూ చెప్పలేదు. అది నిజమైన భక్తులకి, మనస్సులో నాన్నగారిని సుప్రతిష్టం చేసుకున్నటువంటి భక్తులకి- వాళ్లకు అనుభవాల రూపంగా గోచరించేది. ఇది నేను విన్న విషయం, నాకు జరిగిన విషయం. కాబట్టి కేవలం కొన్ని దైహికమైనటువంటి ఆశీర్వచనాలు ఇస్తేను, లేకపోతే కొన్ని miracles చేస్తేనే గురువు అన్న పద్ధతి కాకుండా గురువు అనేవాడు శిష్యులకు తత్త్వాన్ని బోధించాలి, నేనెవరు అనేది వారు తెలుసుకునేటట్లు చేయాలి. సామాన్యమైన గృహిణులు కొన్ని వేలమంది ప్రభావితులై ఈ రోజున వారి జీవితాలను సుఖమయం చేసుకుంటున్నారంటే, మహాపండితులకు కూడా అర్థం అవ్వని తార్కిక విషయాలని అతి సులభమైన ప్రజలకు అర్థం అయ్యే భాషలో నాన్నగారి అమృత వచనాలు ద్వారా మనకు అందుతున్నాయి అంటే, ఇది మనందరి అదృష్టం. ఇటువంటి గురువు దొరకడం మన సామూహిక అదృష్టం. ఈ గురుపూర్ణిమ రోజున శిరస్సు వంచి వారి పాదకమలాలకు నేను హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను. కానీ నమస్కరించటం కొంచెం కష్టం. ఎందుకంటే వారి పాదకమలాలు బయట లేవు, గుండెల్లోనే ఉంటే ఎక్కడ నమస్కరిస్తాం? అందుచేత గురువుగారు నిత్యం మనతోనే ఉన్నారు. ఇటువంటి గురువుగారి సన్నిధానం దొరికినందుకు నేను ఎంతో కృతజ్ఞుడను. అల్పుడనైనా నన్ను పిలిచి, నువ్వు ముందర మాట్లాడు. అంటే అది ఆదేశమే. గురువు ఆదేశం ఏమి చేస్తాం? మనం మాట్లాడి తీరవలసిందే. మాట్లాడే చాతుర్యం, నైపుణ్యం, వాక్ వైభవం లేనప్పటికీ కూడా గురువుగారు చెప్పినప్పుడు ఆజ్ఞగా పాటించి మాట్లాడాలి. అందుచేత గురువుగారి ఆశీర్వచనాలతో ఈ రెండు మాటలు మాట్లాడటానికి ధైర్యం చేసాను. మీ అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.

## శ్రీ నాన్నగారి మాటే మంత్రము

ఒక డాక్టర్ గారు శ్రీ నాన్నగారిని తొలిసారి దర్శించినప్పుడు ఆయనకు కలిగిన అనుభవం మరియు వారి ఇరువురి మధ్యజరిగిన సంభాషణ - 'మాటే మంత్రము' అనే వ్యాసం లోని అంశం:

తొలిసారిగా నేను 1984వ సంవత్సరము April 19వ తేదీన శ్రీ నాన్నగారిని దర్శించుకున్నాను. 35 సంవత్సరాల క్రితము జరిగిన ఆనాటి మధుర సంఘటన నా జీవిత గమ్యాన్నే మార్చివేసింది. నాలోని దుఃఖాన్ని ఆర్పివేసింది. ఈనాడు ఏది జరిగినా - నా కళ్ళలో ఆనందబాష్పాలు తప్ప - కన్నీరు నన్ను తాకలేకపోతోంది.



ఆనాటి మన తండ్రి ప్రతీనోటిమాట నా జీవితంలో మరపురాని ఒక మహా మంత్రమే! ఒక ఉపదేశమే! 1984 April 19వ తేదీ రాత్రి 8 గంటలకు తొలిసారిగా నేను శ్రీనాన్నగారి దివ్యదర్శనం చేసుకున్నాను. శ్రీనాన్నగారు చిరునవ్వుతో ప్రశాంతంగా నా కళ్ళలోకి చూసారు. ఒకసారి కళ్ళు మూసుకొని, మరల కళ్ళు తెరచి నా ముఖములోకి చూసారు. ప్రశాంతంగా ఉన్న ఆయన కళ్ళు ఒక్కసారిగా తళుక్కున వెయ్యి కేండిల్ బల్బు కన్నా కాంతిగా మెరిసాయి. అప్పటివరకు మామూలుగా ఉన్న ఆయన రెండు చెవులు లేడి చెవుల్లా నిక్కబొడుచుకున్నాయి. అలా చెవులు కదలడం నా జీవితంలో నేనెప్పుడూ ఎవరికీ చూడలేదు. అప్పటివరకు చిరునవ్వులు చిందిన ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది. రెప్పవేయకుండా కళ్ళు పెద్దవి చేసుకొని సూటిగా, తీక్షణంగా నా కళ్ళల్లోకి చూస్తూ ఉండిపోయారు.

ఒక్కసారి నా గుండె ఝుల్లుమనిపించి, ఒళ్ళు జలధరించింది. రోమాలు గగుర్పొడిచాయి. ఆ కళ్ళు మామూలు కళ్ళు కాదు. ఆ చూపు మామూలు చూపు కాదు. నన్నేదో మాయచేసి మైకంలో పెట్టి నా జీవితం మీద దాడి చేస్తున్నారనిపించింది. నిజం చెప్పాలంటే నాకు కొంచెము భయము వేసింది. దెయ్యం పట్టిన వాడిలా అలా చూస్తారేమిటి అనిపించింది. వివేకానందస్వామి జీవితంలో జరిగిన ఒక సంఘటన నాకు గుర్తు వచ్చింది. శ్రీరామకృష్ణుడు కాలి స్పర్శతో నరేంద్రుడిని మైకంలో పెట్టి మాయ చేసినట్లు ఈయన కూడా నన్నేదో మాయ చేస్తున్నాడనిపించింది. ఆకంటి చూపుకు బండరాళ్ళు కూడా వెన్నముద్దల్లా కరిగిపోతాయనిపించింది.



కొంతసేపు నిశ్శబ్ధం! గంభీరమైన మౌనం! ఆ మౌనం కూడా ఏదో మాటలాడుతున్నట్లుంది. నా మనస్సులో ఏవేవో ఆలోచనలు. అంతలో నిశ్శబ్ధాన్ని ఛేదిస్తూ... ''డాక్టర్ గారూ! ఏమైనా అడగాలనుకుంటన్నారా?'' అని అడిగారు. వెంటనే నాకు స్ఫురించింది - గ్రౌండ్‌ను ప్రిపేర్ చేయకుండా భూమిలో విత్తు నాటినా అది మొక్క మొలవదుగా? అందుకే మౌనంగా కంటిచూపుతో అప్పటి వరకు నా గుండెను పక్వము చేసి, నా గుండెలో గూడుకట్టుకున్న బరువును బయటికి తీయటానికి నన్ను కదుపుతున్నారని అర్థమైంది.

''ఔను నాన్నగారూ! ఆర్థికంగా మాకు స్థోమతున్నా కుటుంబ కలహాల వల్ల నా భార్య ఉద్యోగం చేసి నన్ను డాక్టరు చదివించింది. చదువు పూర్తై నా భార్య కష్టానికి కృతజ్ఞత తీర్చుకుందామనుకున్న తరుణంలో నా భార్యకు తీవ్రమైన గుండెనొప్పి వచ్చి డాక్టర్లు బ్రతకదని చెప్పారు. కానీ బ్రతికింది. అప్పటినుంచి డబ్బుతోనే బ్రతికిస్తున్నాను. జీవచ్ఛవంలా బ్రతికే నా భార్యను చూస్తే మృత్యువుతో కాపురం చేస్తున్నట్లు అనిపిస్తుంది. మరోసారి నొప్పివస్తే నా భార్య బ్రతకదని నాకు తెలుసు. మరణం మమ్మల్ని వేరుచేయకముందే నా గుండె బాధను దించుకోవాలనే ఆశతో మీ దర్శనానికి వచ్చాను నాన్నగారూ...'' అని నా గుండె బరువును దించుకున్నాను.

''గుండెల్లో ఎంత బాధను దాచుకున్నారు డాక్టరుగారూ! మీరు దుఃఖాన్ని దాటి పోవాలంటే ఒక చిన్న చిట్కాను చెప్తాను. అది మీకు అర్థమైతే ఇప్పుడే చిరునవ్వుతో ఇంటికి తిరిగి వెళ్ళిపోతారు.''

ఆయన మాట మీద నాకు నమ్మకం కుదరలేదు. అయినా మర్యాదకోసం మౌనంగా ఉండిపోయాను.

''డాక్టరుగారూ! మీరూ, మీ భార్యే కాదు..... నిజానికి ఏ జీవుడూ అసలు పుట్టనే లేదు! పుట్టానని భ్రమపడుతున్నాడు... అందుకే చస్తానని భయపడుతున్నాడు''

''అదేమిటి నాన్నగారూ? నేను పుట్టాను - మీ ముందే ఉన్నానుగా?'' అన్నాను తడబడుతూ...



నా అమాయకత్వానికి నాన్నగారు చిన్న చిరునవ్వు నవ్వి ''ఇదేమిటి డాక్టరు గారూ?'' అని చేతికి ఉన్న నా వాచీని చూపించారు.

''నా వాచీ నాన్నగారూ'' అన్నాను.

''అంటే ఆ వాచీకి మీరు యజమాని అన్నమాట. అంతేగాని ఆ వాచీయే మీరు కాదు గదండీ?'' అన్నారు.

''ఔను నాన్నగారు''.

''మరి ఇదేమిటి?'' అని నా చేయి పట్టుకున్నారు.

ఆ స్పర్శకు నా గుండెల్లో ఏదో కుదుపు వచ్చినట్లు శరీరం జలధరించింది. ఆ స్పర్శే నా జన్మకు శాపవిమోచనకై ఆ తండ్రి ముహూర్తం పెట్టాడని ఆనాడు నాకు తెలియదు.

ఏదో అయోమయంలో ''నా చేయి నాన్నగారూ'' అన్నాను.

అప్పుడు నాన్నగారు: “అంటే ఆ వాచీకి మీరు యజమాని ఎలాగో.... ఈ చేతికి కూడా మీరు యజమానే గాని ఈ చేయే మీరు కాదు కదండీ? మరి ఈ చేయి నాది అని చెప్పే యజమాని ఎవరంటారు? ప్రతివాడు నా కాళ్ళు, నా కళ్ళు, నా ముఖం, నా గుండె, నా తల, నా శరీరం అంటాడే గానీ .... అవే నేనని చెప్పడం లేదేమిటండీ? అంటే వీటి అన్నింటికి వేరుగా ఒకడు ఉన్నాడన్నమాట! వాడెవడు? జాగ్రదవస్థలో చిన్నమాటంటే



తిరగబడి రెచ్చిపోయి రంకెలేసే ఆ పెద్దమనిషి గాఢనిద్రలో ఒక తాపు తన్నినా తిరగబడడేమండీ? పోనీ నిద్రలో వాడు లేడా అంటే - నిద్ర లేవగానే రాత్రంతా నాకు సుఖంగా నిద్రపట్టిందని సిద్ధమౌతున్నాడు కదండీ? మరి గాఢ నిద్రలో ఆ పెద్దమనిషి ఎక్కడికి పోతున్నాడంటారు? డాక్టరుగారూ! ప్రతివాడు ‘నేను - నాది’ అని గుండెలమీద కుడివైపు క్రింది భాగములోనే చేయి వేసుకుంటాడు - మీరు ఎప్పుడైనా గమనించారా? అంటే ఆ నేనుకు మూలం అక్కడనే ఉందన్నమాట. దానినే ఆధ్యాత్మిక హృదయం అంటారు. అది మన దేహంలో ఉన్నమాట నిజం - కాని అది మన దేహంలో ఒక భాగము మాత్రం కాదు. అందుకే మన దేహాన్ని కోసి చూస్తే అది కళ్ళకు కనిపించదు. దేహము మరణించినప్పుడు అది మరణించదు - దేహమును కాల్చినపుడు కట్టెలలో అది కాలదు.

ఆ హృదయములో ఆత్మ (బ్రహ్మము) నిరంతరము ‘నేను నేను’ అనుచు స్వయముగా ప్రకాశిస్తున్నది. అది సత్ చిత్ ఆనంద స్వరూపము! అది అనంతము, అఖండము, అమరము, అజరము, అద్వితీయము, అనిర్వచనీయము, అవ్యయము, అభవము, అభౌతికము, కాలాతీతము, గుణాతీతము, ఊహాతీతము. దానిని గాలి కదుపలేదు - నిప్పు కాల్చలేదు - నీరు తడుపలేదు. అది మనకంటే వేరుగా ఎక్కడో లేదు - మన స్వరూపం గానే ఉంది - మన హృదయములోనే ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నది.

చైతన్యమైన ఆత్మను - జడమైన దేహమును కలిపి ముడిపెడుతూ రెండింటికి మధ్యన మిథ్యానేను ఒకటి పుట్టుచున్నది. దానినే ‘చిజ్జడ గ్రంథి’ అని, జీవుడని, అహంకారమని, కారణ శరీరమని అంటారు. ఆత్మగతమైన నేనులో నుంచి - నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు దేహపరిమితమైన నేను పుట్టి, అది దాని

పుట్టుకను మరచిపోయి స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది, స్వయంభువుడిని అనుకుంటుంది. ఈ 'నేను' అను తలంపే తొలి తలంపు - మూల తలంపు - పునాది తలంపు! ఈ మూల తలంపునకే మిగిలిన అన్ని తలంపులు వచ్చుచున్నవి. ఆ తలంపుల మూటే మనస్సు! మూల తలంపును ఆధారము చేసుకొనే ఈ సృష్టి అంతా ఆధారపడి ఉంది. జగత్ జీవేశ్వరులు కూడ ఈ మనస్సు యొక్క సృష్టే! మనస్సు ఉంటే అంతా ఉంది - మనస్సు లేకపోతే ఈ సృష్టే లేదు! -




గాఢ నిద్రలో దేహపరిమితమైన నేను దాని పుట్టుచోటైన ఆత్మలో అణిగిపోతుంది. ఆత్మలో సుఖముంది. రాత్రంతా గాఢనిద్రలో ఆ సుఖ సముద్రములో ఈదులాడుతుంది. అంతలో మెలకువ వస్తుంది! మరల నేను అను తలంపు పుడుతుంది - మీ సంసారమంతా గుర్తుకు వస్తుంది - దుఃఖాన్ని తీసుకువస్తుంది.

సంసారమంటే ఏమిటి? మనిషి నేను చేస్తున్నానని ఏపని చేసినా - ఆపని వాసనగా మారుతుంది. నేను చేస్తున్నాననే కర్తృత్వము ఉన్నంతకాలము - జన్మవచ్చి తీరుతుంది - దేహము వచ్చి తీరుతుంది. దేహము వచ్చిందంటే - మరణము వచ్చి తీరుతుంది.

మరణమంటే మనిషి ఎందుకు భయపడుతున్నాడు? చనిపోతే మరల ఈ దేహం కనబడదేమో, సంసారం కనబడదేమో - అదేగా మీ భయం? కానీ ఎప్పుడో మరణం దాకా ఎందుకండీ? ప్రతిరోజూ మీ గాఢనిద్రలో మీ దేహంతోటి, సంసారం తోటి మీకు సంబంధము తెగిపోతూనే ఉందిగా? మంచం మీద పడుకున్నారో నేలమీద పడుకున్నారో కూడా మీకు తెలియదుగా? అందరూ నిద్రను కోరుకుంటున్నారుగా? అంటే నిద్ర లేవగానే మీ సంసారమంతా మీ కళ్ళముందే కనిపిస్తుంది. ఇదీ మీ అనుభవం!

కానీ నిజానికి నిద్ర ఎటువంటిదో చావు కూడా అటువంటిదే! మరణమంటే మార్పు! ఒక శరీరంలోనుంచి మరో శరీరంలోకి మారడం. మనిషికి మోహం ఉన్నంతకాలము పాపం చేసితీరతాడు. మంచి చేసిన వాడికి సద్గతి,

చెడు చేసిన వాడికి దుర్గతి అనుభవించి తీరవసినదే. అనుభవించటానికి మరల దేహం వచ్చి తీరవలసినదే. దేహమంటూ వస్తే చావుపుట్టుకలు తప్పవు. ఇది దేవుని చట్టం! గురువు సహాయం లేకుండా ఏ జీవుడు దేవుని చట్టాన్ని అతిక్రమించలేడు! జనన మరణ చక్రములో నుంచి బయటపడలేడు. గురుకృప కావాలంటే - శరణాగతి ఒక్కటే గతి! శరణాగతి ఉన్నవాడు అంతా ఆ తండ్రి దయే అనుకుంటాడు - జరిగే ప్రతి సంఘటన ఆ తండ్రి ప్రసాదంగానే స్వీకరిస్తాడు - అప్పుడు అంతా ఆనందమే!



డాక్టరుగారూ! పొద్దుపోయింది. ముగించే ముందు ఒక చిన్నమాట! భగవంతుడు కరుణామయుడు! అందుకే మనమీద ప్రేమతో ఒక చిన్నమాయను పెట్టాడు. ఈ మాయ మీకు అర్థమయితే మీ దుఃఖమంతా ఇప్పుడే ఇక్కడే ఆరిపోతుంది.. మీరు నిద్రలేచిన తరువాత మీ సంసారం ఎంత నిజమో - మరణానంతరం మరల మీ సంసారము అంతే నిజం! రాత్రి పడుకొనేముందు ఒక పుస్తకం 100 పేజీలు చదివి - మరునాడు ఉదయం 101వ పేజీ చదువుతారా? లేక మరల 1వ పేజీ నుంచి చదువరు కదా? ఇదీ అంతే! మరణానంతరం మరో దేహం - దానికి సంబంధించిన సంసారం అంతే సహజం! కాకపోతే దేహాలు మారతాయి - మీ సంసారమంతా మీ చుట్టూనే తిరుగుతుంటుంది. కాకపోతే ఇక్కడే భగవంతుడు చిన్నమాయను పెట్టాడు! చావుపుట్టుకలకు మధ్యలో 'మరుపు' అనే మాయను పెట్టాడు. మీకు ఇష్టమైన మీ సంసారమంతా మీ చుట్టూనే ఉంటుంది. అడ్రస్సులు మారిపోతాయేమో - బ్యాంకు అకౌంట్లు మారిపోతాయేమోనని భయపడనక్కరలేదు ఎవరూ. భగవంతుడు కృతఘ్నుడు కాదు - కృతజ్ఞుడు! కర్తృత్వ బుద్ధి ఉన్నంతకాలము ఎవరిమూట వాళ్ళకు అప్పచెప్తాడు. ఇది నిజం.

డాక్టరుగారూ! మీ విలువైన కాలాన్ని చాలా ఖర్చుపెట్టాను. జాగ్రత్తగా ఇంటికి వెళ్ళండి. నా మాటల్ని మర్చిపోకండి - మననం చేసుకోండి! మీ సందేహాలకు సందేశాలు మీ హృదయంలోంచే వస్తాయి. ఎత్తువారి బిడ్డలుగా కాకుండా స్వతంత్రముగా ఆలోచించండి! మీ బుద్ధికి పని చెప్పండి! మీకు మంచి అనిపించింది ఆచరించండి! రమణానుగ్రహము మీమీద ఉంది! మీకు దారి కనిపిస్తుంది! ఈ ఇంటి తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే వుంటాయి! ఉంటాను!'' అంటూ నన్ను కారుదాకా సాగనంపారు.

## హాస్పిటల్ జాయిన్ అవ్వడానికి వెళ్లేముందు నాన్నగారు భక్తులకు చెప్పిన ఆఖరి మాట

రామకృష్ణులు పెద్ద మంచం మీద పడుకునేవారు, శారదా మాత చిన్న మంచం మీద పడుకునేవారట. ఒక రోజు రామకృష్ణులు శారదాదేవితో అన్నారట: 'అంత ఇరుకుగా ఆ చిన్న మంచం మీద ఏమి పడుకుంటావు? వచ్చి నా దగ్గర పడుకో' అంటే శారదా మాత అన్నారట: 'నేను వచ్చి పడుకుంటే మీకు ఇరుకు అవుతుంది కదా. నాకు నిద్ర పట్టినా మీ నిద్ర చెడిపోతుంది కదా. కనుక మీ నిద్ర మీదే, నా నిద్ర నాదే'. అప్పుడు రామకృష్ణులు అన్నారట: ' నీ నిద్ర గురించి ఆలోచించకుండా కేవలం నా నిద్ర గురించి ఆలోచించేటంత స్వార్థపరుడిని కాదు నేను'. అంటే అప్పుడు శారదామాత అన్నారట: 'పరమార్థం ఉన్నచోటు స్వార్థం ఉంటుందా?'

## చివరి రోజులు- భక్తుల అనుభవాలు

శ్రీ నాన్నగారు దేహయాత్ర చాలించే ముందు, చివరి మూడు నెలలలో ఆయనతో సన్నిహితంగా గడిపి ఆయన సేవలో తరించి, ఆయన దివ్య ప్రేమని అనుగ్రహాన్ని ప్రత్యక్షంగా అనుభవించిన భక్తులు వారి అనుభవాలు మనతో పంచుకొని ఆ అనుగ్రహంలో మనకి కూడా భాగం పంచుతున్నారు.

శ్రీ నాన్నగారు గత 3-4 సంవత్సరాలుగా అనారోగ్య సమస్యల వల్ల శారీరకముగా ఇబ్బందులకు గురి అవుతున్నారు. పుట్టినరోజు సెప్టెంబరు 23 నాటికే ఆయన దేహం నీరసించి అలసటగా ఉంది. అప్పటికే ఆయన సున్నితమైన చర్మంపై వచ్చిన దద్దుర్లవల్ల దురద మంటలతో బాధపడుతున్నారు. అంత బాధలో కూడా ఒక భక్తుని ఇంటిలో పెళ్ళికి వస్తానని మాట ఇచ్చాననే నెపంతో చివరిసారిగా దేహంతో హైదరాబాదు భక్తులని అనుగ్రహించటానికి అక్కడికి ప్రయాణం చేసారు. చర్మవ్యాధికి వైద్యం కోసం భీమవరంలో కొన్ని రోజులు ఉన్నారు. డాక్టరు వ్యాధి తీవ్రంగా ఉంది, విపరీతమైన బాధ ఉంటుంది అన్నారు. అంత బాధలోనూ భీమవరంలో ఉన్నన్ని రోజులూ భక్తుల కోసం సమయం వెచ్చించారు. భక్తులతో ఉన్నంతసేపూ నాన్నగారికి సమయమే తెలియదు! ఆ సమయంలో రామకృష్ణ పరమహంస గురించి ఎక్కువగా చెప్పేవారు. ఆ సమయంలో ఒక రాత్రి తన భక్తుడిని దగ్గరకు పిలిచి అన్నారు, ''ఇంక సరిపోతుంది, మాకూ సరిపడా వయస్సు ఉందికదా, ఇంకా ఉన్నా కాంప్లికేషన్స్ ఉంటాయి.'' ఆ భక్తుడికి కొన్ని చెయ్యవలసిన పనులు, బాధ్యతలు అప్పగించారు. 2017 అక్టోబర్

13వ తేదీన విశాఖపట్టణములోని అపోలో హాస్పిటలులో ఆందోళనకరమైన ఆరోగ్య పరిస్థితిలో శ్రీ నాన్నగారికి వైద్యం ప్రారభించారు. విశాఖపట్టణములోని భక్తుల అభ్యర్ధనను మన్నించి హాస్పిటల్ సిబ్బంది ప్రత్యేకమైన వసతులు కల్పించి ప్రత్యేక శ్రద్ధతో గౌరవంగా చూసారు. రుగ్మతలు ఒకటి తరువాత ఒకటి వచ్చి ఆయన శరీరాన్ని బాధించాయి. తరువాత షర్మిలగారు అనే భక్తురాలి ఇంటిలో కొద్ది రోజులు ఉన్నారు. ఆ సమయంలో ఆయనంతట ఆయన లేచి కూర్చునే ఓపిక కూడా లేదు; అయినా పరిపూర్ణానంద స్వామి చూడటానికి వచ్చారని విని శ్రమలేకుండా లేచి కూర్చుని ఆయనతో కొంతసేపు మాట్లాడారు. పరిపూర్ణానంద స్వామి చేపట్టిన కార్యక్రమాలను మెచ్చుకొని శుభాకాంక్షలు తెలియచేసారు. కొద్దిరోజులకి జిన్నూరు తిరిగి వచ్చి చివరి రోజు వరకు తన ఇంటిలో, తన గదిలోనే ఉండి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఆయనతో పాటు ఆయన సేవ కోసం అక్కడ ఉన్న భక్తులకు అది ఒక తీక్షణమైన ఆధ్యాత్మికానుభవము; అది అందుకోలేని వేగంతో సాగింది. రామకృష్ణ పరమహంస పేరును RK RK అంటూ పదే పదే తలుస్తూ ఆయన రామకృష్ణుడే అయిపోయారు. ఆయన శారీరిక బాధ ద్వారా కూడా అసామాన్యమైన ఆధ్యాత్మిక బోధ చేసారు. అది ఆయన జీవితం పొడుగునా సాగించిన కరుణాపూరితమైన బోధామృతం కంటే కూడా విలక్షణముగా సాగింది.

ఈ మూడు నెలల సమయంలో తెంపులేకుండా మానవాళి పట్ల, ప్రత్యేకంగా ఆయన భక్తుల పట్ల, ఆయన దయ కరుణా ప్రసరిస్తూనే ఉంది. శరీరం పట్ల, శారీరక సుఖం పట్ల ఆయన శ్రద్ధ చూపలేదు. ఒకసారి అక్కడ ఆయనతో సన్నిహితంగా ఉన్న భక్తురాలితో అన్నారు, “ఎందుకు నేను ఇంతగా బాధలుపడుతున్నాను? ఎవరికోసం?” ఆమెకి అర్థం అయ్యింది నాన్నగారు పడే బాధ ఆయనది కాదు, అది ఆయన భక్తులది. ఎంతోమంది వారికి జీవితంలో వచ్చే కష్టాలు బాధలు తట్టుకోలేక వాటినుంచి ఉపశమనం కలిగించమని నాన్నగారిని వేడుకొంటే వాటన్నిటినీ స్వీకరించి, ఎంతో కరుణతో దేహత్యాగం చేసేముందు ఆ బాధలన్నీ భరించారు. మధ్య మధ్యలో ఆ భక్తురాలితో ముందు జరగబోయే సంఘటనలు స్పష్టంగా చెప్పేవారు. ఆమెకీ ఆమెతో పాటు నాన్నగారి సేవలో ఉన్న ఇంకొక భక్తుడికీ “మీరు నా పని చెయ్యండి, నేను మీ పని చేస్తాను” అని చెప్పారు. ఆ తీవ్రమైన శారీరిక బాధలను చూసి తట్టుకోలేక ఆ భక్తురాలు “నాన్నగారూ భగవంతుడు ఎంతటి కర్కోటకుడు” అని ఆక్రోషిస్తే, నాన్నగారు అన్నారు, “శరీరం వస్తే దానితోపాటు సఫరింగ్ కూడా వస్తుంది; ఎక్కడైతే దేహం లేదో, ఎక్కడైతే మనస్సు లేదో, అక్కడ నేను ఉన్నాను.”

ఆ భక్తురాలు తన భావాలను ఇంకా ఇలా పంచుకుంది. "నాన్నగారు నాకు సహనం, ఓపిక, క్షమా గుణాలు నేర్పించారు. నాకు దేహధ్యాస తగ్గించి నా ఏకాగ్రత ఆయనపైనే నిలిపేటట్టు చేసి, ఇతర విషయాలన్నీ మరచిపోయేలా చేసారు. నామీదే ఆధారపడి ఉన్నట్టు నటిస్తూ నేను ఆయన్నే లక్ష్యంగా చేసుకునేటట్టు చేసారు. అందరికీ ఆధారంగా ఉన్న వారికి ఆధారాలు అవసరమా! దేహం విడిచేలోగా నేర్పించవలసినవన్నీ పూర్తి చెయ్యటానికే ఇదంతా! ఒకోసారి నా బుగ్గలని పట్టుకొని "ఎంత బాగా చూసుకొన్నావు అమ్మా నన్ను" అనేవారు. మరి ఆయన ఈ ప్రపంచంలో వేలకి వేలమందిని ఇంకెంత బాగా చూసుకున్నారో కదా! వాళ్ళ భౌతిక అవసరాలే కాదు వాళ్ళ మానసిక ఆధ్యాత్మిక అవసరాల అభివృద్ధి కూడా చూసుకునేవారు. ఇతర ఆధ్యాత్మిక గురువుల వద్ద ఉన్నట్టుగా, నాన్నగారి దగ్గర ఎటువంటి హద్దులు నిబంధనలు ఉండవు. ఆయన భక్తులను ఎటువంటి క్రతువులు, ప్రయత్నాలు చెయ్యమని చెప్పలేదు. భక్తులకు సాధన పేరుతో ఎటువంటి ప్రయత్నము కష్టము లేకుండా ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించటమే ఆయన ధ్యేయం! అంతటి అద్భుతమైన అంతులేని ప్రేమ, మానవరూపంలో మన మధ్యకి రావటం అనేది భక్తకోటికి ఎంతో దుర్లభంగా దొరికే ఒక అపూర్వమైన వరం. ఆయన బోధ జీవన స్రవంతిలా తరతరాలు సాగిపోతూ, అందరినీ దుఃఖం నుంచి సుఖానికి నడిపిస్తుంది. ఆయన దేహం ఇంకొక 5 రోజులలో విడుస్తారనగా శారీరిక బాధ తీవ్రమై కనురెప్పలు కూడా కదపలేని స్థితిలో ఉన్నప్పుడు, ఒక్క సారి కళ్ళు తెరిచి "నువ్వు వెళ్లి రా" అన్నారు. మిమ్మల్ని విడిచి వెళ్ళలేను అంటే, "నేను 5 రోజులలో వెళ్ళిపోతాను" అన్నారు. అలాగే డిసెంబర్ 29వ తారీకున, అతి పవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజున వెళ్ళిపోయారు. సంపూర్ణమైన ఎరుకలో ఉండగా, నేను ఆయన నోటిలో పోసిన తులసిరసం త్రాగారు. ఒకచేతితో ఆయన చేతిని పట్టుకొని ఇంకొక చేతితో ఆయన గుండెల్ని నిమురుతూ ఉండగా శరీరాన్ని నిశబ్దంగా విడిచారు — **నాన్నగారూ**.

నాన్నగారి చివరి రోజులలో ఆయనతో అత్యంత సన్నిహితంగా మెలిగిన ఇంకొక భక్తుడు తన భావాలను ఇలా పంచుకున్నారు. "శ్రీ నాన్నగారు విశాఖపట్టణంలో ఆసుపత్రిలో ఉన్నారని తెలిసి వెళ్ళితే నాన్నగారు ఒప్పుకుంటారా లేదా అనే సంశయం లో ఉండగా అవసరమైన ఆయింటుమెంటు ఒకటి విశాఖపట్టణం లో దొరకలేదు పంపించమని కబురు వచ్చింది. వెంటనే సంతోషంగా కొన్ని డబ్బాలు పట్టుకొని వెళ్లాను. నన్ను చూడగానే ఎన్ని తెచ్చావు అన్నారు. 50 అనగానే చిరునవ్వు నవ్వారు. ఆ సమయంలో నేను పూర్తి చెయ్యవలసిన కొన్ని వృత్తి బాధ్యతలు ఆశ్చర్యకరంగా శ్రీ నాన్నగారి అనుగ్రహంతో బాహ్యా కారణాల వల్ల వాయిదా

పడగా, నాకు ఆయనతో కలసి ఉండే అవకాశం దొరికింది. ఒక రాత్రి డాక్టర్లు కండిషన్ చాలా క్రిటికల్ గా ఉంది అన్నారు. మేము నాన్నగారితో ఆ విషయం చెప్పలేదు, కానీ కొద్దిసేపటికి కళ్ళు తెరిచి "కంగారు పడవద్దు, నేను వెళ్ళిపోవటం లేదు", అని మాతో చెప్పి, డాక్టర్లతో "మీరు ఇంటికి వెళ్లి ప్రశాంతముగా నిద్రపోండి, రేపు సాయంత్రానికి అన్నీ చక్కబడతాయి" అన్నారు. మర్నాడు సాయంత్రం ఒక చర్మవ్యాధి నిపుణుడు ఇచ్చిన మందుతో మంత్రం వేసినట్టుగా చర్మబాధ తగ్గింది. మర్నాడు మెడికల్ రిపోర్టులు కూడా మామూలుగా వచ్చేసాయి. ఆయన పడే శ్రమ తీవ్రమైన బాధ చూడలేక ఒకరోజు బయటికి వచ్చి భగవాన్ పటం ముందు ఏడ్చాను "ఇన్ని సంవత్సరాలు ఆయనను ఉపయోగించుకొని ఇప్పుడు ఈ బాధలు పెట్టావు, నువ్వు కర్కశకుడివి. దయచేసి ఆయనను ఈ శరీరం నుంచి విడిదల చేసి ఆయనకి ఉపశమనం కలిగించు" అని ప్రార్థించాను. ఆయన శరీరం నుంచి విడుదల పొందాలని కోరుకుంటూ కొద్దిసేపు గడిపాను. శ్రీ నాన్నగారు కళ్ళు తెరిచి "నేనెప్పుడు చనిపోతాను అని అలా అనుకోకూడదు" అన్నారు. అప్పుడు నాతప్పు నాకు తెలిసింది, శ్రీ రమణ మహర్షులకు నాన్నగారికి బేధం లేదు అని అర్థం అయ్యింది.  విశాఖపట్టణం నుంచి జిన్నూరు తిరిగి వచ్చాక కొద్దిరోజులు గాలి వెలుతురు గురించి మొదటి అంతస్తులో తన కుమారుని ఇంటిలో ఉన్నారు. ఆ సమయంలో వేల్పూరు ఆశ్రమం నుంచి కొందరు భక్తులు, శ్రీ రమణ మహర్షుల శిష్యులైన శ్రీ పళని స్వామి గురించి ముద్రించిన పుస్తకం తెచ్చారు. పుస్తకం అట్టపైన రమణులు పళని స్వామి కలిసి ఉన్న బొమ్మ చూసి చిరునవ్వుతో ప్రేమగా హృదయానికి హద్దుకున్నారు. ఒక రోజు నాన్నగారు నన్ను పిలిచి నాలుగు వేళ్ళు చూపించి తన గదిలోనే ఉండిపోమన్నారు. అప్పటివరకు ఆయనకి ఎదురుగా ఉన్న గదిలో రాత్రిపూట పడుకునేవాడిని. ఆ రోజునుంచి రాత్రి పగలు ఆయన పక్క నుంచి కదలలేదు. అయిదవ రోజున I LOVE YOU అన్నారు. తరువాత ఏమైయిందో తెలియదు నాలో ఉన్న శక్తి అంతా హరించిపోయింది. నేను ఇదివరకటిలా ఆయన పనులు ఏమీ చెయ్యలేకపోయాను. బయటికి వెళ్ళాలి అనుకొంటే నన్ను పిలిచేవారు. భీమవరం లో మా ఇంటికి కొద్ది రోజులు ఉందామని వెళ్లి ఉండలేక తిరిగి వచ్చేసి, చివరి పది రోజులు కదలకుండా నాన్నగారి పక్కనే ఉండిపోయాను. నాలా ఆయనతోపాటే ఉన్న భక్తురాలు నాన్నగారు 5 రోజులలో శరీరం వదిలేస్తానని చెప్పారని అన్నారు. ఆ సమయంలో నేను అక్కడ లేను. 5 రోజుల తరువాత తిథి వైకుంఠ ఏకాదశి అని కూడా ఆవిడ చెప్పారు. వెంటనే మనస్సులో అనుకొన్నాను. అదే ఆయన సంకల్పం అయితే అలాగే జరగనీ! చివరి రోజు మధ్యాహ్నం వరకూ భక్తులు ఆయన దర్శనానికి వస్తూనే

ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్రీ నాన్నగారు శరీరాన్ని విడిచిపెట్టారు. ఆ సమయంలో అంతకు ముందు ఆయన ముఖములో ఉన్న బాధ మాయమై కాంతివంతంగా మారింది. భక్తులు మరియు కుటుంబ సభ్యులు గౌరవంతో ఆయన దివ్యమైన భౌతిక దేహం అదే రోజున మహా సమాధి చేసారు."

నాన్నగారు నిశబ్దంగా వెళ్ళిపోయారు! మానవాళికి అత్యంత ప్రియమైన, వెలకట్టలేని వరప్రసాదమైన నాన్నగారు పరిపూర్ణమైన మౌనములో, వెళ్లిపోతున్నారనే జాడకూడా తెలియకుండా వెళ్ళిపోయారు — నిజానికి మనము విడిపోవటం లేదు అని బహుశా మనకి తెలియచెప్పటానికేమో! ఊపిరి ఉన్నంతవరకే కాదు, ఆ దేహం లేకపోయినా ఆయనతో అనుబంధం కొనసాగుతూనే ఉంటుంది.

WE LOVE YOU NANNAGARU FROM THE BOTTOM OF OUR HEARTS!



'వాక్యం దేవుడై ఉంది' అని ఏసుక్రీస్తు చెప్పాడు. 'వాక్యం గురువై ఉంది' అని బుద్ధుడు చెప్పాడు. నా presence నా వాక్యం లో ఉంది. నా సన్నిధి లో ఏ సుఖం శాంతి ఆనందం అనుభవిస్తున్నారో, నా వాక్యాన్ని ఆశ్రయిస్తే అదే సుఖం శాంతి ఆనందం లభిస్తాయి. నా presence నా వాక్యం లో ఉంది కనుక నేను లేను అన్న తలంపు కూడా మీకెప్పుడూ రాకూడదు.

## శ్రీ నాన్నగారి ప్రవచనాల నుండి సేకరింపబడిన మహనీయుల సూక్తులు





త్యాగయ్య 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు' అని అన్నాడమ్మా. మనం దాన్ని మార్చేద్దాం. 'అందరూ మహానుభావులు అందరికీ వందనములు' అని అందాము.

మీరు ఏ నామ రూపాలను ఆరాధించినా, నేను హృదయపూర్వకముగా మీ శ్రేయస్సునే కోరుతున్నాను. ఈ ఒక్క మంచి గుణానికే నాకు ఈశ్వరుడు జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాడు.

భగవాన్ రమణ: సూర్యుడు ఎప్పుడూ ఉంటాడు. కళ్ళ పైనుండి నీ చేతులను తీస్తే సూర్యుడు కనిపిస్తాడు. అలాగే భగవంతుని  అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. నువ్వు శరణాగతి చెందితే అది అనుభవపూరితం అవుతుంది.

రామకృష్ణ పరమహంస: మన ప్రాధాన్యత మొదట భగవంతుడు, తరువాత ప్రపంచం ఆ తరువాత నేను కావాలి. కానీ మనం ఎప్పుడూ తిరిగేసి చేస్తాం: మొదట నేను, తరువాత ప్రపంచం ఆ తరువాత దేవుడు అని అంటాము.

శారదాదేవి: ఈ భూమికి ఎంత సహనం ఉందో అంత సహనం ఉంటేనే గాని నీకు ఆత్మసాక్షాత్కారం కలుగదు. దుష్టుల కుచేష్టలను భరించే సహనం లేకపోతే ఆత్మదర్శనం లభించదు.

స్వామి వివేకానంద: మీరంతా అమృత పుత్రులు. మీరు ఆ పరమాత్ముని సంతతి. మీరు పాపులు కారు. మిమ్మల్ని పాపులుగా పిలిచే వారే పాపులు.

గౌడపాదాచార్య: ఎప్పుడూ ఏమీ జరుగలేదు.

మొహమ్మద్ ప్రవక్త:  మాయ మనలను ఎప్పటికైనా అధిగమించగలదు. చివరి శ్వాస దాకా మనం మాయను జయించాము అని అనుకోకూడదు.

బుద్ధుడు: ఆధ్యాత్మిక సాధన లో మద్యేమార్గం అవలంబించాలి. అతిగాకాని తక్కువగా కానీ తినకూడదు. ఒక  వయిలిన్ తీగలు గట్టిగా లేక వదులుగా ఉన్నా సంగీతం రాదు.

ఆదిశంకర: రోగం వచ్చినప్పుడు గాని, భార్య తిట్టినప్పుడు గాని, ఆత్మీయులు చనిపోయినప్పుడు గాని వచ్చిన వైరాగ్యం నిజమైనది కాదు. వివేకం తో కూడిన వైరాగ్యమే నిజమైన వైరాగ్యం.

రామానుజాచార్య: నేను మంచి చేస్తున్నాను అన్న తలంపును త్యజించు. అదే నిజమైన సన్యాసం.

మధ్వాచార్య: నిన్ను పులి వెంటాడుతుంది అనుకో, అలాగే ఎదురుగా దుష్టుడు ఉన్నాడు అనుకో, దుష్టసాంగత్యం చేయడం కన్నా వెళ్లి ఆ పులి నోట్లో పడిపో. ఎందుకంటే పులి నోట్లో పడితే నువ్వు కేవలం ఈ దేహాన్ని కోల్పోతావు కానీ దుష్టసాంగత్యంతో నీకు నీచజన్మలు కలుగుతాయి.

మహావీర్ జైన్: సాధారణంగా యుద్ధంలో గెలిచినవారిని వీరుడు లేక ధీరుడు అని సంబోధిస్తారు. కానీ ఎవరైతే తమ మనస్సును, జీవలక్షణాలను జయించారో వారే నిజమైన మహావీరుడు. యోగసిద్ధి లభించినవారే నిజమైన మహావీరుడు.

ఏసుక్రీస్తు: సూర్యుడికి ఎలాగైతే చీకటి అంటే ఏమిటో తెలీదో అలాగే నీ హృదయంలో ఉన్న సత్యానికి కూడా చావు పుట్టుకలు అంటే ఏమిటో తెలీదు. తెంపులేని సుఖము, శాంతి, ఆనందం అనుభవించాలి అంటే నీవు సత్యాన్ని తెలుసుకొని తీరాలి. ఆ సత్యమే నిన్ను ముక్తుడిని చేస్తుంది.

షిరిడి సాయి బాబా: మీరు ఇతరుల లోపాలు గాంచితే, పంది ఏ విధంగా మలాన్ని తింటుందో మీరూ వారి మలాన్ని తిన్నట్లు అవుతుంది.

గురు నానక్: మీ చేతులతో ఎవరికైనా సహాయ సహకారాలు చేసిఉండకపోతే అవి శుభ్రంగా కనిపించినా పవిత్రమైనవి కావు.

స్వామి శివానంద: గాయాన్ని సహించు, అవమానాన్ని సహించు. అదే అతిపెద్ద సాధన.

మళయాళ స్వామి: తపస్సు ఎందుకు అవసరం అంటే భగవంతుని పై విశ్వాసం కలగటానికి, ఆయన మాటలపై విశ్వాసం కలగటానికి, అంతే కాదు ఆ మాటలను ఆచరణలో పెట్టటానికి అవసరం.

కంచి పరమాచార్య: తల్లి మంచిది కాకపోయినా ఆవిడను బాగా చూసుకోవాలని శాస్త్రం చెబుతుంది. తల్లినే గౌరవించలేకపోతే ఇక గురువుని ఎలా గౌరవిస్తారు?

అరవింద ఘోష్: ప్రశాంతత, బ్రహ్మతేజస్సు, బ్రహ్మానందం, బ్రాహ్మీశక్తి, స్వేచ్ఛా జీవనం, జ్ఞాన శిఖరాలను అందుకోవడం - ఇవే ఒక జ్ఞాని లక్షణాలు.

స్వామి రామతీర్థ: భగవంతుడు లేని ప్రదేశం ఏదైనా ఉంటే చూపించు అప్పుడు ఈ bungalow నుండి కిందికి దూకడానికి కూడా నేను సిద్ధమే.

స్వామి జ్ఞానానంద: ఇష్టం ఉన్న చోట కష్టం ఉండదు. నాకు కష్టం అనిపిస్తే హిమాలయాలకు వెళ్లి తపస్సు ఎలా చేయగలను? ఇష్టం ఉంది కాబట్టే చేయగలిగాను.

శ్రీ రాముడు: సరయూ నది ఎంత స్వచ్ఛంగా ఉందంటే ఒక సత్పురుషుని హృదయం ఎంత స్వచ్ఛంగా ఉంటుందో అంత స్వచ్ఛంగా ఉంది.

శ్రీ కృష్ణుడు: రోజూ గుడికి వెళ్ళేవాడు నా భక్తుడు కాదు. అడ్డంగా లేక నిలువుగా బొట్టులు పెట్టేవాడు నా భక్తుడు కాదు. ఎవరైతే ఈ సృష్టిలో దేనికీ భయపడడో, ఈ సృష్టిలో ఎవరినీ భయపెట్టడో అట్టి భక్తుడు నా హృదయానికి సన్నిహితమైన వాడు.

వాల్మీకి మహర్షి: ఈ సృష్టిలోని మాయనంతా భగవంతుడు డబ్బులో పెట్టేసాడు.

జనక మహారాజు: నా రాజ్యం కాలిపోయి భస్మం అయిపోయినా నేను చలించను. ఎందుకంటే నేను కేవలం రాజ్యాన్ని పరిపాలిస్తున్నాను కానీ అది నాది అనుకోవడంలేదు.

శ్రీ కృష్ణ చైతన్య: భగవంతుడిని స్మరిస్తే చాలు. ఇంకేమీ అవసరం లేదు. మీ మిగతా చేష్టలన్నీ కూడా కోతిమాయలే.

తుకారాం: భగవంతుని నిరంతర స్మరణలో, ఆయనకు శరణాగతి చేసే ప్రక్రియలో నా దేహగతమైన నేను ని కోల్పోయాను. కానీ ఎప్పుడు కోల్పోయానో నాకే తెలీదు.

త్యాగయ్య: ఓ రామ! నన్ను రక్షించే వాడివి నీవు. నాకు నీవు ఉన్నావు. కానీ నీకు ఎవరు ఉన్నారు? కనుక నేను కాదు అనాథను. నువ్వే అనాథవు.

అన్నమయ్య: ఓ వేంకటేశ్వర స్వామి! నీకు సహస్రాధిక భక్తులు ఉండటానికి కారణం కేవలం నీ సహనమే. మా అవగుణాలు కూడా నీకు సుగుణాలుగా కనిపిస్తాయి.

ప్రహ్లాదుడు: చదువ వలెను, చదువ వలెను, చావులేని చదువు చదువ వలెను.

మాతంగ మహర్షి: శబరీ ఓ శబరీ! నేను ఎక్కడికి వెళుతున్నానంటే అక్కడికి ఏ ఇద్దరూ కూడా కలిసి పయనించలేరు. కనుక నిన్ను నాతో తీసుకువెళ్లలేను. నువ్వు రాముడు వచ్చే దాకా ఇక్కడే ఉండు.

గోపికలు: ఓ ఉద్ధవ! సాధన చేయడానికి మనస్సు ఉండాలి. కానీ మా మనస్సును మా ప్రియతమ కృష్ణుడికి ఇచ్చేసాము కదా! ఇక మీరు చెప్పే సాధన మేము ఎలా చేయగలము?

నమ్మాళ్వార్: ఓ పెరుమాళ్ళు! ఇన్నాళ్లు నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను అని అనుకున్నాను. కానీ ఇప్పుడు అర్థం అవుతుంది ఉన్నదల్లా నువ్వే, నేను అసలు లేనే లేను.

మాణిక్యవాచకర్: ఓ భగవంతుడా! నీకు నాకు జరిగిన వ్యాపారంలో ఎందుకూ పనికి రాని నా అహంకారాన్ని పుచ్చుకొని వెలకట్టలేని నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు. కనుక ఈ వ్యాపారంలో నష్టపోయింది నువ్వే కానీ నేను కాదు.

సూరదాస్: ఈ ప్రపంచం అంతా నా ఇల్లు. మానవ జాతి మొత్తం నా కుటుంబ సభ్యులు.

తులసీదాస్: శ్రీ రాముని సుగుణాలు మీరు అభివృద్ధి చేసుకుంటే, సీత వంటి అమ్మాయి మీ వద్దకు వచ్చి కూర్చుంటుంది.

రాధాదేవి: శ్రీ కృష్ణుడు నా హృదయం లోనే ఉన్నాడు. ఆయన నుండి తప్పించుకుందాం అనుకున్నా నేను తప్పించుకోలేకపోతున్నాను ఎందుకంటే ఆయన నన్ను వదలడంలేదు.

మీరాబాయ్: సమస్త బృందావనంలో శ్రీ కృష్ణుడు ఒక్కడు మాత్రమే పురుషుడు. మిగతా వారంతా స్త్రీలే. అంటే ప్రకృతికి లోబడి ఉన్నంత కాలం మనం స్త్రీలము. పురుషోత్తముడైన కృష్ణుడొక్కడు మాత్రమే పురుషుడు.

కబీర్ దాస్: ఓ గురుదేవ! నాకు అహంకారం ఉన్నంత కాలం మీరు నా హృదయంలోకి ప్రవేశించరు. అలాగే మీరు నా హృదయంలోకి ప్రవేశించిన వెంటనే నా అహంకారం మటుమాయం అవుతుంది.

మురుగనార్: ఆధ్యాత్మిక ప్రపంచానికి సూర్యుడైన రమణ భగవానుని చూసిన ఈ కళ్ళతో ఇంకెవరిని చూడమంటారు?

మాస్టర్ మహాశయ: శ్రీ రామకృష్ణుల మనస్సు ఎంత పవిత్రమైనదో ఆయన శరీరం కూడా అంతే పవిత్రమైనది. కనుక ఆయన బూడిద కూడా నాకు ప్రసాదమే.

హనుమంతుడు: మీ ప్రాపంచిక కోరికలు నెరవేర్చుకోడానికి శ్రీ రాముని దాకా వెళ్లనక్కర్లేదు. నా దగ్గరికి రండి సరిపోతుంది. కేవలం ముక్తి కావాలంటేనే శ్రీ రాముని దగ్గరికి వెళ్ళండి.

సీతాదేవి: ఓ రావణ! నేను రాముని భార్య అయి ఉండగా, నీకు భార్యగా ఎలా మారగలను?

పురాణాలు: లక్ష్మీ కటాక్షం కావాలంటే రామాయణం చదవండి. అనుకున్న కార్యం సిద్ధించాలి అంటే మహాభారతం చదవండి. వైరాగ్యం కావాలంటే భాగవతం చదవండి.

భాగవతంలోని రంతిదేవుడు: ఓ నారాయణ! ఈ సృష్టిలోని సమస్త జీవరాసుల హృదయంలో ఉండి వారి దుఃఖాన్ని పీల్చుకునే శక్తిని నాకు ప్రసాదించు.

రామాయణం: కృతజ్ఞతలేని వారి శవాలను కుక్కలు కూడా ముట్టుకోవు.

ఉపనిషత్తులు: నలుదిశలనుండి పవిత్రమైన ఆలోచనలు మనలోకి ప్రవహించు గాక.

మహాభారతం: భగవంతుని అనుగ్రహం లభిస్తే తల పోవాలిసిన చోట కిరీటం పోతుంది.

భగవద్గీత: కామాన్ని ప్రేమగా మార్చుకోండి. కామం తిరిగి ఆశిస్తుంది కానీ ప్రేమ అలా ఆశించదు. ప్రేమ కోసం ప్రేమించండి. పని కోసం పని చేయండి.

కఠోపనిషత్తు: ఎవరైతే చనిపోయాక జీవితం లేదని భావిస్తారో, జీవితం అనేది స్మశానంలో ముగిసిపోతుంది అనుకుంటారో, అమృతస్థితి ఉంటుందని నమ్మరో, ఎరుక కలిగి ఉండరో, తమ కర్మలను అనుభవిస్తూ ఉంటారో - వారే మూర్ఖులు.

విష్ణు సహస్రనామం: ఓం సాక్షినే నమః అంటే మెలకువలో గాని, నిద్రలో గాని, స్వప్నంలో గాని, ఇంద్రియాలు మరియు మనస్సుతో చేసే ప్రతీ పనిని అంతర్యామిగా ఉన్న పరమాత్మ సాక్షిగా చూస్తూ ఉంటాడు.

నారదభక్తి సూత్రాలు: మీ ప్రతీశ్వాసను కూడా భగవన్నామంతో నింపుకోండి.

యోగ వాశిష్టం: ఓ రామ! నువ్వు ఎవరవు అంటే 'నేను దశరథ కుమారుడిని' అని చెపుతున్నావు. నేను నీ తండ్రి పేరు అడగటం లేదు. నువ్వు 'నేను నేను 'అనే ఆ నేను ఎవరు? అని అడుగుతున్నాను.

విష్ణుపురాణం:  భక్తి పేరుతో చేతిలో ఉన్న పనిని తప్పించు కోవాలని చూసేవారు భగవంతుడిని అవమాన పరుస్తున్నారు.

బైబిల్: స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. నిశ్చలంగా ఉండి, నేనే భగవంతుడని గ్రహించు.

ఖురాన్: వడ్డీ వ్యాపారం చేసే వారికి మరణానంతరం నరకంలో పెద్ద పెద్ద రాళ్లను నోట్లో కుక్కుతారు. ‘మేము మింగలేకపోతున్నాము’ అని విలపిస్తే, మరి వడ్డీ ఎలా మింగావు? అని అడుగుతారు ఆ శిక్షించేవారు.

సంత్ జ్ఞానేశ్వర్:  ప్రతీది భగవంతుని సంకల్పం ప్రకారం జరుగుతుందని నీకు అర్థం అయినప్పుడు, అది నీ బుద్ధిలో ఒక భాగం అయినప్పుడు, నీకు దుఃఖ పడటానికి కారణం లేదు, సంతోష పడటానికి కారణం లేదు.

కాళిదాసు: విషయవస్తువులను తప్పించుకోవడం మనోనిగ్రహం అవ్వదు. విషయాలు మీ ముందు ఉన్నా, మీరు చలించకుండా ఉండగలగాలి. అదే నిజమైన మనోనిగ్రహం.

రవీంద్రనాథ్ ఠాగూర్:  పాలు ఇవ్వటం ఆపవద్దని తల్లి తన పిల్లవాడిని ఒక రొమ్ము నుండి మరొక రొమ్ముకు మారుస్తుంది. కానీ అది తెలియక పిల్లవాడు ఏడుస్తాడు. అలాగే మనకు దేహం భారం అయినప్పుడు భగవంతుడు ఇంకొక దేహం ఇవ్వటానికే మృత్యువును ప్రసాదిస్తాడు. అది తెలియక మనం బూడిద అయిపోతున్నామేమో  అని భయపడుతాము.

లోకమాన్య తిలక్: ఆకాశమే వచ్చి నా పైన పిడుగులా పడినా, నేను దాన్ని నా కాళ్లతో తొక్కి, స్వరాజ్యం వైపుగా ముందుకు సాగుతాను.

మహాత్మా గాంధీ: ఇంతవరకూ ఎవ్వరూ కూడా నన్ను అవమానించలేక పోయారు ఎందుకంటే నేనెప్పుడూ వాటిని గుర్తించలేదు. అవమానాన్ని గుర్తించడం కన్నా నేను విషం త్రాగడం మెరుగు.

సర్దార్ పటేల్: హైదరాబాద్ లో కి ప్రవేశిస్తే మీకు కత్తులతో స్వాగతం లభిస్తుంది అని అంటున్నారు. కానీ 'Sword will be met by Sword' అంటే మీరు కత్తులు ఉపయోగిస్తే మేము మా తలకాయలు అర్పించము. మీకు కత్తులతోనే సమాధానం చెబుతాము.

లాల్ బహాదుర్ శాస్త్రి: డాక్టర్స్ ఏమీ చేయలేము అంటున్నారు. నా చివరి గడియలు దగ్గరికి వచ్చేసాయి. ఓ శ్రీరామా! నా తండ్రి! ఇక నన్ను నీ వడిలోకి తీసుకో.

రాజాజీ: తిరుపతికి వెళ్లి పెరుమాళ్లను ఏమని ప్రార్థించారు? అని మా కమ్యూనిస్ట్ సోదరులు అడుగుతున్నారు. మా కమ్యూనిస్ట్ సోదరులకు సద్బుద్ధిని ప్రసాదించు స్వామీ అని ప్రార్థించాను.

సర్వేపల్లి రాధాకృష్ణ: అనుకూలమైన భార్య లభించిన వారికన్నా, అనుకూలమైన ఉద్యోగం లభించిన వారికన్నా, శాంతచిత్తం కలిగిన వారు ధన్యులు.

కామరాజ్: నేను నాలుగవ తరగతి వరకే చదివినా, రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఎలా నిర్వర్తించ గలుగుతున్నాని చాలా మంది నన్ను అడుగుతున్నారు. నాకు కామన్ సెన్స్ ఉంది కానీ ఇగో సెన్స్ లేదు. అందుకే అది సాధ్యమైంది.

జిడ్డు కృష్ణమూర్తి: నాకు చావంటే భయం లేదా? అని అడుగుతున్నారు. రోజూ చనిపోవడం నేర్చుకున్న నాకు ఈ చావు కొత్తేమీ కాదు.

సోక్రటీస్: నాకు ఏమీ తెలియదు అన్న విషయం నాకు బాగా తెలుసు. అందుకే నా దగ్గరికి ఇంతమంది వస్తున్నారు.

ఎమెర్సన్: మీ ముఖాన్ని భగవంతుని వైపు తిప్పండి. మీ వీపును ఈ లోకంవైపు తిప్పండి. కానీ మనం ఎప్పుడూ తిరిగేసి చేస్తాం: మన ముఖాన్ని లోకం వైపుకి తిప్పి, వీపును భగవంతుని వైపు తిప్పుతాం.

Shakespeare : We are all creatures of destiny. మనమంతా విధి చేతిలో పని ముట్టువులం.

Albert Einstein : పంచభూతాలు, సూర్యుడు, చంద్రుడు, ఖగోళాలు- ఇవన్నీ కూడా ఒక చట్ట ప్రకారం నడుస్తున్నాయి. అదే చట్టం సమస్త సృష్టిని కూడా నడుపుతుంది. మన జీవితాలను కూడా అదే చట్టం నడుపుతుంది అన్న విషయం మనకు అర్థం అవ్వడంలేదు.

అబ్రహం లింకన్ : నేను మెల్లిగా నడుస్తాను కానీ సరైన దిశలో నడుస్తాను. వెనక్కి తిరిగి ఎప్పుడూ చూడను.

అలెగ్జాండర్ :  మీ తండ్రి నుండి మీరు పొందిన ఆస్తి ఏమిటి? అని నన్ను అడుగుతున్నారు.  విపరీతమైన ధైర్యం, నిర్భయత్వం- ఇవి నేను మా తండ్రి నుండి పొందిన ఆస్తి.

బిర్లా : I have never smoked a cigarette in my life. నా జీవితంలో నేనెప్పుడూ సిగరెట్ అనేది త్రాగలేదు.

జీబ్రా (ముస్లిం సెయింట్) : అందరిలోనూ అతిపెద్ద లోపం ఏమిటంటే తమ లోపాలు గ్రహించకుండా ఇతరులలో  రంధ్రాన్వేషణ చేయడం.

ఆంగ్ల సామెత: షేర్స్ లో పెట్టుబడి పెట్టే వాడు మధ్యాహ్నానికి ధనవంతుడు, సాయంత్రానికి పేదవాడు. కనుక షేర్స్ మరియు జూదం ఈ రెండిటికి దూరంగా ఉండండి.

## శ్రీ నాన్నగారు మనకు వేసే సూటి ప్రశ్నలు

- మీరు భగవంతుడిని ఎప్పుడైనా అసలు ఎంజాయ్ చేసారా?
- మీరు ఎవరినైనా గాఢంగా ప్రేమించినా లేక ఎవరైనా మిమ్మల్ని గాఢంగా ప్రేమించినా, ఆ ప్రేమ మీకు శాశ్వతం అనిపిస్తుందా?
- మీ తలంపులకు, మాటలకు, చేతలకు సమన్వయం ఉందా?
- మీరు కోటి రూపాయలు ఖర్చు పెట్టి ఒక్క చిన్న చెడు తలంపును పోగొట్టుకోగలుగుతారా?
- మీ గాఢ నిద్రలో 'నేను అమెరికన్' లేక 'నేను ఇండియన్ ' అని మీకు తెలుస్తుందా?
- మీకు భగవంతుడంటే ఎక్కువ ఇష్టమా లేక ఆయన మాయ అంటే ఎక్కువ ఇష్టమా?
- మీరు ఏ పని చేసినా, ఉదాహరణకు మీరు వంట చేసి ఎవరికైనా వడ్డిస్తున్నారు అనుకోండి, ఆ వడ్డించేది భగవంతుడికే అన్న అనుభవం మీకెప్పుడైనా కలిగిందా?
- మీ జీవితం లో ఎవరి మీద ఆధార పడుతున్నారు? మీ తల్లితండ్రులా లేక కొడుకు-కూతురా లేక భార్యనా? మరి భగవంతుని సంగతి ఏమిటి?
- ఈ రోజు ఎవరెవరిని పరిశీలించారు? వారిలో ఏదైనా మంచిని గ్రహించగలిగారా?
- మీ వర్తమానాన్ని బాగు చేసుకుంటున్నారా లేక భవిష్యత్తు గురించి గాలి మెడలు కడుతున్నారా?
- మీ దేహానికే excercise కావాలా? మీ బుద్ధికి excercise అక్కర్లేదా?
- మీరు ఆనందం ఉన్న చోట వెదుకుతున్నారా? లేని చోట వెయ్యి సంవత్సరాలు వెదికినా అది లభిస్తుందా?
- మీరు భగవంతునికి ఏవేవి సమర్పిస్తున్నారు? కర్పూరం, పండు, పువ్వు, నీరు - ఇవ్వేనా? మరి మీ కర్మ ఫలితం సంగతేమిటి?
- బాహ్యంగా కనిపించక పోయినా, మీకు లోపలి అంతస్తు ఏమైనా పెరుగుతుందా? లేక లోపల తూకం ఏమీ లేకుండా, కేవలం బాహ్యంగా షో ఆఫ్ చేస్తున్నారా?

## శ్రీ నాన్నగారి అనుగ్రహ వెల్లువ

మీరు చేసిన పాపము నేను చేసినట్లుగా భావించక పోతే నేను బోధించటానికే పనికిరాను.

సోదర మహాశయులారా! నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మ వైపు తిరుగకపోతే, మీకు శాంతి కలుగక పోతే - లోపము నాదిగాని మీది కాదు.

మీ బుద్ధికి విషయం అందేటట్లు చెప్పలేకపోతే ఆ దోషము నాదిగాని మీది కాదు.

నా హృదయంలో పవిత్రత ఉంటే మీరు మరచి పోవాలి అనుకున్నా నా మాటలు మిమ్మల్ని వెన్నంటి తరుముతాయి.

ఆత్మబంధువుల్లారా! ఆధ్యాత్మిక రంగంలో నేను మీకు చేసే సహాయముగాని, మీ అభివృద్ధిగాని, మీ బుద్ధికి అందదు.

నా మీద మీకు ప్రేమ లేనప్పుడు మీకు ప్రేమ కలిగేటట్లు చేయవలసిన బాధ్యత కూడా నాదే.

నా మాటలు వినటం వలన మీ కాలం వృధా అయిపోతున్నదని మీరు బాధ పడకండి. మీ జీవితంలో మధుర ఘడియలు అంటూ ఉంటే అది ఇక్కడ మీరు గడుపుతున్న కాలము మాత్రమే.

మీ శరీరానికి అన్నం ఎటువంటిదో, మీ మనస్సుకు నా మాటలు కూడా అటువంటివే! మీరు తిన్న అన్నం జీర్ణం చేసుకుంటే, మీ ఒంటికి బలం. నేను చెప్పిన మాటలు మీరు అర్థం చేసుకుంటే - అది మీ మనస్సుకు బలం.

నేను బోధ చేస్తున్నప్పుడు నా హృదయంలో శాంతి, పవిత్రత ఉంటేనే ఆ మాటలు మీ మీద పని చేస్తాయి. నేను స్మరించినంత మాత్రము చేతనే, మీ హృదయములో శాంతి కలగకపోతే నాలో పవిత్రత లేనట్లే!

మీ అందరికీ తరించే యోగం ఉంది కాబట్టే ఇక్కడికి రాగలిగారు.

## సేవ, సమత్వం, భగవద్భక్తికి ప్రతిరూపమైన పాందువ్వ మామ్మ

సేవ, సమత్వం, భగవద్భక్తి - ఈ మూడింటి ప్రతిరూపమే పాందువ్వ మామ్మ. ఆవిడ అసలు పేరు సూరమ్మ గారు కానీ అందరూ ఆవిడని పాందువ్వ మామ్మ అని పిలిచేవారు. ఆవిడ భర్తకు అయిదుగురు తమ్ముళ్లు. ఆయన్ని పంచపాండవుల్లో ధర్మరాజు అని పిలిచేవారు. ఆయన కాన్సర్ వ్యాధి తో మరణించాక, ఎనిమిది కూతుర్లు మరియు ఇద్దరు కొడుకుల బాధ్యత పాందువ్వ మామ్మ మోసారు. కూతుర్లు గాని, కోడళ్ళు గాని, మనవరాళ్లు గాని, చెల్లెలి సంతతి గాని ఎవరికైనా సరే పురుడు లేక ఏదైనా ఆపరేషన్ పడితే ఆవిడ వారిని సేవించడానికి పరుగు





పరుగున వెళ్లేవారు. నిత్యవసరాల విషయంలో తల్లి లేక సోదరిలు చేయడానికి వెనుకాడే సేవలు కూడా ఎంతో సునాయాసంగా చేసేవారు. అట్టిది ఆవిడ సమానత్వం. ఇంటి నుండి బయలు దేరిన ఆవిడ ఒక నెలకు గాని తిరిగి వచ్చేవారు కాదట. ఆవిడ కృష్ణభక్తిలో చాలా పండిపోయి ఉన్నారు గనుక ఆవిడకు ఎరుక తెలుసుకోవాలన్న తపన మొదలైంది. పుస్తకాలు చదవడం కానీ ఆధ్యాత్మిక ప్రవచనాలు వినడం గాని ఆవిడ ఎరుగరు. ఆవిడది పవిత్రమైన హృదయం కనుక 'ఎరుక అంటే ఏమిటి?' అన్న తపన తనంతట తానుగా ఉదయించింది. తణుకు లో కాళహస్తి నుండి వచ్చిన స్వామీజీని సందర్శించి, ఆవిడ ఎంతో తపనతో 'ఎరుక అంటే ఏమిటి?' అన్న ప్రశ్న వేస్తే ఆయన 'పెద్దమ్మా' అని ఒక నవ్వు నవ్వి, ఒక పండు చేతిలో పెట్టి పంపేసారట. ఆధ్యాత్మిక ఆసక్తితో ఒక ఆశ్రమంలో కొన్ని నెలలు గడిపారు పాందువ్వ మామ్మ. కానీ ఎక్కడ కూడా ఆవిడకు సరియైన సమాధానం లభించలేదు. చిన్న కొడుకు ఉండేది కొమ్మర అవ్వటంతో ఆవిడ తరువాత కొమ్మర రావటం జరిగింది. ఒకసారి నాన్నగారు కొమ్మర వచ్చినప్పుడు కాపవరం భక్తులొకరు పాందువ్వ మామ్మ ను నాన్నగారికి పరిచయం చేసారు. ఆవిడను చూడగానే


నాన్నగారు అన్నారట: 'అమ్మ మీ మనస్సు మల్లె పుష్పమంత స్వచ్ఛంగా ఉంది'. ఆఖరికి ఎంతో కాలంగా ఆవిడని పీడిస్తున్న ప్రశ్నకు (ఎరుక అంటే ఏమిటి?) సమాధానం నాన్నగారి దగ్గర లభించింది. ఇక అప్పటినుంచి ఎప్పుడూ మౌనంగా ఊరక ఉండేవారు. ఒక విగ్రహం లా గంటల తరబడి కదలకుండా కూర్చునేవారు. ఎవరన్నా ఏదైనా చెప్పండి అని ప్రాధేయపడితే, బోసి నవ్వు నవ్వుతూ ఇలా అనేవారట: 'ఏమి లేదమ్మా హృదయం కాళీ చేసేసుకోవాలి. అంతకన్నా ఇంకేమీ లేదమ్మా'. ఎప్పుడైనా 'వినీలాకాశం లో వింతకాంతి' అనే పుస్తకం చదివేవారు. 'నాన్నగారు మహానుభావుడమ్మా' అంటూ అస్తమానం నాన్నగారిని తలపెట్టుకుంటూ ఆయనకు నమస్కరించేవారు. నాన్నగారు పాందువ్వ మామ్మను 'అమ్మ' అని సంబోధించేవారు. ఆవిడ నాన్నగారిని 'బాబు' అని పిలిచేవారు. పాందువ్వ మామ్మ కూతురు ఎప్పుడైనా ఆవిడను నాన్నగారి దగ్గరికి తీసుకువెళ్లేవారు. సాధారణంగా నాన్నగారు ఆడవారిని స్పర్శించరు. కానీ పాందువ్వ మామ్మ విషయం వేరు. నాన్నగారికి తల్లి వరుస అవుతారు. అలాగే ఆవిడకు నాన్నగారిని 'బాబూ' అని పిలిచే ఆధ్యాత్మిక అర్హత కూడా ఉంది. అందుకే నాన్నగారు ఒకసారి ఆవిడను తమకు ఎదురుగా కూర్చోపెట్టుకుని, పాందువ్వ మామ్మ చేయి తమ తలపైన పెట్టించుకుని, తాము పాందువ్వ మామ్మ బుగ్గలు పట్టేసుకొని 'ఆనందం అంటే ఏమిటో ఈవిడను చూస్తే తెలుస్తుంది' అని అన్నారట. కన్నమ్మ గారు (నాన్నగారి భార్య) కూడా ఎంతో ప్రేమగా పాందువ్వ మామ్మకు భోజనం పెట్టి పంపేవారు. అలా రెండు మూడు సార్లు పాందువ్వ మామ్మ జిన్నూరు వెళ్లడం జరిగింది. అప్పుడు నాన్నగారు 'మీరు ఇక ఇక్కడికి రావద్దు. నేనే అటువైపు వచ్చినప్పుడు మీకు కనపడి వెళ్తాను' అన్నారట. పాందువ్వ మామ్మ నాన్నగారి పట్ల సంపూర్ణమైన శరణాగతి చెందిన ధన్యజీవి. ఒకసారి పాందువ్వ మామ్మ నాన్నగారిని అడిగారట: 'నేను మా ఆయనతో తీర్థయాత్రలు చేస్తూ అరుణాచలం సందర్శించి ఉంటాను. వెళ్లానో లేదో నాకు జ్ఞాపకం లేదు. ఇప్పుడు ఒకసారి అరుణాచలం వెళ్ళమంటారా? లేక అవసరం లేదంటారా? మీరు ఎలా చెబితే అలా చేస్తాను' అంటే నాన్నగారు: 'మీకు ఇక అవసరము లేదమ్మా' అన్నారట. అనివార్య పరిస్థితుల్లో పాందువ్వ మామ్మకు కొడుకుల దగ్గర కాకుండా కూతుళ్ళ ఇంట్లో ఉండవలసి వచ్చింది. ఈ విషయంలో పాందువ్వ మామ్మ కొంచెం మథన పడ్డారు. 'కొడుకుల దగ్గర ఉండకుండా కూతుళ్ళ దగ్గర ఉంటున్నాను. ఈ తలంపు నన్ను

బాధిస్తుంది' అని ఒకసారి నాన్నగారి తో చెబితే, నాన్నగారు అన్నారట: 'అమ్మా ఆ తలంపు కూడా వద్దు. ఒక్క తలంపు ఉన్నా మళ్ళీ జన్మించాలి'. నాన్నగారు అలా అనగానే ఆవిడ వెంటనే ఇక ఆ విషయం గురించి ఆలోచించడం మానేసారట. అలా ఆవిడకు ఏ సమస్య ఉన్నా నాన్నగారిని అడిగి ఉపశమనం పొందేవారు. పొందువ్వ మామ్మ ఇతరుల విషయాల్లోకి తలదూర్చేవారు కాదు. అలా ఎప్పుడూ మౌనంలో రమించేవారు. కొంతమంది భక్తులు ఆవిడ మౌన స్థితిని గుర్తించి, ఆవిడను ఒక జ్ఞానిగా భావించి ఆవిడ చేతులు పట్టేసుకుని గంటల తరబడి కూర్చునేవారు. నాన్నగారిని తలుచుకుంటూ పొంగిపోయి ఒక్కోరోజు భోజనం కూడా చేసేవారు కాదు పొందువ్వ మామ్మ. నాన్నగారి వలె సాత్త్వికాహారం తీసుకునేవారు. ప్రొద్దున పదింటి లోపు భోజనం చేస్తే, మళ్ళీ సాయంత్రం 5 గంటలకు భోజనం చేసేవారు. మధ్యలో ఒక్కసారి కాఫీ త్రాగేవారు. నాన్నగారు పులిహోర మానేస్తే ఆవిడా పులిహోర మానేసేవారు. అంటే అన్నీ నాన్నగారు భోజన పద్ధతులు అవలంబించేవారు. పొందువ్వ మామ్మ చివరి రోజుల్లో మహాదేవపట్నం లో ఉన్నారు. నాన్నగారు తమ మాటానుసారం అటు చుట్టు ప్రక్కన ఊరులకు వచ్చినప్పుడు మామ్మగారిని చూసి వెళ్లేవారు. ఒకసారి 'ఫలానా శనివారం వస్తాను' అని నాన్నగారు మామ్మగారికి కబురంపారు. ఆ శనివారం మామ్మగారి శరీరం స్మశానానికి వెళ్లాల్సిన రోజు. ముందురోజు శుక్రవారం రాత్రి పొందువ్వ మామ్మగారికి గుండెనొప్పి వచ్చింది. ఆవిడ ఎన్నడూ రోగగ్రస్తురాలై హాస్పిటల్కు వెళ్ళలేదు. అలాగే ఆఖరిలో గుండెనొప్పి వచ్చినప్పుడు కూడా హాస్పిటల్కు వెళ్ళలేదు. మర్నాడు నాన్నగారు వస్తారు అని ఆవిడకు తెలుసు. నాన్నగారు వచ్చేవరకు ప్రాణాలతో ఉండరని ఆవిడకు అర్థం అయిపోయింది. అందుకే 'నాన్నగారు వచ్చేవరకు ఈ శరీరం నిలబడదు' అని కూడా అన్నారట. అలాగే శుక్రవారం రాత్రికే ఆవిడ ఇంట్లోనే దేహత్యాగం చేసారు. మరుసటి రోజు నాన్నగారు వచ్చారు. పొందువ్వ మామ్మగారికి నమస్కరించి, తమ తుండును ప్రక్కన ఉన్నవారికి ఇచ్చి, 'నేను మామ్మగారిని కొంత దూరం మోస్తాను' అని అన్నారు. నాన్నగారు పొందువ్వ మామ్మగారిని ఒక 30 అడుగుల దాకా మోసి, తిరిగి వచ్చి మామ్మగారి గురించి ప్రసంగిస్తూ అన్నారట: 'ఆవిడకు ఇక జన్మ లేదు. ఒకవేళ జన్మ వచ్చినా ప్రవక్తగా వస్తారు'.

# <u>Poem dedicated to Sri Nannagaru</u>.

Love.
Love is.
Love is the force of life.
Love is happening by itself.

Thank you Nannagaru for allowing this precious moment to know everything
not by words but as it is.
Easter Sunday 1999



Love- the essence of all the religions,
is the special message of Easter, Sunday.

Love- Nanna Garu,
this empty vessel, without expectation, without desire,
living totally in the present moment, can show us that.

Love,
the message of Jesus Christ,
the message of all the Masters,
Love,
eternity, no beginning, no end, only Consciousness.

When everything gone,
when we are losing something that is very dear to us,
there is suffering.
But when we remember the Love, there is no further suffering.

Love, that's we all come from,
we have gone away from Love
because of the 'I-individual',
Now we are back in Love,
Love can never forsaken us,
it is always here.

Do not judge,
dont expect anything,
be in the present now,
it's happening, Love,
the essence of all beings.

There was one precious moment- as a present of Love.

Love is the essence of all creation,
at the foot of Arunachala- of Love- I realized it,
Who I am, only Love.

BY HORST RAATZ FROM GERMANY

# ప్రియమైన నాన్నగారు

నాన్నగారు అనేదే సరియైన పేరు కానీ, ఆయన వ్యావహారిక నామం "భూపతి రాజు వేంకట లక్ష్మీ నరసింహ రాజు" లో కూడా ఎంతో గూడార్థం ఉంది. మన తండ్రి పాదాలకు వందనం సమర్పిస్తూ, హృదయం లో కృతజ్ఞతా భావం పొంగిన ఒక క్షణం లో మనస్సు లో మెదలిన కొన్ని భావాలు:

ఓ (**భూపతి రాజా**) జగత్ పరిపాలకుడా!

ఆపద మొక్కుల వాడు, కోరికలు తీర్చే కల్పతరువు అయిన **వేంకట** పతివి నీవు

మమ్మల్ని దీవించి మా ప్రార్థనలు ఆలకిస్తావు, మా దుఃఖాన్ని పోగొట్టి మా పై నీ కృపా వర్షం కురిపిస్తావు!

ఐశ్వర్యానికి రూపమైన **లక్ష్మీ** నీవే, అశాశ్వతమైన ఈ ప్రాపంచిక సంపద కాదు నీ ఐశ్వర్యం



అది వెలకట్టలేని జ్ఞాన సంపద, సంపూర్ణ సచ్చిదానందం

పసివాడైన ప్రహ్లాదుని రక్షించి రాక్షస వధ చేసిన **నరసింహా**!

మాలో మాయని రూపుమాపి, అజ్ఞానాంధకారాన్ని వధించి,

పసి ప్రాయం లో ఉన్న మా భక్తి విశ్వాసాలను, వివేక వైరాగ్యాలను రక్షిస్తావు!

లోక రక్షకుడవైన రాజాధి **రాజు**వి; నీవే మాకు గతి, నీకు శరణు!

నీవు జగదీశ్వరుడవైనా, నీ కరుణా రూపము "**నాన్నగారు**", మాకు ప్రియమైన తండ్రివి!

మమ్మల్ని మీ దివ్యమైన ఒడిలోకి తీసుకొని, మీ కృపావర్షం మా పైన కురిపించి,
మాకు అంతులేని ప్రేమ శాంతి అందిస్తావు!

నీ కృపాదృష్టి మమ్మల్ని ఆనంద సాగరంలో ముంచి వేస్తుంది!

నిన్ను హృదయం లో సదా జ్ఞాపకం ఉంచుకొని, నీకు సంపూర్ణ శరణాగతి చేయటం ఒక్కటే మా గమ్యం!

నీ పై అంతులేని విశ్వాసం, చెదరని విశ్వాసం ఉండేలా మాకు శక్తిని ధైర్యాన్ని ప్రసాదించేది నీవే!

అన్య చింతన లేకుండా నిన్నే సదా ప్రేమించేటట్టు దీవించు తండ్రీ!

# మూలం

1) శ్రీ నాన్నగారి సంక్షిప్త జీవితం -- భక్తుల నుండి సేకరణ

2) శ్రీ నాన్నగారి భక్తికి మూలం అయిన పాపాయమ్మగారు --- భక్తుల నుండి సేకరణ

3) మన నాన్నగారు - ఒక భక్తురాలి వివరణ -- భక్తుల నుండి సేకరణ

4) స్వామి జ్ఞానానంద తో శ్రీ నాన్నగారి మొదటి సమావేశం---(Source: Goraganamudi November 20, 2006 Min 1 - 5)

5) హృషీకేశ్ లో స్వామీ శివానంద తో సమావేశం----(Source: Goraganamudi November 20, 2006 Minute 5 to 9)

6) శ్రీ నాన్నగారి జీవితంలోకి శ్రీ రమణ భగవానులు ప్రవేశించడం ---- (Source: June 13 1984- శ్రీ నాన్న ప్రవచనాలు)

7) రమణ జయంతి సందర్భంగా ప్రవచించమని భగవాన్ రమణులు శ్రీ నాన్నగారిని స్వప్నం లో ఆదేశించడం---- Source: (June 18th 1984- శ్రీ నాన్న ప్రవచనాలు).

8) భగవాన్ రమణులతో శ్రీ నాన్నగారి జన్మజన్మల అనుబంధం

9) భగవాన్ రమణుల పట్ల శ్రీ నాన్నగారి దృఢమైన భక్తి--(13-11-88, Lankalakoderu Minute 11)

10) భగవాన్ రమణుల విశిష్ఠత శ్రీ నాన్నగారి మాటల్లో---(Ramana Bhaskara 2012 (20-11-2011 muramalla)

11) మీరు తపస్సు చేసారా? అన్న ప్రశ్నకు శ్రీ నాన్నగారి జవాబు

12) భగవాన్ రమణుల దత్త పుత్రులు శ్రీ నాన్నగారు--- కాశీలో మాటలు- భక్తుల నుండి సేకరణ

13) భగవాన్ ఎల్లప్పుడూ ఉన్నారు- శ్రీ నాన్నగారి మాటల్లో - (Ramana Bhaskara January 2012 page 22)

14) భగవాన్ చేయనిది ఏమిటి? --- source రమణ భాస్కర

15) భగవాన్ని ప్రత్యక్షంగా చూడలేదని నాన్నగారికి ఎప్పుడూ బాధ కలుగలేదు ($1^{st}$ Sep 1996 Arunachalam min 34-36)

16) నాన్నగారికి భగవాన్ తో ఉన్న అనుబంధం చైతన్యానికి సంబంధించినది (Source: 19-7-2009, Jinnuru)

17) శ్రీ నాన్నగారిపై భగవాన్ రమణుల అపార కృప (Source: sadguru nannagarito sambhashanalu)

18) శ్రీ నాన్నగారు అంటే భగవాన్ యొక్క ప్రతినిధి (source: youtube video)

19) ఒక అశరీర వాణి తో శ్రీ నాన్నగారి అనుభవం (old cassette)

20) శ్రీ నాన్నగారి ఆంజనేయస్వామి స్వప్నదర్శనం---(source: 2009 GP3- first 2 mins and old papers)

21) శ్రీ నాన్నగారి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వప్నదర్శనం--- (Source: Attili)

22) సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో శ్రీ నాన్నగారి అనుబంధం---(Source: Ramana Bhaskara January 2012 page 24)

23) శ్రీ నాన్నగారి కంచిపరమాచార్యుల స్వప్నదర్శనం

24) శ్రీ నాన్నగారి నరసింహస్వామి స్వప్నదర్శనం--- (Source: Jaggayyapeta  August 19, 2003, Minute 71 onwards)

25) శ్రీ నాన్నగారి శ్రీ రాముని స్వప్నదర్శనం---- ( Source: Chilukuru October 08, 2005 Minute 56)

26) నేను పార్టీని మార్చేసాను---- పాలకోడేరు speech

27) జగన్నాథుని బొమ్మను చూడగానే శ్రీనాన్నగారికి చైతన్యానుభూతి కలగటం--. ( Ramana Bhaskara 18-8-2014 jinnuru)

28) సుఖదుఖాలన్నీ స్వప్నసమానం అని తెలిపిన శ్రీ నాన్నగారి స్వప్నవృత్తాంతం--. (Ramana Bhaskara june 2006 page 15)

29) శ్రీ నాన్నగారికి ఒక వైష్ణవునిపై కోపం వచ్చిన స్వప్నవృత్తాంతం

30) ప్రేమ యొక్క శక్తిని తెలిపే శ్రీ నాన్నగారి స్వప్నవృత్తాంతం---(Source: Dharbarevu July 16, 1998, Minute:19)

31) శ్రీ నాన్నగారు సినిమా కు వెళ్ళిన స్వప్నవృత్తాంతం--(12th Nov 2003, Kaikalooru, 15th minute)

32) శ్రీ నాన్నగారి ఆదిశంకరుల స్వప్నదర్శనం - సాధనా పంచకం వివరణ (Source: 5-2-2008 Tadinada)

33) శ్రీ నాన్నగారికి కారుల్లో తిరిగే యోగం ఉందని చెప్పిన పాలకొల్లు భక్తుడు

34) శ్రీ నాన్నగారికి ఇష్టమైన మహనీయులు--- Lincoln-old papers, (కాటన్ దొర source: 12/2/2010 చించినాడ)

35) శ్రీ నాన్నగారికి ఇష్టమైన ఇంగ్లీష్ పాట --- రమణ పాటలు పుస్తకం

36) శ్రీ నాన్నగారికి బాగా ఇష్టమైన బుద్ధుని ప్రబోధనలు---(Source: 29th Aug 2014 Tiruvannamalai)

37) శ్రీ నాన్నగారికి ఇష్టమైన భగవద్గీత శ్లోకం--- భక్తుల నుండి సేకరణ

38) శ్రీ నాన్నగారు తరచుగా చెప్పిన అక్షరమణమాల లోని ద్విపదం (Source: youtube video)

39) శ్రీ నాన్నగారు స్వరపరచిన శ్రీ రామకృష్ణుని పాట (Source: 29th July 2012 Jinnuru)

40) రామకృష్ణుని విషయంలో నాన్నగారిని అరెస్ట్ చేసిన మాట (Source: 24.09.2000 – Narsapuram and Source: 29th July 2012 Jinnuru)

41) రామాయణం లో నాన్నగారికి బాగా ఇష్టమైన మాట (30/8/2005, Odduru)

42) నాన్నగారికి ఇష్టమైన రామాయణంలోని పాత్రలు (Source: 6th April 2009 Mandapeta)

43) 'భక్తిని భరించటం కష్టం' అంటూ చెప్పిన నాన్నగారు (Source: 30-8-2002, Jinnuru)

44) శ్రీ నాన్నగారికి బాగా నచ్చిన Shakespeare మాట (Source భక్తుల నుండి సేకరణ)

45) శ్రీ నాన్నగారు తరచుగా పాడిన సినిమా పాట (Source: youtube video)

46) ఆదివారం సమావేశాలు ఎలా ప్రారంభమైనాయో - శ్రీ నాన్నగారి మాటల్లో---(Source: 23-9-1984 Jinnuru: Minute 1-4)

47) శ్రీ నాన్నగారి ప్రసంగాల వైభవం (Source: 6th April 2009 Mandapeta Minute 91-95)

48) శ్రీ నాన్నగారి ప్రసంగాల ప్రయోజనం (10.02.06 - ఉందుర్రు — రమణభాస్కర and 17.02.2015 — జిన్నూరు)

49) సబ్జెక్టు విషయం లో compromise అవ్వలేము అన్న శ్రీ నాన్నగారు (Source: 20011028 Kaikaluru మినిట్ 3 to 5)

50) శ్రీ నాన్నగారు ప్రబోధించే subject విశిష్టత-- భక్తుల నుండి సేకరణ

51) తనను భక్తులు ఎలా గౌరవించగలరో వివరించిన నాన్నగారు (Source: 16th Sep 1984 Jinnuru).

52) మిమ్మల్ని రమణ భక్తులుగా మార్చడం శ్రీ నాన్నగారి ఉద్దేశ్యం కాదు (Source: 16-2-86 Jinnuru)

53) 'నా జీవితానికి ఈ ఒక్క సర్టిఫికేట్ చాలు' అని శ్రీ నాన్నగారు అన్న సన్నివేశం--- (Source Tadinada 18-1-2004 41st min)

54) రమణ కేంద్రాన్ని అభివృద్ధి పరచాలని శ్రీ నాన్నగారు ఎలా ప్రేరేపితులయ్యారు

55) మనోధైర్యం మరియు మనశ్శాంతి కలుగ చేసే ఆధ్యాత్మిక పత్రిక రమణ భాస్కర (Source: Sri Nannagari Ramana Vani)

56) శ్రీ నాన్నగారి లండన్ అనుభవాలు Source: 29th June 1998 Narsapur (first 20 mins)

57) సాధనా రహస్యం, గురుస్తవం, శరణాగతి, భక్తిభావాలు----Gurustuti book, Source: Hyderabad August 07, 1998, Source: 29th June 1998 Narsapur (first 20 mins)

58) Ashton Lodge, Dorset లో శ్రీ నాన్నగారు చేసిన ప్రసంగం (19-21 June 1998)

59) రోజర్ అనుభవాలు — (Source: Travels through Sacred India book)

60) శ్రీనాన్నగారికి ఆంగ్లేయులు ఇచ్చిన బిరుదులు

61) Janet Attwood చేసిన ఇంటర్వ్యూ లో శ్రీ నాన్నగారి వ్యక్తీకరణ (Source: srinannagaru.com)

62) శ్రీ నాన్నగారిని సుందరంగారు చేసిన ఇంటర్వ్యూ వివరాలు (Source: srinannagaru.com)

63) అదిగో light కూడా వచ్చింది. చూడండి ఎలా వచ్చిందో'---(12.11.2003, kaikalooru minute 52)

64) శ్రీ నాన్నగారికి టీచింగ్ ఆపేయాలని ఉన్నా ఆపలేకపోవడం--- (7.7.2009 Hyderabad guru poornima)

65) శ్రీ నాన్నగారి ఇల్లు ఒక హాస్పిటల్ లాంటిదే--- (Source: Chinaamiram 01 December 2004 Minute 25 -26)

66) శ్రీ నాన్నగారి జీవితంలోని ఒక హాస్య సన్నివేశం

67) శ్రీ నాన్న నామధేయం వచ్చిన కారణం

68) శ్రీ నాన్నగారు కుల మతాలకు అతీతులు (Source: భక్తుల నుండి సేకరణ)

69) గుప్త దానాలను ఇష్టపడేవారు శ్రీ నాన్నగారు

70) ఒక సాధువు శ్రీ నాన్నగారికి వివరించిన సంఘటన

71) 'శ్రీ నాన్నగారు నిజమైన సన్యాసి' అని చెప్పిన రామకృష్ణ మఠం స్వామీజీ

72) శ్రీ నాన్నగారి స్థితప్రజ్ఞత తెలిపే సన్నివేశం---(Source: Chinchinada December 18, 1985, Minute 60)

73) ఒక విదేశీ భక్తురాలు నాన్నగారిని హృదయవాసిగా గుర్తించడం--(Source: 31-12-97 Undi)

74) రామకృష్ణ మఠం ప్రబోధకులు నాన్నగారిని గొప్ప యోగి గా గుర్తించడం (Source: 16-2-1986 Jinnuru)

75) శ్రీ నాన్నగారంటే జ్ఞానమహాసముద్రం --source: (12th Nov 2003, Kaikalooru, 45th minute)

76) ఒక భక్తురాలు 'వండర్ఫుల్ వండర్ఫుల్' అని నాన్నగారి మౌనాన్ని అభినందించడం (Source: 29th June 1998 Narsapur)

77) భగవాన్ తనని షిరిడీకి ఎలా మరలించాడో ఒక భక్తుడు నాన్నగారికి వివరించిన ఘట్టం (Source: 28/11/2004, పాతాళమెరక)

78) నేను 'ఉండటానికి సంబంధించిన వాడన'ని డాక్టర్స్ తో చెప్పారు నాన్నగారు-- భక్తుల నుండి సేకరణ

79) శ్రీ నాన్నగారు తమ పనిని వివరించిన తీరు (Source: Nannagaru last visit to Hyd Aug 2017)

80) శ్రీ నాన్నగారంటే full manifestation of సుబ్రహ్మణ్యేశ్వరస్వామి--- భక్తుల నుండి సేకరణ

81) శ్రీ నాన్న గారి ఆప్యాయత బుద్ధుడికి మానవ జాతి మీద ఉన్న ప్రేమవంటిది---(Source: 13th March 2002 Neredimelli Minute 43:30 to 45)

82) ఫిజియోథెరపిస్ట్ కి చెప్పిన ఉపదేశం--- భక్తుల నుండి సేకరణ

83) బ్రహ్మాన్ని వర్ణించడంలో ఆదిశంకరులను మించిపోయిన శ్రీ నాన్నగారు (Source: Nannagaru last visit to Hyd Aug 2017)

84) భక్తుల సందేహాలను నివారించే శ్రీ నాన్నగారు (Source: Hyderabad July 12th 2014 at minute 28:30)

85) శ్రీ నాన్నగారి మాతృప్రేమ --- భక్తుల నుండి సేకరణ

86) శ్రీ నాన్నగారికి భక్తులతో గల అనుబంధం---(Source: Sadguru Sri Nannagaru book)

87) భక్తుల పట్ల శ్రీ నాన్నగారి అపార కరుణ--- Source: oldpapers

88) శ్రీ నాన్నగారికి భద్రిరాజుగారితో ఉన్న అనుబంధం (source: 11/12/2004 గొరగనమూడి)

89) భక్తులు నా దగ్గర పొందేది undiluted happiness అని చెప్పిన నాన్నగారు (Source: youtube video Nannagaru with Suryagaru and Raveegaru in Arunachala)

90) ఈశ్వరుని సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తుంది అని శ్రీ నాన్నగారు తెలియచెప్పిన సన్నివేశం (source: oldpapers)

91) శ్రీ నాన్నగారిని అభినందించిన భక్తులు (Source: Sadguru Nannagaru book and 17.11.93 – జువ్వలపాలెం)

92) ఒక నాలుగవ తరగతి అబ్బాయి నాన్నగారి స్వరాన్ని 'స్వీట్ వాయిస్' అని అభినందించడం (Source: 3rd Oct 2014 Jinnuru)

93) రామకృష్ణ మఠం వారు నాన్నగారు పట్ల చూపించిన ఆదరణ (source: youtube video)

౯4) పెద్ద తిరుపతి పండితునితో శ్రీ నాన్నగారి అనుభవం (Source: 5th Sep ౨015 Jinnuru)

౯5) కాశీలో భక్తులు శ్రీ నాన్నగారు ఊరిలో లేని లోటు గ్రహించడం (Source: 1౯th Oct ౨00౯ Jinnuru)

౯6) Miscellaneous (Sources: Nannagaru last visit to Hyd Aug ౨017, భక్తుల నుండి సేకరణ, సద్గురు నాన్నగారు 7-1౨-౨011 లో అరుణాచలం లో అన్న మాటలు, Sadguru Nannagaru book).

౯7) శ్రీ నాన్నగారినే ఆలోచింప చేసిన భక్తుడు (Source: Nannagaru last visit to Hyd Aug ౨017)

౯8) 'మీకంటే మీ భార్యే గొప్పది' అని శ్రీ నాన్నగారు బోధించిన సన్నివేశం-Source: oldpapers

౯౯) భక్తురాలి సమాధానం తో నిశ్చేష్టులైన నాన్నగారు-- భక్తుల నుండి సేకరణ

100) శ్రీ నాన్నగారి గురుతత్త్వం యొక్క ప్రధానమైన అంశం--- Audio cassette

101) శ్రీ నాన్నగారి మాటే మంత్రము ---- మాటే మంత్రము అనే ఆర్టికల్

10౨) హాస్పిటల్ లో జాయిన్ అవ్వడానికి వెళ్లేముందు నాన్నగారు భక్తులకు చెప్పిన ఆఖరి మాట-- భక్తుల నుండి సేకరణ

103) చివరి రోజులు- భక్తుల అనుభవాలు--- Sadguru Sri Nannagaru book

104) శ్రీ నాన్నగారి ప్రవచనాల నుండి సేకరింపబడిన మహనీయుల సూక్తులు--- Amrutha vahini and speeches

105) సేవ, సమత్వం, భగవద్భక్తి - ఈ మూడింటి ప్రతిరూపమే పొందువ్వ మామ్మ --- భక్తుల నుండి సేకరణ

106) ప్రియమైన నాన్నగారు ---- భక్తుల నుండి సేకరణ

పుస్తకాలు: రమణ భాస్కర, సద్గురు నాన్నగారు, శ్రీ నాన్నగారి రమణ వాణి, శ్రీ నాన్నగారి హైదరాబాద్ లాస్ట్ విసిట్ ౨017, ఓల్డ్ పేపర్స్, గురు స్తుతి, సద్గురు నాన్నగారితో సంభాషణలు, అమృత వాహిని, అమృత వాక్కులు, Travels through sacred India.

Articles: Interview by Janet Attwood, Interview with Sundaramgaru

Websites on Sri Nannagaru: a) www.srinannagaru.com, b) http://www.srinannagarusatsang.com/



ప్రతీ సంవత్సరం గీతా జయంతి జరిగే కాపవరం



భక్తులతో కళకళలాడే శ్రీ నాన్నగారి స్వగృహం



నాన్నగారు ప్రాథమిక విద్యను అభ్యసించిన జిన్నూరు పాఠశాల



నాన్నగారు విద్యను అభ్యసించిన M.M.K.N.M ఉన్నత పాఠశాల (1947-52)



నాన్నగారికి స్వప్నములో దర్శనమిచ్చిన వ్యక్తి శ్రీ రమణులు అన్న విషయాన్ని తెలిపిన జిన్నూరు శాఖా గ్రంథాలయము




విశ్వవ్యాప్తమైన నాన్నగారి నామంతో తొలిసారిగా పిలిచిన అరటకట్ల భక్తుల ఆధ్యాత్మిక ప్రవచనాల వేదిక



తొలినాళ్లలో శ్రీనాన్నగారి ప్రవచనాలు జరిగిన జిన్నూరు పోస్ట్ ఆఫీస్



రమణ వాణిని ప్రతిధ్వనించే హాల్ - రమణ క్షేత్రం



అరుణాచలం లో శ్రీ నాన్నగారి విగ్రహం

జిన్నూరు లో శ్రీ నాన్నగారి విగ్రహం






శ్రీ నాన్నగారి సమాధి శ్రీ నాన్నసన్నిధి







Love and Grace Incarnate- Sadguru Sri Nannagaru.



This is a book on Sri Nannagaru in his own words.